భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

డిశంబరు 1964

సంపుటము 41 : : సంచిక 12

విడిప్రతి వెల ఒక రూపాయి

TANAM BARA... ...PALEM

విషయానుక్రమణిక

డిశంబరు 1964



బా ధా గ ళ ము

శ్రీ బాలగంగాధర తిలక్

(అతి వ్యాధి పీడితుడైన రోజులలో కవి చెప్పిన పద్యాలివి. ఆమె కరుణా మధురమూర్తి. అతన్ని 'శశి' అని ఆమె పిలిచేది. శశి మానస ప్రియా' అన్నది ఆమెకు సంబోధన.)

అడుగిడలేను నిన్వడచి ఆప్తుల దీన విలోచనాలలో
సుడిగొను వేడి కోల్మరచి, సుందర తాలవమేని లేని యీ
ఉడుకుడుకెత్తు జీవితము నోర్చుటికెన్ని దినాలు, స్రుక్కి యీ
బడుగు శరీరమే మడియ పాల్పడునో శశిమానస ప్రియా !

జీవితమన్న మాయతెర చీకి నశింపక మున్నె శాశ్వత
శ్రీ విలసిల్లు చిత్రము రచింపగ బూనిన నా ప్రయత్నమి
ట్లీ విధి మొక్కపోవునటె తీయని భావనలెల్ల ధూళియై
పోవున, నా కనుంగవల పున్నమి వెన్నెల వెల్గులారునా.

దేవత లెవ్వరే మునుపు తీయని ప్రేముడి నా కనుంగవన్
రే వెలుగుల్ వెలార్ప మృదురీతుల నంగుళులొత్తినారొ ! ఏ
దేవుడు ఖండచంద్ర పరిదీపిత జూటుడు నన్మహోర్థమై
ప్రోవినవాడు నన్మరచి పోయెనొ, రాడొకొ రక్షణార్థమై.

వీడొకనాడు స్వప్నముల వెంబడి పోయి దివౌక సాంగణ
క్రోడము కొల్లగొట్టి ఒక కొంచెము కొంచెముగా అశాంత శు
క్పీడితులైన మానవుల కిచ్చెను సౌఖ్య రసామృతమ్ము నా
నాడొక యింత తాను రసనన్ చవి జూడడ ప్రత్యయాత్ముడై.

గుండియ పోటుతో బ్రతుకు కోసలు వంకరలయ్యె వేదనల్
చెందిన కత్తులీ తనువు ఛిన్నమొనర్చెను మౌన బాష్పముల్
నిండిన సంద్రముల్ కనుల నివ్వెరపోయె నికేమి పల్కు నీ
కొండొక షట్పదమ్ము మణి కోమల వీణయు పుంస్పికమ్మయున్.

ముఘురాశా మృదువృంత నిర్గళిత మీ పుష్పమ్మునేలా పున
ర్వహా సామర్థ్యముత్తైన మాధవ కథా వ్యామోహముల్ చూపి ని
స్పృహ బాపన్ దొరకొందురీ విధమున క్షీణోగ్ర మార్తాండ రుక్
దహనమ్మై చనెలెమ్ము లోని సుధలున్ కల్యాణ సౌరభ్యముల్.

గోపీచంద్

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

'అసమర్థుని జీవయాత్ర' తర్వాత గోపీచంద్ దృష్టి సామాజిక మానవుడి నుంచి వ్యక్తియైన మానవుడిమీదికీ, ఆదర్శంనుంచి యదార్థ్యంమీదికీ మరలినందుకు తార్కాణ 'సెక్స్' పట్ల ఆయన ఏర్పరచుకున్న క్రొత్త వైఖరి. సీతారామరావు తనలోని మానవత్వపు లోతుల్ని స్పృశించిన 'పిచ్చి'లో అనుభవించిన మొదటి సహానుభూతి ఒక భోగ వనిత కష్ట సుఖాలతో; తర్వాత శ్మశాన ఘట్టంలో చివరి క్షణాల్లోనూ ఒక పతిత జీవిత గాథను విని ఆమెలోని మానవత్వాన్ని గౌరవించటం ద్వారానే 'జీవితం జీవించటం కోసమే' అనే మహత్తర సత్యాన్ని ఆకళించుకుంటాడు. నవలలో ఇది యాదృచ్ఛికంగా ప్రవేశపెట్టబడిన విషయంకాదు. హేతువాదిగా సంఘ చాలకుడుగా కాల్పనిక కవుల మధుర సంవేదనన్నూ, చలం కథల లైంగిక ప్రవృత్తి తీవ్రతనూ, సంఘ పురోగతికి పనికి రానివిగా త్రోసిపుచ్చిన గోపీచంద్ వ్యక్తిలోని వ్యక్తిత్వానికీ, 'సెక్స్'కూగల గంభీరమైన ధార్మిక సంబంధాన్ని క్రమంగా అవగాహన చేసుకోవటం జరిగింది. వ్యక్తియైన మానవుణ్ణి అతని ద్వారా జీవిత పరమార్థాన్ని అన్వేషిస్తూ గోపీచంద్ మెట్టిన ప్రథమపాదం— స్త్రీని అర్థం చేసుకోవటం.

ఈ విషయాన్ని నిరూపిస్తున్న నవలలు 'పిల్ల తెమ్మెర', 'గడియపడని తలుపులు', 'మెరుపుల మరకలు'. ఈ మూడు నవలలూ ఇంచుమించు ఒకే కాలంలోనే, ఒక సమస్యనుగూర్చి మననం చేస్తూనే వ్రాయబడినవి. ఒక విషయాన్ని పూర్తిగా ఆలోచించి దానిలోని వైవిధ్యాన్ని సమన్వయించేస్తూ సమ్యక్ రూపం తీర్చిదిద్దే ప్రతిభ ఉత్తమమైంది. గోపీచంద్ ఒక ఊహ రాగానే దానికి వెంటనే రూపు కల్పించే ఉద్వేగ ప్రకృతి— ఆయన కథల్లో వ్యక్తమౌతున్న సత్యమే యిది— ఒక విషయాన్ని గూర్చిన భిన్నములైన ఊహల సంకీర్ణతను వివిధ లక్షణ సమన్వితమైన కావ్య స్వరూపంలో ఏకత్వంగా ప్రతిష్ఠించేందుకు కావలసిన ధారణ, ఓర్పు గోపీచంద్‌లో కనిపించదు. ఇది ఆయన ప్రతిభకు పరిధి. లేడికి లేచిందే పరుగు అన్నట్లు ఊహ రావటమే కథ లేక చిన్న- నవల వ్రాయటం. ఫలితం: మూడు నవలల్లోని వస్తువు ఒకటే కావటం, ఒకే సమస్య ముగ్గురు కథా నాయికలుగా రూపొందటం జరిగింది. శమంతకమణి, కోటీశ్వరమ్మ, ఉషారాణి ఒకే స్త్రీ మూర్తి యొక్క మూడు ప్రతిబింబాలు అనటంలో సందేహంలేదు.

స్త్రీలోని స్త్రీత్వం 'సెక్స్' ఆకర్షణ; అంటే పురుషులమీద స్త్రీయొక్క ప్రభావం; ఇది స్త్రీలలో వ్యక్తిత్వ వికాసంయొక్క మూలసత్యం. స్త్రీ వ్యక్తిత్వ వికాసాన్ని గూర్చి సంఘంలో ఎన్నో అభిప్రాయాలున్నాయి. కాని ఆ అభిప్రాయాలన్నింటినీ అధిగమించిన మూల సత్యం స్త్రీత్వం. (వ్యక్తి వికాసం అనే భావమే అధునాతనమైంది) ''ఒక స్త్రీ ఇంట్లోనుంచి బయటకు అడుగుపెట్టి, దానివల్ల వచ్చే కష్టాలను ఎదుర్కొని సాంఘిక జీవితంలో ప్రవేశించాలనుకోవటం ఉన్నత భావం. అటువంటి స్త్రీకి ఆసరాగా నిలవాలనుకోవటం అంతకన్న ఉన్నతమైన భావం.....'' శమంతకమణి అనాథ బాలిక. రామనాథం ఆమెను ఉద్ధరించటానికి వివాహం చేసుకొంటాడు. అంతేకాదు. ఆమె మనఃప్రవృత్తిని అర్థం చేసుకొని తనకు తో[illegible]ట్లు ఆమె వ్యక్తిత్వ వికాసా[illegible] దోహదం చెయ్యటానికి ప్రయత్నిస్తాడు. ''శమంతకమణి దృష్టి భగవంతుని పరం చెయ్యటానికి ప్రయత్నిస్తాడు. ఇంతలో శచీంద్రుడు అనే ఆదర్శవాది, సంఘ సంస్కర్త, ఆమెలోని నృత్య నాట్య కళా కౌశలాన్ని ప్రోది చెయ్యటమే ఆమెలో వ్యక్తి వికాసానికి మార్గమని ఆమెను ఒక స్నేహితుడు నడుపుతున్న డ్యాన్సు స్కూల్లో చేర్పిస్తాడు. శమంతకమణి వ్యక్తిత్వానికి రామనాథం చూపిన భగవద్భక్తి, శచీంద్రుడు చూపిన కళాసేవా రెండూ

నప్పినట్లే కనిపిస్తాయి; కాని చివరకు తేలిన సత్యం రామనాథమ్, శచీంద్రుడు యిద్దరూ ఆమె స్త్రీత్వానికి (సెక్స్ ఆకర్షణకు) లోబడటమే! డ్యాన్సు మాష్టరు దగ్గర డ్యాన్సు నేర్చుకోవటంలో వ్యక్తమైన శమంతకమణి శ్రద్ధాసక్తులు కూడా ఆ డ్యాన్సు మాష్టరుని తన ప్రభావంలోకి లాక్కోవాలనే ఆమె స్త్రీత్వమే తప్ప వేరు కాదు! వివాహ వ్యవస్థ నతిక్రమించి కళాసేవ నెపంతో పట్టణం చేరుకున్న శమంతకమణి స్వేచ్ఛా ప్రవర్తన కూడా ఆ స్త్రీత్వ విన్యాసమే! ఈ స్త్రీత్వము రామనాథం, శచీంద్రుడు వంటి వారి అభిప్రాయాలకు ఆదర్శాలకు అతీతమైనది; డ్యాన్సు మాష్టర్ ఆమె శ్రేయస్సును గూర్చి పడే భయాన్ని ఆదుర్దాని లెక్కచెయ్యనిది! ఈ స్త్రీత్వము 'పిల్ల తెమ్మెర' లాంటిది. ''ఆమె .... బ్రతికి నన్నాళ్ళూ పిల్లతెమ్మెరలాగు బ్రతుకుతుంది. అది తప్పో ఒప్పో ఆమెకు తెలియదు..ఆమె స్వభావం అది...'' ఈ స్త్రీత్వము లైంగిక ప్రవృత్తితో తాదాత్మ్యము చెందినట్లు కనిపించినా, కాముకత్వం కాదు. కాముకత్వంలో లేని అమాయకత్వం, మార్దవము, మంచితనం ఇందులో భాసిస్తూ, కేవలం లైంగిక ప్రవృత్తి అనటానికి వీల్లేని అనిర్వచనీయమైన అతీతమైన వ్యక్తి ధర్మంగా యిది కనిపిస్తుంది. స్త్రీ జీవిత గమ్యం వ్యక్తి వికాసమేనని వాదించే శచీంద్రుని వంటి సాంఘిక, ఆదర్శ వాదులు స్త్రీత్వం గూర్చిన తమ సొంత అభిప్రాయాల్ని విచ్ఛిన్నమై స్త్రీత్వంయొక్క మూలసత్యాన్ని దర్శించినప్పుడు దానికి లోబడినప్పుడు ఆ అనుభవాన్ని అంగీకరించి భరించగలరా? వాళ్ళు ఎలా ప్రవర్తిస్తారు?

''ప్రపంచంలోని విచిత్ర వస్తువులలో కెల్లా విచిత్రమైన వస్తువు ఈ మనిషి అనే వ్యక్తి. ఈ వ్యక్తి ఎప్పటి కప్పుడు తనే రైటనీ తప్పు యితరులదేననీ కారణాలను పోగు చేసుకోగలడు. ఒక్క కారణాలను పోగుజేసుకోవటమే కాదు; బహు చక్కగా తన్ను తాను మోసం చేసుకోగలడు. శచీంద్రుని విషయంలో కూడా ఇందుకు భిన్నమైంది ఏమీలేదు. శచీంద్రుడు చాలమంది మనుష్యులకంటె తెలివైనవాడు. వివేకవంతుడు. ఒకరకంగా మంచివాడు కూడాను. అతనే మామూలు ఆలోచనలు అల్లే వలయం నుంచి తప్పించుకోలేకపోతే ఇక ఇతరుల మాట చెప్పుకొని ఏం ప్రయోజనం? అతను పెండ్లి అయిన శమంతకమణిని భర్త అనుమతి లేకుండా మద్రాసు తీసుకు వచ్చాడు. ప్రమాదవశాత్తే అవుగాక, ఆమెతో కాపురం చేశాడు. అప్పుడు భర్త పడే బాధ అతనికి గమనంలో లేదు. ఇప్పుడు ఆమె ఇతరులతో చనువుగా ఉంటూ ఉండటం. క్షోభిస్తున్నాడు. తనతో చనువుగా ఉన్నప్పుడూ ఇతరులతో ఉండటమే గదా. ఇప్పుడు తను పడుతున్నంత బాధా ఒకప్పుడు ఆమె భర్త పడిఉండాలిగదా! భర్త అదుపులోనుంచి తీసుకు వచ్చిన తనకు, తన అదుపులో ఆమె ఉండాలనే భావం ఎందుకు కలగాలో! ఆ అధికారం తనకు ఎవ్వరిచ్చారో! ఇవన్నీ ఆలోచనకే రావు. ఇప్పటికీ తనే రైటనీ ఆమె తప్పనీ అతని విశ్వాసం...'' శచీంద్రుడు శమంతకమణిని హత్య చేస్తాడు!

పై నుల్లేఖించిన భాగంలోని శచీంద్రుని గూర్చిన విమర్శ అతి నిశితమైనది. సాంఘికవాదులు, హేతువాదులు, ఇంత దూరం వెళ్ళనే వెళ్ళరు; వాళ్ళ విమర్శ ఎప్పుడూ పర పరామర్శే తప్ప ఆత్మవిమర్శగా రూపొందదు. కాని విమర్శ ఇంత దూరం వెళ్ళితే తప్ప అహం, స్వార్థం అనే కళ్ళ గంతలు మనిషికి విడిపోవు. అవి విడితేగాని స్త్రీ జనాభ్యుదయాన్ని గూర్చి స్త్రీ వ్యక్తిత్వ వికాసాన్ని గూర్చి సత్యం బోధపడదు. స్త్రీత్వం ఒక సమ్మోహనశక్తి; దాన్ని అర్థంచేసుకునేందుకు మనిషి దానికి లొంగకుండానైనా ఉండాలి, లేక తన స్వార్థమైనా త్యజించాలి.

శమంతకమణి ఆకర్షణకు లొంగని వ్యక్తి డ్యాన్సు మాష్టరు. కారణం: అతనికి ''స్త్రీలో గానీ, పురుషునిలో గానీ విచిత్రమైన ప్రవృత్తి కనుపించితే, ఆ భావంమీదా ఆ ప్రవృత్తిమీదా కలిగిన మమకారం, వాటికి స్థావరమైన వ్యక్తులను ఆశ్రయిస్తుంది; ఆ వ్యక్తుల భౌతిక సౌందర్యంతో గానీ, మిగిలిన గుణగణాలతోగానీ నిమిత్తం ఉండదు.'' అందుకే అతనికి మృణాళిని, హైందవ సంప్రదాయం మూర్తీభవించిన మృణాళినిమీద ప్రేమ. డ్యాన్సు మాష్టరు శమంతకమణి వ్యక్తిత్వ ప్రభావానికి అతీతుడు కావటంవల్లే అతను ఆమెలోని స్త్రీత్వ జిగీషకు అందని ఆదర్శంగా, చివరకు ఆమె ఆరాధనకు పాత్రుడౌతాడు! ఆ ఆరాధన స్వరూపం— ఆమె తన బిడ్డలో అతని పోలికలు చూడటం! ఇది మాతృత్వానికి ఎంత చక్కని వ్యాఖ్యానం!! గోపీచంద్ అభినందనీయుడు!

''పిల్ల తెమ్మెర'' నవలలో శమంతకమణి 'స్త్రీత్వా' నికి — అంటే సాంఘిక నిర్వచనాలకు అతీతమైన వ్యక్తి మానవత్వానికే— ప్రతీక. డ్యాన్సు మాష్టరు సహృదయుడు, కరుణాశీలి, మనస్వీ అయిన సంప్రదాయజ్ఞుడు. రామనాథం ప్రేమికుడు, ఆస్తికుడు. శచీంద్రుడు సంఘ సంస్కర్త, ఆదర్శవాదీ అయిన ఆధునికుడు. మానవత్వానికి సంప్రదాయమూ ఆస్తికతా కలిగజేస్తున్న విపత్తు కంటె సాంఘిక వాదివల్ల కలిగే విపత్తే అధికతరమేమో అన్న ధ్వని! గోపీచంద్ యీ నవలలో డ్యాన్సు మాష్టరుగాను అతని ప్రాత స్నేహితు

డైన సాంఘికవాదిగాను దర్శన మిస్తాడు. సాంఘికవాది చేసిన స్త్రీ హత్యకు అతనికి అజన్మ కారాగారవాసము శిక్ష పడుతుంది. గోపీచంద్ తనలోని 'ప్రాత స్నేహితుని' కిచ్చిన చివరి వీడ్కోలు యిది ! అంతేకాదు; ఈ నవలలో సంప్రదాయాన్ని (మృణాళిని) వ్యక్తి వికాసాన్ని (శమంతకమణిని) జంటగా నిల్చోబెట్టి ఏది ? ఏది ? అనే సందిగ్ధంలో ఉండి పోయాడు రచయిత.

సంప్రదాయబద్ధమైన జీవితాన్ని, భర్తనూ వదిలి వ్యక్తి వికాసం ఆకాంక్షిస్తూ పట్నం చేరిన అధునాతన యువతి కోటేశ్వరమ్మ 'గడియపడని తలుపులు' నవలలో కథానాయిక. స్త్రీత్వం 'సెక్స్' ఆకర్షణ; అది లోకాన్ని జయిస్తుంది; వ్యవహారాలు నడుపుతుంది; విజయపరంపర సాధిస్తుంది; కాని తర్వాత ఏమిటి ? ''ఆమె డ్రెస్ చేసుకోవడం చాలా బాగా డ్రెస్ చేసుకుంది. అందులో సందేహంలేదు. అక్కడికి వచ్చినవారి చూపులన్నీ ఆమెమీదే ఉండేటంత అందంగా ఉంది. అందులో సందేహంలేదు. ఆమె అవయవాలన్నీ తీర్చి దిద్దినట్లుగా ఉండి పోతపోసిన విగ్రహంలాగుంది. అందులో సందేహంలేదు. ఆ మందహాసం వారితో వీరితో మాట్లాడుతూనే ఉంది. నవ్వింది నవ్వినట్లే ఉంది. కాని ఆమె చూపుల్లో విపరీతమైన దైన్యం గోచరించింది నాకు ..... ఆమె కళ్లు దూరంగా ఉన్న ఎవ్వరినో వెదుకుతున్నట్లు ఉన్నాయి ..... అవి వెతుకుతున్నాయి. అంతే, ఎవ్వరినీ కాదు. ''శమంతకమణి ముగ్ధ; ఆమె లోకాన్ని జయించలేకపోయింది. కోటేశ్వరమ్మ ప్రౌఢ, ఆమె లోకాన్ని జయించింది. శమంతకమణిలో వ్యక్తి వికాసం సాంఘిక పరిస్థితులవల్ల పరిణతి చెందకుండా అంతం అయింది; కాని, కోటేశ్వరమ్మలో విజయవంతమైన ఆ పరిణామం ద్వారా ఆమెకు మిగిలినది ఏమిటి ? దైన్యం, అన్వేషణా మాత్రమే ! ఆ పరిస్థితిలో ఆమెకు శ్రీనివాసరావు తారసిల్లుతాడు. అతను ''పసిపిల్లవానికి మల్లే ఉండి పసిపాప నవ్వంత నిర్మలంగా ఉండి కొంతమందిని యిట్టే ఆకర్షిస్తాడు.'' అతనిలోని అమాయకత్వం, నైర్మల్యం ఆమె ప్రేమిస్తుంది. కాని ఆ ప్రేమకూడా లైంగిక ప్రవృత్తిద్వారానే వ్యక్తమౌతుంది. లైంగిక ప్రవృత్తితో విసిగి వేసారిన కోటేశ్వరమ్మ ఆ రెండింటిని విడదీయటానికి ప్రయత్నిస్తుంది. ఆ ప్రయత్నానికి మార్గం, సాధన ఏమిటో బ్రహ్మానందస్వాములవారి సాన్నిధ్యంలో ఆమెకు గోచరిస్తుంది. ''స్వాముల వారి చూపుల్లో ఉన్న కాంతికి నేను మోహపడ్డాను. వారు ఆ చూపులను నామీదికి ప్రసరించినప్పుడల్లా మధురప్రవంతిలో ముంచెత్తుతున్నట్లు అనిపించింది. నా మనస్సుకే యిన్నాళ్లూ ఎక్కడా దొరకని శాంతి వారిముందు లభ్యమైనట్లు అనిపించింది.' ఇలా ధ్యేయం గోచరించినా కోటేశ్వరమ్మ ఆ సాధనలో నిలువలేక పోతుంది. అందువల్ల శేష జీవితం సంప్రదాయాన్ని మననం చేసుకోవటంలో, వైరాగ్యాన్ని అవలంభించటంలో, స్నేహంలోని పవిత్రతను భావించటంలో గడపి కన్నుమూస్తుంది. ''తన బాధ్యతలను ఇతరులకు వదలి నిర్విచారంగా ఉండగలిగిన అమాయకత్వం ఆమెలో ఉంది..... జీవితంలో ఎన్నో అనుభవాల ఛాయలు ఆమెమీద పడినా ఈ అమాయకత్వం కాస్త కూడా చెదరకపోవటం నాకు ఆశ్చర్యం కలిగించింది'' అంటాడు కథకుడు.

ఈ నవలలో గోపీచంద్ కోటేశ్వరమ్మలో, శ్రీనివాసరావులో, యిద్దరిలోనూ ప్రత్యక్షమౌతాడు. బ్రహ్మానంద స్వాములవారి దగ్గర కోటేశ్వరమ్మకు కలిగిన అనుభూతి గోపీచంద్ అరవిందు[redacted] ఎదుట పొందినదే. అయితే ఆ ధ్యేయములో యింకా[redacted]మైన విశ్వాసం, ఏకాగ్రత కలగలేదనటానికి సూచనలూ కారణాలూ నవలలోనే ఉన్నాయి. ''ఏవో సిద్ధాంతాలూ సమస్యలు అనుకొని వెంటపడతాం కాని, ఈ చిన్న చిన్న విషయాలలో వున్న ఆనందం (ఉ॥ మంచి కాఫీ త్రాగటంలో) యింకెందులోనూ ఉండదు: వీటిని వదులుకొని వాటి వెంట పడటం ఎదురుగా కనబడే మంచినీటికొలను వదులుకొని మృగతృష్ణ వెంటపడటం వంటిదే'' .... అంతేకాదు. శ్రీనివాసరావు గార్హస్త్యపు బాధ్యతలను వదలిపెట్టి ఆధ్యాత్మిక సాధనకోసం సన్యాసం స్వీకరిస్తే అతని భార్యాపిల్లల శ్రేయస్సు మాటేమిటి ? నాలుగైదు సంవత్సరాల ఆధ్యాత్మిక చింతన తర్వాతగాని, ముందు వెనుకలు ఆలోచించిగాని అందులో దిగకూడదని గోపీచంద్ మరొక అభిప్రాయం... పోతే, వ్యక్తిత్వ వికాసానికి గమ్యం నిర్మలమూ నిస్స్వార్థమూ అయిన స్నేహం కాగూడదా ? జీవితంలో అన్నింటికన్న ముఖ్యమైన సాధన 'ఎన్ని అనుభవాల ఛాయలు మీదపడినా అమాయకత్వం చెక్కుచెదరకుండా నిలుపుకోవటం' కాగూడదా ? అన్న ఊహ కూడా ఆధ్యాత్మిక సాధనకు ప్రత్యామ్నాయంగా యీ నవల ద్వారా వ్యక్తమౌతున్నది. అది అప్పటి గోపీచంద్ మనస్థితి.

సంప్రదాయ నిబద్ధమైన జీవితం, వ్యక్తి వికాసానికి వలసిన స్వేచ్ఛ ఈ రెండింటి మధ్యా సమన్వయం కుదుర్చుకోలేక సాగుతున్న గోపీచంద్ ఆలోచనను వ్యక్తం చేస్తోంది ''గడియపడని తలుపులు'' నవల. సంప్రదాయం అవరోధమన్న అభిప్రాయంతో దాన్ని కాదని వ్యక్తి వికాసాన్ని స్వేచ్ఛనూ కోరుకున్న ఆధునిక యువతి దుర్భరమైన ఏకాంతంలో

దైన్యంలో పతమతమై మళ్లీ సంప్రదాయంవైపే మొగ్గటాన్ని చిత్రించినప్పటికీ రచయిత ఆగమ్యం ఎటువంటిదో స్పష్టంగా సూచించలేకపోవటం, సంప్రదాయానికీ వ్యక్తి వికాసానికి సమన్వయం సాధ్యమా కాదో తేల్చుకోలేక పోవటం, యిది ప్రయోగాత్మకమైన రచన అని నిరూపిస్తున్నది.

ఇలా 'పిల్ల తెమ్మెర', 'గడియపడని తలుపులు' రెండూ ప్రయోగాత్మకమైన రచనలే అయినా మొదటి నవలలో ఉన్న పరిపూర్ణత, ధ్వనీ రెండవదానిలో వ్యంగ్యం. గోపీచంద్ తలుపులకు గడియపడకపోవటాన్నే రెండు నవలలూ ముఖ్యంగా వ్యక్తం చేస్తున్నవి.

'మెరుపుల మరకలు' నవలలోని విశిష్టత ఉషారాణి పాత్ర చిత్రణలో గోపీచంద్ చూపిన శ్రద్ధ, నేర్పు. శమంతకమణి, కోటేశ్వరమ్మ రేఖాచిత్రాలైతే ఉషారాణి తైలవర్ణ చిత్రం. శమంతకమణికీ ఉషారాణికీ భేదంలేదు పరిస్థితుల్లో అదృష్టంలో తప్ప. శమంతకమణి అనాథబాలిక, ఆమె శచీంద్రుని చేతిలో పడటం ఆమె దురదృష్టం. ఉషారాణి రామానుజం భార్య కావటం, చక్రవర్తి శ్రీకాంత్, కమలాకరం వంటి వారితో స్నేహం చెయ్యటం ఆమె అదృష్టం. ఉషారాణి చదువుకున్న అధునాతన యువతి కావటంతో ఆమె వ్యక్తిత్వంలో జాణతనం, శమంతకమణిలో కనిపించనట్టిది, విశేషంగా కనిపిస్తుంది. పోతే, యిద్దరిలోనూ వారి లైంగిక ప్రవృత్తినీ స్వేచ్ఛా ప్రవృత్తినీ కాముకత్వం స్థాయికి దిగజారకుండా రక్షించే గుణాలు హార్దము, స్నేహము, సత్యాన్వేషణ, పసిపిల్లల అమాయకత్వం దీపించే నవ్వు. ఉషారాణి వ్యక్తిత్వం మనస్వియైన చక్రవర్తిమీద చూపిన ప్రభావం యిలా ఉంది : "నేను నిన్ను మామూలు స్త్రీని ప్రేమించినట్లు ప్రేమించటం లేదు. స్త్రీలలో ఉండే అందాల నన్నిటినీ, సుగుణాల నన్నిటినీ నీలో చూస్తున్నాను. నీవు నాకు ప్రియురాలివికాదు. ఆరాధ్య దేవతవు. నిన్ను చూచిన తర్వాత ఈ ప్రపంచంలో మరి దేనినీ నాకు చూడ బుద్ధి అవటం లేదు. నీపట్ల నాకున్న ప్రేమను అతి పవిత్రమైన దానినిగా భావిస్తున్నాను...." అంటాడు చక్రవర్తి. ఈ భావనకు అస్తిత్వం ఎక్కడ ? కేవలం చక్రవర్తి మనస్సులో; ఏమంటే దాని విశిష్టతను అతను నిరూపించలేడు ! అతని మాటలూ విని ఉషారాణి అంటుంది : "బాగానే ఉంది చక్రీ, కాని శ్రీకాంత్ కూడా నన్ను నీకుమల్లేనే ప్రేమిస్తున్నాడని ఎందుకనుకోవు ?" "అసంభవం" అన్నాడు చక్రవర్తి .... "ఎందుకనీ ? .... నువ్వు ప్రవర్తించినట్లే అతనూ ప్రవర్తిస్తాడు. ఇప్పుడు నువ్వు వెలిబుచ్చిన అభిప్రాయాలే అతనూ వెలిబుచ్చుతాడు" అంటుందామె. "అభిప్రాయాలు వెలిబుచ్చటానికేం, ఎన్నయినా వెలిబుచ్చవచ్చు." "మరింకేమిటంటావు ?" ఈ ప్రశ్నకు ఎలా సమాధానం చెప్పాలో చక్రవర్తికి బోధపడలేదు. "నన్ను అడగటం ఎందుకు ? నీ మనసుకి తెలియదా, మా యిద్దరికీ ఉన్న తారతమ్యం ?" అన్నాడు. "నాకు తెలియటంలేదు" అన్నది ఉషారాణి. చక్రవర్తి తలమీద పిడుగు పడినట్లయింది .... ఈ సన్నివేశంలో ద్యోతకమౌతున్న ముఖ్య విషయం : చక్రవర్తి భావనకు బాహ్యప్రపంచంలో, సంఘంలో అస్తిత్వం లేదు. అంటే కేవలం బహిరుపాధుల ద్వారా నిరూపించబడి నిర్ణయింపబడే సత్యం స్థూలంగానే ఉంటుందనీ, బహిరుపాధుల కందని వైవిధ్యం దానిలో ఒక్కొక్క వ్యక్తి మనస్సునుబట్టీ ఎంతో మేర ఉంటూ ఆ సూక్ష్మ్యం గ్రహించేదీ, దానికి సాక్షి వ్యక్తి అంతర్యం మాత్రమేననీ తెలుస్తోంది. హేతువాదులు ఈ అంతరంగికమైన సత్యాన్ని, దాని విశిష్టతను అంగీకరించరు. కాని మానవునిలో వ్యక్తిత్వానికి మూలమైన సత్యం అదేననీ దాన్ని గుర్తించి గౌరవించి అంగీకరించేదాకా మానవుని సమస్యలకు పరిష్కారమార్గం లేదనీ గోపీచంద్ యిక్కడ సూచించారు. గోపీచంద్ చేసిన హేతువాద నిరాసము యిలా నిశితంగా సూక్ష్మంగా ప్రారంభమై చివరకు కథానాయిక పాత్రలో ఆమె వ్యక్తిత్వ విశిష్టత ద్వారా ప్రకాశం కావటమే ఈ నవల గొప్పదనం.

హేతువాదులే కాదు, సంప్రదాయానువర్తులైన ఆధ్యాత్మికవాదులు కూడా కొన్ని ప్రసిద్ధ సిద్ధాంతాలనూ, నైతిక సూత్రాలనూ తప్ప వాటికి భిన్నమైన, వైవిధ్యం కలిగిన ఆంతరంగిక అనుభూతుల సత్యాన్ని, విశిష్టతను అంగీకరించరు. "ఒక సందర్భంలో నిజమైన ప్రేమ ఒకసారి వస్తుందనీ, ఒకే ఒకరిమీద ఉంటుందనీ నేను ఒప్పుకోను" అన్నది ఉషారాణి. అందుకు ఆమెను దూషించాడు. కాని తనకూ అప్పుడప్పుడూ అలాగే అనిపిస్తూ ఉంటుంది. ఈ సిద్ధాంతం సంఘాన్ని ముందుకు నడవకుండా కట్టి పడవెయ్యాలనుకున్నవారు సృష్టించారని తనకూ అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది కాని తనకు యిబ్బంది కలిగినప్పుడు ఆ సిద్ధాంతం చాటున దాక్కున్నాడు." నిజమైన ప్రేమ యిలాంటిది అని సిద్ధాంతరం చెయ్యటంలోనే దాన్ని సర్వజనీనమూ, సామాజికమూ చేసి దానికి భిన్నమైన వ్యక్తిగతమైన అనుభూతులను నికృష్టమైనవిగా త్రోసివుచ్చటంలో ఎంతో మేర మానవత్వాన్ని, వాస్తవిక జీవితాన్ని నిరాకరించటం జరుగుతోంది. ఈ ధోరణి సంఘ క్షేమం దృష్ట్యా ఎలా ఉన్నా వ్యక్తి వికాసం దృష్ట్యానూ, సాహిత్యంలోనూ అభిలషణీయం కాదు. "అది

జుగుప్స అనుకోండి, ఏమన్నా అనుకోండి. అది మనం అనుభవించే జీవితం. ఈనాటి రచయితలు వాస్తవిక జీవితాన్ని కప్పివేస్తున్నారు. వారివల్ల సాహిత్యం వాస్తవిక జీవితాన్ని కప్పివేసే ముసుగుగా ఉపయోగపడుతూ ఉంది. దీనివల్ల మానవునికి కృత్రిమదృష్టి ఏర్పడటం, జీవితంపట్ల అనేక దురభిప్రాయాలు కలగటం జరుగుతుంది. ఈ కృత్రిమ దృష్టికి, దురభిప్రాయాలకూ అనుకూలంగా జీవితానికి అర్థం చెప్పుకుంటూ ఉంటాం. అందువల్ల సత్యం మనకు ఎప్పుడూ దూరంగానే ఉంటుంది. ఎప్పుడయితే మనం ఒక సిద్ధాంతాన్ని అల్లడానికి ప్రయత్నిస్తామో అప్పుడు జీవితాన్నించి వైదొలగుతున్నాం అన్నమాట. ఈ జీవితంలో అస్తిత్వం తప్ప ఏదీ నిజం కాదు. ఆ అస్తిత్వం, మన అనుభవంలోకి వచ్చేవి మాత్రమే నిజం. వాటిని ఏదో ఒకవంకతో త్రోసిపుచ్చటం జీవితాన్నించి పారిపోవటమే అవుతుంది. మనం జీవితాన్ని ముఖాముఖిని చూడాలి. చూచినదాన్ని చదువరులకు చెప్పాలి. ఇదే సాహిత్యం'' అంటూ జీన్‌పాల్‌సార్త్రే మాటలుగా గోపీచంద్ ఈ నవలలో గ్రంథస్థంచేసిన వాక్యాలు గమనించదగ్గవి. ఈ అస్తిత్వవాద (**Existentialism**) దృక్పథం ఆధారంగా గోపీచంద్ తన మనస్సుని విశాలపరచుకొని, మానవతావాదం (**Humanism**) నుంచీ కూడా తాత్త్వికంగా పురోగమించాడు. ఈ నవలలో గోపీచంద్‌కు ప్రతినిధి చక్రవర్తి పాత్ర.

పై నుదాహరించిన దృక్పథం రీత్యా చూస్తే శమంతకమణి, కోటేశ్వరమ్మ, ఉషారాణి పాత్రలలోని వ్యక్తిత్వ వైశిష్ట్య మెటువంటిదో బోధపడుతుంది. వ్యవస్థ ఆమోదిస్తున్న నైతిక సూత్రాల దృష్ట్యా వీరికీ సాధారణంగా మనం గర్హించే 'వ్యభిచారిణులకూ' భేదమేమీ లేదు. లైంగిక ప్రవర్తనలో (**Sexual Behaviour**) స్వేచ్ఛ అన్న దొక కొండగుర్తు; చాల స్థూలమైన బహిరుపాధి. ఈ బహిరుపాధికి అంతుచిక్కని వైవిధ్యం వ్యక్తిగతమైన అనుభూతుల్లో ఎంతో ఉంటుంది; అయితే దానికి విలువ కట్టేది ఆ వ్యక్తి అంతరంగం మాత్రమే; తరతమభేదాల్ని ఉచ్చనీచ అంతస్థుల్ని, ఉత్తమమూ పతితమూ అనే నిర్ణయాల్ని అంతరంగంలో వ్యక్తి తనకు తను మాత్రమే చేసుకోగలడు. లేకపోతే సహానుభూతి, భావనాశక్తి ద్వారా తత్త్వదర్శి లేక సాహిత్యకారుడు దాన్ని అంచనా వేయగలడు. ఇక్కడ ముఖ్యమైనవి సహానుభూతి, భావనాశక్తి వాటికి ప్రాతిపదికయైనది క్షమాగుణమూ; అంటే సిద్ధాంతాలా, సూత్రాలా కట్టి పడవెయ్యవి మనస్సు! మనస్సుని కట్టివేసిన బంధాన్ని విప్పుకోవడం ఎవరికి వారే చేసుకోవాలి; తోటి మానవులమీద ప్రేమ పెరగటానికి అదే మార్గం! (అంతరంగిక సత్యాన్ని కాదనే హేతువాద ధోరణి మానవుణ్ణి మానవుణ్ణీ వేరుచేస్తుందంటారు గోపీచంద్.) అందుకే నవలలో ఉషారాణిని క్షమించగలిగి, తనలో ఆమె వ్యక్తిత్వం కలిగించిన ఉదాత్తభావనను చెరిగిపోకుండా నిలుపుకోగలిగిన చక్రవర్తికి ఒక క్రొత్త అనుభూతి లభిస్తుంది.—''ఆమె పట్ల ఇదివరకున్న వ్యామోహం యిప్పుడతనికి లేదు. అతని హృదయంలో స్వార్థచింతన లేదు. నిర్మలాకాశం, గంభీర సముద్రం, తరపి వెన్నెల ఆకర్షించినట్లే ఆకర్షిస్తున్న దామె. అటువంటి ఆకర్షణలో ఉన్న ఆనందం అతనికొక నూతన అనుభూతి... శరీరం నిర్మించిన అవధులు కరిగిపోయినయ్. ఆవేశాలు సురిగిపోయినయ్. కోర్కెలు నశించినయ్. ఉషారాణి తనలోనే ఉన్నట్లనిపించిందతనికా క్షణం ....'' చక్రవర్తికంటె దిగువమెట్టులో ఉన్న వ్యక్తి శ్రీకంఠ్. చక్రవర్తిని ఎదుర్కొన్న పరిస్థితులే, ఉషారాణిని గూర్చిన స్వప్నభంగం వంటిదే అతనికి కలిగింది. కాని, అతని ప్రవర్తన, అతను పొందిన అనుభూతి ఏ స్థాయిలో ఉన్నాయి? పోతే, చంద్రవదనుల 'అనులీన శృంగారం' తాలూకు ఉపాఖ్యానం అతని వ్యక్తిత్వం ఎంత మరీ దిగువమెట్టులో ఉందో తెలుపుతుంది! బహిరుపాధులను, నైతిక సూత్రాలను మాత్రమే ఆశ్రయిస్తే చంద్రవదనుల కెన్ని ఎక్కువ మార్కులు వేస్తే చక్రవర్తికి అన్ని తక్కువ మార్కులు వెయ్యాలి. కాని, వ్యక్తిగతమైన అనుభూతినిబట్టి ఆంతరంగికమైన సత్యాన్నిబట్టి వాళ్ల విలువలు నిర్ణయిస్తే చక్రవర్తి ఎంత ఉత్తముడో చంద్రవదనులు అంత అధములు! అస్తిత్వవాదం సాహిత్యంలో ప్రతిపాదిస్తున్న క్రొత్తదృష్టి యిదే!

ఉషారాణి వ్యక్తిత్వంలోని వైశిష్ట్యాన్ని ఉత్తమ సాహిత్య శిల్పంతో అనుభూతం చేసిన గోపీచంద్ ఆ వైశిష్ట్యాన్ని గూర్చి యింకా ప్రశ్నలు వెయ్యటం మానలేదు. ఉషారాణి బాల్యాన్నిగూర్చి, ఆమెకు వచ్చిన కలల్ని గూర్చి ప్రస్తావించటంలో అతని ఉద్దేశ్యం యిదే. చివరకు కమలాకరాన్ని ప్రవేశపెట్టి, అతని ద్వారా మనస్తత్వ పరిశోధకుల పేర్లు వల్లెవేయించి—''అలా చెప్పుకుపోయాడు కమలాకరం. ఎన్నో వివరాలిచ్చాడు. ఎన్నో నిదర్శనాలను చూపాడు. శరీరంలో ఉన్న మూలయంత్రాలను ఎన్నిటినో వర్ణించాడు. హార్మోనుల విషయం కూడా కొంతవరకు చెప్పాడు...'' అంటూ చివరకు 'లోపల జరుగుతున్న హార్మోన్ల చలనమే దానికి (లైంగిక ప్రవృత్తికి) కారణ'మని తేల్చాడు అంటూ 'ఎన్నో ఎన్నో' ఈ ఘట్టంలోనే రచనలోని బలహీనత బయటపడుతోంది. శారీరక విజ్ఞానాన్ని, మనస్తత్వశాస్త్ర పరిశోధనల్ని, సాంఘికశాస్త్రాన్ని

గోపీచంద్


(**Socialogy**) కలగాపులగం చేసిన కమలాకరం వివరణ గ్రంథంలో అసంతృప్తికరమైన రచన. అందులో 'జంగ్' (యూంగ్— **Jung**) పేరు బొత్తిగా అప్రస్తుతం. గోపీచంద్ యీ నవలలో ప్రవేశపెట్టిన కలలు కూడా సినిమా కలల్లాగా ఉన్నాయి కాని, మనస్తత్వాన్ని వివరించేందుకు ఉపయోగ పడేవిగా అంటే సహజమైనవిగా **లేవు !** ఇది గోపీచంద్‌కు బాగా పరిచయంలేని రంగంగా కనిపిస్తుంది. **పోతే,** కమలాకరం శాస్త్రీయంగా ఉపన్యసించటం ద్వారా ఉషారాణికి తన లైంగిక ప్రవృత్తియొక్క వైశిష్ట్యాన్ని గూర్చి ఏమి తెలిసింది ? ఏమీ తెలీలేదు ! ఉషారాణిలో కలిగిన ప్రాపంచిక జీవన వైరాగ్యం అది ఎలాగూ సహజపరిణామంగానే ఉంది—కోటీశ్వరమ్మలో లాగ. పోతే శమంతకమణి చరిత్రలో ద్యోతకం చేసిన భావన్నె స్త్రీత్వాన్ని గూర్చిన భావాన్ని, యిక్కడ వాచ్యం చెయ్యటం జరిగింది : "జీవితాన్ని స్త్రీ అర్థంచేసుకున్నంత సవ్యంగా పురుషుడు చెసుకోలేడు..... ఆమె ఎప్పుడూ జీవిత ముఖద్వారం దగ్గరే ఉంటుంది .... పురుషుడో వ్యవహారధర్మాలతో సంగలుపడి ఎప్పుడో జీవితాన్ని విడిచిపెట్టాడు. తాను సృష్టించుకొన్న భ్రాంతులే అతనికి నిజం. వాటికోసమే అతను బ్రతుకు తున్నాడు. అందుకనే భావాలను గానీ, సిద్ధాంతాలనుగాని పురుషుడు పట్టుకున్నంత తేలికగా స్త్రీ పట్టుకోలేదు. వాటికి చచ్చినా దాసురాలుకాదు. ఆమె జీవిస్తుంది అంతే." ఈ విషయము యింత చక్కగా గ్రహించిన గోపీచంద్ ఉషారాణి వ్యక్తిత్వాన్ని శాస్త్రీయ సిద్ధాంతాలతో కొలవబూనటం, దాని ద్వారా ఆమె పరిణామాన్ని వివరించదలచుకోవటం ఆశ్చర్యమే ! అంటే గోపీచంద్‌లో ప్రాతవాసనలింకా వదలలేదన్నమాట !

ఉషారాణి కరుణానందస్వాములవారి సన్నిధి చేరుకోవడంతో ఆమె వ్యక్తిత్వం పొందిన వికాసంలో చివరిఘట్టం ప్రారంభమౌతుంది.

ప్రాచ్య పాశ్చాత్య నాగరకతల్లో, సంస్కృతుల్లో భేదాన్ని
క్లుప్తంగా ఒక్క మాటలో [illegible] —తత్త్వదర్శనము,
మోక్షము మనకూ, వ్యక్తి [illegible] త వారికి, జీవిత
పరమావధీ, ధ్యేయం కావ [illegible] వ్యక్తిగత
మైన సాధనమీద మన [illegible] రా
వ్యక్తి [illegible] కాసానికి అవకాశాలు
వారూ విశ్వాసాన్ని నిలుపుకో
ఈ రెండు దృక్పథాల క
యమూ, జరుగుతున్న
భావించవచ్చు. ఈ దృషి

పడని తలుపులు' నవలలో స్పృశించి పరిష్కరించక విడిచిన సమస్య— సంప్రదాయానికీ వ్యక్తి వికాసానికి సంబంధం; మూడవ నవల అయిన 'మెరుపుల మరకలు' లోనూ అదే ఎదురైంది. సంప్రదాయము అంటే ఏమిటి ? సంప్రదాయము సాంఘికమైన వ్యవస్థాధర్మము (వివాహము మొ.), వ్యక్తిగతమైన యోగసాధన (భక్తి, జ్ఞాన, కర్మయోగాదులు) అని రెండువిధాలుగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో సాంఘిక వ్యవస్థల్లో సంప్రదాయము వ్యక్తి వికాసానికి ప్రతిబంధకంగా భావింపబడుతూవుంది; రెండవరకం సంప్రదాయము సమాజం లోని సామాన్యునికి అందుబాటులో లేని, నిత్య జీవితానికి అతడు అన్వయించుకోలేని, గహనమైన విషయంగా కనిపిస్తోంది. అందువల్ల సంప్రదాయాన్ని సమర్థించేవారు కాని దాన్ని వ్యతిరేకించేవారు కానీ వ్యవస్థలను గూర్చి ఎక్కువగా వాద ప్రతివాదాలు చేస్తున్నారు. వ్యవస్థ కాలానుగతంగా మారక తప్పదు; అది మారక**పోతే** వ్యక్తి వికాసము నిరోధింపబడటమే కాదు, వ్యక్తి జీవితమే దుర్భరమౌతున్నది అన్న విషయం చాలవరకు యిప్పటికి గ్రాహ్యమే అయింది. కాని, ఆ మార్పు ఎంతవరకు అవసరము? అనే విషయంలో ఏకాభిప్రాయం కుదరటంలేదు. వ్యవస్థను సంస్కరించే విషయంలో వ్యక్తి వికాసమే ధ్యేయంగా పెట్టుకున్న పాశ్చాత్య జీవిత విధానాలూ, భావాలు పుష్కలంగా మనల్ని ఈ యుగంలో ప్రభావితం చేస్తున్నాయి. గోపీచంద్ ఈ నవలలో ఫ్రెంచివారి జీవిత విధానం దృష్ట్యా వివాహ వ్యవస్థను గూర్చి దాని భవితవ్యాన్ని గూర్చి యిలా ఊహించారు :—"వివాహమే పూర్తిగా రద్దవుతుందో, వివాహం ఉంటూనే అందులో తీవ్రమైన మార్పులు వస్తాయో ఇప్పుడు చెప్పటం కష్టం. క్రమక్రమేణా వివాహంలో మార్పులు వచ్చి వచ్చి చివరికి వివాహం అవసరంలేని స్థితికి సంఘం రావచ్చు..... అది మృగదశే గదా ? .... ఈ స్థితి ఒక్క మృగదశకు చెందిందే కాదు. దేవతల దశకు చెందింది కూడా. దేవతలు మానవులకంటె ఉత్తములనే కదా విజ్ఞుల అభిప్రాయం. ఆ దశలో కూడా వివాహంలేదు. వివాహ నియమాలను అధిగమించిన వ్యక్తి రాక్షసుడే అవుతాడో దేవతే అవుతాడో ఎవ్వరం ముందుగా నిర్ణయించలేం. అది అతని ప్రయత్నం మీద ఆధారపడిఉన్న విషయం. అదేవిధంగా వివాహం లేని
నరకం అవుతుందో స్వర్గం అవుతుందో ముందుగా
[illegible] శకు దేకవచ్చు. ముందుకు జరుగవచ్చు" చింత
[illegible] వలేదన్నట్లు, గోపీచంద్ తను సాంఘిక
వదలుకున్నా, ఆ దృష్ట్యా యింకా

ఊహకురావటం, ఆలోచన మళ్లటం మానలేదు అనటానికి యిది తార్కాణ. గోపీచంద్ ఈ నవల నిర్మాణంలో అనుసరించిన తాత్త్విక, సాహిత్య దృక్పథాలరీత్యా పైనుల్లేఖించిన ఆలోచనలూ (వాటికోసం ప్రవేశపెట్టబడిన కమలాకరం పాత్ర) అప్రస్తుతం కావటమే కాదు, క్రొత్త దృక్పథం ఇంకా ఆయనలో పరిణతికిరాని స్థితికూడామనకు గోచరిస్తున్నది.ఉషారాణి ఒకవిశిష్టవ్యక్తి.ఆమెవ్యక్తిత్వం,వికసించటంద్వారావ్యవస్థా ధర్మాన్ని అధిగమించింది. కాని వ్యవస్థా ధర్మాన్ని వ్యతిక్రమణంచేసే అందరిలోనూ ఆవైశిష్ట్యం ఉంటుందని సిద్ధాంతీకరించి చెప్పటానికి వీలులేదు. అలాగే, భవిష్యత్తులో అందరూ అలా చేస్తారనికాని, చెయ్యటం మంచిదనికాని, చేసేవాళ్లు విశిష్టతను నిరూపించుకుని దేవతలు అవుతారనికాని ఆలోచించటం క్రొత్త దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకం; ఏమంటే అది 'సమూహం'మీద ఆలోచించటం. గోపీచంద్ ఈ నవలలో నిరూపించదలచుకొన్నదీ నిరూపించినదీ ఉషారాణి అనే వ్యక్తి విశిష్టత; దాని ద్వారా పాఠకులకు లభించేది ఒక క్రొత్త దృష్టి. అంతే కాని ఆ క్రొత్త దృష్టి భవిష్యత్తులో వివాహం ఉండదు అనే నిర్ణయంతో భావంతో లేక సిద్ధాంతంతో ఏ విధంగానూ ముడిపడేదికాదు. క్రొత్త దృష్టికీ వివాహ భవితవ్యానికి ఏదో సంబంధం ఉన్నదన్న అభిప్రాయం పాఠకులకు సూచనగా కూడా రచయిత కలిగించి ఉండవలసింది కాదు. ఈ విషయంలో గోపీచంద్ ఆలోచనా క్రమమే నిర్దుష్టంగా అంటే పరిపక్వంగా లేదు అనుకోవల్సి వస్తున్నది. కాని ఈ దోషంవల్ల ఉషారాణి పాత్ర చిత్రణలో ఏ విధంగానూ లోపం జరుగలేదు. వ్యక్తి వికాసం అనే ధ్యేయం లక్ష్యశుద్ధితో, నిర్భయత్వంతో, కొంత నిస్సంగత్వంతో సాధించనచ్చు; అది సాధించబడిన తర్వాత ఎదురయ్యే దైన్యం, శూన్యం, ఏకాంతం, ఎలా తీరుతుంది ? ఈ స్థాయికి చేరుకున్న వ్యక్తికి ప్రాచ్య సంప్రదాయంలోని రెండవ భాగం— వ్యక్తిగతమైన యోగసాధన— ఒక్కటే మార్గం. గోపీచంద్ ఈ సత్యం గుర్తించటంవల్లే ఉషారాణి యోగినిగా పర్యవసించినట్లు చిత్రించాడు. అంటే సాంప్రదాయంలో వ్యవస్థధర్మాన్ని అధిగమించిన ఉషారాణి సంప్రదాయంలో వ్యక్తి సాధనను అవలంభించిందన్న విషయం ఆమె చరిత్ర ద్వారా మనకు అవగతమవుతున్న సత్యం. ఇందులో వింతా విడ్డూరమూ ఏమీ లేదు, కొంత నింపాదిగా ఆలోచించి చూస్తే. వ్యవస్థ ఒక స్థాయి మనుష్యులకు ఆలంబనముగా, పట్టుగొమ్మగా పనికి వస్తుంది; మరొక స్థాయివారికి ప్రతిబంధకంగా గోచరిస్తుంది; అంతకంటే పైస్థాయివారికి అది ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే; దానితో 'తామరాకు మీది నీటిబొట్టు' లాగా వ్యవహరించగల స్థాయి వారిది. ఇందులో ఎవరు ఏ స్థాయికి చెందినవారో నిర్ణయించగల హక్కు ఏ వ్యక్తి విషయంలో ఆ వ్యక్తి అంతరంగానిది మాత్రమే. ఆ అంతరంగాన్ని సాహిత్యం ప్రతిబింబించిన తరుణంలో ఆ వ్యక్తి స్థాయినీ, విశిష్టతనూ గ్రహించి తద్వారా లోకాన్ని క్రొత్త దృష్టితో దర్శించే అనుభూతి పాఠకులది ! ఈ దృష్టి ప్రసాదిస్తున్నందువల్లనే 'మెరుపుల మరకలు' ఒక కావ్యం అవుతోంది. గోపీచంద్ ప్రాచ్య పాశ్చాత్య జీవిత విధానాలకు సమన్వయం ఉషారాణి పాత్రద్వారా సాధించాడు.— వ్యక్తి వికాసము, వ్యక్తిగతమైన ధర్మసాధన రెండూ వేర్వేరుకావు; రెండూ వ్యక్తికి సంబంధించినవే; రెండింటిలో ప్రధానము వ్యక్తి వైశిష్ట్య నిరూపణమే; రెండింటి మధ్యా ఉన్న భేదం పూవుకీ పండుకీ గల భేదం మాత్రమే ! (సశేషం)



దివ్యౌషధం

శ్రీ మధురాంతకం రాజారాం

"ఏమోయ్ కుర్రడాక్టరూ! నీ కోసమే చూస్తున్నా! ఇదిగో శ్రీదేవీ! అబ్బాయి వచ్చాడుగానీ నాలుగు మల్‌గోబా మామిడిపళ్ళు పట్టుకురా."

"నా కొక్కటైతే చాలు! మిగిలిన మూడూ మీకా మేష్టారూ?" వినయం ఉట్టిపడుతుండగా ప్రశ్నించాడు డాక్టరు రమణమూర్తి.

"ఒక్కసారిగా మూడు మామిడిపళ్ళు తినడం చాలా ప్రమాదకరమని వైద్యశాస్త్రం చెబుతుందా ఏమిటి మూర్తీ?" మరింత అమాయికంగా ప్రశ్నించారు నారాయణరావుగారు.

"గురు శిష్యులమధ్య రగడ రాజుకుంటోందన్న మాట!" నవ్వుతూ హాల్లోకి వచ్చింది శ్రీదేవమ్మ.

"చూడు మిస్టర్ మూర్తీ! నువ్వు మీ పెద్దమ్మ మాటలకు పెద్దగా పరిగణన ఇవ్వగూడదు. మాటి మాటికీ నా ఒజ్జరికాన్ని జ్ఞప్తికి తేవడం ఆమె కలవాటు. హైస్కూల్లో, అదీ యస్సెల్సీ క్లాసులో నీకు నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్పానేమో, ఆ మేరకే మన గురు శిష్య సంబంధం! వైద్య శాస్త్ర విజ్ఞానం నువ్వు కళాశాలలో సంపాదించుకున్నది. ఆ శాస్త్రానికి సంబంధించినంతవరకూ నువ్వు డాక్టరువి. నేనొక మానవుణ్ణి. ఇక్కడ మానవుడనగా ఏ క్షణాన్నయినా డాక్టరుగారి ప్రాబల్యానికి లోనై అతడి నిగ్రహానుగ్రహాల్లో దేనికో ఒక దానికి గురి కావలసివున్న ఒకానొక సజీవ ప్రాణి అని నిర్వచనం! మామిడిపళ్ళేగాదు, నువ్వు మంచి నీళ్ళు త్రాగడం ఆరోగ్యకరం కాదని చెప్పు, మరుక్షణంనుంచీ నేను మంచి నీటిని ముట్టుకుంటే ఒట్టు......"

"నీకు పుణ్యముంటుందిగానీ దాహమైనప్పుడల్లా ఓ టంబ్లర్ పాయసం త్రాగమని చెప్పవయ్యా మూర్తీ! మీ మేష్టరుగారికి పాయసమంటే చాలా యిష్టం......" మళ్ళీ కలుగజేసుకుంది శ్రీదేవమ్మ.

"ప్చ్, ప్చ్. నువ్వు లాభంలేదు శ్రీదేవీ ఇలా యింటి గుట్టు డాక్టర్లకు చెప్పుకోవచ్చా! రేపు నాకు ముక్కే నొప్పిందనుకో, ముఖమే వాచిందనుకో, డాక్టరేమంటాడు? 'నేను చెబుతున్నాను మేష్టారూ! మీరు తీపి వస్తువులు తినడం బాగా తగ్గించేయాలి' అనడూ! చేతులు గాలిన తర్వాత ఆకులు పట్టుకోడం బుద్ధిమంతుల లక్షణమేనా చెప్పు......"

పంతులుగారు శిష్యుణ్ణి ఎగతాళి పట్టించడం మామూలే! కానీ ఆవేళ పరిహాసం కాస్త శ్రుతి మీరిందేమో శిష్యుడి ముఖం చిన్నబోయింది. ప్రాక్టీసు క్రొత్తదే అయినా 'క్రొత్త వింత, పాత రోత' అన్న లోక సాంప్రదాయం రీత్యా నైతేనేమి, ఉత్సాహంతో, ఓర్పుతో శ్రద్ధగా కర్తవ్యాన్ని నిర్వహించడం వల్ల నైతేనేమి, డాక్టరు మూర్తికి చేతినిండుకూ పని తగులుతోంది. నిర్ణీత సమయాల్లో ఆసుపత్రిలో పనిచేసి, ఆసుపత్రికి రాలేని రోగులకోసం తెరిపి దొరికినప్పుడల్లా పట్టణాన్నొక చుట్టు వేసుకుని వచ్చి అనుదిన వ్యాసంగాల ఒత్తిడిలో అనురుసురైపోయిన తర్వాత మూర్తికి కాసేపు ఉల్లాసంగా కాలం గడపాలనిపిస్తుంది. అరగంటసేపు ఈ పురాణ దంపతుల సమక్షంలో కూర్చుని ఆ తరువాత వెళ్ళి పడుకుంటే హాయిగా నిద్ర గూడా వచ్చేస్తుంది. అలాగైతే తన ఉబలాటంకొద్దీ ఇలా రావడమే తన పొరబాటా! తరచుగా వస్తున్నాడుగదా అని తన నిలా లోకువచేసి పారేస్తారా మేష్టరుగారు!.....

పెడముఖం పెట్టుకుని గోడవైపు చూస్తూ కూర్చున్నాడు మూర్తి. అయిదు నిమిషాలవరకూ హాల్లో నిశ్శబ్దమే ఆవరించింది.

మళ్ళీ రావుగారే ప్రారంభించారు—"పరధ్యానంగా కూర్చున్నావేం శ్రీదేవీ! ముక్కలు కోసిపెట్టు. మన కిద్దరికీ చెరొక పండు. మూర్తికేమో రెండు. ఎందుకంటే భోజనానంతరం పళ్ళు తినడం మంచిది. ఆ మాట ఆరో తరగతి సైన్సు పాఠంలో ఉంది......"

విసురుగా అడ్డు తగిలాడు మూర్తి!—"వద్దులెండి పెద్దమ్మగారూ! కొంతసేపు కబుర్లు వినిపోవచ్చుననే నేనిలా రావడం......"

"అబ్బాయికి కోపం రానేవచ్చింది. రాకేంచేస్తుంది? ఏనాటో మీ దగ్గర చదువుకున్నాడన్న చొరవతో మీ రెంత మాటలంటే అంత మాటలనడం ఏం సబబు?" నిలదీసి ప్రశ్నించింది శ్రీదేవమ్మ.

"సబబుకాదని నీకే అనిపిస్తే నా కిక క్షమాపణ చెప్పుకోక తప్పుతుందా శ్రీదేవీ! శిష్యులకు గురువులు క్షమాపణ చెప్పుకోవలసి వస్తున్న సుదినాలే యివి! చెప్పండి. మీ రిద్దరూ కలిసి ఏ శిక్ష విధించినాసరే, శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాను......"

"అలా గన్నారు గనుక బాగుంది. అవునా మూర్తీ! శిక్షగా మరొకటీ మరొకటి ఎందుకూ! ఈ నాలుగుపళ్ళు ఆయన్నే తినేయమంటే సరిపోదూ!"

"ఎలాగైనా డాక్టరు మనవాడేనని నీ ధీమా! చూడు శ్రీదేవీ! ఎక్కడ బావా అన్నా వంగతోట దగ్గరమాత్రం బావా అనగూడదు......"

ఎంతగా పెదవులకు తాళం వేసుకుని కూర్చున్నా హఠాత్తుగా పెల్లుబికిన చిరునవ్వుల వరదకు ఆనకట్ట వేయలేకపోయాడు మూర్తి — "బాగుందిలేండి మేష్టరుగారూ! అప్పటికి నేను మీకు మందు తెచ్చి యిచ్చి అలిసి పోతున్నట్టు! ప్రాక్టీసు ప్రారంభించి దాదాపుగా ఏడాది కావస్తోంది నేను. ఇంత వరకు నా ఆసుపత్రి ముఖమైనా చూడనివాళ్ళు మీరొక్కరే!"

"మూర్తీ, మూర్తీ!" బతిమాలుతున్నట్టుగా అన్నారు రావుగారు. "ఎంత చెడినా నీకు నేను గురువునే అనుకున్నాను. ఆవిధంగా నిన్ను నా శ్రేయోభిలాషి క్రిందనే జమ కట్టాను..."

పొట్ట చెక్కలయ్యేటట్టుగా నవ్వసాగాడు మూర్తి. —"చూచారా పెద్దమ్మగారూ! మేష్టరుగారి ధోరణి యింత! బెంచీ ఎక్కించడం, బెత్తంతో బాదడం లాంటి కఠిన శిక్షలు మాకు రివాజే! కానీ అంతలోనే దగ్గరికి పిలిచి ఒక మాట అని నాలుగు నవ్వులు నవ్వించి 'వెళ్ళరా బాబూ' అని బుజ్జగించి పంపేసేవారు. అందువల్లనే మేష్టరుగారంటే భయమూ, భక్తీ గూడా ఉండేవి. . . ."

"ఆ భయ భక్తుల్ని భూతం తినిపోయిందిలేవోయ్ మూర్తీ! భూతమంటే భూతకాలమని భావం! ఇప్పుడా మాటెందుకు గానీ నువ్వు పళ్ళుతిను. . . ."

పళ్ళుతింటూ ఆలోచనలో పడ్డాడు మూర్తి—రోగాలు మనిషికి గాక మ్రానికొస్తాయా అన్నది లోకోక్తి. అనగా మనిషికీ రోగాలకూ ఏదో గాఢమైన అనుబంధమే ఉందన్నమాట! ఆహ్వానం పంపక పోవచ్చు. మనకు బొత్తిగా యిష్టమూ లేక పోవచ్చు. ఐనా మన అభిప్రాయంతో ప్రసక్తి పెట్టుకోకుండా తమంతట తామే తీరిగా వచ్చి, ఇంట మకాంపెట్టి, తిన్నంత కాలం సుష్టుగా తిని, చిట్ట చివర బస్సు ఛార్జీలకు సైతం డబ్బు గుంజుకుని వెళ్ళే బంధువుల లాంటివి జబ్బులు. వాటి బారికి గురికాని మానవుడుండడు. తనకైతే సరిగ్గా తెలియదు గానీ మేష్టరుగారికైనా ఎప్పుడో ఒకప్పుడు జ్వరం, జలుబు, తలనొప్పి లాంటి మామూలు రకం జబ్బులైనా వచ్చి ఉండక పోవు.

"ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నావు మూర్తీ !" నింపాదిగా అడిగాడు రావుగారు.

అలాగైతే మీరెప్పుడూ జబ్బు ముఖమే చూడలేదా మేష్టారూ ?— అన్న ప్రశ్న నాలుక చివరిదాకా వచ్చి అక్కడే ఆగిపోయింది. ఆ తొట్రుబాటులో తన ప్రశ్న కొకమారు వేషం తగిలించాడు మూర్తి—" "మరేం లేదండీ మేష్టారూ ? మనిషికి జ బ్బులెందు కొస్తాయా అని ?"

"ఏమిటోనబ్బా ! నే నెన్నడూ ఆ అంశం పైన ఆలోచనలు పెట్టుకోలేదు. అలాంటి జిజ్ఞాసకు పూనుకోడానికి తీరికుండాలిగదా ! నాకు లేనిదే అది ! క్రమ శిక్షణ, సిలబస్సు, పరీక్షలు— ఈ బడిగోడల పరిమిత పరిధిలోనే ముప్పై ఏళ్ళ సర్వీసు గడిచి పోయింది. ఇంకో అయిదేళ్ళు యిలాగే పనిచేసి రిటయిరైతే, ఆ తరువాత కొన్ని ముఖ్య విషయాలను గురించి తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చోవాలన్న సదుద్దేశం మాత్రం లేకపోలేదు. ఐనా యిప్పటికిప్పుడు జబ్బులెందుకొస్తాయన్న ప్రశ్నకు గాక పోయినా, అవి ఎవరికోసం వస్తున్నాయో చెప్పగలను. కానీ ఎందుకులే బాబూ, చెబితే మళ్ళీ నీకు కోపం రావచ్చు. . . ."

"పరవాలేదు చెప్పండి మేష్టారూ. . . ." ప్రాధేయ పడ్డాడు మూర్తి.

"జబ్బు లెందుకొస్తున్నాయన్న విషయముంది చూచావూ, అదొక మహా రహస్యం ! ఆ రహస్యం కాస్తా తెలిసిపోతే వెను వెంటనే దానికి నివారణోపాయాలు గూడా తయారౌతాయి. ఆ తరువాతి పరిణామాలను గురించి నేను వేరే చెప్పాలా మూర్తీ ! బయట తగిలించుకున్న బోర్డులను పూడబెరికి, డాక్టర్లు, తమతమ వైద్యాలయాలను మూసుకోవలసిందే గదా !"

మేయబోయి మెడతగిలించుకున్న చందంగా యిరుకున పడిపోయాడు మూర్తి. కానీ అంతలోనే తెప్పరిల్లి "అయితే

డాక్టర్లుండడం అనారోగ్య నివారణకే గానీ ఆరోగ్య పరిరక్షణకు కాదని మీ అభిప్రాయం'' అన్నాడు.

''బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది. ఈ జబ్బుల గొడవ కాస్త కట్టిపెట్టి మరేదైనా లోకాభి రామాయణంలోకి దిగకూడదూ!'' మంచి నీళ్ళకోసం లోపలికి వెళ్తూ అంది శ్రీదేవమ్మ.

మొదటి ఆటనుంచీ తిరిగి వెళ్తున్న సినిమా ప్రేక్షకులతో బాటుగా యిల్లు చేరుకున్నాడు మూర్తి. పడుకున్నాడే గానీ నిద్రపట్టిందిగాదు. ఈ రోజు మేష్టరుగారి ద్వారా అవగతమైన విషయం తనకు క్రొత్తదేమీ గాదు. డాక్టర్లతో ఏపాటు తమ కెంతగా అవసరమైనా లోకుల కెందుకో వాళ్ళపట్ల సదభిప్రాయం ఉన్నట్టు తోచదు. చిన్నవాడు తను హైస్కూల్లో చదువుకునే రోజుల్లో 'డాక్టరా, లాయరా, ఎవరు గొప్ప' అన్న విషయం పైన ప్రసంగాలు జరిగేవి. లోకంలో టీచర్లు, గుమాస్తాలు, దర్జీలు, యిన్స్యూరెన్సు ఏజంట్లు మొదలైన వృత్తిదారు లెందరో ఉండగా, డాక్టర్లకు, లాయర్లకు మాత్రం లంకెగలిపి వారిలో ఎవరు గొప్ప ఎవరు తక్కువ అన్న మీమాంసకు పూనుకోవలసిన అవసరమేమిటో తన కర్థమయ్యేది గాదు. బహుశా యిది కారణమైతే గావచ్చు— ఈ రెండు వృత్తులూ ప్రధానంగా మానవుడి బలహీనత పైన ఆధారపడి కొనసాగేవి. న్యాయాన్ని ధిక్కరించడానికి కారణం మానసిక దౌర్బల్యమైతే, జబ్బులకు గురికావడానికి హేతువు శారీరక బలహీనత. కానీ తమతో ఎదుటివాడికి ఏర్పడిన అవసరంలో నుంచీ ఎంతగా వీలైతే అంతగా డబ్బు పుట్టించాలన్న కక్కుర్తి పైన పేర్కొన్న రెండు వృత్తులకే పరిమితమైనదేమీ గాదు. క్లాసులో క దంపుడు పాటలే చెబుతూ వచ్చి, పరీక్షలకు ముందుగా తమ దగ్గర ట్యూషన్లు చెప్పుకోకపోతే గడచి గట్టెక్కడం అసాధ్యమని హెచ్చరికలు పలికే ఉపాధ్యాయులెంతమంది లేరు? పడవలసిన మామూలు జేబులో పడితే గానీ ఫైలును టేబిలు దాటనివ్వని గుమాస్తాలెంత మంది లేరు? జీవితానికి సంబంధించిన ప్రతిరంగంలోనూ నిస్వార్థంగా సేవచేయడానికి ఎంతటి అవకాశమైతే ఉందో, దగా చేసి మూటలు ముల్లెలూ కట్టుకోడానికైనా అంతే అవకాశం ఉంది. మరైతే ప్రత్యేకించి లాయరీ, డాక్టరీలను మాత్రం తప్పుబట్టడం ఏం న్యాయం?

ఈ అన్యాయానికి తోడుగా తమకు జబ్బులు రాకపోతే డాక్టర్లు బ్రతకలేరన్న వితండవాదం ఒకటి! అప్పటికి డాక్టర్లు విక్షేపంగా బ్రతుకు గడచి పోవాలన్న ఉదార బుద్ధి గలిగినవారై స్వప్రయత్నంతో జబ్బులు కొని తెచ్చుకున్నట్టు తన కోడి, తన కుంపటీ లేకపోతే లోకానికి తెల్లవారదనుకున్న ముసలమ్మలా తమకు జబ్బులు రాకపోతే డాక్టర్లకు బ్రతుకు లేదని భావిస్తున్నట్టున్నారు లోకులు! ఛీ, యిదేం బాగుండటం లేదు!

మరునాటి ఉదయం కొంత ఆలస్యంగా నిద్రలేచాడు మూర్తి. అరగంట ఆలస్యం అయిందేమో, ఆసుపత్రికి వెళ్ళేసరికి వెయిటింగు రూం నిండుకూ క్రిక్కిరిసి ఉన్నారు రోగులు. వేళకింత తిండి నీళ్ళూ తీసుకుంటున్నట్టుగా ప్రతి రోజూ యిన్ని మందునీళ్ళు లోపలికి పుచ్చుకుంటూ జబ్బుకు అలవాటు పడిపోయిన పాత రోగులు కొందరు డాక్టరుగారిని సందర్శించారు. వాలకాన్నిబట్టి చూస్తే మానవుడు ఆరోగ్యంగా, ఆనందంగా బ్రతకవచ్చునన్న స్పృహ వారి కున్నట్టు లేదు. హిమాలయాలపైన గడియ కొక రకంగా వాతావరణం మారుతుందని చెబుతారు. ఆవిధంగా ఒకప్పుడు బాగా తగ్గినట్టు కనిపించి, మరొకప్పుడు విపరీతంగా విజృంభించినట్టుగా తోచే రోగ ప్రభావం క్రింద రంగులు మార్చుకుంటూ సహజ సౌందర్యాన్ని గోల్పోయినవాళ్ళ ముఖాలకేసి చూస్తూ డాక్టరు మూర్తి నిర్విణ్ణుడైపోయాడు. వీళ్ళ నిస్సహాయ పరిస్థితిని మాటల్లో వర్ణించి చెప్పడం కష్టం. లేదంటే ఒక పోలిక చెప్పవచ్చు. బలవంతుడు, దుర్మార్గుడు అయిన శత్రువుడికి, వాడు శత్రువన్న సంగతి తెలుసుకోకుండా స్వంత యింటిని అద్దెకిచ్చి, వాడా యింటిని ఖాళీ చేయడం కుదరదని భీష్మించుకుని కూర్చుంటే, ఏం చేయడానికి పాలుపోక పంచలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న యింటి యజమానిలా వీళ్ళు తెల్లబోయి ఉన్నారు. పాలిపోయిన ఈచనిటేపవుల్లో ఉద్యానవనాలు తల లెత్తకపోతేమానె! పచ్చికైనా మొలవదా అన్నదే. వీళ్ళ ఆశ! స్వరాజ్యం ఒకరు వేరొకరికి ప్రసాదించే భిక్షం కాదనీ, అది ఎవరికి వారే సంపాదించుకోవలసిన జన్మహక్కనీ అన్నాడట మహాత్ముడు. ఆరోగ్యానికి సంబంధించినంతవరకూ అలాంటి ఆత్మవిశ్వాసం వీళ్ళల్లో ఏనాడో నశించిపోయినట్టుంది .....

వైద్యశాస్త్రం అనారోగ్యానికి బోలెడన్ని కారణాలను ఏకరువు పెడుతుంది. నివారణోపాయాలు గూడా చెబుతుంది. విచిత్ర మేమిటంటే వైద్యశాస్త్ర విజ్ఞానం పెరిగిన కొద్దీ క్రొత్తగా కొన్ని జబ్బులూ పుట్టుకొస్తున్నాయి. వాటికి చిత్ర విచిత్రమైన చికిత్సా విధానాలూ అన్వేషింపబడుతున్నాయి. కాని ఆరోగ్యవంతుడి కిదంతా కాబట్టడం లేదు. అతడు తన జీవితాన్నొక మధురగీతంలా ఆలాపించుకుంటూనే ఉన్నాడు.

అలాగని ఆరోగ్యవంతుడైన మానవుడు ఆరోగ్య శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదివి దాని సలహాలను, హెచ్చరికలను విధిగా పాటిస్తున్నా డనడానికి దాఖలాలు లేవు.

డాక్టర్లు రోగనిదానం చేయగలరు. ఔషధాలు నిర్ణయించగలరు. పథ్యం చెప్పగలరు. అంతకుమించిన గారడీ పనితనంతో జబ్బులను మటుమాయం చేయలేరు. కానీ ఈ వాస్తవాన్ని రోగులు గుర్తించరు. ఒక చిన్న మాత్రగానో, ఒకటి రెండు ఔన్సుల ద్రవంగానో, కొన్ని గ్రాముల సూదిమందుగానో సర్వరోగ నివారణిగా ఒక దివ్యౌషధాన్ని వైద్యశాస్త్రం కనిపెట్టగలిగితే బాగుండునన్నదే వాళ్ల కోరిక. శాస్త్రం అందులో కృతకృత్యత నందుకోగలిగే సూచనలు కనుచూపుమేరలో కనిపించవు. ఎటొచ్చి ఉపాయాంతర మొక్కటే కనిపిస్తుంది. దుఃఖాల కన్నింటికీ కోరికలే కారణం గనుక, తీర్చుకోడానికి ప్రయత్నించడంకన్నా వాటిని సమూలంగా తుడిచిపెట్టడమే మంచిదని తత్వజ్ఞులు చెబుతారు. ఆవిధంగా ఆలోచిస్తే జబ్బులకు నివారణోపాయాలు కనిపెట్టడంకన్నా, ఆరోగ్యానికి మూలకారణం కనిపెట్టడమే సులభమేమో!

ఉదయం పది గంటలకు ఆసుపత్రిలో పని ముగిసిన తర్వాత పట్టణంపైన మొదటి రౌండు బయల్దేరాడు మూర్తి. వెళ్లవలసిన నాలుగైదు చోట్లకూ వెళ్లి యింటికి తిరిగివస్తూ గడియారం చూసుకున్నాడు. గంట పదకొండు. భోజనానికి యింకా కొంత వ్యవధి లేకపోలేదు. దారిలోనే తగులుతుంది మేష్టరుగారి యిల్లు. పెద్దమ్మకు అచ్చంగా జబ్బులాంటిదేదీ లేకపోయినా దానికి సంబంధించిన అనుమానాలు దండిగా ఉన్నాయి. వాటిని గురించి ఆమె చెప్పడానికైనా, తాను వినడానికైనా మేష్టరుగారి సాన్నిధ్యంలో బొత్తిగా వీలుండదు. పనిలో పనిగా ఆమెనుగూడా పలకరించుకుని వెళ్లిపోతే ఆదనంగా యింకొకపని గూడా ముగిసినట్లవుతుంది.

“ఏం చేస్తున్నారు పెద్దమ్మగారూ! దారిలో వెళ్తూ యిలా వచ్చాను. పది రోజులప్పుడు నే నిచ్చిపోయిన మందు ఎల్లా పనిచేసిందో చెప్పారుగారు” అంటూ కుర్చీలో కూర్చున్నాడు మూర్తి.

“అయ్యో, మతిమరుపు! చెప్పొనుకావా మూర్తీ! పదిరోజులకని చెప్పావుగదూ! మందు తియ్యగా ఉందేమో, మూడు రోజులకే బాటిలు ఖాళీ అయిపోయింది. చెబితే నువ్వే మసుకుంటావోనని గమ్మునుండిపోయాను ....”

పెద్దమ్మలో యింకా పసితనం మాసిపోనందుకు లోలోపలే నవ్వుకున్నాడు మూర్తి.

“ఐనా నీ అక్కరంకొద్దీ నువ్వేదో మందు లిస్తున్నావు గానీ, పుచ్చుకుంటున్నానని తెలిస్తే మీ మేష్టరుగారు మండిపడతాడు. నీరసంగా ఉంది అంటాననుకో—వెళ్లి భోజనం చేయమంటారు. చెమటలు పోస్తున్నాయంటా ననుకో, స్నానం చేయమంటారు. నిద్రపట్టలేదంటా ననుకో, కాసేపేదైనా చదువుకోమంటారు. అంతేగానీ దీని కేదైనా మందో మాకో చూడాలన్న ధ్యాసే ఉండ దాయనకు ....”

“మితిమీరిన నీరసం, మాటిమాటికి చెమటలు పట్టడం, రాత్రుల్లో నిద్రలేకపోవడం యివన్నీ అనారోగ్య లక్షణాలు. ఈ చిహ్నాలు పొడసూపినప్పుడు జాగ్రత్త వహించడం మంచిది. ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం పనికిరాదు” అన్నాడు మూర్తి.

“ఒక్కసారా, రెండుసార్లా మూర్తీ! లక్షసార్లు చెప్పి ఉంటాను. చెబితే వినే రకమా! వద్దు వద్దని చెబుతున్నా సరే తన ధోరణి తనది! ఉదయం అయిదు గంటలకే నిద్రలేస్తారు. పండు చలిగా ఉన్నా, జడివానలా మంచు కురుస్తున్నా బయటికి వెళ్లి భళ్లుమని తెల్లవారాక యింటికి తిరిగొస్తారు. ఎనిమిది గంటలకు ఓ గ్లాసుడు పాలు త్రాగితే, మళ్లీ పన్నెండుకు పైన్నే భోజనం. సాయంకాలం టిఫినుచేసి పెడతానంటే, ససేమిరా వద్దంటారు. ఎందుకని నిలదీసి అడిగితే ఏడు ఏడున్నరకల్లా ఏకంగా భోజనమే చేయవచ్చును గదా, మళ్లీ మధ్యలో టిఫిను దేనికని ఎదురు ప్రశ్నిస్తారు...”

“ఆ రెండుపూటలైనా ఆయన తృప్తిగా తింటున్నారా అన్నదే నా సందేహం!” ఆరోగ్యానికి మూలకారణాలను ఆరా తీసే ప్రయత్నంలో ఉన్నాడు మూర్తి.

“అయ్యో రాతా! ఆమాటెందుకులే మూర్తీ! ఇది బాగుంది, ఇది బాగాలేదు అన్నమాటే లేదు. చేసిపెట్టిందల్లా శుభ్రంగా తినేయడమే! అదేమిటని అడిగితే ఆకలికి రుచేం తెలుస్తుందని ఒకటే నవ్వు ....”

ఆరోగ్యాన్ని కొలవడానికి ఉపకరించే బెరామీటర్లు రెండు. మొదటిది ఆహారం. రెండోది నిద్ర. బాగా ఆకలి వేస్తే, సుఖంగా నిద్రపడితే—ఆ పరిస్థితిలో ఆరోగ్యం ఢోకా లేకుండా ఉందన్నమాటే! జఠరాగ్ని ప్రకోపం జాజ్జ్వల్యమానంగా ఉన్నట్లయితే ఆరోగ్యం సగం మేరకు నిక్షేపంగా ఉందనే చెప్పవచ్చు. మిగిలిన సగం సంగతి?

“తొమ్మిదిన్నర అయ్యా కాకమునుపే నేను వెళ్లిపోతుంటానా పెద్దమ్మగారూ! ఆ తరువాత గూడా చాలాసేపు

చదువుతూ కూర్చుంటూరారా మేష్టరుగారు ? అర్ధరాత్రి దాటుందే పడుకోరా ?" ప్రశ్నించాడు మూర్తి.

"బాగా చెప్పావులే మూర్తీ ! గంట పది కొట్టడమే ఆలస్యం. మేష్టరుగారి విషయంలో పడుకోవడం వేరు, నిద్ర పట్టడం వేరు కాను. పడుకోవడమంటే నిద్రపట్టించడన్నమాటే!"

ఏవో వివరాలైతే తెలిశాయి గానీ 'క్లూ' మాత్రం దొరికిందిగాదు—

డాక్టరుగారి ద్విచక్ర శకటం మళ్లీ పురవీధుల వెంట బయల్దేరింది. మార్గ మధ్యంలో శంకరశాస్త్రిగారు ఎదురయ్యారు. బిగ్గరగా కేకపెట్టి ఆయన మూర్తిని సైకిలు నుంచి క్రిందికి దింపించారు.

"అదేమిటోయ్ మూర్తీ ! చిన్ననాటి గురువుని ! డాక్టర్లకు చిరకాల మిత్రుణ్ణి! నిరంతర వైద్యశాస్త్ర ప్రయోగాలకు ఎడతెగని ముడిసరుకుని ! నన్ను పలకరించకుండా వెళ్లిపోవడం న్యాయమా ?" నిలదీసి అడిగా రాయన.

"అబ్బే. నేను మీవైపు చూడ్డం తటస్థించలేదండీ మేష్టరుగారూ ! సెలవులో ఉన్నారేమిటి ?"

"అవునొందుకులే మూర్తీ ! కాజువల్ లీవులు, ప్రివిలేజి లీవులు జూనుకే ఖాళీ అయిపోయాయి. సిక్‌లీవు గూడా గడువు మీరిందని లాస్ ఆఫ్ పే చేస్తామంటున్నారు. సింహాద్రి డాక్టరుకు రెస్టు రెస్టనడం పరిపాటే. రెస్టువల్ల నాకు కలిగే నష్టం సంగతి ఆయన ఆలోచించడు. అప్పటికీ హెడ్మాస్టరుగారు మంచివారు గనుక నా ఆటలు సాగుతున్నాయి...."

"అన్నట్టు హెడ్మాస్టరుగారి కెప్పుడూ ఇలాంటి సెలవుల్ని వాడుకునే అవసరం తగలదా మేష్టరుగారూ ?" కుతూహలంతో అడిగాడు మూర్తి.

"అయినా ! ఆయనకు సెలవు లెందుకు ? ఆదివారం నాడు తప్పనిసరిగా బడి మూసేయవలసి ఉంటుందనే ఆయనకు విచారం ! ఇంచుమించుగా నేనూ ఆయనతోబాటుగానే సర్వీసులో చేరానా మూర్తీ ! అనాటినుంచీ చూస్తున్నాను. ఒళ్లు నలతగా ఉందన్న కారణంతో ఓ అరరోజు సెలవు పెట్టిన పాపాన పోయాడుకాడు మహానుభావుడు ! ఏ అమ్మ గన్న బిడ్డో, ఏ అమృతరసాయనం సేవించాడో, దినదిన ప్రవర్ధమానమైన ఆయన ఆరోగ్యభాగ్యానికి వెనుకనున్న కిటుకేమిటో ...."

అర్థోక్తిలో ఆగి పోయారు శాస్త్రిగారు. మూర్తి గూడా అక్షణాన అనివార్యంగా ఓ సందేహం కలిగినమాట నిజం ! హెడ్మాస్టరుగారన్న పేరుతో వ్యవహరింపబడుతున్న ఈ వ్యక్తి నిజంగా ఒక మనిషేనా, కాకపోతే నియమబద్ధంగా పనిచేస్తున్న ఒక యంత్రమా అని ! మనిషైతే ఒకప్పుడు గాకపోయినా ఒకప్పుడు రోగాలకు రొష్టులకు లోనుగావడం సహజం ! మరలు విరిగిపోవడంవలన, బిగి చెడిపోవడంవల్ల ఒక్కొక్కప్పుడు యంత్రమైనా దారితప్పడం కద్దు ! మేష్టరుగారు రెంటికీ చెడిన రేవడిలా ఉన్నారు !

అన్వేషణకు ఫలితంగా ఒక అసందిగ్ధమైన నిర్ణయానికి చేరుకోలేక పోయాడు మూర్తి. భాగ్యలక్ష్మికి మల్లే ఆరోగ్యలక్ష్మి కూడా ఆ కారణంగానే కొందరిని అనుగ్రహిస్తుందేమో! మరి కొంతమంది ఎంతగా వేడుకొన్నా దగ్గరికి రాక దవుదవ్వులనే ఉండి పోతుందేమో....

* * * *

విజ్ఞానం అంతు లేనిది. తృష్ణ అంతకన్నా అంతులేనిది. ఆ రెండు కలిస్తే ఇక చెప్పేదేముంది? జ్ఞాన తృష్ణ పూర్తిగా ఉపశమించడానికి కొన్ని ఆయుష్షులైనా చాలక పోవచ్చు.

నాలుగేళ్ళ శాస్త్రాధ్యయనంలోనూ, ఒకటి రెండేళ్ల అనుభవంలోనూ మూర్తికి సంతృప్తి కలిగింది కాదు. శస్త్ర చికిత్సపైన క్రొత్తగా కనుగొన్న విశేషాలను అభ్యసించే నిమిత్తం ఉత్తర దేశం వెళ్ళి రెండేళ్ళ ఒప్పందం పైన అక్కడొక మిషనరీల ఆసుపత్రిలో అతడు ఉద్యోగానికి కుదిరాడు. నిపుణులైన వైద్యులు, క్రొంగ్రొత్త చికిత్సా విధానాలు, ఆధునికమైన ఉపకరణాలు, అన్నింటినీ మించి వైద్య శాస్త్రంలో ఏ ప్రయోగం చేయాలన్నా అందుకనువుగా లభ్యమయ్యే జబ్బులు, అంతా బాగానే ఉందిగానీ ఎందుకో తన హృదయంలో అశాంతి చోటు చేసుకుంటున్నట్టు తోచింది మూర్తికి! బహుశా ఊరు విడిచి దూరప్రాంతానికి తరలిరావడమే అందుకు కారణం గావచ్చు. ఐనా ఈ ప్రవాస జీవితం ఎంతకాలం ? ఈ చూస్తుండగానే రెండేళ్ళు గడచిపోవూ ! కార్యసాధకుడు కష్టాన్నిగానీ సుఖాన్ని గానీ లెక్కకు రానీయడని భర్తృహరి చెప్పనే చెప్పాడుకదా !

రెండేళ్ల శిక్షణ కాలంలో ఆరుమాసాలు గడచిన తరువాత ఓరోజురాత్రి మలిజాము వేళ వాలు కుర్చీలో కూర్చుని ఆనాటి టపాలో వచ్చిన దినపత్రిక చదువుకుంటున్నాడు మూర్తి. పతాక శీర్షికలో నదీజలాల తగాదాను పరికించి, రెండో పేజీలో క్రీడా విశేషాలను గమనించి, మూడో పేజీలోనికి వచ్చేసరికి తనకోసం కాచుకుని ఉన్న మహత్తరమైన వార్త ఒకటి

మూర్తి కక్కడ దృగ్గోచరమైనది. రెండు కాలంలమేరకు విస్తరించిన ఆ వార్త కనుబంధంగా ఓ ఛాయాచిత్రంకూడా ప్రచురింపబడింది. రాష్ట్రపతి దగ్గరినుంచీ ఓ ఉపాధ్యాయుడు బహుమానం అందుకుంటున్న దృశ్యం. జాతీయ గౌరవానికి పాత్రుడైన ఆ ఉపాధ్యాయుణ్ణి మొదటి చూపుల్లోనే పోల్చుకోగలిగాడు మూర్తి. వెంటనే వార్తను సాకల్యంగా చదివేశాడు. విద్యాబోధనకు జీవితాన్ని అంకితంచేసి ఆరంగంలో దేశానికి గొప్ప సేవచేసిన ఆచార్యులను జాతీయ స్థాయిలో గౌరవించడం ఇటీవలి సాంప్రదాయం. ఈ ఏడు ఆ విధంగా గౌరవింపబడిన నలుపదిమంది ఉపాధ్యాయుల్లో నారాయణరావుగారొక్కరు. వారి క్రింద సంగ్రహంగా జీవిత విశేషాలను పొందుపరచడంగూడా జరిగింది. ఒకే పాఠశాలలో ముప్పై ఏళ్ల సర్వీసు. బడిని గుడిగా దిద్దితీర్చిన కార్యదీక్ష. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా నీతిపథంనుంచీ తప్పి నడవని అసిధారావ్రతం. ఇంకా సంఘసేవా కార్యక్రమాలు..............

ఐదు నిముషాలవరకూ కళ్లుమూసుకుని నిశ్చలంగా కూర్చున్నాడు మూర్తి. అంతసేపూ అలౌకికమైన తన్మయత్వాన్నే భజించాడు. న్యూఢిల్లీ నగరం. రాష్ట్రపతి భవనం. సభాసీనులైన పెద్దల సమక్షాన సన్మానం. ఆ దృశ్యాలన్నీ అతడి మనోనేత్రం ఎదుట సాక్షాత్కరించాయి. పోగా చిరకాలంనుంచి తనను వెంటాడుతూ వచ్చిన ఓ ధర్మసందేహంనుంచీ విముక్తి పొందినట్లుగా మనసు తేలికపడిందిగూడా ! ఇది మానవ సామ్రాజ్యంపైన యాంత్రిక నాగరికత పెత్తనం చలాయిస్తున్న కాలం. నిజమైన పనితనంతో గాకుండా పోజులుపెట్టి డాబులుకొట్టే పబ్బం గడుపుకపోవడానికి వీలున్న రోజులు. జీవితకాలంలోనూ, జీవశక్తిలోనూ ఎక్కువ భాగాన్ని ఒక సంస్థకు, లేదా ఒక సత్కార్యానికి ధారబోసిన వ్యక్తులకు పరిగణివీ లభించదేమోనన్నదే తన సందేహం ! ఆ సందేహం వట్టి సందేహమేననీ, సిద్ధాంతంకాదనీ తేలిపోయింది.

అప్పటికప్పుడు తన ఆనందాన్ని ఉత్తరంలో యిమిడ్చిన తర్వాతగానీ మూర్తికి నిద్రపట్టిందిగాదు. తోటలో పువ్వులు పూస్తే వాటిలో భగవంతుడి కైంకర్యంలో చరితార్థత పొందేవి కొన్ని. భామినుల కేశపాశాలకు అలంకారాలుగా చెన్ను మీరేవి కొన్ని. పరిమళద్రవ్యాల తయారీకి ఉపకరించేవి కొన్ని. ఆకులో రాలని, పూలువాడని వసంతారామంలాంటిది విద్యాలయం. విద్యార్థుల పువ్వులు. ఉపాధ్యాయుడే తోటమాలి. అబ్బో ఎందరు శిష్యులు మేష్టరుగారికి ! విదేశాల్లో ఉన్నతోద్యోగులుగా కొందరు. మంచుకొండ శిఖరాల్లో మాతృదేశ రక్షణార్థమై దీక్షా కంకణులై కొందరు. దారిద్ర్య నిర్మూలనంకోసం నదీజలాలకు ఆనకట్టలు కట్టే బృహత్కార్యాల్లో నిమగ్నులై కొందరు. ఇంకా తనలాంటి డాక్టర్లు, కార్మికులు, గుమాస్తాలు—వేల సంఖ్యలో ఉన్న శిష్యులకింతకంటే శుభ వర్తమానం మరేముంటుంది ? వందల కొలది అభినందన లేఖల్లో తనదీ ఒకటి—

మరునాటినుంచీ మరింత శ్రద్ధగా దినపత్రికను గమనింపసాగాడు మూర్తి. ఏ వార్తల కోసమైతే తానెదురుచూచాడో అవి ఒకరోజు గాకపోతే మరొక రోజు, ఒక చోట గాకపోతే మరొక చోట, విపులంగా గాకపోతే టూకీగానైనా కనిపించేవి. ముఖ్యంగా చెప్పుకోదగినది పురపాలక సంఘంవారు మేష్టరుగారికి చేసిన పౌరసన్మానం. అంతకుమునుపు ఆయన రాజధానినుంచి తిరిగివచ్చిన సందర్భంలో జరిగిన ఊరేగింపు గూడా గణనీయమైనదే ! దారిపొడుగునా మేళతాళాలతో పుష్ప వర్షంతో, విద్యార్థుల కోలాహలంతో సాయంకాలం ఆరుగంటలప్పుడు స్టేషను దగ్గర ప్రారంభమైన వూరేగింపు మేష్టరుగారిల్లు చేరుకునేసరికి రాత్రి పది గంటలు కావచ్చింది. మరునాడు పాత విద్యార్థుల సంఘంవారు పట్టు శాలువాలు కప్పి రజత శారదా విగ్రహాన్ని బహూకరించారు. సభావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరుగారు మేష్టరుగారికి ఆ గౌరవం లభించడంలో ఉన్న ఔచిత్యాన్ని గురించి నాలుగు మాటలు చెప్పారు — "మానవుడికి ఘనత నాపాదించే హంగులు చాలావున్నాయి. మొదటిది డబ్బు. లాటరీలో లక్షరూపాయలు రావచ్చు. అవినీతే ప్రాతిపదికగా అంత మొత్తం గడించవచ్చు. అలాకాకుండా న్యాయానికి సేఃలేని పద్ధతిలో లక్ష రూపాయిలు గడించడంలో విశిష్టత ఉందని చెబితే అందు కభ్యంతరం చెప్పే వాళ్ళుండరు. మేష్టరుగారికి కీర్తి లాటరీలో వచ్చిన ప్రైజు గాదు. కనుకట్టుతో మంత్రతంత్రాలతో సంపాదించిందిగాదు. దాని వెనుక ముప్పదేళ్ల నిర్విరామ కృషి ఉండనే ఉంది"

మూర్తి మరి కొంత దూరం ఆలోచించాడు— నిజమే! సేవ, త్యాగం, ఉపకార పారీణత మొదలైన సద్గుణాల వల్ల జేబులు నిండవు. కీర్తి మాత్రమే లభిస్తుంది. అది గూడా లభించక పోతే ఇక లోకంలో సదుద్యమాలకు, సదుద్దేశాలకు తావే ఉండదేమో!

మూడు మాసాల వరకు పత్రికలో అడపాదడపా సన్మాన వార్తలు చూస్తూ వచ్చాడు మూర్తి. బడిలోని పిల్లలందరూ కలిసి ఒకసారి ఉపాధ్యాయులందరూ ఒకసారి మేష్టరు గారిని సన్మానించారు. జిల్లాలోని పేరెన్నిక గన్న పాఠశాలలు ఆయన్ను పిలిపించుకుని విందులిచ్చి వేనోళ్ళ ప్రశంసలు కురిపించి తమ వంతు తాముగా చెల్లించుకున్నాయి. ఎటొచ్చీ మూర్తికి

కొక్కటే కొరత. ఆ ఆనందంలో తను పాలు పంచుకోడానికి వీల్లేక పోయింది. ఉత్సాహ సంరంభంలో ఉండిపోయారేమో, మేష్టరు గారు తన జాబుకు బదులు గూడా వ్రాశారు కారు.

అక్కడ తన జాబుకు జవాబు రానందుకు మూర్తి కించపడడము, యిక్కడ రావుగారు అతని జాబుకు బదులు వ్రాయడము రెండూ బహుశా ఒక్కసమయాన్నే జరిగి ఉండవచ్చు. మూడోనాటి సాయంకాలం టపాలో మూర్తి ప్రత్యుత్తరం అందుకున్నాడు. ఒకటికి రెండుసార్లు చదివాడు. చదువుతగా అది మేష్టరు గారు తనకు వ్రాసిన ఉత్తరం కాదేమో ననుకున్నాడు. కాకపోతే మేష్టరు గారికి అనారోగ్యమా! అందులోనూ తీవ్రమైన అనారోగ్యం! పాఠశాలకు రెండు నెలలు సెలవు పెట్టవలసిన అనారోగ్యం! ఇలా జరగవచ్చునని తన కలలోనైనా అనుకోలేదు.....

విచ్చిపోయిన దుర్గంలోనికి శత్రువులు చొచ్చుకుని వచ్చినట్టుగా మేష్టరుగారి ప్రశాంత జీవనంలోకి అనారోగ్యం ఎలా ప్రవేశించినట్టు? ఎలా ప్రవేశించిందో గానీ ఉత్తరంలో ముప్పాతికా మువ్వీసం వంతు దాని వర్ణనతోనే సరిపోయింది. ఎంతోకాలం సాధన చేస్తేగానీ భక్తుడికి భగవంతుడి పైన ఏకాగ్రత కుదరదు. రోగి సంగతలా కాదు. రోగి ధ్యాసంతా రోగంపైకి మళ్ళడానికి ఎంతటి స్వల్ప కాలమైనా చాలు...

మూడో పర్యాయం ఉత్తరం చదువుకున్నాడు మూర్తి.

“తన సంతోషమే స్వర్గము, తన దుఃఖమే నరకమన్న ఆర్యోక్తిని ఎరుగుదువా మూర్తీ! ఆ మాటలో నెంతో నిజం ఉంది. నువ్వు కాన్సరంటావు. టి. బి. అంటావు. అదంటావు. ఇదంటావు. కానీ అవన్నీ నా జబ్బు ముందు దిగదుడుపుకైనా పనికిరావని నేననుకుంటాను. డాక్టర్లతో సంప్రదించడం మూడు మాసాల క్రిందటే ప్రారంభమైంది. ఆ ప్రారంభం ఏ దుర్ముహూర్తాన జరిగిందో గాని నాటి నుంచీ నేటి వరకూ ఈ వ్యాధి రోజుకొక విచిత్ర వినూత్న పరిణామంతో నన్ను వేధించుక తింటోంది. కొంతసేపు కుర్చీలో కూర్చుంటే వెన్నుముకలోపలి భాగాన సూదులతో పొడిచినట్టు బాధగా ఉంటుంది. అరమైలు దూరాన నడిస్తే బడలిక వల్ల ఎక్కడ బడితే అక్కడ కూలబడి పోవాలనిపిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఎందుకో హఠాత్తుగా తలనొప్పి తరుముకొచ్చేస్తుంది. రైలు రానున్నందుకు గుర్తుగా రెక్కమాను వంగడంలేదా మూర్తీ! ఆ మాదిరిగా నొప్పిరావడానికి ముందుగా పట్టకారుతో బిగనొక్కినట్టుగా తల ఇనుపగుండులా స్తబ్దమై పోతుంది. ఇవి మాత్రమే గాదు. ఈ అవలక్షణా లన్నింటికీ తలమానికమైనది వేరొకటుంది. నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో మునుపెన్నడూ నాకు ప్రమేయం ఉండేది గాదు. ఇప్పుడలా కాదు. ఎడమవైపు శ్వాస బరువెక్కినట్టు తోస్తుంది. ఒకప్పుడు ప్రయత్న పూర్వకంగా గానీ వూపిరాడదు. . . .”

ఉత్తరం పూర్తిగాక మునుపే మూర్తి ఆలోచనలన్నీ ఒక్కసారిగా వైద్యశాస్త్ర వీధుల వెంట పరవళ్ళు త్రొక్క సాగాయి. ఈ అనారోగ్య లక్షణాలకు హేతువైన జబ్బులు నాలుగైదున్నాయి. సామాన్యులైన వైద్యుల్ని ఆ నాలుగైదింటినీ ఒక్కటే పేరుతో వ్యవహరిస్తారు. శాస్త్రసాంప్రదాయరీత్యా ఆంగ్లంలో దానిపేరు పల్నాడు చెంత్రాటితో పోటీ పడదగినంత పెద్దది. తెలుగులో ముక్తసరిగా నరాలనిస్సత్తువ అని పేర్కొనవచ్చు.

మళ్ళీ ఉత్తరంలో పడ్డాడు మూర్తి.

“మీ పెద్దమ్మ దొకటే గోల! నేను తగు జాగ్రత్త వహించడంలేదని! ఆమె ఉద్దేశంలో జాగ్రత్త అంటే ఏమిటో నా కర్థం గాదు. లోకంలో ఎన్నో వైద్యశాలలున్నాయి. తీరుతెన్నులనుబట్టి చూస్తే అవి రోగాలకు నిలయాలనుకోడానికి మనసొప్పదు. అక్కడ రోగదేవతకు జరిగే పరిచర్య గూడా ఎంతో ఖరీదుతో కూడుకున్నది. పోగా నిష్కర్షగా యింతకాలంలో జబ్బు నయమైపోతుందన్న పూచీ ఏమీ ఉండదు. ఈ పరిస్థితిలో రోజుకు పాతిక రూపాయల చొప్పున వెచ్చిస్తూ ఆసుపత్రుల్లో ఉండగల స్తోమత నాకు లేదు. లేదని చెబితే మీ పెద్దమ్మ ఒప్పుకోదు. చెవిలో ఇళ్ళు గట్టుకుని సతపోరుతుంది. రోగమే ఒక బాధ కాగా నా పాలిటికిదొక అదనపు బాధగా పరిణమించింది. డాక్టరు సింహాద్రిగారుండనే ఉన్నారు. ఆయుర్వేద వైద్యులు అప్పల నరసయ్యగారు వారానికొకటి రెండుసార్లు వచ్చి చూచి పోతున్నారు. ఇక్కడి గవర్నమెంటు ఆసుపత్రికి కనకాచలమని క్రొత్త డాక్టరు వచ్చాడు. నాయీ జబ్బు నయం చెయ్యాలన్న శ్రద్ధ, పట్టుదల పై ముగ్గురిలోనూ ఒకటే సమాన నిష్పత్తిలో ఉందని నా నమ్మకం! కానీ, మీ పెద్దమ్మ అలా అనుకోదు. ఆమె నమ్మకం ఇరుగింటివాళ్ళు, పొరుగింటివాళ్ళు, బంధువులు, మిత్రులు మొదలైన శ్రేయోభిలాషుల సహాయమేరకు దేశంలో ఎందరెందరు ఘనవైద్యులైతే ఉన్నారో, వాళ్ళందరి పైకి శాఖాచంక్రమణం చేస్తుంది. అలాంటి అసంఖ్యాకులైన వైద్యుల్లో నువ్వు ఒక్కడివి. ఆమె దృష్టిలో నీకొక్క అదనపు క్వాలిఫికేషను గూడా ఉంది—నువ్వు నా శిష్యుడవని!”

ఉత్తరాన్ని టేబిలుపైకి విసిరాడు మూర్తి. చివాలున పైకి లేచాడు. పెద్దమ్మ కంగారు పడడంవల్ల నైతేనేమి పరామర్శించే డాక్టర్ల సంఖ్య హెచ్చడంవల్ల నైతేనేమి, మేష్టారుగారికి యిదేదో తీవ్రమైన జబ్బన్న అనుమానం, కలిగినట్టుంది ! ఒకవేళ ఇది తీవ్రమైన జబ్బే ననుకుందాం. దివ్యౌషధాలున్నాయి గదా ! ముసలి డాక్టర్లకు పాతవాటి పైన్నే గానీ కొత్త మందులపైన విశ్వాస ముండదు. ఇక ఆయుర్వేద వైద్యుడి దృష్టిలో ఆయుర్వేదమే వైద్యం. వాళ్లు క్రొత్త క్రొత్త వైద్యగ్రంథాలను చదువరు. క్రొత్త మందులను ఉపయోగించి వాటి ఫలితాలను గమనించరు. కాకపోతే ఒకరికి ముగ్గురు డాక్టర్లు చికిత్స చేసినా మేష్టారుగారి జబ్బు నయం కాలేదంటే అర్థమేమిటి ? వాళ్లు దగ్గరుండి చేయలేని పనిని యింతదూరం నుంచి పట్టుమని పది రోజుల్లో చేసి చూపడం తన చేతనౌను.

మరునాడు మూర్తి దగ్గర నుంచి రావుగారి కొక మందుల పార్సెలు వెళ్లింది. ఔషధసేవనం జరుగుతోందనీ, గుణం కనిపిస్తున్నట్టే ఉందనీ మేష్టారుగారు బదులు గూడా వ్రాశారు.

ఆ జాబును పదిమంది డాక్టర్లకు చూపించాడు మూర్తి. వాళ్లు పదిమందీ పది రకాల సూచనలు చేయగా వాటి నన్నిటినీ తాను మథించగా, అప్పుడు స్ఫురించిన క్రొత్త మందులను జతచేసి మేష్టారుగారికి మళ్లీ ఒక మందుల పార్సెలు రవాణా చేశాడు.

నెలరోజులు గడచిపోయాయి.

రావుగారి దగ్గరినుంచి మూతో ఉత్తరం గూడా వచ్చింది. జబ్బు నయం కావస్తోందట ! తనకేవిధంగా కృతజ్ఞత తెల్పుకోవాలో తోచడంలేదట !

*   *   *   *

శిక్షణ కాలం పూర్తయి స్వస్థలానికి మరలివచ్చిన మూర్తి వారం రోజులు హాయిగా విశ్రాంతి తీసుకున్న తరువాత మళ్లీ బోర్డు తగిలించి డిస్పెన్సరీ తెరిచాడు. ఆలోగా పట్టణంలో తాను కలుసుకోదగిన పెద్దల నందరినీ కలుసుకున్నాడు. ఆ వారం రోజుల్లో అతడు ఒక రోజా రోజంతా మేష్టారుగారి యింటి దగ్గరే గడపవలసి వచ్చింది. పుట్టింటికి వచ్చిన ఆడుపడుచుకు జరిగినట్టుగా మూర్తి కక్కడ రాజోపచారాలు జరిగాయి. "ఏం చెప్పమంటావు మూర్తీ ! గడచిన అయిదారు నెలలుగా మేము మనుషులమే కామనుకో ! అంతగా బెంబేలు పడిపోయాము. చివరి కెలాగైతేనేం, కొండలా వచ్చిన ఆపద మంచులా కరిగిపోయింది. అంతా భగవంతుడి కృప" అంది శ్రీదేవమ్మ.

మూర్తికి మనస్సు చివుక్కుమన్న మాట నిజం ! ఎంతో కొంత మానవ ప్రయత్నం స్పష్టంగా కళ్లకు కనిపిస్తుండగా అంతా భగవంతుడి కృపే ననుకోడం ఏం సబబు? ఆ మాటకొస్తే దృగ్గోచరమయ్యే దొక్క మానవ ప్రయత్నమే గదా ! భగవంతుని కృప అన్న దొకటి ఉందో లేదో ఎవ్వడెరుగును ? లేదంటే ఇందులోని అంతరార్థాన్ని ఈవిధంగా విడమరిచి చెప్పుకోవచ్చు—అవసరాని కెంతగా ఆదుకున్నా డాక్టర్లు మానవమాత్రులు మాత్రం గాకపోరు. ఆరోగ్యం చెడిన రోజుల్లో వైద్యుడే నారాయణుడుగా కనిపిస్తే కనిపించవచ్చు. కానీ, ఆ తరువాత డాక్టరుతో అవసరముండదు. రానూ వచ్చి పోనూ పోయిన జబ్బు మళ్లీ రాకుండా ఉండాలనుకోడం మానవ స్వభావం. ఈ కోరిక నెరవేరడానికి డాక్టరు తోడ్పాటుకన్నా భగవంతుడి కృపే అవసరమేమో !

ఆవిధంగా ఎదుటి వారి ధోరణికి తనకు తోచిన వ్యాఖ్యానం చెప్పుకున్నాడు మూర్తి. కానైతే యిందులో తన ఊహకు మించిన నిజాలు ఉండగలవన్న ఊహ అతడికి లీలగానైనా స్ఫురించిరదిగాదు. పదిరోజుల తర్వాత డాక్టరు సింహాద్రిగారితో మాట్లాడుతుండగా విషయం బయట పడింది.

"రెండేళ్లుగా నువ్వు వూళ్లో లేకపోయావా మూర్తీ ! నువ్వుంటే నాకు కాస్తా రిలీఫ్ ఉండేది. ఎందుకులే, నా అవస్థ ఆ దేవుడికే ఎరుక ! తిండి తినడానికైనా తీరికుండేదిగాదు ప్రతిరోజా పది పదిహేను చోటకు వెళ్లవలసి వచ్చేది. మిగిలినవన్నీ ఒక ఎత్తయితే హెడ్మాష్టరుగారి కేసే ఒక ఎత్తు. వచ్చిన చిక్కు ఆయనతో గాదు. ఆయన భార్యకు ధైర్యం చెప్పేసరికి తలప్రాణం తోక కొచ్చినంత పనయ్యేది. ఎలాగైతేనేం, ఆ జబ్బును నయం చేసేశాను—ఊపిరి త్రిప్పుకోగలిగాను....."

"మీరు నయం చేశారా ?" అప్రయత్నంగా ప్రశ్నించాడు మూర్తి.

"మరి? ఈమధ్య నువ్వు అప్పల నరసయ్యను కలిశావా ఏమిటి మూర్తీ ! అదేదో సింధూరమట ! దాంతో ఆ రోగం నయమైపోయిందని అతగాడు గొప్పలు చెప్పుకుంటున్నాడట ! నాతో చాలామంది చెప్పారు'...."'

"అబ్బె, అప్పల నరసయ్యగాద్దు ...."

దివ్యౌషధం

“మరైతే డాక్టరు కనకాచలమై ఉంటాడు. ఏమైనా అతడి నిజాయితీ మాత్రం మెచ్చుకోదగ్గది. చాటునా మాటునా గాకుండా నా ముఖాన్నే చెప్పేశాడు—హెడ్మాస్టరుగారికి జబ్బు నయంచేసిన ఘనత తనకే దక్కాలని! ఆమాటమీద మాకు జటాబాటీ జరగడం గూడా జరిగింది....”

అంతపనికి సిద్ధంగాలేడు మూర్తి. పైగా సత్యాన్ని తేల్చుకోడానికి ద్వంద్వయుద్ధమే సహజమైన పద్ధతన్న సూత్రం పట్ల అతడికి నమ్మకం గూడా లేదు. అతడు మెల్లగా పైకి లేచి నేరుగా కథారంగానికే దారితీశాడు.

వెళ్లిన సమయానికి రావుగారింట్లో లేరు.

“కూర్చో మూర్తీ! ఆరోగ్యం కుదిరిందిగా, అయ్యగారింట్లో లేరు. షికారుకు వెళ్లినట్టున్నారు. వచ్చేస్తారు కూర్చో” అంది శ్రీదేవమ్మ.

పది నిమిషాలసేపు ఆమాటా, యీమాటా మాట్లాడి అసలు విషయంలోకి వచ్చేశాడు మూర్తి.

అంతా విన్నాక పెద్దమ్మ గూడా అయోమయమైన అభిప్రాయాన్నే వెలిబుచ్చింది. నిజానికి తమకు గూడా అంతుబట్టని రహస్యం అదేనట! వాడడానికైతే అందరి మందులూ వాడడం జరిగిందట! వాటిలో ఎవరి మందువల్ల ఆరోగ్యం కుదిరిందో గానీ, అది తమ పాలిటి కొక ధర్మసందేహమై పోయిందట!

అప్పుడిక తాను పంపిన మందుల ప్రాశస్త్యాన్ని గురించి ఉగ్గడించక తప్పిందిగాదు మూర్తికి!

“ఉండుండు మూర్తీ! మనలో మనకు సందేహాలెందుకు? అలమారా తెరిచి చూస్తే సరిపోదూ!”

తలుపులు తెరిచింది శ్రీదేవమ్మ. అలమారా చిన్నసైజు మందులంగడిలా ఉంది. అరల నిండుకా రకరకాల మందుల సీసాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ డబ్బీలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని సీసాలకు వేసిన సీలు వేసినట్టే ఉంది. మిగిలిన వాటిలో ఒకటి రెండు డోసుల మేరకు ఖాళీ అయివున్న సీసాల సంఖ్యే హెచ్చు. సూది మందులు కొన్ని ఆలనా పాలనా లేకుండా ఒకదానిపైన ఒకటి పడిఉన్నాయి. అన్నింటిలోనూ తాను పంపిన ఔషధాల ఆచూకీ కోసం తీవ్రంగా పరిశీలించి చూడసాగాడు మూర్తి. క్రింది అరలో పార్సెలు కనిపించింది. అది తను రెండోసారి పంపిన పార్సెలు! మందపు కాగితాల దిగ్బంధనంతో, బిగదీసికట్టిన నవారు దారాలతో, ఆఖరుకు లక్క సీళ్లతో సహా అది తనెలాగైతే పంపాడో అలాగే సురక్షితంగా ఉంది!

మూర్తి నిర్విణ్ణుడై పోయాడు. మేష్టరుగారు జబ్బు నుంచి కోలుకున్నారు. ఆ కోలుకోడానికి హేతుభూతమైన వైద్యు డెవ్వరో ఆయనకు తెలిసి ఉండకపోదు. మరైతే ఈయన వరుసగా డాక్టర్లనందరినీ మభ్యపెట్టి ఇలా కపట నాటకం ఆడవలసిన అవసరం ఏమై ఉంటుంది?

శ్రీదేవమ్మ ఏమిటో మాట్లాడుతోంది. ఆమాటలేవీ మూర్తి బుర్రకెక్కడంలేదు. మేష్టరుగారు చడీ చప్పుడూ లేకుండా ఎప్పుడో వచ్చారు. వచ్చి మూర్తికెదురుగా కుర్చీలో కూర్చున్నారు.

“వచ్చేశారా! ఆలస్యంగాకుండా సమయానికే వచ్చారు. ఎందుకంటారా! మూర్తి కొక టెంకాయ దొరికింది. దాన్ని పగలగొట్టాలంటే ఇందాకటి వరకూ రాయే కనిపించింది గాదు......”

“ఇప్పుడు కనిపించిందన్నమాట!”—రావుగారు తెరిచి ఉన్న అలమారా వైపు చూశారు. క్వశ్చన్ మార్కులా ఉన్న మూర్తి ముఖంలోకి చూచారు. అంతకు మునుపు ద్వారంలో అడుగు పెట్టినప్పటినుంచీ హాల్లోకి వచ్చేదాకా ధారాపాతంగా వినవచ్చిన శ్రీదేవమ్మ ప్రసంగంనుంచీ ఆయన అసలు విషయం కొంత గ్రహించే ఉన్నారు—

“చూడు మిస్టర్ మూర్తీ! ఈ ప్రపంచం ఎలా సృష్టింపబడిందన్న ప్రశ్నను నువ్వు జీవితంలో వందసార్లయినా విని ఉంటావు. అన్నిసార్లూ దాన్ని గురించి ఆలోచించి గూడా ఉంటావు. పైకి చూడ్డానికి అది చాలా మామూలు ప్రశ్న. కానీ, ఒక పట్టాన సమాధానం స్ఫురించని చిక్కు ప్రశ్న కూడా అదే!”

“కావచ్చు.”

“అలాగే నువ్వు రెండేళ్లకు మునుపు నన్నో ప్రశ్న అడిగావు ....”

“. . . . . . .”

“నీకు జ్ఞాపకం ఉండకపోవచ్చు. ఏమైనా అది నీలాంటి డాక్టరు, డాక్టరీ విద్యతో ఏమాత్రమూ పరిచయంలేని నాబోటి సాధారణ వ్యక్తిపైన ప్రయోగించవలసిన ప్రశ్న మాత్రం కాదు.....”

“. . . . .”

“పోనీ, నేనే చెబుతాను. మనుషులకు జబ్బు లెందుకొస్తాయన్నది నీ ప్రశ్న. అవునా మూర్తీ?”

“అవును. దానికి సమాధానం ఎప్పుడైనా తీరిగ్గా ఆలోచించి చెబుతానన్నారు ....”

"ఆలోచించాను. ఈమధ్య కొంతకాలం తిరిగ్గా అంప శయ్యపైన ఉండిపోయానుగదూ! ఒకానొక గొప్ప ప్రశ్నకు సమాధానం తెలుసుకోగలిగాను గనుక ఆ కాలం సద్వినియోగ మైనట్టే!"

"చెప్పండి."

"నాకూ చెప్పాలనే ఉంది. లేనిపోని మాటలతో శ్రోత లను అట్టే విసిగించడం మంచి పద్ధతి గూడా కాదు. కానీ నీ ప్రశ్నకు సమాధానం చెప్పేముందుగా నీకో చిన్న కథ చెప్పడం బాగుంటుందేమోనని ......"

"కథకేం భాగ్యం మేష్టారూ? భేషుగ్గా చెప్పండి. అవసరమైతే ఒక ఉపోద్ఘాతాన్ని గూడా జోడించి మరీ చెప్పండి."

"మనిషికి జబ్బులెందు కొస్తాయన్నది నీ ప్రశ్న. మని షికి జబ్బులే గాదు. ఇంకా చాలా వస్తున్నాయి. సుఖాలు, కష్టాలు, ఆనందాలు, ఆందోళనలు మొదలైనవి. చిన్నచిన్న పరీక్షలతో డాక్టర్లు రోగనిదానం చేయగలరు. మనిషి దిగు లుగా ఉన్నాడా, లేక ఆనందంగా ఉన్నాడా అని తెలుసుకో డానికి ఆమాత్రం పరీక్షలు గూడా అక్కర్లేదు...."

"ఎందుకూ! వాలకాన్నోకసారి ఎగాదిగా చూస్తే తెలిసి పోద్దూ!"

"మనిషి ఆనందంగా ఉన్నాడనుకో! ముఖం విప్పారి కల కల లాడుతుంది. కళ్లల్లో కాంతి చిప్పిల్లుతుంది. శరీరం దూది పింజలా తేలికై ఆకాశవీధుల్లో సంచరిస్తున్నంత హాయిగా ఉంటుంది. మనిషి దిగులుగా ఉన్నాడనుకో! ముఖాన మసి పూసినట్టుంటుంది. శరీరాన్ని లాక్కెళ్లడం ఓ కొండను కది లించినంత శ్రమగా ఉంటుంది. మిన్నులు విరిగి తలపైన పడి పోగా శరీరం భూమిలోకి కృంగిపోతున్నట్టుంటుంది. మరైతే ఈ శరీరమన్న వెండితెర పైకి యిలా నిరంతరంగా రంగుల్ని ప్రసరిస్తున్న ప్రొజెక్టరు ఏదో చెప్పగలవా మూర్తీ!"

"చెప్పలేకేం మేష్టారూ! దాన్నే 'మనసు' అనవచ్చు."

"వెండితెర ఒక్కటే! ఉన్న రంగులు గూడా కొన్ని మాత్రమే! కానీ ఆరంగుల అన్యోన్య సమ్మేళనంవల్ల ఒకప్పుడు తెరపైని దృశ్యం ఆనందకరంగా ఉంటుంది. మరొకప్పుడు భయంకరంగా ఉంటుంది. సారాంశమేమిటో చెప్పనా మూర్తీ! మనసులో ఉదయిస్తున్న ప్రతిభావవీచికా శరీరంపైన తన ప్రభా వాన్ని ప్రసరిస్తోంది ....."

"అర్థమైంది."

"ఇక కథ చెబుతాను" అన్నారు రావు గారు.

"యుగాల క్రిందటి కథ. ఒక అరణ్యంలో ముగ్గురు రాక్షసు లుండేవారు. మహా బలవంతులు. ఎంద రెందరో ఒక్కొ క్కడిగా ప్రయత్నించి చూచారు. వాళ్లని గెలవడం సాధ్యం కాలేదు. చివరకు పరాజితు లందరూ కలిసి ఓ మహర్షిని ప్రార్థిం చారు—అసురుల విజయానికి వెనుకనున్న రహస్య మేమిటో చెప్పవలసిందని!

"మహర్షి వివరించాడు: పోరాడుతున్నప్పుడు తాము పోరాడుతున్నామన్న ధ్యాసగానీ, పోరాటం ముగిసిన తర్వాత తాము విజయం సాధించడం జరిగిందన్న స్పృహ గానీ ఆ రాక్షసుల కుండటంలేదు. వాళ్లు తమను తాము విస్మరించి యుద్ధం చేస్తారు. ఆపైన తమ విజయాన్ని గురించే తలపెట్టరు గనుక —విజయోత్సాహంవల్ల వాళ్లు ఉబ్బి తబ్బిబ్బయ్యే అవకాశమే లేదు. అదే వాళ్ల విజయానికి వెనుకనున్న రహస్యం ...."

"ఐతే వాళ్లని ఓడించడానికి ఉపాయమే లేదా స్వామి!"— పరాజితులు దీనంగా ప్రశ్నించారు.

"లేకేమి!" అన్నాడు మహర్షి—"తాము మహా బల వంతులమన్న స్పృహ వాళ్లకు కలగాలి. తాము విజేతలమన్న గర్వం వాళ్లల్లో ఉద్భవించాలి. యుద్ధం చేసిందీ, విజయాన్ని సాధించిందీ ఈ శరీరమేనన్న స్పృహ వాళ్ల కెప్పుడైతే కలుగు తుందో, ఆ క్షణాన్నే వాళ్ల శరీరాలు వాళ్ల పాలిటికి బంధిఖానా లౌతున్నాయి. నేను చేస్తున్నాననే ధ్యాస, నేను గొప్పవాడినన్న గర్వం—యివి మానవుణ్ణి శరీరమన్న చెరసాలలో నిర్బంధించి వేస్తున్నాయి. ఆ భావాల ఒత్తిడివల్లనే శరీరం ఎజ్జు గుజ్జయి పోతోంది. ఆపైన వాళ్లను జయించడం ఎంత పని?"

రావుగారు ముగించారు—"అలాగే జరిగింది. రాక్షసులు ఓడిపోయారు ...."

కొంతసేపు మౌనంగా ఉండి మళ్లీ ఆయనే కొనసా గించారు—"తాను చేస్తున్నానన్న స్పృహ అతీతమైన కర్తవ్య నిర్వహణవల్ల మానవుడు వజ్రకాయు డవుతాడు. అజేయు డవుతాడు. అందుకు విరుద్ధంగా స్వార్థాన్ని గురించిన చింత, కీర్తికి సంబంధించిన ఆకాంక్ష అతణ్ణి దుర్బలుణ్ణిగా చేస్తు న్నాయి. వాటివల్ల మనిషి కృంగిపోతున్నాడు. నీ ప్రశ్నకు సదుత్తరం లభించినట్టేనా మూర్తీ!"

"జబ్బెలా నయమైందో చెప్పారు కారు ...."

"జబ్బొకరు నయం చేసేదిగాదు. ఆరోగ్యం ఎక్కడైతే ఉండాలో అక్కడ ఉండనే ఉంది. జీవితం సాగరమైతే, శరీరమే పడవ. సముద్రజలాలకు పడవను తేల్చివేసే శక్తి కద్దు. కానీ ఎంతవరకు? పడవకు బొరియలు ఏర్పడనంతవరకు! దిగులుతో క్రుంగిపోవడం, ఆందోళనతో అలమటించడం, ఆరాటంతో కుమిలిపోవడం, స్వార్థచింతలతో తనను తాను సంకుచిత పరచు కోడం, కీర్తికి మురిసిపోవడంలాంటి అలతలతో, కలతలతో శరీరనొక వికలం కాకుండా చూచుకుంటే చాలు, సునాయాసంగా జీవితసాగరాన్ని తరించవచ్చు."

ఆలోచిస్తూ కూర్చున్నాడు మూర్తి.

ఏడు మాటలు

శ్రీ తెన్నేటి విశ్వనాథం

కావ్యమేదైన వ్రాసినా
గాన మేదైన పాడినా
మాట ఏదైన ఆడినా
పెద్దలూ తల ఊచాలి
పిన్నలూ మరి మెచ్చాలి॥

కథలు ఏమైన అల్లినా
కబురు లేమైన కదిపినా
సబబు లేమైన పలికినా
పెద్దలూ తల లూచాలి
పిన్నలూ మది మెచ్చాలి॥

సదసు లేమైనా జరిగినా
పదవు లేమైనా పట్టినా
వ్యాఖ్య లేమైనా దొరలినా
పెద్దలూ తల లూచాలి
పిన్నలూ సంతసించాలి॥

చేతలేమైనా చేసినా
అర్థమేదైనా చెప్పినా
వేషమేదైనా వేసినా
పెద్దలూ తల లూచాలి
పిన్నలూ ముద మొందాలి॥

ఇహలోక వ్యసన   నా
పరలోక విషయమైనా
కవిలోక కృతకమైనా
పెద్దలూ తల లూచాలి
పిన్నలూ మరి మెచ్చాలి॥

పగటి పాపాలు పగలే పోతాయన్నా
రాత్రి పాపాలు రాత్రియే పోయాయన్నా
ఏడు కొండల వాని నెట్లా మొక్కినా
పెద్దలూ తల లూచాలి
పిన్నలూ మరి మెచ్చాలి॥

పలకని దేవుళ్లు దక్షిణ లడిగినా
పలికిన దేవుళ్లు దక్షిణ ల్లాగినా
అయినది కాదని వాదాలు చేసినా
పెద్దలూ తల లూచాలి
పిన్నలూ మరి మెచ్చాలి॥



కవిత్వము - అలంకారము ఛందము

శ్రీ ఉమాపతి పద్మనాభ శర్మ

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గారీ వేపటి భారతి, ఆంధ్రపత్రిక [ఉగాది సంచిక] లలో కవిత్వమునకు వ్యాకరణ ఛ్ఛందోలంకారాదులతో పనిలేదనుచు సహేతుకముగ చర్చించిరి. అవి యక్కఱకురాని బంధములుగను, బరువులుగను పరిణమించుటకుగల హేతువులవశ్యాలోచనీయాంశములైనను, ఆ హేతువులను పురస్కరించుకుని వాని ఉపయోగములను త్రోసిరాజనుటయు బంధముగనే భాసించును.

లక్ష్య లక్షణ సంబంధములను విలోమముగా గ్రహించి ఛందస్సుకొఱకే కవిత్వము వ్రాయుట, అలంకారము నలంకారము కొఱకే వాడుకొనుటయు, అంధానుకరణము, కీర్తికాముకత్వము వంటివి వాని విలువలను కొంచెపఱచుటయేగాక కవిత్వమును "కస రత్తు"గ మార్చివేసియుండును. ఇంచుమించుగ నిట్టి కేవల చమత్కార కవిత్వములను పూర్వులే నిరసించియుండిరి. గణవర్ణ శబ్దార్థ గుణదోష నికరంబుఁ బరికించి కబ్బముఁ గూర్చువారును, బహుతరాను ప్రాస పదబంధ నియమంబు వదలకఁ గృతిసేయువారును, యమకాదులు సెప్పువారును, అలం కృతులఁ బొందుపఱచు 'భూషణార్థు'లును కవిబ్రువులనియే పెద్దలైన యభిజ్ఞుల యభిప్రాయము.

'ప్రాయశోయమకే చిత్రే రస పుష్టిర్నదృశ్యతే' (విద్యాధరుఁడు) అని చిత్రకవిత్వము యొక్కయు, 'రసాభావే చిత్ర కావ్యే శబ్దార్థ వైచిత్రీ మాత్ర పర్యవసాయిత్వ మలంకారాణాం' (ప్ర. రు. రత్నాపణము) 'అని అలంకారములయొక్కయు, 'వాగ్వైదగ్ధ్య ప్రధానేఽపి రస ఏవాత్ర జీవితం' (అగ్నిపురాణము) అని వాగ్వైదగ్ధ్యము యొక్కయు విలువలను పలు విధములుగా పరికించి నిర్ణయించి యుండిరి.

అలంకార చ్ఛందములు సాక్షాద్రసోపస్కారములు గాకున్నను రస పర్యవసాయిత్వ హేతువులుగా నుపాదేయములన్న దృక్పథమును ముఖ్యముగ కవిత్వమునను, భాషలోను వాని ఇమిడి పోయిన తీరును యథాశక్తి పరిశీలింప కుతూహలమును నీ వ్యాసమునకు ప్రోత్సాహకములు. ఆక్షేపించుట, విమర్శించుట, నిరసించుటయు నిందు కార్యములు గావు నిది యొక సహృదయుని స్వగతముగ భావింపదగును.

కవిత్వమునకు రసము ప్రధానమైనది. భావముచే సిద్ధించును. భావ వ్యక్తీకరణమునకు ముఖ్య సాధనము భాష. భావము దాని సహజ స్థితిలో నగ్నముగా నుండును. నగ్నభావన నితరులు చూడ జాలరు. ఇతరులు చూచి యానందించుటయే కవిత్వగత భావనకు పరమావధి. కావున నది భాష యను వాచ్ఛాదనమున ననుభూతి యోగ్యమగును. దీనినిబట్టి భాష యను నది భావనయొక్క యథాతథమైన చిత్రణ చేయఁజాలుట లేదని తెలియుచున్నది. భాష కందని యూహలుండుట తద్జ్ఞులకు విదితమే. ఎవరి యూహల వారే యనుభవించి నప్పుడవి నిసర్గముగా నుండును. ఒకరివి మఱియొకరు పంచుకొనవలసి వచ్చునపుడు భాషచేత కృత్రిమములై యుండును. సూక్ష్మముగ నాలోచింప వ్యాకరణచ్ఛందోలంకారాదులకు వలెనే భాష సైతము 'రసము'ను కట్టడి చేయుచున్నదని తోచును.

ఇట్టి దృష్టితోడనేమో జేమ్సు జాయిస్, గెర్ట్రూడ్ స్టైన్, వర్జీనియా వుల్ఫ్ మొదలగు పాశ్చాత్యులు, అనుభవనున్నది యున్నట్లుగా చిత్రించుట కొక వినూత్న ప్రక్రియ కనుగొనిరి. ఈ పద్ధతిని తెలుఁగులో బుచ్చిబాబు 'చైతన్య స్రవంతి' యను రచనలో ననుకరించిరి. ఇందు భాషకుండు సామాన్య ధర్మములు, వ్యాకరణ నిబంధనలు నిరంకుశముగా నతిక్రమింతురు. భాషకందని భావములకు స్వయముగా కొంత పరిభాష సృష్టించుకొందురు. కొన్ని భావములను సాంకేతిక

ముగనే సూచింతురు. ఇట్టి నిసర్గభావ వ్యక్తీకరణ పద్ధతులు దురవగాహము లగుటచే శిష్టమగు భాషలో వారే వ్యాఖ్యానములు వ్రాసికొందురు. ఇది ప్రత్యేక కళాత్మక ధోరణి యైనచో గావోపును. కాని, యీ రచనలందు వారతి సహజత్వము కొఱకతి కృత్రిమమార్గమవలంబించిరేమో యని పించును.

తెలుగు దేశమున, ప్రాంతీయ పరిమితిలో నైనను భాష కొన్ని సామాన్య ధర్మములతో విస్తరించును. ఆ లక్షణములే భాషను శక్తివంతముగ వశపఱచుకొనును. ఐనను భాష, భావ సామ్యమును పొందజాలకున్నది.

ఒకరి ముఖ 'మందము' గా నున్నదందుము. 'అంద' మను మాట నుపయోగించు మాత్రమున నా ముఖము మన యూహలో దర్శన మివ్వజాలదు. కొన్నివేల ముఖము లంద ముగా నుండవచ్చును. కాని యందరి పోల్కలొకటిగున నుండు ననుకొనలేము. ఆ మాట ఎన్నో ముఖముల వర్ణించుచు వచ్చుచున్నది. నేడు మరియొక ముఖమునకును నా ప్రాత మాటే శరణ్యము. ఒక్కొక్క క్రొత్త ముఖమున కొక్కొక్క క్రొత్త పదము సృష్టించుకొనుటయు, ఆ సృష్టించుకొనిన దిక్కుల కర్థమగుటయు దుస్తరము.

భాషలోని యిట్టి యసౌకర్యమే యలంకారమునకు మూలము. కావున నది భాషలో నొక భాగమే యగుచున్నది.

అర్థము విశేషముగ భావింపజేయదలచి యొకరు "ముఖము చంద్రబింబమువలె నున్న' దని విలక్షణముగ వర్ణించిరి. "అతథాసపి తథా సంస్థితానివ హృదయే యా సూచయతి అర్థవిశేషే సా జయతి వికటకవి గోచరా వాణీ" అను నభియుక్తోక్తినిబట్టి యట్లు వర్ణించిన వాడు కవియే గావోపును. ఆ వర్ణనము సహృదయ సమ్మతమై ప్రశస్తినందినది. అట్టి ప్రాశస్త్య ప్రభావమునకు శాసించు శక్తి యబ్బినది. అనుభవమును కాదను శాస్త్రము లేదందురు. కావున నెట్టి యనుభవమునకైనను శాసించు నవకాశము 'సమ్మతి' యను ప్రమాణముచే కలుగును. ముఖమును చంద్ర—కమల—దర్పణాదులతో గాక మరి దేనితో పోల్చినను, వైలక్షణ్యము కొఱకెట్లు చెప్పబూనినను, అది యలంకారమే యగును. కావున భాషయొక్క విస్తృత రూపమే యలంకారము.

అట్లు భాషలో నతిశయోక్తులు, అసత్యములు, ఉపమాదులు తాళీదళ సంపుటములందే గాక, పోల్చుకొనరానంత సన్నిహితముగ, మన నిత్య వ్యవహారమువనే స్థిరపడియున్నవి. "ప్రాతవడ్డ మాటల తమ నేర్పు చూపు" కవులను తిక్కన నిందించెను. ఏదో నదే పనిగను, గ్రుడ్డిగ ననుకరించుట ప్రాతవడి వినుగు పుట్టించును. తిరుపతి వేంకటకవులని నట్లు "కాలము బట్టి, దేశమును గాంచి, ప్రభుత్వము నెంచి దేశభాషా లలితాంగి" మారుచుండును. అట్టిదే జీవద్భాష యగును.

అప్రస్తుతము గావి నలంకారములే భాషగా మారిన రీతి కుదహరింపదగు కొన్ని ప్రయోగము లిట పరికింప దగును.

"ఓయి పిచ్చివాడా ! (కాకుస్వరము), స్వర్గసౌఖ్యం, నరకం, చస్తున్నాం బాబూ, ఏనుగంత మనిషి, బంగరుమాటి, బంగారుకొండ, పిల్లికళ్లు, శకునపక్షి, శనిగ్రహం, మొద్దునిద్ర, గొంతులో వెలక్కాయ, తెలివి కెల్లారు, వసపిట్ట, అరికాలుమంట...., తాతలు దిగివచ్చు, తలప్రాణం తోకకువచ్చు, కళ్లు కాయలుకాచు, చింతనిప్పుల్లాటి కళ్లు, బ్రహ్మాండంగా, ఊసరవెల్లి, నల్లి, నాలిముచ్చు, కొంగజపం, తిండిపోతు, రాతిగుండె, అబద్ధాలపుట్ట, రాక్షసుడు, వాడికేం మహారాజులా, కొయ్యబారు, గంపెడాస, ఏదోలా ఉంది [ఉపమానం దొరకనప్పుడు], మట్టిబుర్ర, పిల్లకాయ, పండుముసలి, ఉంగరాలజుట్టు"

ప్రభుత్వ, కాలములనుబట్టి యేర్పడునవి :—

"అమృతం లాంటి కాఫీ, చుక్కలకు దాకు ధరలు, ఐపై పోవు, మెదడులో రైళ్లు పరుగెత్తు, ఆటంబాంబులా లేచాడు, రాకెట్‌లా దూసుకుపోవు, దొరబాబులా, 'షేక్స్పియర్ మోహం" మొదలగునవెన్నేని గలవు.

అలంకారములు "గంగిరెద్దు బొంతలవలె" నుండునని శ్రీపాద వారే యుపమించిరి. [గంగిరెద్దుకు బొంతలందమిచ్చునా!!] భాష తీరట్లుండ నిరలంకార— నిసర్గ రచన చేయుమనుటయే భారమగును గదా! అలంకారము లేమియే భావమును కుంచించి బంధించును.

కవిత్వమున కలంకార ప్రాధాన్యమెంత వలెనను చర్చయా లంకారికుల లోనే వచ్చెను. కేవల మర్థ చిత్రములుగా గాక కావ్య జీవితమునకుపస్కారకములుగను,— ఆస్వాద్యములుగను నుండవలయుననియే యుగ్గడించిరి. బొత్తిగ వాని యక్కఱను త్రోసిపుచ్చినవారు కానరారు. భామహాద్యలంకార వాదులు కొందఱు, రసమును స్థితమలంకారముగనే భావించిరి. అభినవ వాగనుశాసనులు, శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారిట్లందురు.

"సాహిత్య లక్షణ కర్తల యభిప్రాయములను బట్టి కావ్యమునకు శోభ గలిగించునట్టి రీతి— వృత్తి— శయ్యా— పాక—

ధ్వని— భావ— రస— ప్రసాద— యమక— ఉపమ— కథా— పాత్రౌచిత్యాది సకల కావ్యధర్మములను అలంకార శబ్దవాచ్యములేయని భావింపదగును." (సంస్కృత వాఙ్మయ చరిత్ర. పుట 199)

ఇది సత్యమేని యలంకారములను కాదనుట కవిత్వమునే కాదనుట వంటి దగును.

"కావ్యకథ— భావ అనుభవము కల్గించే పొసకపు రచనలో అలంకారములు పుడకల" ని శ్రీ పాదవారనిరి. (ఆం.ప. ఉగాది)— విషయము సుబోధకముగ నుండుటకు, భావానుభవమును విశేషించి కలుగజేయుటకు వాడుకొను నలంకారము భాషలో జొచ్చిన తీరు, ప్రయోజనము, వారి వాక్యముననే గమనింపదగును.

"నహి కవేరితి వృత్త మాత్ర నిర్వాహణేన ఆత్మపదలాభః, ఇతిహాసాదేవ తత్సిద్ధేః" అని ధ్వన్యాలోక కారుడనును. కావ్యకథలో కథ కన్న కావ్యగుణమునకున్న విలువ మిన్న—కేవల కథ నిర్వహించుటయే విధిగా తలచిన నా విధి నిర్వహణమునను కవిత్వమాపిర్భవింపదు. ఇతిహాసము చరిత్రమును సిద్ధమగును. భావానుభవసౌష్ఠవమున కలంకారము దోహదకారియగుట, కొన్నియెడల నలంకారము లేనిదే భావానుభవ మభావమగుటయు గలదు.

" క్షీరోదకగతిఁ బాండవ, కౌరవులొడఁ గూడిమనికి
కార్యంబది నీ
వారసి నడపుము, వారన వీరనఁ గురు ముఖ్య నీకు
వేఱు గలదే?"

(భారతము— ఉ—తృ. 258)

ఇవి శ్రీ కృష్ణుఁడు ధృతరాష్ట్రునితో నని మాటలు. శ్రీ కృష్ణునకు సంధి పొసగదని తెలియును. ఐనను "అన్నదమ్ములు తమలోనం బోరఁ గృష్ణుండు వారింపక యుపేక్షించె" నని జను లాడుదురని ధృతరాష్ట్రునితో సంధి విషయము సల్లపదించెను. శ్రీకృష్ణుని మానసము "క్షీరోదకగతి" ద్వారమున నతి విస్పష్టముగ సూచితమగుచున్నది. లోకమున నరుదుగ లభించు వస్తువు క్షీరమువలె [పాండవులు] ప్రియముగా నుండును. విరివిగ లభించు వస్తువుదకము వలె [కౌరవులు] ప్రియముగ నుండ నేరదు. కొద్ది క్షీరమున [ఐదుగురు] నెక్కువ యుదకము [వంద] కలిపినచో నుదకమునకు క్షీరత్వమబ్బునేమో గాని క్షీరము విలువ తగ్గిపోవును. ద్రవగుణమున్నంత మాత్రమున [అన్నదమ్ములు] వానికయ్యుకలోని విప్రతిపత్తి యవాంఛితము. పాలు, నీరు విజాతీయములు. పాలను పలుచన చేయుట ఎవరికి మాత్రమిష్టము గల్గునని? "గంగమ్మ చల్లనిదైనను [క్షాత్రము], గట్లను కోయును. జలమునకు ప్రళయమును సృష్టించు శక్తి గలదు. అట్లు "క్షీరోదకగతి" లోని వ్యంగ్యము శ్రీ కృష్ణుని యభీష్టమును, ధృతరాష్ట్రుని యసమర్థతను, పాండవ కౌరవుల గుణాగుణములను చెప్పక చెప్పుచు, జరుగబోవుదెల్లరకు విదితమే యను విపులార్థమును వెలువరించుచున్నది.

శ్రీనాథుని శృంగార నైషధమున దమయంతి స్వయంవర సందర్భమున సరస్వతీదేవి 'ఐదుగురు నలచక్రవర్తులను' వర్ణించు శ్లేష, కథకు పుష్టిగల్గించుచు సహృదయ హృదయానందకరముగ నొప్పారును. అయ్యలంకారము లేనిదే ఔచిత్యమునకెట్లు భంగము వాటిల్లునో, యూహింపదగినది.

ప్రాచీన కావ్యములందే గాక నాధునిక కవిత్వమందును వలసినంత యలంకార సంపద భావుకత్వ ప్రేరేపకమై యలరారుచున్నది.

అలంకారములు కొన్ని యనుకరణముచేతను, విశేష ప్రచారముచేతను పేలవములైన మాట వాస్తవము. ఈ 'అనుకరణ' మనునది యనివార్యమగు నొక మానవతాధర్మము. అసలు కవిత్వమే ప్రకృతి కనుకరణమని అరిస్టాటిలభిప్రాయపడెను. అది యట్టిద.

L. ఏబర్ క్రాంబీ దాని నిట్లు వివరించును.

"The poet first derives an inspiration from the world by the power of his imagination; the art of Poetry then imitates this imaginative inspiration in Language."

[Principles of literary critisism']

కవితాజగత్తులోని యాదర్శములను పాఠకులు, [పాఠకులలోను కవులుండవచ్చును.] అనుకరింతురని ఫిలిప్ సిడ్నీ భావించెను. కవి, ప్రకృతినుండి పొందిన యుత్తేజమును భాషలోని కనుకరించునపుడు తన వైయక్తికమగు కళాత్మక ప్రౌఢికతను జతపఱచి యా యనుకరణమును కమనీయము నరచ్చును. అదే యతని కవిత్వమగును. అందుచే అనుకరణ మనునది యొక మూఢ విశ్వాస మగను, గుడ్డిగను పరిణమించుట యారోగ్యము కాదనుట సమంజసమగును. అనుకరణమునను స్వేచ్ఛ యుండదగును.

"అలంకారము కవిత్వానికి అందము సమకూరుస్తుంది. అవి వాదిస్తే అది పూర్తి సత్యము కాదు. అది బంధము కూడ కాగలదని చేరిస్తేనే పూర్తి సత్యమౌతుంది" అను శ్రీపాదవారి వాక్యములు యథాక్షర సత్యములు. అందుచే 'బంధము కాగల' దనుట అర్ధసత్యము మాత్రమే—ఛందోలం

కారములతోడనే కవిత్వము వ్రాయవలెననుకొనువారి కవి బంధ ములే యగును. కాని కవిత్వమున—కవికైనను తెలియకుండ—సహజముగ నిమిడివచ్చు నలంకారమైనను, ఛందమైనను సుంద రములుగ నుండును. ఫారసీ కవి అక్బర్ ఇల్హాబాది యిట్లనెను.

"షేర్ అజ్ గోయమ్ ఆబెహయాత్,
మన్నదానమ్ ఫాయలాతున్ ఫాయలాత్."

[కవిత్వ లక్షణములు నాకు తెలియవు. కాని నా కవిత్వ మున నమృతత్వ ముండును]. వాల్మీకి శ్లోకమును నట్లే నిసర్గ రమణీయ మయ్యెను. ఛందో విషయమున పాశ్చాత్యుల భావము నద్దియే.

"Metere is instinctively used by all poets." [Rhetoric Notes]

కవిత్వమున 'రసము' గుంభనగా నుండుటవలననే పాఠకునిలో క్రమసంచలనము కలిగి తాదాత్మ్య స్థితి కల్గును. రసానుభవ పరిణతి కొక కాలావధి, ఒక మార్గమును కావల యును. ఆ మార్గమున కిట్లు సోపానము లుండును. 1. నాదము—లయ 2. శబ్దము 3. అర్థము 4. అన్వయము 5. భావము 6. రసము. ఇవి యొక్కొక్కటిగా నాకర్షించుచు సహృదయుని రసానందమునకు గొంపోవును. కాని హఠాత్తుగ రసమును ప్రత్యక్షముచేయుట అసౌకర్యము. ఒకవేళ చేయ గల్గినను తదమూల్యానుభవమునకు లట్టుకొని, ఆస్వాదించి, ఆనందించుట యసౌలభ్యము. రసవత్తరమగు భావము కల్గు టకు వెనుక, దానిని వెలువరించు భాష వెనుక కవి హృదయ మున నొక 'మథన' యుండును. ఆ 'మథన' ఛాయా మాత్రముగనైన పాఠకునికి స్ఫురించినపుడతఁడు కవితో సహానుభూతి పొందగల్గును. కార్యకారణ సంబంధమును, కాలపు విలువను సడలించి భావసారమును ముందుంచినచో పాఠకుని రుచి దెబ్బతినును. మధు బిందువుల నౌషధమువలె గుటకవేయక రుచి మూరించి యూహించి, రసనాస్పర్శచే నాస్వా దించి గుటకవేయుదుము.

అందుకే ఆపాతమాధుర్యము కొఱకు శబ్దాలంకార ములును, అర్థమును ప్రతిధ్వనింపజేయుటకు నౌదార్యమును (Onomatopocia), అర్థాన్వయ భావాదుల స్పష్టమును చేయు కొఱ "కాశ్రయాశ్రయా భావేన" అలంకారములును రసానుగుణ్యముగ మాత్రమే గ్రాహ్యములయ్యెను. కాని రస మునే వదలి వానినే ప్రదర్శింపదలచిన నవి వ్యర్థ చమత్కారము లగును.

"భావము తీవ్రమగుచోట నలంకారము పలుచనగును."

కాని ఆ భావ తీవ్రతాదశకు వెనుక కొంత యలంకార సామగ్రి యుండును. అదియే ఆదశకత్యవసర పోషకముగా నుండుటయు కద్దు. మనుచరిత్రమున వరూథినీ ప్రవర సంవాదమునకు పూర్వమున గల వర్ణన మహా ఘట్టమునకు పుష్టి గూర్చి నది. ప్రవరుఁడు 'మకరాంక శశాంకమూర్తి'యైనఁగదా వరూథిని 'నీపయిం జిక్కె మనంబు నాకు' అనియన గల్గినది. కావ్యమున భావస్వరూపమును బట్టి, అలంకార్యాలంకారముల గుర్తించి యే వంపులో నెట్టి యలంకారము తొడుగవలెనో, ఎంతవఱకు వస్త్రములు ధరింపజేయవలెనో, యెచ్చట నగ్న ముగా వదలవలెనో కళాదృష్టిగల కవికి తెలియును. బంగరు పట్టు పుట్టములు గలవని వాని నొడలంతయు గప్పడు. ఏడు వారముల సొమ్ము నొకేసారి యలంకరించడు.

"అలంకారమున్న కవిత్వము ప్రాంతీయమే కాగలదు. విశ్వజనీనము కాలేదు." అని శ్రీపాదవారి యభిప్రాయము.

మానవత్వమునకు వలెనే రసానుభూతికి విశ్వజనీనత గలదు. కాని రస ప్రతిపాదకమగు నే శక్తికి నట్టి విశ్వజనీనత యున్నట్లు గన్పట్టదు. రసము ననుభవమునకు దెచ్చుటకు భాషేకదా ముఖ్యసాధనము. ఆ భాషే ప్రాంతీయ పరిమితి గలదయ్యెను. లోకోత్తర వర్ణనా నిపుణుఁడైనను, అద్భుత సౌందర్యద్రష్టయైనను, స్రష్టయైనను, కవి నివసించు పరిసరములలోని మనుష్యులు, రూపములు, భాషలు, మత ములు, ఆచార సంప్రదాయములు, ఋతువులు, ప్రకృతి సంపదలు, సంస్కృతి సభ్యతలు, చరిత్రలును—ఎంతో కొంత యతని కవిత్వముపై ప్రభావము కలిగియుండక తప్పదు. కావున నొక్క యలంకార మేల ? ఇవన్నియును విశ్వజనీనత కాటంకములు కావలయును. కాని యట్లగుట లేదు. భారతీయ సంస్కృతిమయముగ నలంకార సుచిరముగ నుండు కాళి దాసుని శాకుంతలమును జదివి జర్మను కవి గెథె ఆనందో న్మత్తుఁడై గంతులు వేసెను. మధ్యయుగము నాటి శబ్ద జాలము, ఆకాలపు సామాజిక చిత్రణలు, చరిత్రలును గల్గు షేక్స్పియర్ రచనలు లోకప్రసిద్ధములై యల రారుచున్నవి. 'కవితాశక్తి' సహృదయుని మానందమున ముంచెత్త గల్గుచున్నపుడు, రసికుడు, కవి వాడుకొను భాషలో, సంప్రదాయములలో జొచ్చికొని పోయి, వాని నతిక్రమించిన రసానందమున వెదకికొను నోపిక, సహృదయత్వము [సమాన మానసిక భావము] న సమర్థ్యవస్థకు వెళ్లగల్గు యోగ్యత గలిగియున్నపుడును—అలంకారముగాని, ఛందముగాని సామాన్య స్థితిలో విశ్వజనీనత కాటంకప్రాయములు కానేరవు. అవి కవితా సౌందర్యము నందించి ప్రక్కకు తొలగును.

కవిత్వము - అలంకారము - ఛందము

మహాకవుల రచన లైనను భాషాంతరీకరణమున మూలములోని శోభను గోల్పోవును. కవిలో పుంజీభూతములై నిండియున్న సంస్కృతి సభ్యతలు, వాని నాశ్రయించి యతఁడు చెప్పినయట్లు నడచు భాషలోని చక్కదనము, దానికి కట్టుబడిన భావనావైఖరియు నితర భాషలో నంత సులువుగ రానేరవు. రసము—భాష అన్యోన్యాశ్రయములు గాన వానిని వేరుచేయునపు డందము తగ్గిపోవును. నిరలంకార కవిత్వమైనను మూలమునను, వేరొక భాషలోను చదువునప్పటి యానందములలో తారతమ్యము లుండును. ప్రపంచ సాహిత్యములందలి యలంకార సామ్యములకు తద్జ్ఞులు ప్రమాణము.

ఇక ఛందస్సు—

సంగీతమునకు వలెనే సాహిత్యమునకును నాదమే ప్రధానము. నాదమునుండియే శబ్ద ముత్పన్నమయ్యెను. [నాదే నవ్యజ్యతే వర్ణః పదం వర్ణాత్పదాద్వచః] శబ్దోచ్చారణలోని నాదము వినబడిన తరువాత నర్థగ్రహణము జరుగును. ఈ నాదములోని యుదాత్తానుదాత్త స్వరితములపై, హ్రస్వ దీర్ఘ ప్లుతములపైనను శబ్దార్థము, వాక్యభావమును, ఆధారపడి యుండును. వేదమంత్రములను సస్వరముగా జెప్పుటకు కారణ మదియే.

"మంత్రో హీన స్స్వరతో వర్ణతో వా
మిథ్యా ప్రయుక్తో న తదర్థ మాహ
స వాగ్వజ్రో యజమానంహి నస్తి
యథేంద్ర శత్రు స్స్వరతోఽపరాధాత్."

ఇట్టి సందర్భముననే యపస్వరమువలని యనర్థము ననుభవించిన వృత్రాసురుని కథ జెప్పుదురు. శబ్దములోని యక్షరములకును, వాక్యములోని శబ్దములకును, వాక్యములకును మధ్య కొంతకాలము నిబద్ధమై యుండును.

"లోకే వేదేచ వచసాం పాదయోర్గతిరుత్తమా
తాశేన్నైవ వినా తేన స్ఖలనం తేషు దృశ్యతే" అని

కోహళాచార్యుఁడు భానమునకు వాక్యములందలి లయ తోడ్పాటును సూచించెను. స్వర, లయలలోని హెచ్చు తగ్గులు తప్పుటచేత నపార్థములు వచ్చుట మనకు నిత్యానుభవ సిద్ధమే. ఈ స్వర లయల నవ్యక్తపరిపుష్టదశయే ఛందమని తోచును.

కొండలు మాట్లాడునప్పుడును, కొన్ని భాషలు—మనకు తెలియకున్నను— వినునప్పుడును వానిలో నేదియో సంగీత గుణము ద్యోతకమగును. పద్యములను గాని, పాటలను గాని లిపి రూపమున చూచునప్పుడు ప్రత్యక్షర సాక్ష్యముగా గోచరించు నది కాల విభజన మాత్రమే. వానిని వచనములాగైనను, భావ స్ఫోరకముగఁ జదివినచో నాద విభజన కూడ శ్రవ్యమగును.

"పసుపుం గుంకుమ పూలు పూజ లిడి, సౌభాగ్యంబు
శోభిల్ల, భూ
మిసుర వ్రాతము దీవనల్ గురియ, నామేలెంచి
కట్టించితిం
పెనగన్ మంగళసూత్రమిమ్మె డను; దంగ్రీ! దీని
నీ చేతులా
ర,"—సతీరత్నము నెక్కియేడ్చెనెద జాలిన్ రుద్ధ
కంఠంబునన్—
[శివ భారతము]

ఈ పద్యమును కేవలము లయ విభజనతో వినిపింపలేము. 'చేతులార— సతీరత్నము' అన్న చోట ముఖ్యముగా నాదము చేతనే భావాభివ్యక్తి జరుగును. నాదము శ్రవ్యముగా నున్నను, స్వతంత్రము నతి సూక్ష్మము నగుటంజేసి, చదువాని భావుకత, గళ మార్దవము [Melody] నాదము నెప్పటి కప్పుడే విశ్లేషింపగలుగును. స్వరమక్షర రూపమున నిక్షిప్తము చేయదగినది కాదు. సంగీత గ్రంథములందు కృతులకును, కీర్తనలకును స్వర విభజన మమర్చి చూపుదురు. కాని యాస్వరములను యథాతథములుగ స్వీకరించినచో పాట రాణించ జాలదు. స్వరముల మధ్య గల్గు నొయ్యారము, మెలిక, కంపనము మొదలగు వాని కక్షర సంజ్ఞలుండవు. అందుచే నాదము వినదగినది మాత్రమే. ఇట్టి నాదము నాయా కంఠధ్వనుల నపేక్షించియు, లయను విస్పష్టముగను ఛందము సూచించును. "కావ్యగానము" వినునప్పుడును, స్వయముగఁ జదువుకొనునప్పుడును గల్గు నానందములకును మన ప్రతి చర్యలు గమనింపదగును.

సంగీత నాట్యగుణ సంపన్నత కొఱకే ఛందస్సు, కవిత్వమునకబ్బెను. పాశ్చాత్యులు నైతము ఛందస్సు యొక్క ప్రయోజనమునిటులే వివరింతురు.

"It is the survival of music and dancing in poetry and gives the pleasure and thrill...by its rhythmical flow."

"It is the spontanious out pouring of emotion which sooths by its regularity."
[Rhetoric Notes]

ఇస్లాం మతమున సంగీతమునొక పాపకార్యముగ భావించి నిషేధింతురట. ఇతరుల విషయమేమో గాని మన వారు పద్యములను శ్లోకముల నేల పాడిరో యాలోచింప దగును. 'కావ్యేషు నాటకం రమ్యం' అని దృశ్య కావ్యములకు ప్రాధాన్యమిచ్చుటం

జేసి, భరతుని భావమున నేత్రశ్రోత్రములచే రసగ్రహణయోగ్యములగుటంజేసియు, సంగీతము వ్యక్తి ప్రత్యేకతను తొలగించి యాత్మ విస్మృతి కలిగించుటకుత్తమ సాధనమగుటవలనను, శబ్ద నాద బ్రహ్మాద్వైత స్థితిని దాల్చినవని తోచును.

పదము వలెనే పద్యమును పాడదగియున్నది. వృత్త భేదములు తాళ భేదములే. కొన్ని వృత్తములు సంగీతమున కనుకూలముగ మనము వినియున్న పాటలకు సరిపోలుచున్నవి. భూనుతమను వృత్తము "తేరేశివా కౌనుమేరా కృష్ణకనయ్యా" అను మట్టును, పంచ చామరము "ఇదం ఇదం జడాయెజా" అను మట్టునకు సరిపోవుచున్నవి.

భారతీయ సంగీతము నున్న రసానుగుణ్యమైన నాద వైచిత్రి—అనుభూతి—ఇతర సంగీతములలో నెంతవఱకున్నవో తెలియరాదు—రాగములు స్వతస్సిద్ధముగ రసప్రతిపాదకములు. సంపూర్ణ రాగములు శృంగార, కరుణాదులందు, షాడవ రాగములు రౌద్ర వీర భయానకములందును పాడబడును. లయలో రాగము లీనమగునప్పటి యానందమునకు రసికుల వీనులు ప్రమాణము. శ్రీ కే.వి.రాఘవాచార్యులుగారు "లయకు నైసర్గికముగా నితరముల సహాయము లేకయే శ్రోతలను పరవశింపచేయు శక్తి గల" దనిరి. ఇది కొంత యాలోచనను పురి కొల్పును. లయ అనగా కేవలము కాలవిభజన. రెండు ధ్వనుల మధ్య గల్గు నిశ్శబ్దకాలము.

"తాళాంతరాళ వర్తీయః కాలోఽసౌలయ నామకః" అని కోహళాచార్యుడు లయకర్థము వివరించెను. ధ్వనులను తన యందు లీనము చేసకొని లయ గుర్తింపబడును. కవిత్వమున శబ్ద, గణ రూపమునను, సంగీతమున మృదంగాది వాద్య రూపమునను, లయ నాదము నాశ్రయించి శ్రవ్యమగుచున్నది.

ఈ లయ తాళప్రాణము. తాళము నృత్తగీత వాద్యములందు ప్రతిష్ఠితమగును.

"తాళస్తల ప్రతిష్ఠాయా మితి ధాతోః ప్రయోగతః
నృత్తం గీతం తథా వాద్యం యతస్తాలే ప్రతిష్ఠితం"

అని శార్ఙ్గదేవుడు, నృత్తగీత వాద్యములు తాళమందు ప్రతిష్ఠితమైనవనెను. "రాగ స్వరశ్చ తాళశ్చ త్రిభిస్సంగీత ముచ్యతే" అని సంగీతము నిర్వచింప బడును. ఛందస్సు తాళస్వరూపమే, కావున ఛందస్సునకును, సంగీతమునకును సంబంధము గలదు.

ఆపాత మధురమగు సంగీత రసమును ఆలోచనామృతమగు కవితా రసముతో జత గూర్చి, రెండు మనోహర కళల సమ్మేళనమే ఛందోబద్ధమగు పద్యము, 'పాట' యేర్పడెను. లయాన్వితములగు పద్యములు సంగీత గంధముచే హృద్యము లగుచున్నవి.

"పద్యంలో రాగం ప్రవేశించడంవల్ల లయ స్ఫురించడంలేదు. మరి నాట్య గుణ సంపన్నతను మెచ్చుకునేవారు దేన్ని చూచి మురిసిపోతున్నట్టు?" అని శ్రీపాద ప్రశ్నించిరి. దీని కిట్లు సమాధానము చెప్పవొప్పును.

ఉదాహరణము కొఱకుత్పలమాలను దీసికొందము. ఇది వార్తిక మార్గమున త్రిశ్రజాతి త్రిపుటలో నాల్గు చరణములు, నాల్గావృతములలో సాగు వృత్తము. పాదము నందలి శబ్దములను లయ కనుబంధించి పాడిన యెడల తాళము నడచు విధానము స్పష్టముగ గోచరించును. గుర్వక్షరములను రాగపు మెలికలతో లాగుచు, లఘువులను సామాన్యముకంటె పొట్టిగ నుచ్చరింపుచు తాళము నింపుకొని పాడినచో కాల విభజనకును, అక్షర విభజనకును గల సంబంధ మస్పష్టమైపోవును. కాని లయ మాత్ర ముండితీరును. ఇట్లే పద్ధతి నింకను విస్తారముగ నుపయోగించుకొనిన నవే నాల్గు చరణములను, ఎనిమిది, పదహారా వృతముల వరకు—అర్థము చెడనంత వరకు—పెంచుచు వెళ్లవచ్చును. రాగతాళ ప్రస్తార వశమున నీ పద్ధతి యందు లయ అపోధారణముగ నుండుటచే లయలేదను భ్రాంతియు గల్గుచుండును. 'హిందుస్తానీ' గాయకులు 'విలంబిత్' పాడునపు డంతర్వర్తిగ నడచు లయ సామాన్య దృష్టికి విస్పష్టముగ గోచరింపదు.

పద్యము అర్థ ప్రాధాన్యము లగుటంజేసి సభా నాటకాదులలో వాద్యములతో తాళము సూచించు పద్ధతి ప్రచారమునకు రాకుండును. కాలక్రమమున పద్యముల బాడువారిలో మాత్రకాలముల ధారణ చేయగల్గు శ్రద్ధాసక్తులు సన్నగిలి, రాగము మిగిలి, లయ మాయమైయుండును. కావున పద్యములను తాళ బద్ధములుగనే పాడవలసి యుండును.

ఇక ఛందస్సు విస్తరించిన తీరు తెన్నులు కొన్ని విచిత్రములుగ గన్పట్టును. సంస్కృతమున లేని యతి ప్రాసలు తెలుగున నెందుకు ప్రవేశించెను? యతి ప్రాసలతో తెలుగు కవిత్వము "మేడ్ డిఫికల్ట్"య్యెనా? యను ప్రశ్న లాలోచనీయములు.

యతిప్రాసలు క్రమబద్ధము చేయబడిన యక్షర పునరావృత్తులు. శ్రుతిపర్వమగు వినోదము, వైలక్షణ్యమే వీని ప్రయోజనములైన కట్టుదిట్టము లేల ? యతి నియతి గురించి సంస్కృతము నుండి తెలుగులోనికి వచ్చిన కొన్ని వృత్తములలో కవుల పాటింపులు, లాక్షణికుల మతములును వేర్వేరుగా నుండుట గమనార్హము. యతిస్థలములు నిర్ణయించుకొనుటలో కవులకు స్వాతంత్ర్య ముండవలెనని

కవిత్వము - అలంకారము - ఛందము

శ్రీ గిడుగు వేంకట సీతాపతి గారభిప్రాయపడిరి. [చూ. ఆనంతుని ఛందము— ఉపోద్ఘాతము. పుట 19] తెలుగు పద్యములందు సంస్కృతమునందువలె శబ్ద విశ్రాంతి లేదు. అందుచే "వడి (వళి)కి బదులుగా యతి, విరతి మొదలగు పర్యాయ పదములలో మరియేదిన్ని వాడకూడదన్నట్లే తోచు"నని గిడుగువారు తేర్చిరి. కేవల సంస్కృత విశ్రాంతి నియతి వలననే యతికి విరామాది పదములు పర్యాయము లయ్యెనని యూహింప వీలగుచున్నది. అంతకన్న యతికి విరామాది పదములెట్లు సార్థములగునో తెలియరాకున్నది. కావున యతికి "నియతి" శబ్దమే పర్యాయ మనుట యుచితమగును—

ఏలయన తాళప్రాణములగు కాలమార్గ క్రియాదులలో 'యతి' కూడ గలదు. 'యతి' అనగా లయ నడచు విధానమును సూచించెడు నియమము. "లయ ప్రవృత్తి నియమో యతిరిత్యభిధీయతే" అని కోహళాచార్యుడు. అక్షర సామ్య ద్వారమున నొక "విలంబితలయ"ను ప్రతి చరణమున యతి,— నియతిగా సూచించుచుండును. యత్యక్షరములు [ప్రాసలును] తాళపు ఘాతల ననుసరించి యుండును. ఎన్ని యతులున్నన్ని తాళపు ఘాతల మూలమున లయ మారుచుండు గతి సూచితమగుచుండును. తాళాంగములగు లఘు, ద్రుతాదులను విభజించుటకు యత్యక్షర ముపయోగింపబడును. ఈ విభజన క్రమములలో మారుచుండు యతులకు పారిభాషిక నామములు గలవు. ఉదాహరణము కొఱ కొక వృత్తము పరిశీలింపదగును.

ఉత్సాహమను వృత్తము చతురశ్ర జాతి, చతురశ్ర గతి త్రిపుట [ఆది] తాళములో నొక చరణ మొక యావృతమున నడచును.

ఇట్లు క్రౌంచ పదాదులలో యతి, ప్రాసయతులును భుజంగ ప్రయాతరుచిరాదులలో ప్రాసలు యతులు కలిసియు కొన్నింట కేవల ప్రాసములును గ్రహ విధానముల ననుసరించి చిత్ర విచిత్ర గతులలో సాగుచుండును.

"తక, తరి, కిట" మొదలగు తాళ ప్రత్యయములకును సరిగమాది స్వరముల తాళబద్ధములైన రూపములకును "జతి" అని పేరు. తాళాంగముల ననుసరించియుండును కావున వానికి జతి [యతి] పేరు సార్థమగును. జతి శబ్దము యతి వైకృత రూపముగా నేర్పడి యుండవలెను. "యతిస్వరములు", "స్వరయతులు" ను "జతిస్వరములు" "స్వరజతులు"గను మారియుండవచ్చును. కాని శబ్ద రత్నాకరమున "జతి" శబ్దము దేశ్యమని వ్రాయబడెను. ప్రౌఢ్యమున నీ శబ్దమునకు సంస్కృత సూచ్యమగు గుర్తించబడలేదని శ్రీ మునునూరి వేంకటశాస్త్రిగారి శబ్దార్థ దీపిక యందిట్లు వ్రాయబడును.

జతి— వై. వి. (సం. యతిః) కావున నా శబ్దము వైకృత మనుటయే లెస్స. పద్యమునందలి సాహిత్యము ప్రక్కగా నుంచిన యెడల యతి (యతులు) లఘుద్రుతాదుల విభజించుచు సాగుచుండు జతి స్వరముల వంటివి. ఇక విరామ శబ్దములగూర్చి ఇంచుక పరిశీలింపవలయు.

షోడశ తాళాంగములలో నొక యక్షర కాలము 'అనుద్రుత' మందురు. దీనికే విరామమని నామాంతరము గలదు.

"అను ద్రుతోర్ధ చంద్ర స్స్యాద్వ్యంజనం చాను నాసికం
అవ్యక్తంచ విరామంచ వక్తవ్యం భరతజ్ఞకైః"

ఉ *	తు ల	శౌర్యో	దని ల	ఉవయుం	దవిత *	వాహి	నీ వ	దా
ఘాత		చిటికెన వ్రేలు	అనామిక	మధ్యమము	ఘాత	ఉపి	ఘాత	ఉపి
లఘువు					ద్రుతము		ద్రుతము	

మొదటి తాళాంగము పెద్దదియగు లఘువును, తరువాతివి చిన్నవగు ద్రుతములు నగుటచే విది గొప్పయతి వాడబడును. ఇందు లఘు—ద్రుతములను వేరు చేయుటకు రెండు ఘాతలు సరిపోవును. ఈ రెండు ఘాతలను చరణ ప్రథ[illegible] తెలియజేయుచున్నవి.

అని తాళాంగ నిఘంటువు. అంగ విభజన కొక యక్షర కమగు ననుద్రుతము నక్షర సామ్యమున 'యతి'గా విరమించుటంజేసి యా శబ్దమునకు విరామాది శబ్దములు పర్యాయములై యుండునా యనిపించును. 'వళి' యను మాహదు (ముడుత)ను. వడి యనునది వేగము (కాలము)ను తె

పుచు యతికి మారుపదములై యుండును. ఏమైన నీ విషయము పండితులు శోధింపదగినది. ప్రాసలు శబ్దాలంకార ప్రాయములైనను ఆ యా యక్షరములనుబట్టి ఆ యా రసములను స్ఫురింప జేయును.

కర్షితరిపు లన్యోన్యా
కర్షణ సంకర్షణాప కర్షణముల పా
మర్షులయి పెనగి రాహవ
హర్షంబునఁ బవన సుత బృహద్రథ పుత్రుల్.
(నన్నయ)

ఇందు భీమ జరాసంధుల శరీర కర్కశత్వములు, మల్లయుద్ధమును 'ర్ష' ప్రాసము ధ్వనింపజేయుచున్నది.

యతిప్రాసలు 'టీకా' వంటివి. అనుప్రాస యమకాదులు ద్విత్వ సంయుక్తాక్షరములనున్న "పరుసల"ను బోలియు, సామాన్యాక్షర పునరావృత్తులు తాళపు నడకను స్పష్టము చేయునవియుగ నున్నవి. శ్రీనాథుని "ధాటీ ఘోటక......", పెద్దనార్యుని "అటజనికాంచె..." ఉదాహరణీయములు. శంకరాచార్యుని ఈ శ్లోకము వినదగును.

"డమరు డిండిమ ఝర్ఝర ఝల్లరీ
మృదు రవ ద్రగడ ద్రగడాదయః
ఝుడితి ఝాంకృత ఝాంకృత ఝాంకృతై
ర్బహుదయం హృదయం సుఖయంతుతే"

చివరి చరణమునందలి 'యం' పునరావృత్తి 'ముక్తాఝుంపు' వలె విన్పించును. పోతనామాత్యుని "పాద ద్వంద్వము నేలమోపి" అను పద్యమున చివరి పాదమున, "......నక్రము విక్రమించె కరి పాదాక్రాంత నిర్వక్రమై", అనుటలో 'క్ర' పునరాగమనము, "అమ్మల గన్నయమ్మ" పద్యమున "మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్" అనుటలోని "త్వ" ఆ వృత్తియు నటులే 'ముక్తాయి'ల బోలి శ్రవణ సుఖదము లగును.

పాశ్చాత్యులు "Rhythm" అను మాట కిట్లర్థము చెప్పుదురు.

"The hormonious reccurence of sound accent and moment; in music a grouping of tones in regard to accent and time value."

Reccurenee—Moment—Time value అను మాటలు సమన్వయింప అక్షర సామ్యమున తాళమును సాధించుట యనునది స్పష్టమగును.

యతి—In Telugu it denotes a syllable rhyming to intial of the line.

ప్రాస—In Telugu it denotes alliteration, a rhyme. అని బ్రౌను నిఘంటువున వ్రాయబడును.

Rhyme— అక్షర పునరావృత్తి తాళ (కాల) నియమానుసారముగ వాడబడును. కావున యతి ప్రాసలు లయకాధారపడి ప్రత్యేక వాద్యాదులతో తాళము సూచింప నక్కఱ గల్గకుండునట్లు పద్యముననే అక్షర రూపమున నిమిడియున్నవని తోచును.

సర్వ కవిత్వ మంతర్లయల సూచించునదై యుండును. బంధ కవిత్వము గూడ నొక విచిత్ర ప్రక్రియ. పద్మ చక్రాది బంధములు పెక్కుల జూడ మన వారలు కవిత్వమున గాంధర్వముతోబాటు చిత్రకళను సైత మిమిడ్చి చూపిరను నూహ కలుగుచున్నది. వస్తు స్వభావ వర్ణనలయందు నా యా వస్తువులయొక్క యూహా చిత్రముల నూహా దృష్టికి దృశ్యమానము చేయుటకో, లేక తత్తద్వస్తు రూపముల కావ్య కథాంశములతో నుపమించుటకో ఈ బంధ కవిత్వమవతరించెనను శంక వొడముచున్నది. పాశ్చాత్య సాహిత్యమునను నిట్టి కవిత్వ మొకానొక కాలమున నుండి యున్నట్లు 'బెండెల్ కీత్' పండితుండు

History of Sanskrit litrature [Page 127]

అను గ్రంథమున వ్రాసినట్లు శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యానమున వివరించిరి. బంధ కవిత్వోద్భవమునకు కారణము నా పండితుడిట్లూహించెను.

"It may be that these tricks arose from the practice of writing inscriptions on swords and leaves."

పూర్వులు ప్రయోజనములేని పద్ధతులను ప్రవేశ పెట్టలేదేమో యనిపించును. ఒక్కొక్క భావమున కొక్కొక్క వాఙ్మయ స్వరూపము నిక్కరి ప్రయోజనకారి కాగలదు. కాని వ్యాస ముఖముననే సూచింపబడినట్లు లక్ష్య లక్షణ సంబంధములను గ్రహించినచో 'గ్రుడ్డి యనుకరణ'లకు తావుండక నా యా విలువలు నిలిచియుండును.

ఛందస్సుతో వ్రాసినదే కవిత్వమనుట 'విస్సన్న జెప్పినదే వేద' మనుట వంటిది. గద్యములోనను కవిత్వము గలదు. ముక్తక వృత్తగంధి, ఉత్కలికా ప్రాయాది గద్యముల ప్రాచీనులు వాడిరి. ఆధునికులు వ్రాయు క్రొన్ని వచన కవిత్వము


లందును, కథలలోనను, నవలలలోను హృదయమును రుల్ల మనిపించు చైతన్యము గలదు. సహృదయుడైనవాడే రూపమున నున్న కవితా సౌందర్యమునైనను పోల్చుకొని యానందించును. కాని ఆయా సౌందర్యములందు భేదముండునని మాత్రము చెప్పదగును.

కవిత్వమునకు సంగీత తత్త్వము [ఛందము] అక్కఱ లేదనువారును, 'మాటకు, పాటకు వైరుధ్యము లే'దనువారును, 'సంగీతము నాదాశ్రయ శబ్దాశ్రయమేగాక—అర్థాశ్రయమైగూడ నుండగ'దని'యు [శ్రీ కె. వి. రమణారెడ్డి—భారతి జూన్' 64— పుట 6] సంగీతమును బహుసూక్ష్మ భంగులుగా విశ్లేషించు వారును గలరు. "కవిత్వమే సంగీత"మను వారును—ఉండవచ్చును. ఆ యా రుచులను కాదనరాదు.

నాదము [సంగీతము], స్ఫోట [అర్థ యుక్త లయాన్విత నాదము] రెండును శ్రుతి ద్వారమున గ్రాహ్యము లగుటంజేసి యిట్టి విశ్లేషణములకు వీలు కలుగుచున్నది. కాని యివి ఆ యా పరిణతులకు ప్రాతిపదికలు మాత్రమే. వాని పరిపుష్ట దశలు భిన్నమార్గములుగ నున్నవి. ఆ దశలను ప్రాతిపదిక స్వరూపముల కన్వయించుట చేతనే "మాటలలోనుండు 'సంగీతము' కవిత్వములో నుండగల్గ"చున్నది. అందుకే ఛందము బంధమై "స్వచ్ఛందము" అందమై వచన కవిత్వ మావిర్భవించినది. ఇందు కవితా గుణమును ప్రక్కగా నుంచిన, శబ్దాంతర్లయలకు ప్రాధాన్యమీయబడు నన్వయ గుంభనగల గద్యమే భావ స్ఫోరకముగా పాదములుగా విరుపబడుచు "పద్యమ్ము చదివిన యనుభూతి" గలుగును.

అనిబద్ధ కవిత్వ మొక మెట్టు పైకెక్కినది. ఏదైనను క్రమ పరిణామముననే సహజముగ నుండును. 'ఇది యిట్లుండవలయు' ననుట నిర్బంధమగును. కవితాకన్యయొక్క "వివర సౌందర్యము"ను చూచుటకు మన కన్నులలవడవలయును. ఏమైనను కవిత్వముతో చదువరులకు సంబంధముండునంత కాలము భాషయు, తదాశ్రితములైన సమకాలీన సామాన్య నిబంధనలు తప్పవు.





అమృతాంజనం
బాధ శీఘ్రంగా నివారణ పొందండి
స్థానికంగా ఉండే బాధను నివారణ చేసుకోడానికి ఊరికే మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పి ఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా బెణుకులకు కండరాల నొప్పులకు తలనొప్పికి ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు. అమృతాంజన్ గుండెజలుబుకు సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెం కొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది. కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికంతా కలిపి నెలలు తరబడి వస్తుంది. అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిని పొందిన నమ్మకమైన గృహ ఔషధం.
అమృతాంజన్ నొప్పుల జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు
బెణుకునొప్పి
ఎంత ఎక్కువగా ఉన్నా
బెణికినచోటేకదా!
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
PAIN BALM
AMRUTANJAN LTD.
అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ

JWT/AM/2819

మహాస్రష్ట - రోరిక్

శ్రీ సంజీవదేవ్

47 అనే అంకెలను ఇటుది అటూ, అటుది ఇటూ త్రిప్పితే 74 అనే అంకెలు అవుతవి. అది 1947 వ సంవత్సరం అక్టోబర్. నికొలస్ రోరిక్‌కు 74 వ సంవత్సరం వచ్చింది. నేను ఆయనకు జన్మదిన అభినందనలు తెలుపుతూ వ్రాశాను, "ఇది 1947 వ సంవత్సరం, మీకు వచ్చింది 74 వ సంవత్సరం. 74 ను తిరగవేస్తే 47 అవుతుంది, 47 ను త్రిప్పితే 74 అవుతుంది. కనుక ఈ సంవత్సరంలో మీ జీవితంలో ఏదో ప్రముఖ పరివర్తన జరగవచ్చు."

అందుకు ఆయన సమాధానం వ్రాశారు, "47 ను త్రిప్పితే 74 అవుతుందనే సత్యం మా కెవరికీ ఇదివరకో తట్టలేదు. మీ ఉత్తరంలోని ఈ నూతన సత్యాన్ని హెలీనా (రోరిక్ సతి)కూ, జార్జి (రోరిక్ పెద్ద కొడుకు)కీ, స్వెతస్లావ్ (రోరిక్ చిన్న కొడుకు)కూ తెలియపరిచాను. వారంతా ఆనందించారు."

1947 అక్టోబర్ ప్రథమంలో నేను రోరిక్‌కు వ్రాశాను, అదే సంవత్సరం డిశంబరులో ఆయన మరణించటం జరిగింది! పోయిన అక్టోబర్‌లో ఆయన డెబ్బైయ్యో జన్మ దినోత్సవం జరిపారు. ఆయన మరణించి ఈ డిశంబర్‌కు 17 సంవత్సరాలు.

సాంస్కృతిక రంగంలో, ప్రత్యేకించి చిత్రకళారంగంలో అంతర్జాతీయంగా ఇంతగా ఖ్యాతి నార్జించినవారు ప్రాచీన కాలంలోనూ కొద్దిమందే ఉన్నారు, ఆధునిక కాలంలోనూ కొద్దిమందే ఉన్నారు.

రోరిక్ అనగానే రంగూ రేఖా, శబ్దమూ అర్థమూ, ప్రేమా మైత్రీ, శాంతీ ఆనందమూ మన మానస చక్షువుల ముందు రూపం తాల్చి నిలుస్తవి. ఈ విశాల విశ్వంలో ఆయన సంచరించని దేశం లేదు, ఆయన 'ఆలోచించని' ఆలోచన లేదు. ఆయన అనుభూతి చెందని అనుభవం లేదు. ఆయన ప్రేమించని మానవులు లేరు, ఆయన ద్వేషించిన వ్యక్తులు లేరు, ఆయన కుంచె కందని రంగు లేదు, ఆయన కలం కందని పదం లేదు.

చిత్రాలు రచించాడు వేలకు వేలు. సుమారు ఏడువేల చిత్రాలు రచించినట్లు లెక్క. కవితలల్లాడు, వ్యాసాలు వ్రాశాడు వివిధ విషయాలమీద గ్రంథాలు రచించాడు, సుదూరమైన నిర్జన ప్రాంతాల్లో, నిర్జల ప్రాంతాల్లో వైజ్ఞానిక, ఇతిహాసిక, పురాతాత్త్విక అన్వేషణలు జరిపేడు, వైజ్ఞానిక పరిశోధనాలయాలనూ, కళా సంస్థలనూ నెలకొల్పాడు, శాంతి పథకాలనూ, శాంతి పతాకనూ సృష్టించాడు.

ఇన్ని ఉన్నా నికొలస్ రోరిక్ ప్రధానంగా చిత్రకారుడే, అందులోనూ ప్రత్యేకించి హిమాలయ చిత్రకారుడు. ఆయన జీవితంలో నిజమైన కీర్తి భారతదేశ నివాస కాలంలోనే విస్తరించింది, భారతదేశంలోనే ఆయన కీర్తిశేషుడు కావటమూ జరిగింది.

1945 లో హిమాలయాలలోని కులూ లోయలోని రోరిక్ నివాసంలో వారి కుటుంబంలో నేను కొంతకాలం గడపటం జరిగింది. స్వెతస్లావ్ రోరిక్‌కు ఆ సంవత్సరమే దేవికారాణితో వివాహం జరిగింది. నికోలస్ రోరిక్ రచించిన కొన్ని హిమాలయ చిత్రాలను చూచి నేను అన్నాను, "నిజంగా మీ కుంచె హిమాలయాలకు అమరత్వం ప్రసాదించింది" అని. అందుకాయన గౌరశ్మశ్రు గడ్డంలో గుండా చిరునవ్వుతూ అన్నాడు, "లేదు, నా కుంచెకే హిమాలయాలు అమరత్వాన్ని ప్రసాదించినవి" అని.

యదార్థానికి రెండూ జరిగినవి. రోరిక్ కుంచె హిమాలయాలకు అమరత్వం ప్రసాదించిన మాటా నిజమే; హిమాలయాలు రోరిక్ కుంచెకు అమరత్వం ప్రసాదించిన మాటా నిజమే.

పశ్చిమ హిమాలయాల్లో కాశ్మీర్‌కు తూర్పుగానూ, లదాఖ్‌కు దక్షిణంగానూ ఉన్న కులూ లోయలో, దేవదారు

వృక్షాల దట్టమైన అరణ్య ప్రాంతంలో నికొలస్ రోరిక్ తన సతి హెలీనా, తన ఇద్దరు కుమారులు జార్జి, స్వెతస్లావ్‌లతో సహా నివాసం ఏర్పరచుకొన్నాడు. కొద్ది దూరంలోనే బ్యాస్‌నది ప్రవహిస్తూంటుంది. ఆయన కుటుంబ వ్యవహారాల అజమాయిషీ చూచేందుకు ఇద్దరు రష్యన్ నర్సులూ, వైద్య వ్యవహారాల నిమిత్తం డాక్టర్ యులానెంకో అనే ఒక రష్యన్ డాక్టరూ ఉండేవారు.

నేను వెళ్లబోయేముందే జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కూతురు ఇందిరా కొన్నాళ్లు రోరిక్కులకు అతిథులుగా కాలం గడిపి వెళ్లేరు.

రోరిక్‌ల నివాసంనుండి చూస్తే ఎటుచూచినా ఏకాంతపు జీవంత శాంతి, హిమాచలపు వరమయ కాంతి కంటికీ హృదయానికీ అందాన్నీ ఆనందాన్నీ ప్రసాదిస్తూంటవి. ఈ ప్రదేశాన్ని తన నివాస భూమిగా చేసుకోటంలో రోరిక్ రసమయదృష్టి, ఆనందమయ సృష్టి ఎంతగానో వెల్లడి అవుతూంటవి!

నికొలస్ రోరిక్ రష్యాలోని సెంట్‌పీటర్సుబర్గ్‌లో 1874 లో జన్మించాడు. రోరిక్ రష్యాలో జన్మించినప్పటికీ, ఆయన పూర్వులు రష్యన్లుకారు, స్కాండినేవియా వారు. రోరిక్ ప్రతిభ అతి బాల్యంలోనే కొన్ని ప్రత్యేక దిశలలో వికసించింది. బాల్యంలోనే ఆయనకు పురాతత్వ శాస్త్రం మీదా, పురాతాత్విక వస్తువులమీదా, పురాతాత్విక అన్వేషణల మీదా అమిత ప్రీతి ఏర్పడింది. పాడుపడిన దిబ్బలు చూచినా, శిథిలాలైన కట్టడాలు చూచినా, పగిలిపోయిన శాసన ఫలకాలు చూచినా, విరిగిపోయిన మూర్తులను చూచినా ఆయనలో ఏదో అజ్ఞాత ప్రేరణ మేల్కొనేది; ఏదో తెలియని కుతూహలం తెలుసుకోవాలని పడిగలు విప్పేది; ఏదో అందని సుదూర సత్యాన్ని చీకటి తెరలను చించి బహిరంగపరచాలనే తహతహలు ఆవిర్భవించేవి.

అందుకు ఫలితంగానే రోరిక్ తన పది ఏళ్ల వయస్సులోనే స్కాండినేవియాలోని వైకింగుల కాలంనాటి దిబ్బలను త్రవ్వి కొన్ని పురాతాత్విక వస్తువులను కనుగొన్నాడు. తరువాత వాటిని పురాత తత్వ ప్రదర్శనశాలలకు బహూకరించాడు.

పురాతత్వ పిపాస క్రమేణ ఆయనలో కళాసృష్టికి దారి తీసింది. పదిహేను సంవత్సరాల వయసుకే రేఖాంకనలో విశేష దక్షత ప్రదర్శించసాగేడు. చూచినదాన్నీ, చూడనిదాన్నీ కూడ రేఖల్లో గీయసాగేడు. వస్తురూపంలోలేని విశ్వతను రేఖారూపంలో ప్రదర్శించ ప్రారంభించాడు. జగత్తంతా రూపమయంగానే, రేఖామయంగానే గోచరించసాగింది ఆయన లేత కంటికి. ప్రతి వస్తువులో రూపమూ, ప్రతిరూపంలో రేఖల ప్రాణవంతమైన లయా, ప్రతి లయలో అశేష ఆనందానుభూతి ఆయనకు పట్టసాగినవి.

అయితే ఏం, తనయుల ఇష్టాయిష్టాలకు విలువనిచ్చే తల్లిదండ్రులు చాల అరుదుగా ఉంటారు. రోరిక్ తల్లిదండ్రులు కూడ తమ తనయుని ఇష్టాయిష్టాలకు విలువ ఇవ్వక తమ ఇష్టాన్ననుసరించే అయన్ను నడిపించాలనే కోవకు చెందిన వారే. తండ్రి ప్రతిభాన్వితమైన లాయర్. అందుకని తనయుని కూడ లాయర్‌ను చేయాలనే ఆయన ఆశయం. ఆ ఆశయం ప్రకారం రోరిక్‌ను పీటర్సుబర్గ్‌లోని లా కాలేజీలో చేర్పించారు. రోరిక్ లా చదవటంలో శ్రద్ధ చూపుతూ వచ్చినా కూడ అసలు అభిమానం మాత్రం చిత్రకళ మీదనే నిలచింది. న్యాయశాస్త్రాలనూ తర్కశాస్త్రాలనూ తరచి చూస్తూన్నా కూడ రూపోపాసన దిన దినమూ ప్రవర్ధమానం అవుతూ వస్తూందే కాని సన్నగిలటం లేదు.

లా చదువు ఆయనలోని బుద్ధిని మేల్కొలిపి వ్యవహార జగత్తును సహేతుకంగా అర్థం చేసుకొనే సత్తానూ, ఒక సమస్యను సక్రమంగా విడదీయగల జ్ఞానాన్నీ, ఆవేశానికి లొంగని ఆలోచనా శక్తినీ ప్రసాదించింది. ఈ సుగుణాలన్నీ ఆయన కళాజీవితంలో ఆయన్ని ఎంతగానో కాపాడినవి. రసదృష్టికితోడు దూరదృష్టి కూడ అబ్బింది ఆయనకు. సృజనాత్మక ప్రతిభకు తోడు సమీక్షాత్మక నిశితత్వం కూడ ఆయనలో మేల్కొనటం జరిగింది. అందువల్ల ఆయనలో కళాకారుని లలిత స్వభావమేకాక వైజ్ఞానికుని గంభీర స్వభావం కూడ అస్తిత్వాన్ని పొందింది.

అటుతరువాత ఆయన లా కాలేజీకి స్వస్తిచెప్పి పీటర్సుబర్గులో కళాసంస్థలో ప్రవేశించి చిత్రకళా సాధన సాగించాడు. కొంతకాలం అయిన తరువాత పీటర్సుబర్గు వదలి పారిస్‌కు పయనించి అక్కడ కళారంగంలో ఉన్నత విద్య నభ్యసించాడు.

రష్యాలో 1917 లో జరిగిన విప్లవం నాటికే రోరిక్ కుటుంబంతోసహా రష్యా వదలి ఫిన్‌లాండ్‌లో నివాసం ఏర్పరచారు. తరువాత కొంతకాలం లండన్‌లో ఉన్నారు. ఆ లండన్ నివాస కాలంలోనే రవీంద్రనాథ ఠాకూర్‌తో రోరిక్‌లకు పరిచయం ఏర్పడింది. దేవికారాణితో కూడ అక్కడే ప్రథమంగా పరిచయం ఏర్పడింది. తరువాత హిమాంశురాయ్ మరణం

మహా ద్రష్ట - రోరిక్

చిన మీదట భారతదేశంలో దేవికారాణికీ నికోలస్ రోరిక్ చిన్న కొడుకు స్వెతస్లావ్ రోరిక్‌కూ వివాహం జరిగింది 1945 లో.

తాము లండన్‌లో ఉంటూన్న సమయాన రవీంద్రుడు తమ స్టూడియోకు వచ్చిన ఉదంతాన్ని మదాం హెలీనా రోరిక్ చెప్పసాగింది, ''మేము లండన్‌లో ఉంటూండగా రవీంద్ర కవీంద్రుడు ఒక రోజు మా స్టూడియోలోకి వచ్చాడు. నికోలస్ రచించిన చిత్రాలను చాలా ఆనందంతో వీక్షించాడు. ఎంతగానో ఆనందించాడు. తన కవితలకంటే నికోలస్ రోరిక్ రచించిన చిత్రాలే ఎక్కువ ఆనందదాయకంగా ఉన్నవన్నాడు.''

వెంటనే నికోలస్ రోరిక్ సంభాషణను అందుకొని అన్నాడు, ''రవీంద్రుడు తన కవి జీవితాన్ని నా కిచ్చి నా చిత్రకారుని జీవితాన్ని ఆయన తీసుకోంటా నన్నాడు. అంతే జరిగింది ఆఖరుకు. నేను అల్లసాగేను కవితలు, ఆయన రచించ సాగేడు చిత్రాలు.'' అయితే, రవీంద్రుని చిత్రాలకంటే రోరిక్ కవితలే ఎక్కువ పరిపూర్ణత చెందినవి.

రోరిక్‌వి అంతర్జాతీయ భావాలు. విశ్వ మానవకోటి అంతా సోదర సోదరీ బృందమనీ, జాతి, మతమూ, దేశమూ వీటన్నిటికీ అతీతమైన అస్తిత్వం ఒకటున్నదనీ, అదే విశ్వ మానవత అనీ ఆయన నమ్మకం. ఆ సూత్రాన్ని అనుసరించే ఆయన నివాసం కూడ అనేక దేశాల్లో జరుగుతూ వచ్చింది. లండన్‌లో కొంతకాలం ఉన్న తరువాత అక్కడనుంచి సకుటుంబంగా అమెరికాకు ప్రయాణించారు. రోరిక్‌కు విశ్వఖ్యాతి లభించింది ప్రథమంగా అమెరికాలోనే.

అమెరికాలో రోరిక్ పేరుతో అనేక సాంస్కృతిక సంస్థలు స్థాపించబడినవి. వీటిలో ప్రధానమైంది 26 అంతస్తుల రోరిక్ మ్యూజియం. ఈ మ్యూజియంలో రోరిక్ చిత్రాలు దాదాపు ఒక వెయ్యి శాశ్వతంగా ప్రదర్శించబడినవి.

ఇటు కళారంగంలోనేకాక అటు వైజ్ఞానిక రంగంలో కూడ రోరిక్ నిర్మాణాత్మకమైన శ్రద్ధ చూపసాగేడు. ఇందుకు అమెరికన్‌ల సహాయం ఎంతగానో ఆయనకు లభించింది. దీని ఫలితంగానే ఆయన ఒక బృందంతో మధ్య ఆసియా అన్వేషణకు బయలుదేరాడు. మధ్య ఆసియాలోని చాలా భాగాలను అన్వేషించి ఎన్నో నూతన పురాతత్వ సత్యాలను కనుగొన్నాడు. ఈ వైజ్ఞానిక పరిశోధనల ద్వారా మధ్య ఆసియాలోని వివిధ గుప్త సత్యాలూ బయల్పడినవి. ఈ విషయాలన్నిటినీ ఆయన తన ''ఆల్టాయ్ హిమాలయాస్'' అనే గ్రంథంలో వెల్లడించాడు. ఈ అన్వేషణల్లో ఆయన ఎన్నో విపత్తులకు లోనయినాడు; ఎన్నో దారుణమైన శారీరక మానసిక వ్యథలను అనుభవించాడు. అయితే, వీటికితోడు ఎన్నో ఆనందాలను పొందాడు, ఎన్నో అద్భుతాలను రుచి చూచాడు.

ఈ మధ్య ఆసియా అన్వేషణ 1929 వరకూ సాగింది. ఈ సందర్భంలోనే ఆయన ప్రథమసారిగా హిమాలయాలను సందర్శించటం జరిగింది. ఆ సమయంలోనే కులూ లోయ ఆయన్ను ఎంతో లోతుగా ఆకర్షించింది, ఆతిథ్యాన్నిస్తూ ఆహ్వానించింది. ఆ ఆకర్షణకు లోనైనాడు, ఆ ఆహ్వానాన్ని స్వీకరించాడు. అక్కడే ఆ దేవదారు ఛాయల్లో నిలిచిపోయాడు కుటుంబంతో సహా. మధ్య ఆసియాకు ఈ ప్రదేశంగుండా వ్యాపారమార్గం ఉన్నది. కంచరి గాడిదల రవాణా ఈ దారినే సాగుతూంటుంది.

కులూ లోయలోని నగర్ అనే గ్రామ సమీపంలో రోరిక్ నివాసం. అక్కడే **Urusvati Himalayan Research Institute** అనే దాన్ని స్థాపించాడు. ద్వితీయ మహా సంగ్రామానికి పూర్వం ఈ పరిశోధన సంస్థలో వివిధ దేశాల వైజ్ఞానికులూ హిమాలయాలకు సంబంధించిన జంతువులూ, వనస్పతీ, ఖనిజాలూ, వాతావరణమూ మొదలైన వాటిని గురించి విలువైన పరిశోధనలు జరిపేరు. ఒక పత్రికను కూడ ఈ వైజ్ఞానిక పరిశోధనా ఫలితాలను ప్రకటిస్తూ నడిపేరు.

రోరిక్‌ల నివాసం చుట్టూ దేవదారు వనానికి తోడు యాపిల్ తోటలూ, చెర్రీతోటలూ ఉన్నవి. కొండల మీదుగా ప్రవహించే ఊట కాలువల ద్వారా ఈ తోటలను తడుపుతుండే వారు. నికోలస్ రోరిక్ వీటి పనులను చూడటంలో ఎంతో ఆనందం కనపరిచేవాడు. ఆరుబయట కాలం గడపటం ఆయన కెంతో ఇష్టం.

మధ్యరకం ఎత్తు, తగినంత లావు, బట్టతల, గౌర వర్ణపు నిండుగడ్డం, మంగోలియన్ ప్రభావంగల కళ్ళూ, వీటన్నిటితో చాలా ఆకర్షణీయంగా ఉండేవాడు ఆయన. మాతృభాష రష్యన్ అయినప్పటికీ మంచి ఇంగ్లీషు మాట్లాడే వాడు, అంతకంటే మంచి ఇంగ్లీషు వ్రాసేవాడు.

ఆయన మధ్య ఆసియా పర్యటనల్లోనూ, ట్రాన్సు హిమాలయ పర్యటనల్లోనూ ఎన్నో వాతావరణానికి సంబంధించిన నైసర్గిక విచిత్రాలను తిలకించాడు. ఒకసారి ఆయన పరివారంతోసహా లదాఖ్‌లో సముద్ర మట్టానికి పదకొండు వేల అడుగుల ఎత్తున ఉన్న 'నిమూ' అనే గ్రామంలో ముకాం

చేసి ఉండగా, ఒకరాత్రి పది గంటలకు జరిగిన ఘటన. నికొలస్ రోరిక్‌గారు, ఆయన సతీ డేరాలో శయనించి ఉన్నారు. నికొలస్ రోరిక్ గాఢ నిద్రలో ఉన్నాడట. హెలీనా మాత్రం మేల్కొనే వుండి తన పక్కమీది ఉన్ని రగ్గును సరి చేయాలని లాగేసరికి అందులోనుంచి గులాబీ ఊదా రంగుల మంటనాలుకలు చాపుతూ పైకి లేవసాగింది. ఆమె ఆందోళనతో నికొలస్ రోరిక్‌ను లేపింది. ఆయనలేచి ఆ మంటను నలిపివేయ ప్రయత్నించగా ఆ మంట చీలికలు చీలికలుగా చీలి అనేకచోట్ల వ్యాపించింది. చేతికి వెచ్చదనంతప్ప మరేమీ వేడి తగలలేదట. బాగా వెలుగు మాత్రం వ్యాపించిందట. ఆ మంటలు ఒక అడుగు ఎత్తువరకూ లేచి క్రమేణ తమకు తామే చల్లారిపోయినవట. ఇటువంటి వాతావరణపు ఇంద్రజాలాలు ఎన్నో జరుగుతూంటవి ఆ ప్రాంతంలో.

నికొలస్ రోరిక్ తన సుదూర ప్రయాణ గాథలనూ, వాటిలోని బాధలనూ చెపుతూ అన్నాడు, ''అదంతా ఒక కష్టాల గాథ. అదే విధంగా అదొక ఆత్మబోధ. అయితే ఆ కష్టాలమధ్య సుఖం లేకపోలేదు. ఆ వెనకటి ప్రయాణాలన్నీ ఇప్పుడొక సుదూర స్వప్నంలా గోచరిస్తూంటవి. తూర్ఫాన్ లోని ఆ చలిబాధ ఇప్పటికీ గుర్తొస్తూనే ఉంటుంది. తుర్కిస్తాన్ నుంచి టిబెట్టు వైపు కొస్తుండగా దారిలో ఒకచోట మా దళం నిలుపు చేయబడింది; నాలుగు రోజుల వరకూ ఎటూ కదలనివ్వలేదు. తినడానికి ఆహారం లేకనూ, మా సామానంతా ఇంకా అక్కడికి చేలనందునా, కప్పుకొనే చలిదుస్తులు లేకనూ, చాలా బాధ పడ్డాం. బాధ పడటమేకాదు, ఇక మరణమే శరణ్యమయే స్థితి జనించింది. చివరకు టిబెట్టు ప్రభుత్వపు పై అధికార్ల సహాయంతో ఆ విపత్తునుంచి బయటపడ్డాం.''

మధ్య ఆసియా నుంచీ, టిబెట్‌నుంచీ అనేక విధాలైన కళాసామగ్రిని సేకరించి తెచ్చారు. రక రకాల బోధిసత్వ విగ్రహాల్నీ, పట్టుగుడ్డమీద మిలమిలలాడే రంగుల్లో చిత్రించబడ్డ తంకాలు అనబడే టిబెటన్ చిత్రాలూ ఎన్నో వింత వింత వస్తువులూ సేకరించి తెచ్చారు.

కొందరు కళాకారులు తమ స్వంత కళాసృష్టికే ప్రాధాన్యం ఇచ్చి ఇతర్ల కళాసృష్టికి అంత విలువ ఇవ్వరు. రోరిక్ మాత్రం తన స్వీయ కళా సృష్టి కెంత విలువిచ్చేవాడో అన్యుల కళాసృష్టికి కూడ అంత విలువిచ్చి వాటిని సేకరించటంలో ఎంతో ఆసక్తిని చూపేవాడు. కళాఖండాల్ని స్వయంగా సృష్టించటంలో ఎంత ఆనందించేవాడో ఇతర్ల కళా ఖండాల్ని సేకరించటంలో కూడ అంత ఆనందించేవాడు. ఈ రసమయ ఆసక్తి, ఈ కళానందమే ఆయన చేత దేశ దేశాల, ప్రత్యేకించి మధ్య ఆసియా, టిబెట్ దేశాల కళా ఖండాలను సేకరింపజేసినవి.

ఆయన ఇల్లంతా ఇటువంటి కళా సామగ్రితో నిండి ఉండేది. తన కళా ఖండాలను కొన్నిటిని మాత్రమే బహిరంగంగా కనపరచేవాడు; ఎక్కువగా మిగతా కళాఖండాలనే బయల్పరచి ఉంచేవాడు!

నికొలస్ రోరిక్ కవి కావచ్చు, అన్వేషకుడు కావచ్చు, గ్రంథకర్త కావచ్చు, శాంతిదూత కావచ్చు, కాంతిదాత కావచ్చు. ఏమయినప్పటికీ ఆయన ప్రధానంగా చిత్రకారుడు. అందులోనూ ముఖ్యంగా ప్రకృతి దృశ్యకారుడు. అందులోనూ ప్రత్యేకించి హిమాలయ చిత్రకారుడు.

రోరిక్ ప్రకృతి చిత్రాలలో మానవమూర్తులుండటం లేకపోవటం కూడ జరుగుతుంది. కొన్ని మానవమూర్తులు లేని విశుద్ధ ప్రకృతి చిత్రాలు, మరికొన్ని మానవమూర్తులతో ఉన్నా ప్రకృతి చిత్రాలు. అయితే, రోరిక్ చిత్రాల్లో మానవమూర్తులు ప్రాధాన్యం వహించి ప్రకృతికి అల్పత్వాన్నివ్వవు, ప్రకృతే ప్రాధాన్యం వహించి మానవమూర్తులకే అల్పత్వాన్ని ఆపాదిస్తుంది. పర్వత శిఖరాల ఎత్తు ముందు మానవమూర్తులను ఆయన సూక్ష్మరూపాల్లో చూపుతాడు. ఒకర్థంలో ఈ మానవ మూర్తుల సూక్ష్మ రూపాలుంటేనే గాని అక్కడున్న పర్వత శిఖరాల ఎత్తూ, గాంభీర్యమూ, దీప్తీ గోచరించవు సుస్పష్టంగా.

ప్రకృతి దృశ్యాలు అనేక విధాలు. విశాలమైన మైదానాలను చిత్రించటం, మహా వృక్షాలతో నిండిన అరణ్యాలను చిత్రించటం, సముద్రాలూ, నదులూ, సెలయేళ్లూ, జలపాతాలూ మొదలైన జల దృశ్యాలను చిత్రించటం, కొండలను చిత్రించటం మొదలైనవి. రోరిక్ ప్రధానంగా కొండల చిత్రకారుడు. చెట్లున్న కొండలూ, చెట్లులేని కొండలూ వేటికవే ఒక ప్రత్యేక సుందరంగా గోచరిస్తవి. రోరిక్ చిత్రించేవి చెట్లులేని కొండలనే. చెట్లున్న కొండలను ఎప్పుడైనా అరుదుగా చిత్రిస్తాడు. కొండలను చిత్రిస్తాడు కనుకనే ఆయనకు **Master of the Mountains** అని పేరు వచ్చింది. ఆయన కొండలు పచ్చదనంలేని ఎండు కొండలే; వెండి కొండలు కూడ!

ఈ విశ్వసృష్టిలో కొండలకో ప్రత్యేకస్థానం ఉన్నది. భూమిమీద అంత ఎత్తయిన వస్తువు మరొకటిలేదు. సముద్రానికి లోతుంటే కొండలకు ఎత్తుంది. సముద్రపు లోతు

లోపలికి చుుగితేగాని కనుపించదు. కొండలు ఎత్తు వాటిని ఎక్కకపోయినా కూడ కనుపిస్తూనే ఉంటుంది.

నా "తేజోరేఖలు" లో కొండల్ని గురించి వ్రాశాను; "కొండలు చూడడానికీ, ఎక్కడానికీ, అక్కడ నివసించడానికీ ఎంతో మనోహరంగా ఉంటవి. అవి భూమినుంచి లేచి ఆకాశం లోకి చొచ్చుకపోయి భూమికీ ఆకాశానికీ మధ్య ఒక విలువైన వంతెనగా ఉంటవి. బూడిదరంగు కొండలూ, ఆకుపచ్చని కొండలూ, ఊదారంగు కొండలూ, నీలిరంగు కొండలూ, నల్లని కొండలూ, తెల్లని కొండలూ; ఒకో కొండ కొకో ప్రత్యేకతా, కమనీయతా, ఒకో విశిష్టమైన మహనీయతా."

కొండలను చిత్రించటంలో ప్రసిద్ధ ఇంగ్లిష్ ప్రకృతి చిత్రకారుడు టర్నర్ చిత్రించిన విధం వేరు, విఖ్యాత ఫ్రెంచి చిత్రకారుడు పాల్‌సజాన్ చిత్రించిన విధం వేరు. టర్నర్ చిత్రణ విధానంలో రూప విశిష్టతకంటే రంగుల విశిష్టతే ఎక్కువగా ఉంటుంది; దూరపు కొండలను అస్పష్ట రూపాల్లో చిత్రించేవాడు; రూపానికి వ్యక్తమైన విస్పష్టతను చూపేవాడు కాదు. పాల్‌సజాన్ తన చిత్రణలో దూరపు కొండలకు కూడ స్పష్టమైన ఆకారాన్నిచ్చేవాడు; అస్పష్ట వాతావరణాన్ని సృష్టించి చిత్రానికి అస్ఫుటత్వాన్నిచ్చేవాడు కాదు.

రోరిక్ కొండల చిత్రణ ఒక ప్రత్యేక శైలి కలిగుంటుంది. అటు టర్నర్ విధానంలోని రంగుల కాంతీ, ఇటు సజాన్ విధానంలోని సుస్పష్ట రూప నిర్మాణమూ రెండూ గోచరిస్తవి రోరిక్ శైల దృశ్యాల్లో.

రోరిక్ ప్రధానంగా వర్ణకారుడు; తరువాతనే రూపకారుడు. ఆయన రూప సృష్టికంటే వర్ణ సృష్టి గొప్పది. ఆయన చిత్రాలలో రంగులుకాక రంగుల కాంతులే ప్రధానం. రంగును ఎవరైనా చిత్రించగలరుకాని రంగుల కాంతిని చిత్రించటం రోరిక్‌లాంటి ఏ కొందరు సిద్ధహస్తులైన వర్ణకారులకో తప్ప కుదరదు.

ఆయన చిత్రాల్లో, ప్రత్యేకించి హిమాలయ చిత్రాల్లో కనుపించే రంగులు దృశ్య జగత్తులో గోచరించే రంగులు కావు, కేవలం కల్పిత రంగులు మాత్రమే అవి అని ఒక విమర్శ. రోరిక్ కేవలం కల్పనావాది కాడు; ఆయన చాలా వరకు వాస్తవవాదే. అయినా, దృశ్య జగతు లో కనుపించే రంగులనే వాడాలని ఎక్కడున్నది? అదృశ్య జగత్తులోని రంగులను కూడ వాడవచ్చు. కాని రోరిక్ వాడే రంగులు దృశ్య జగత్తులోనివే. అయితే, అవి మైదాన భూముల్లోని వాతావరణంలో ఎక్కడా గోచరించవు. హిమాలయ వాతావరణం లోనూ, హిమాలయాల కావలి వాతావరణంలోనూ ఆ దీప్తివంతమైన, పారదర్శకమైన రంగులు గోచరిస్తవి. వాటినే రోరిక్ తన చిత్రాల్లో సృష్టించే వాడు. ఆ రంగులు మైదాన వాసులకు కల్పనా లోకపు రంగులుగా కనుపించేవి.

ఎత్తుకుపోయినకొద్దీ, ఉత్తరంగా దూరం పోయిన కొద్దీ ప్రకృతిలోని రంగుల కాంతిలో ఒక విధమైన లోకోత్తర దీప్తి హెచ్చుతుంది. దాన్ని ప్రకృతిలో కంటితో చూడటం సులభమే కాని, ఆ వర్ణకాంతిని కుంచెతో కాయితం మీద సృష్టించటం కష్టతరం. ఈ కష్టతరమైన పనినే చేసి చూపెట్టేవాడు మహాద్రష్ట రోరిక్!

ప్రపంచంలోని చిత్రకళా జగత్తులో రోరిక్ వాడే రంగులు ప్రఖ్యాతి పొందినవి. 'రోరిక్ బ్లూ', 'రోరిక్ పర్పుల్' అనేవి ప్రత్యేకత పొందినవి.

బార్నెట్ డి. కన్లాన్ అనే విఖ్యాత విమర్శకుడు రోరిక్ రంగులను గురించి అంటాడు:

"At first sight the dazzling character of Roerich's mountain masses seems almost theatrical, but on examination we discover that this brilliant colouring is the outcome of close concentration and a remarkable observation of Nature, seen from heights where the atmosphere has a purity 'never met with here below".

రోరిక్ చిత్రించిన పర్వతరాసులు ప్రథమ దృష్టిలో కన్ను మిరిమిట్లు గొల్పుతూ నాటకీయంగా గోచరించుతవి, కాని పరిశీలించి చూస్తే తెలుస్తుంది ఆ అతిదీప్తివంతమైన వర్ణలేఖన క్రిందికి కనుపించకుండా పై ఎత్తులనుంచి చూస్తే మాత్రమే కనుపించే ఒక వాతావరణ నైర్మల్యమనీ, ప్రకృతిని నిశితంగా పరిశీలిస్తే లభించే ఫలితమనీ.

అందువల్ల రోరిక్ చిత్రాల్లో గోచరించే అద్భుత వర్ణ మాధుర్యం వాస్తవ లోకానికి చెందిందేకాని కల్పనా జగత్తుకు చెందింది కాదు. రోరిక్ తన చిత్రణలో విభిన్నమైన మాధ్యమాలన్నీ వాడిచూచాడు. తైలవర్ణాలు, పాస్టెల్సు, నీటిరంగులూ, టెంపరా మొదలైన విధానాలన్నిటినీ ఉపయోగించాడు. కాని కొంతకాలంనుంచీ ప్రత్యేకం టెంపరా విధానాన్నే వాడుతూ వచ్చాడు. టెంపరా విధానం ఉష్ణ దేశాల వాతావరణపు మార్పులకు చెక్కు చెదరని ప్రతీతి. ఆయన చిన్న సైజు చిత్రాలను లేత బూడిద వర్ణపు కాయితం మీదా, పెద్ద సైజు చిత్రాలను కాన్వాస్ మీదా చిత్రించే వాడు.

రోరిక్ ప్రధానంగా బుద్ధికంటే బోధి (intuition) కి సంబంధించిన మనిషి. బోధి ఆయనలో సదా మేల్కొనే ఉండేది. కొన్ని చూడని దృశ్యాలను చిత్రిస్తే కొంతకాలానికి ఆయన పర్యటనల్లో అవే దృశ్యాలు ప్రత్యక్షంగా గోచరించేవి. జరగబోయే కొన్ని ఘటనలను చిత్రిస్తే కొంతకాలానికి అటువంటి ఘటనలే జరగటం సంభవిస్తూ వచ్చినని ఆయన జీవితంలో.

''వసంతోత్సవం'' అనే ఒక రష్యన్ నృత్య నాటకానికి రోరిక్ కొన్ని రంగ దృశ్యాలను చిత్రించాడు. ఆ నాటకం ప్రాగైతిహాసికమైన శిలా యుగానికి సంబంధించిన గాథ. ఆ సమయాన్ని దృష్టిలో ఉంచుకొనే రోరిక్ దానికి దృశ్యాలను రచించాడు. కాని విచిత్రం ఏమంటే తరువాత ఎన్నో సంవత్సరాలకు ఆయన కాశ్మీర్‌లో పర్యటిస్తూంటే ఆయన చిత్రించిన దృశ్యాలే ఆయన చిత్రించిన రంగులలోనే ప్రత్యక్ష్యంగా కనుపించినవి. రోరిక్ ఆశ్చర్యానికి అంతు లేకుండా పోయింది!

ఇదే విధంగా ప్రథమ ప్రపంచ సంగ్రామానికి ముందు బెల్జియంలోని ఆంట్ వర్ప్ కోట తగలబడిపోతూన్నట్లు చిత్రం రచించాడు. తరువాత 1914 లో ప్రథమ ప్రపంచ సంగ్రామంలో ఆ కోట అగ్ని జ్వాలలకు ఆహుతి అయిపోయింది! ఇటువంటి ఘట్టాలను ప్రదర్శించే ప్రొఫెటిక్ చిత్రాలు చాలా రచించాడు ఆయన.

చూడని దృశ్యాల్ని, జరగని ఘటనల్ని చిత్రించటానికి అవకాశం ఉన్నదా అంటే, ఈ విస్తృత విశ్వంలో ఏదీ అసంభవం కాదనీ, అసాధ్యమైంది లేదనీ చెప్పాల్సొస్తుంది. చూచిన దానికీ చూడని దానికీ మధ్య పెద్ద రాతి గోడ ఏమీ ఉండదు; గోడ అనేది ఉన్నా కూడ అది స్ఫటికపు గోడ కావటంలో అడ్డంకే లేదు!

1902 నుంచి 1912 వరకూ రోరిక్ కొన్ని రష్యన్ చిత్రాలను చిత్రించాడు. రష్యాలోని ప్రముఖ నగరాలైన మాస్కో, స్మొలెన్స్క్, విల్నా, కోవ్‌నో, మిటావా, రీగా, కజాన్, నొవ్‌గొరాడ్ మొదలైన వాటిని అద్భుతమైన రంగుల్లో అందమైన రూప రచనలో చిత్రించాడు. అంతకు ముందు ఏ రష్యన్ చిత్రకారుడూ కూడ వాటిని అంత అద్భుతంగా చిత్రించలేదట. తరువాత చాలా సంగీత నాటకాలకూ, నృత్య నాటకాలకూ రంగ దృశ్యాలను చిత్రించి కీర్తి పొందేడు.

రోరిక్ చిత్రాల్లో విషయ వస్తువుకు ప్రాధాన్యం ఉంటుంది కనుక అవి విశుద్ధ చిత్రాలు కాక ఆఖ్యాయికా చిత్రాలు (Illustrations) మాత్రమే అని ఒక వదంతి ఉంది. ఇది పూర్ణంగా అసత్యం కాదు. కారణం రోరిక్, చాలా మూలాల నుంచి ఇతివృత్తాలు తీసుకొని వాటిని చిత్రించాడు కనుక. అయితే ఈ విమర్శ ఆయన చిత్రాలపట్ల నిలవదు. ఆయన చిత్రాల్లోని విషయ వస్తువును తొలగించి చూచినా కూడ ఆయన చిత్రాల్లోని విశుద్ధ చిత్రత్వం కుంటుపడదు. విషయ వస్తువుతో సంబంధం లేకుండానే ఆయన చిత్రాల్లోని వర్ణ మాధుర్యం, రూప సౌరభ్యం, రచనా చమత్కారం ప్రేక్షకునికి రసానందాన్ని ప్రసాదిస్తవి. అందువల్ల ఆయన చిత్రాలు ఏమి కథ చెపుతూన్నవి, ఏమి విషయ వస్తువును చూపుతూన్నవి అనే సమస్యే లేదు. వినేవాళ్లకు అవి కథలుచెప్పి ఆనందం ఇస్తవి, వినకుండా చూచేవాళ్లకు అవి రంగులా, రూపాలా దృశ్యానందాన్నిస్తవి.

చిత్ర లక్షణాలు బలహీనంగావున్న చిత్రంలో అయితే అందులోని విషయ వస్తువును తొలగించి చూస్తే ఆ చిత్రంలో మిగిలేదేమీ ఉండదు. అటువంటి చిత్రాల్లో విషయ వస్తువే ప్రధానం. కాని చిత్ర లక్షణాలు పూర్ణంగా వికసించివున్న చిత్రాలకు ఆ ప్రమాదం ఉండదు.

ఉదాహరణకు రోరిక్ చిత్రించిన ''నిర్మాత సెంట్ సెర్జియస్'' అనే చిత్రాన్ని తీసుకొందాం. సెంట్ సెర్జియస్ జీవితాన్ని చిత్రించే చిత్రం ఇది. ఈ చిత్రంలో సెంట్ సెర్జియస్ తన శిష్యులకు కుటీరాలు నిర్మించి పెట్టే నిమిత్తం అడవిలో చెట్లు కొడుతుంటాడు. ఇందుకోసం చిత్రించిన చిత్రం ఇది. కాని ఆ కథా ఘట్టాన్ని తొలగించి చూచినా కూడ ఈ చిత్రంలోని చిత్ర లక్షణాలు మన కెంతో ఆనందం ఇస్తవి. అడ్డంగావున్న కొండల వరస, దానిమీద నిలువుగా పెరిగిన నిటారైన చెట్లూ, ఒక మూల తలవంపు త్రిప్పి కూర్చొనివున్న భల్లూకం, దాని కెదురుగా అదేమాదిరి వంపుతో వంగి గొడ్డలితో చెట్టు గొడుతూన్న సెంట్ సెర్జియస్– లేత నీలి ఊదారంగుల్లో ఈ చిత్రం ఎంతో రసానందాన్నిస్తూంటుంది. ఈ చిత్రంలోని కథ మనకు తెలియక పోవచ్చు. ఆ చెట్టు కొడుతూన్న మానవమూర్తి సెంట్ సెర్జియస్ అని కూడ మనకు తెలియకపోయినా పరవాలేదు. మనకు ఆనందం ఇచ్చేది అందులోని ఘటనకాక అందులోని చిత్ర లక్షణాలు మాత్రమే. అందులోని రచనా చమత్కృతి, వర్ణ విన్యాసమూ మన కెంతో మాధుర్యాన్ని ప్రసాదిస్తూన్నవి. ఆ కథా ఘట్టాన్ని మనకు తెలపటానికని ఆ చిత్రాన్ని చిత్రించక ఆ చిత్రాన్ని చిత్రించే నిమిత్తమే ఆ కథా ఘట్టాన్ని ఒక నెపంగా తీసుకొన్నాడేమో రోరిక్!•

మహా స్రష్ట - రోరిక్

అయితే, రోరిక్ తరువాతి కాలంలో రచించిన చాలా చిత్రాలు ఇటువంటి కథా ఘట్టాలు కూడ లేని రాగాలాపన లాంటి విశుద్ధ ప్రకృతి దృశ్యాలు. వీటిల్లో కేవలం రంగూ రూపం మాత్రమే మనకు గోచరిస్తూ రసానందాన్నిస్తవి; ఒక విషయాన్నికాని, ఒక ఘట్టాన్నికాని, ఒక సందేశాన్ని కాని మనకు వినిపించవు. అవి వాస్తు ఖండాలలాంటివి. రోరిక్ కళ రూప మాధుర్యానికి ప్రాధాన్యం ఇచ్చేదేకాని విషయాభి వ్యక్తికి కాదు.

రోరిక్ చిత్రించిన ఏడు వేల చిత్రాలలో ఒక వెయ్యి చిత్రాలు కేవలం హిమాలయ చిత్రాలే. మంచు శిఖరాలను వివిధ సమయాలలో, వివిధ వాతావరణంలో చిత్రించటంలో రోరిక్ సిద్ధహస్తుడు. కళలో పూర్ణ రూపానికంటే అంశిక రూపానికే విలువెక్కువ. రోరిక్ హిమాలయ దృశ్యాలన్నీ చాలా భాగం అంశిక రూపాలే. కొండల క్రింది భాగాన్ని వదలి మంచు శిఖరాల క్లోజప్‌లను చిత్రించటం రోరిక్ ప్రత్యేకత.

నీలాకాశంలో నారింజరంగు మంచు శిఖరాలను చిత్రిస్తే అవి ఎంతో దేదీప్యమానంగా వెలుగుతుంటవి. సంధ్యాకాశాన్ని చూపక సంధ్యాకాంతితో ప్రతిఫలించే మంచు శిఖరాలను మాత్రమే చూపటంలో ఆ దృశ్యానికో ప్రత్యేక ఆకర్షణ కలుగుతుంది.

రోరిక్ గొప్ప ఆకాశ చిత్రకారుడు కూడ. ఆకాశాన్ని చిత్రించటంలో మేఘాలున్న ఆకాశాన్ని సృష్టిస్తే అదో రమ్యంగా ఉంటుంది, మేఘాలులేని ఆకాశాన్ని సృష్టిస్తే అదో రమ్యంగా ఉంటుంది. రోరిక్ ఎక్కువగా మేఘాలులేని ఆకాశాలనే సృష్టిస్తాడు. టర్నర్ అరుణ వర్ణపు ఆకాశాలను సృష్టించటంలో సిద్ధహస్తుడైతే రోరిక్ నీలాకాశాలను సృష్టించటంలో సిద్ధహస్తుడు. నీలవర్ణపు ఛాయలు ఎన్నో విధాలయినవి కమనీయ కాంతులతో రోరిక్ కుంచెనుంచి ఆవిర్భవిస్తవి. హరితనీలం, నీలహరితం, వీటి వివిధ ఛాయలూ ఆయన ప్రత్యేక సృష్టి.

1947 లో ఆయన మరణశయ్యమీద ఉండి నాకు బహూకరించిన ఒక విలువైన టెంపరా చిత్రం గంగానది జన్మించిన తావును చూపుతూంటుంది. పసుపూ, నారింజా రంగుల శిలలతో నిండిన కొండలలో ఒక సన్నని నీల హరిత ధార అస్పష్టంగా గోచరిస్తూంటుంది. ఆ కొండల వెనకవున్న ఆకాశభాగం ఒకవిధమైన హరితనీలాభతో ప్రకాశిస్తూంటుంది. చిత్రాన్ని చూచిన చాలా సేపటివరకూ ఆ నీలాభ మనోచక్షువుల ఎదుట వెలుగుతూనే ఉంటుంది.

రోరిక్ చిత్రాలలో ప్రఖ్యాతి చెందిన చిత్రాలు కొన్ని "ఫెస్సర్‌ఖాన్ ఖడ్గం", "లాహుల్", "బ్రహ్మపుత్రా", "చెన్‌రేజి", "సాధు అతిథులు", "కరుణ", "రీజన్ జీపో అజ", "మహాజ్వాల", "దాతయగు బుద్ధుడు", "ఓం మణి పద్మెహు", "గూగాచౌహాన్", "భారత దేశాని కొస్తున్న లాన్‌చె", "అగ్నియోగ", "విజేతయగు బుద్ధుడు", "నిర్మాత సెంట్ సెర్జియస్", "టిబెట్ సరిహద్దు", ఇంకా ఎన్నో మరెన్నో. వీటిలో "రీజన్ జీపో ఆజ్ఞ" అనేదీ, "మహాజ్వాల" అనేదీ రక్తవర్ణ ప్రధానమైనవి. "ఫెస్సర్‌ఖాన్ ఖడ్గం" అనేదీ, "టిబెట్ సరిహద్దు" అనేదీ నీలవర్ణ ప్రధానాలూ.

రోరిక్ చిత్రాల్ని విశ్లేషణాత్మక పరిశీలన చేయాలంటే చాలా సమయం తీసుకొంటుంది. వాటిలోని గుణాలన్నిటినీ బయటికి లాగాలంటే సుదీర్ఘకాలం అనుశీలన చేయాలి. వెనకటికి పాల్‌సజాన్ చిత్రాన్నొక దాన్ని పూర్ణంగా రసాస్వాదన చేయటానికి సుప్రసిద్ధ చిత్రకారుడైన హెన్రీ మాటీస్‌కు 37 సంవత్సరాలు పట్టిందట.

రోరిక్ చిత్ర స్రష్ట మాత్రమే కాక గ్రంథకారుడు కూడ. రోరిక్ ప్రథమ సాహితీ రచన తన విశ్వ విద్యాలయానికి సమర్పించిన థీసిస్ "ప్రాచీన రష్యాలోని చిత్రకారులు" అనేది. ఈ మొదటి గ్రంథంలోనే ఆయనలోని సాహితీ ప్రతిభా, సమీక్షాత్మక దృక్పథమూ, పాండిత్యపు లోతూ అన్నీ ప్రత్యక్షమైనవి. ఆయన రష్యన్‌లో, ఇంగ్లీషులో కూడ రచనలు చేశాడు. ఆయన రచించిన గ్రంథాలు "Altai—Himalaya", "Adamart", "Realm of Light". "The Heart of Asia", "Fiery Stronghold", "Flame in Chalice", "Joy of Art" "Shambala" అనేవి.

రోరిక్ శాంతిదూతగా కూడ ప్రఖ్యాతి గాంచాడు. యుద్ధ సమయాల్లో సాంస్కృతిక సంపదను వినాశం కాకుండా రక్షించేందుకు రెడ్‌క్రాస్‌లాంటి దన్నొకటి ఏర్పాటు చేశాడు. ఇందుకోసమని ఒక శాంతి పతాకను సృష్టించాడు. ఈ పతాక చిహ్నం ఒక వలయంలో మూడు చిన్న గోళాలు కళావరు వలె ఉంటవి. ఆ వలయం సంస్కృతిని సూచిస్తుంది. దానిలోని మూడు గోళాలూ కళనూ, విజ్ఞానాన్నీ, శీలాన్నీ సూచిస్తవి. వివిధ సాంస్కృతిక సంస్థలపైనా ఈ శాంతి పతాకను యుద్ధం రోజుల్లో ఎగరవేస్తే ఉభయ పక్ష సైన్యాలు కూడ ఆ సంస్థలపైన బాంబులువేసి ధ్వంసం చేయకుండా ఉండేలాగు. మరో శాంతి పథకాన్ని కూడ తయారు చేసి అప్పటి అమెరికన్ రాజ్యాలచేత అంగీకరింప చేశాడు. భారతదేశం కూడ అందుకు చాల ప్రోద్బలం ఇచ్చింది.

నికొలస్ రోరిక్ మహాస్రష్టగా మాత్రమేకాక మహామానవుడుగా కూడ జీవించాడు. మహా మానవునిలో వుండాలసిన మహా లక్షణాలన్నీ ఆయనలో విద్యమానమై ఉండేవి. మహాస్రష్టగా ప్రకాశించటానికి మహా మానవతలో జీవించటం ఎంతో అవసరం. రోరిక్ మహా మానవుడు గనుకనే మహాస్రష్టగా కూడ వెలుగొందాడు. ఆయన తేజోజీవి!

ఏమన్నాను?

శ్రీ పరిగి రాధాకృష్ణ.

నే నేమన్నాను ?
నీ వింతగా ఉడుక్కోవటానికి
నే నేమన్నాను చెప్పు !
అవును ఏమన్నాను ?

నిరాశలో కుళ్ళికుళ్ళి ఏడవ్వద్దన్నాను
కన్నీళ్ళు తుడుచుకోమన్నాను
కష్టాలు భరించుకోమన్నాను
జిడ్డు మొహంతో వుండొద్దన్నాను
రుద్ధ కంఠంలో బ్రతుకు స్వరాలు
సరిగా పలకవన్నాను
ఆశతో పయనిస్తే
ఇవ్వాళ కాకుంటే రేపైనా
అణుమాత్రం సుఖమైనా
అనుభవంలో కొస్తుందన్నాను.

ఏదో కసిగా మాట్లాడి
మాటలతో పోట్లాడి
నీ మనసుతో నీవే కొట్లాడి
భావాల్ని పంచబంగాళం చేయొద్దన్నాను.
మాటలకు విలువ లేకుండా చేయొద్దన్నాను.
అయోమయంలో పడిపోవద్దని హెచ్చరించాను.

ఏమన్నాను?

నిచ్చెన లాంటి బ్రతుక్కి
మెట్లు చూసుకొని, సరి చేసుకొని
జాగ్రత్తగా ఎక్కమన్నాను
ఆశావాదానికి పాదు సరిచేసి
నీళ్ళు పోసి పెంచమన్నాను.

ఇంతకన్నా నేనేమన్నాను?
ఇందులో నీవుదుక్కునేందు కేముందని!
ఆ అన్నది కూడా గట్టిగానే అన్నాను.
నూతిలో మాటల్లా కాకుండా
ఇకిలి చేష్టలు లేకుండా
కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాను.
పలికిన ప్రతిమాటా సంపూర్ణ విశ్వాసంతో పలికాను.
మళ్ళీ కావాలంటే చెపుతాను.

నే నన్నది సహేతుకంగా వుందో లేదో చూడకుండా
ఆలోచించకుండా
ఆవేశ పడతావెందుకు?
ఎందుకలా తూలి పడిపోతావు ముందుకు?
ఎందుకలా భీరత్వానికి నిర్వచనంగా మారిపోతావు?
ఆలోచన అన్నది మనిషికి ప్రసాదింప బడిన వరం!
దాన్ని వాడుకోనంటా వెందుకు?

ఇంతకీ నే నేమన్నానని
అంతగా కుమిలిపోతావు
నీతులు చెప్పానా
ధర్మపన్నాలు వల్లించానా
ఆత్మాభిమానా న్నమ్ముకోమన్నానా
ఆశతో బ్రతకమన్నాను.
చిక్కని చీకట్లో కూడ
చుక్కలు ప్రసాదిస్తున్న వెలుతురు చూడమన్నాను.
కారుమేఘాన్ని చూసి జడుసుకొంటున్న నిన్ను

తూర్పున విరిసిన ఇంద్రధనుస్సును చూడమన్నాను.
చల్లని వాన జల్లులో తడవమన్నాను
హాయిని చవి చూడమన్నాను.
ఎదుర్కొనే ప్రతి సమస్యకీ
ఈ దృక్పథాన్ని అప్లై చేయమన్నాను.
ఆత్మ విశ్వాసాన్ని పుంజుకోమన్నాను.
నేను కోరిందల్లా ఒక్కటే
నీలో నైరాశ్య పతనం!
విరక్తితో మూరెడు గడ్డం పెంచితే
సమస్యలు పరుగెత్తి పోతాయనుకున్నావా
పిచ్చివాడా!
ఇప్పటికైనా మించిపోయిందేముంది
నీవేం మానువి కావు మట్టిముద్దవి కావు
మేధవున్న మనిషివి!
ఆలోచించు
నే నేమన్నానో.



కుజుడు - కుజరాసులు

శ్రీ దివాకరుని వెంకటసుబ్బారావు

కుజుని జన్మ వృత్తాంతము—భూమి విష్ణువును మోహించి గర్భము ధరించెను. ఆ బీజమును భరింపజాలక దానిని పవడము రూపమున త్యజించెను. అందుండి కుజుడుదయించెనని బ్రహ్మ వైవర్త పురాణము తెలుపుచున్నది. విష్ణువు శరీరమునుండి వెలువడిన ఒక స్వేదబిందువు భూమిపై బడి లోహితాంగుడైన పురుషరూపము దాల్చెను. వాడు తపస్సుచే బ్రహ్మను మెప్పించి గ్రహమయ్యెనని పద్మపురాణ స్వర్గ ఖండమునందు జెప్పబడియున్నది. దక్షయజ్ఞానంతరమున వీరభద్రుడు శివుని వరమున గ్రహములలో ప్రథముడయ్యెనని మత్స్యపురాణము దెలుపుచున్నది. దాక్షాయణి విరహానంతరము శివుడు తపస్సు చేయుచుండగ నాతని లలాటము నుండి స్వేదబిందువులు భూమిపై బడి యొక బాలుడయ్యెను. భూదేవి యాతని బెంచెను. అతడు కాశీపట్టణమున అంగారకేశ్వరుడను లింగమును స్థాపించి తన శరీరమునుండి యగ్ని ప్రజ్వలించువరకు తపమాచరించి, తుదకు శివుని వరమున గ్రహత్వము నొందెనని కాశీఖండమం దున్నది. శివు డంధకాసురుని వధించువేళ వాని రక్తబిందువు నుండి యొక బాలకుడు పుట్టి మిక్కిలి దప్పి గలవాడై యంధకాసురుని రక్తమంతయు ద్రావెను. శివుడు వానికి గ్రహాధిపత్య మిచ్చెనని వామనపురాణమం దున్నది. ఇతడు గురుపుత్రుడని వేరొక చోట చెప్పబడియున్నది.

సూర్యుని చుట్టును దిరుగుచుండెడి గ్రహములలో కుజుడు నాల్గవవాడు. ఈ గ్రహము మూడవ గ్రహమైన భూమికి తరువాత నుండును. వీని తరువాత ఐదవ గ్రహముగు బృహస్పతి యున్నాడు. ఇతడు సూర్యుని నుండి మధ్యమమానమున 14 కోట్ల, 15 లక్షల, మైళ్ళయం దున్నాడు. భూమినుండి 4 కోట్ల 86 లక్షల మైళ్ళయందున్నాడు. ఇతడు ఒకప్పుడు ఇంతకంటె ఎక్కువ దూరమునను; వేరొకప్పుడు తక్కువ దూరమున నుండగలడు. కుజుని కక్ష్య పూర్తిగ వర్తులాకారము గలదిగానందున ఈ భేదమునకు హేతువగుచున్నది. ఈ గ్రహము ఉచ్చయందున్నపుడు రవికి 15 కోట్ల 40 లక్షల మైళ్ల కెక్కువ దూరముగను, నీచయందున్నపుడు 4 కోట్ల 87 లక్షల మైళ్ల దూరమున నుండును. కుజ కక్ష్య భూకక్ష్యకు వెలుపల నున్నది. కాన నడుమ రవి, తరువాత భూకక్ష్య, తరువాత కుజ కక్ష్య యుండును. ఒకప్పుడు భూమి నడుమ, ఒకవైపు సూర్యుడు, మఱియొకవైపు కుజుడుండుట తటస్థించును. ఈ స్థితికి (Opposition) షడ్వాంతరమని పేరు. అనగా ఆరు రాసుల అంతరము. ఈవేళ సూర్యాస్తమయము కాగానే గ్రహములు ఉదయించి ఉదయము వరకుండును. ఒకప్పుడు గ్రహమునకు భూమికి మధ్య సూర్యుడుండుట తటస్థించును. అపుడు ఏర్పడు స్థితికి (Conjunction) యోగము యందురు. ఇందు గ్రహము అస్తమించును. కుజుడు షడ్వాంతరమున భూమినుండి 4 కోట్ల 86 లక్షల మైళ్ల దూరమునను, యోగమందు 23 కోట్ల 44 లక్షల మైళ్ల దూరమున నుండును. షడ్వాంతరవేళ ఈతని తేజస్సు బృహస్పతిని బోలియుండును. కుజుడు నీచనొందు సమయమున షడ్వాంతరమగునేని ఇతడు భూమికి మిక్కిలి సమీపమందుండును అనగా 3 కోట్ల 50 లక్షల మైళ్ల దూరమున నుండును. నీచ సామాన్యముగా ఆగస్టు 26 వ తేదీ ప్రాంత్యముల ప్రాప్తించును. ఫిబ్రవరి 22 వ తేదీన ఇత డుచ్చనొందును. కుజుడు భూమికన్న చిన్నవాడు. 7 కుజ గోళములు కలిపిన భూగోళమునకు సమానమగును. కుజగోళ మందలి ద్రవ్యముల గురుత్వము భూగోళమందలి ద్రవ్యము గురుత్వమునకు పదిరెట్లు తక్కువ. గురుత్వాకర్షణము కుజగోళమందు ఎక్కువ. కుజుడు భూమివలె ఆత్మప్రదక్షిణము జేసికొనుచూ సూర్యప్రదక్షిణము జేయుచుండును. ఆత్మ ప్రదక్షిణమునకు 24 గంటల 37 నిమిషముల 22 సెకనులు పట్టును. ఇది కుజ దినప్రమాణము. ఈ గ్రహము సూర్యునిచుట్టు 686.98 దినముల కొకసారి తిరిగి వచ్చును. గాన ఈ కుజ సంవత్సరము

మన సంవత్సరము కన్న 322 దినము లెక్కువ. కుజగోళ మందు 381 దినములు ఎండాకాలము. 306 దినములు చలికాలము. ఇచట వర్షకాలమున్న విషయము ఇంతవరకు తెలియలేదు. ఈ గ్రహము ఉచ్చయందున్న ఉత్తర గోళార్ధము, నీచయందున్న దక్షిణ గోళార్ధము మనకు స్పష్టముగ గాన్పించును. కుజుడు క్రమగతి, మందగతి, స్తంభన, వక్రగతి గలవాడు. సాధారణముగా నితర బహిరంగ్రహములవలె అశ్విని నుండి భరణికి, భరణి నుండి కృత్తికకు పోవుచుండును. ఇట్లు సంచరించుచూ క్రమక్రమముగా మందగతి నొంది నిల్చిపోవును. దీనిని కుజస్తంభ మందురు. మరల కొంతకాలమునకు వెనుకకు బోవ నారంభించును. దీనిని వక్రగమన మందురు. మరికొంతకాలమునకు మరల తన పూర్వపుగ్రమమైన త్రోవను నడచుట కారంభించును. ఇవి యదార్థములు గావు. భూమి చలనము వలన ఈ గ్రహ చలనమువలన మన కిట్టి దృగ్భ్రమ కలుగుచున్నది.

కుజ, సూర్యుల యోగము కలిగినపుడు వీరిర్వురకు అంతరము లేనందున ఈ గ్రహము నిరంశ మగును. అచట నుండి పయనమై మొదటి రాశిలో 20 అంశముల మేర నడచి యా వెనుక దూర్పున నుదయింప మొదలుపెట్టును. రెండవ యింట సమగతి కన్న హెచ్చగు అనుగతితో నడచును. దీనినే శీఘ్రగతి యందురు. మూడవ యింట సమగతితో ననుగతిగ నడుచును. దీనిని సమగతి యందురు. నాల్గవ యింట సమగతి కంటె తక్కువగ నుండి క్రమముగ వృద్ధియగు వేగముతో బోవును. దీనిని మందగతి యందురు. అయిదవ యింట సమగతి కంటె దక్కువగ నుండి క్రమముగ తగ్గెడి వేగమున ప్రయాణము జేయును. దీనిని మందతరగతి యందురు. ఆరవ యింట, ఏడవ యింట సమగతి కంటె తగ్గుచూ వెనుకకు నడుచును. ఇది వక్రగతి. ఎనిమిదవ యింట సమగతి కంటె హెచ్చు వేగముతో వెనుకకు నడచును. ఇది అనువక్రగతి. తొమ్మిదవ యింట నిశ్చలముగ నుండును. ఇది స్తంభనము. పదవ యింట సమగతితో పోవును. ఇది ఋజుగతి. పదునొకండవ యింట, పండ్రెండవ యింట సమగతికన్న క్రమముగ హెచ్చగు వేగముతో నడచును. దీనిని శీఘ్రతరగతి యందురు. సూర్యుని విడచి మరల సూర్యుని చేరువరకు పై విధమున ఈ గ్రహము సంచరించును.

కుజునకు రెండుపగ్రహము లున్నవి. డిమస్ (Deims) అనునది కుజునకు 14,500 మైళ్ల దూరమున, ఫోబస్ (Phobos) అనునది 3,700 మైళ్ల దూరమున నున్నవి. కుజగోళమందు గాలి, జలము, ప్రాణకోటి గలవు. కుజుడు కాలపురుషుని బలమును సూచించును. ఇతడు పురుష గ్రహము. క్షత్రియుడు, దీప్తాగ్ని సమానవర్ణుడు క్రూర దృక్కు, పాపగ్రహము, నిత్యయౌవనుడు, దానగుణము కలవాడు, అస్థిరచిత్తుడు పిత్తాధిక స్వభావి, సన్నమైన నడుము, ఎముక బలము గలవాడు. తమోగుణవంతుడు. యవనేశ్వర మతమున ఇతడు సత్వగుణాధిపతి. సేనాధిపతిగా వర్ణింపబడినాడు. మంగళ, అర, వక్ర, క్షితిజ, రుధిర, అంగారక, క్రూరనేత్ర యనునవి ఇతని పర్యాయ నామములు. అగ్నితత్వ గ్రహము. ఈతనికి భచక్ర పరిభ్రమణకు సుమారు 540 దినములు పట్టును. బాలరూపము, సంరక్త బలము గలవాడు. సహోదర కారకుడు. రక్తము, ఎముకలందుండు ధాతువు, అగ్ని పాకశాలలు, సామవేదము, దక్షిణదిక్కు, మంగళవారముల కధిపతి. ముప్పాతిక పాపత్వము గలవాడు. వింధ్యపర్వతమునకు దక్షిణదిక్కు నున్న హిందూదేశ మంతయు; సింధు, శోణ, గంగా, పయోష్ణి, శిప్రా, వేదవతీ తీరములు పై ప్రాంతముల నివసించువారు (ద్రవిడ, ఆంధ్ర, మళయాళ, మహారాష్ట్రులు భిల్లులు), విదేశీయులు, మ్లేచ్ఛులు, సంకరజాతులు ఈతని ఆధిపత్యమం దున్నవి. మేష, వృశ్చికరాసు లితని స్వక్షేత్రములు, మకరము ఉచ్చస్థానము, కర్కటము నీచక్షేత్రము. మేషమందు 1 నుండి 12 భాగలు ఈతని మూలత్రికోణ స్థానము. మకరమందు 28 వ భాగ మోక్షం. కర్కటమందు 28 వ భాగ పరమ నీచ. ఈతని స్వస్థానములలోని నవాంశ, ద్వాదశాంశముల కితడే యధిపతి. త్రింశదంశములందు కుజుడు బేసి రాసులలో మొదటి ఐదు త్రింశ దంశములకు, సరిరాసులలో చివరి త్రింశదంశములకు అధిపతిగా నుండును. మేషమందు మొదటి ద్రేక్కాణమునకు, సింహమందు మూడవదానికి వృశ్చిక మందు మొదటి దానికి, ధనస్సునందు రెండవదానికి, మీనమందు మూడవ దానికి ఈత డధిపతి.

యవనేశ్వర మతానుసారమున మేషమున ప్రథమహోరకు, మిథునమున రెండవహోరను, వృశ్చికమున ప్రథమమునకు, మకరమున రెండవదానికి ఈతడధిపతి. కుజాధిపత్య సంవత్సర మందు ఈ క్రింది విధమున ఫలాఫలములు లోకమున గలుగును :

రాజు— గ్రామ పురవనాదుల కగ్నిదాహము, దుర్భిక్ష భావము, రాజులకు యుద్ధము, చోరరోగ బాధ, సస్యహాని.

మంత్రి— అగ్ని ఆయుధ వాతరోగ భయములు, సస్యము లెండిపోవుట.

సేనాధిపతి— రోగపీడ, సస్యనాశము, లోకములు దహించుట, రాజులకు యుద్ధము.

కుజుడు - కుజరాసులు

సస్యాధిపతి — ఎల్లని భూములు సస్యవంతములగును. కందులు, సెనగలు మొదలగునవి సమృద్ధిగ పండును.

రసాధిపతి— ఊరిలో నువ్వు, నెయ్యి, నూనె, నూవులు, బెల్లము మొదలైనవి కారిపోవును.

నీరసాధిపతి— మంచి గంధము, అగరు, చందనము, కస్తూరి, పగడములు మొదలైనవి వాని వెలలు హెచ్చును.

ధాన్యాధిపతి— యవలు మొదలగు శాక ధాన్యములు, పెసలు మొదలగు పెట్టు ధాన్యములు వృద్ధియగును. ఎల్లి భూములు పండును.

అర్ఘాధిపతి— వర్షము, ధాన్యము, ప్రజల యారోగ్యము స్వల్పముగా నుండును. గాలితో కూడిన స్వల్పవృష్టియుండును.

మేఘాధిపతి— అతివాయువు, కఱవు, స్వల్పవృష్టి, ఎల్లని సస్యములు గలుగును.

గ్రహ యుద్ధములు

కుజుని యోటమి గెలుపులచే లోకమునకు గలుగు ఫలములు :

అన్యగ్రహము	కుజుని ఓటమి	కుజుని గెలుపు
బుధుడు—	శూరసేనులకు, కళింగులకు బాధ	చెట్లకు, నటులకు, సన్యాసులకు, యాజకులకు, ఉత్తర దేశీయులకు నష్టము.
గురుడు—	పాంధులకు, హుతాశన జీవులకు బాధ	మధ్య దేశీయులకు, రాజులకు, ఆవులకు నష్టము.
శుక్రుడు—	ధనాగారములకు, క్షత్రియులకు, మ్లేచ్ఛులకు హాని.	రాజ్యనాశములు, ఘోర యుద్ధములు ప్రాప్తించును.
శని—	నాగరకులకు లాభము, జానపదులకు నష్టము	ఆంధ్రులకు, ఓఢ్రులకు, కాశీప్రాంతములవారలకు నష్టము
చంద్రుడు—	క్షత్రియులకు, పైరు పంటలకు లాభము.	ఆటవికులకు జయము.

వక్రఫలములు

ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, శ్రవణము, మూల, జ్యేష్ఠ, రోహిణి, పుబ్బ, ఉత్తరలందు వక్రము నొందిన వర్షములుండవు. మఖ, హస్త, పూర్వాభాద్ర, అశ్వని, విశాఖలందు వక్రించిన ప్రజాక్షేమము, వస్తుసమృద్ధి. ఉత్తర గమనము శుభము. దక్షిణ గమనము అశుభము.

రవి, చంద్ర, గురులు మిత్రులు. బుధుడు శత్రువు. శని, శుక్రులు సములు. కర్కట, సింహ, మీన, ధనస్సులు మిత్ర క్షేత్రములు. మిథున కన్యలు, వృషభ, తుల, మకర, కుంభములు విషమ క్షేత్రములు. ఈతనికి సమక్షేత్రములు లేవు. వరాహమిహిరుని మతప్రకారము కుజునకు శుక్ర, బుధులు మిత్రులు. 'సితేందుజసయోనుహృదః'' అని ప్రమాణము. వృషభ, మిథున, కన్య, తులలు మిత్రక్షేత్రములని సింహ, ధను, కుంభ, మీనములు శత్రు క్షేత్రములని వారియొక మతము. పూర్వాషాఢ ఈతని జన్మనక్షత్రము. మృగశిర, చిత్త, ధనిష్ఠలకితడధిపతి. దశమ కేంద్రమందు బలవంతుడు. చతుర్థమందు బలహీనుడు. ఈతని మహర్దశ 7 సంవత్సరములు. తిలకధారణసమయ మితనికి శుభము. ఆరు కళలు గలవాడు. తనవారమందు, స్వనవాంశ, స్వద్రేక్కాణ, స్వక్షేత్ర, శని క్షేత్రములందు, మీనమందు, రాత్రులందు, వక్రగతి నొందినపుడు, రాశ్యారంభమున, కర్కటమందు, దశమభావమందు, నాలుగు ఎనిమిది స్థాన దృష్టులందు బలీయుడై శుభములనొసగుచున్నాడు. షడ్బలమందు 300 విరూపములు, స్థానబలమందు 96, దిగ్బలమందు 30, చేష్టాబలమందు 40, కాలబలమందు 67, ఆయన బలమందు 20 విరూపముల నొంది బలయుక్తుడగుచున్నాడు. పగడము ఇతని రత్నము.

కుజకారకత్వములు

సత్వము, రజోగుణము, తమ్ముళ్ళు, భూమి, పరివారము, జ్ఞాతులు, అక్కచెల్లెళ్ళు, నౌకరులు, పరాక్రమము, ఉదారబుద్ధి, మూర్ఖత, కోపము, విదేశ ప్రయాణము, పరదూషణము, రాజోద్యోగము, సేనాధిపత్యము, చిత్తచాంచల్యము, శత్రుజయము, క్రూరరసప్రీతి, అతిరక్తవేషము, తామసబుద్ధి, వివాదములు, ధైర్యము, బలము, ఆత్మవిశ్వాసము, వాదకుశలత్వము, నిర్మాణకౌశలము, కార్యదీక్ష, న్యాయవాదిత్వము, వ్యవసాయము, చర్మము, శస్త్రవిద్య, కామము, బాణములు, గణితము, వేట, దరిద్రము, స్వర్ణకారులు, ధనుర్విద్యానైపుణ్యత, వాహనసౌఖ్యము, కోర్టు వ్యవహారములు, ఊహలు, కోర్కెలు.

కుజకారకత్వ వృత్తులు

సేనాధిపత్యము, ప్రభుత్వోద్యోగములు, శస్త్రవేత్తలగు వైద్యులు, కర్మాగారములు, ఫ్యాక్టరీలందుండు ఉద్యోగులు, ప్రజానాయకులు, స్వర్ణకారులు, ముద్రాధికారులు, పగడ వ్యాపారులు, వేటాడువారు, క్రొత్త విషయముల కనిపెట్టు

వారు, మిలటరీ, పోలీసు ఉద్యోగులు, మందుల విక్రయించు వారు, దంతవైద్యులు, హత్యలు చేయువారు, అగ్నితత్వ రాసులందు చేరిన యుద్ధముల చేయువారు, భూతత్వ రాసి యందు చేరిన కాల్బలము లందుండువారు, జలతత్వ రాసియందు చేరిన నౌకాబలమందుండువారు, వాయుతత్వ రాసియందున్న విమానబలములందుండువారు. రవితో కూడిన మిలటరీ ఆస్పత్రులందు పనిచేయువారు. బుధునితో కూడిన లెఖ్ఖ వ్యవహారములు, ఆడిట్ విషయముల చూచువారు, మెకానికల్ ఇంజనీర్లు. శుక్రునితో చేరిన రవాణా శాఖాధికారులు, శనితో కూడిన గోతుల త్రవ్వువారు, గాయపడిన వారిని, చనిపోయిన వారిని మోయువారు అగుదురు. శాక్యులు, బౌద్ధులు, ఆటవికులు, రసవాదులు, కంచర కమ్మరవాండ్రు, శిశువారకులు, దొంగలు, యోధులు, కృషికారులు, పశుల కాపరులు ఇతని అధిపత్యకుల వ్యాపారములు.

కుజకారకత్వ వస్తులు :

ఇనుము, ఉక్కు, కాఫీ, టీ, పొగాకు, నార, వేరుసెనగ, జీడిపప్పు, వక్కలు, అల్లము, ఆవాలు, చిన్న ఉల్లిపాయలు, బ్రాంధి, విస్కి, కల్లు, భస్మములు, కత్తులు, గొడ్డళ్లు, తుపాకులు, రాగి, పాములు, ప్రాతవస్తువులు, ధనాగారములు, అగ్నిహోత్రములు, గనులు, బెల్లము, ఎఱ్ఱని పండ్లు, ఎఱ్ఱని ధాన్యములు, రసములు.

ఆర్యులకు భిన్నులగువారు, అన్యమతస్థులు, అన్యదేశజులు, దేశోపద్రవ కారకులు ఈతని ఆధిపత్యము గలవారు.

రాజ్యాంగసంబంధములు :

మనస్పర్థలు, తగాదాలు, కష్టములు, యుద్ధ సన్నాహములు, విశ్రాంతి లేకుండుట, తిరుగుబాట్లు, ఘాతుక చర్యలు, మందు సామాను ఉత్పత్తి స్థానములు, కృత్రిమ ఎరువుల ఉత్పత్తి స్థానములు, బంజరు భూములసాగు, తడిప్రదేశముల సాగు.

కుజకారకత్వ వ్యాధులు :

జ్వరము, ప్లేగు, మశూచికము, ఒడలు కాలుట, రక్తనాళములు పగులుట, సన్నిపాత జ్వరము, హెర్నియా, మలేరియా, గర్భస్రావము, రాచకురుపులు, వడదెబ్బ, ఎపెండిసైటిస్, ఫిస్టులా, పొంగులు, ప్రసవకాల సన్నిపాతము, ఎర్సిపిలేసిస్, కండరముల వాతనొప్పులు, విష సంబంధ రక్తవ్యాధులు టెటనీస్ మొదలగునవి.

కుజకారకత్వ పశుపక్ష్యాదులు :

అడవి జంతువులు, పులి, తోడేలు, వేటకుక్కలు, ఏనుగులు, రాంబందులు, కాకులు, గద్దలు.

ముండ్లచెట్లు, పెదలు, గోగునార, ధనియాలు, పొగాకు, చేదుగడ్డలు, దేవదారు వృక్షములు ఈతని ఆధిపత్యములందలి వస్తువులు. గ్రీష్మ ఋతువు, మణులు, ఎఱ్ఱని రాళ్లు, పద్మరాగము, కెంపు, కురువిందము, పగడము, ప్రవాళము, ఈతని ఆధిపత్యములు.

కుజుడు తానున్న స్థానము నుండి 4, 7, 8 స్థానములను పూర్ణదృష్టితోను, 5, 9 స్థానములను అర్థదృష్టితోను, 3, 10 స్థానములను పాదదృష్టితోను చూచును. జన్మకాలమందు తానున్న రాశి మొదలుకొని 1, 2, 4, 7, 8, 10, 11 -- ఈ స్థానముల పొందినవాడై శుభ ఫలము లిచ్చును.

ఈ క్రింది స్థానములందు శుభకరుడు :

లగ్నము నుండి 1, 3, 6, 10, 11 అందు; రవి నుండి 3, 5, 6, 10, 11 అందు; చంద్రు నుండి 3, 6, 11 అందు; బుధు నుండి 3, 5, 6, 11 అందు; గురునుండి 6, 10, 11, 12 అందు; శుక్రునుండి 6, 8, 11, 12 అందు; శని నుండి 1, 4, 7, 8, 10, 11 అందు.

వివిధ గ్రహములతో కూడిన ప్రాప్తించు ఫలములు : రవితో పాపాసక్తుడు; చంద్రునితో కూటస్త్రీ పాన విక్రయాసక్తుడు, తల్లికి నశుభము బుధునితో మూల, పుష్ప వల్కల సారఫలకూట వ్యవహార శీలుడైన వర్తకుడు, బహుయుద్ధకుశలుడు; గురునితో నగరాధిపతి, రాజు, ధనలాభము గల బ్రాహ్మణుడు; శుక్రునితో గోపాలుడు, బాహుయోద్ధ చతురుడు, పరస్త్రీ ద్యూతసక్తుడు; శనితో దుఃఖ పీడితుడు, అసత్య ప్రతిజ్ఞుడు, అనృతభాషి, కుత్సితుడు, అసూయాపరుడు.

వివిధ భావములందు, వివిధ రాసులందు కుజుడున్న ప్రాప్తించు ఫలములు, ఈతని దశయందు ఇతర గ్రహవిదశల యందు ప్రాప్తించు ఫలములు, అన్యగ్రహ దశలలో ఈతని అంతర్దశా ఫలములు, యుద్ధాదులందు కుజ బల ఫలములు క్రమముగా తెలుపబడును.

కు జ గ్రా సు లు

మేషము :

ద్వాదశ రాసులందు మొదటిది మేషము. రవి ఉత్తరాయణ మందు సంచరించువేళ అశ్వని నక్షత్ర ప్రవేశకాల

ముతో మేషాయన ప్రారంభమగును. ఇది నిరయన సిద్ధాంత రీత్యా మార్చి 21 తేదిన జరుగును. ఆ నాడు పగలు రాత్రులు సమానముగా నుండును. మేషము అశ్విని నాల్గు పాదములు, భరణి నాల్గుపాదములు, కృత్తిక ప్రథమ పాదముచే ఏర్పడు చున్నది. సాయన సిద్ధాంతరీత్యా భూమి వక్రగతిలో చరించు చున్నందున ప్రస్తుతము సాయన మేష ప్రారంభము నిరయన మీన 7వ భాగము సమాన మగుచున్నది. 71 సంవత్సరముల అనంతరము రవి మేష సంక్రమణము మార్చి 20 వ తేదిన జరుగనున్నది. నిరయన, సాయన సిద్ధాంతముల రీత్యా ఈ సంక్రమణము ఏప్రియల్ 14 తేదితో ప్రారంభమైనది. అశ్వినికి అధిదేవతలు అశ్వినీ దేవతలు. భరణికి యధిదేవత యముడు. కృత్తిక అగ్ని దైవత్యము. "కృత్తికా నక్షత్ర మగ్నిర్దేవతా" అని శ్రుతి వచనము. విష్ణుపురాణ, వాయు పురాణ ముల ప్రకారము ఈ మూడు నక్షత్రములు ఉత్తర మార్గ మున నాగవీథి యని చెప్పబడి యున్నవి. అజము, మేషము, క్రియ, తుంబుర, ఆద్య అనునవి మేషమునకు పర్యాయ నామములు. ఈ రాశి కాల పురుషుని శిరస్సని చెప్పబడి యున్నది. గొర్రెలె నుండును. ధాతువులు, రత్నములు, పశుమేత ప్రదేశములు, ఇసుక భూమి, గుట్టలుగా నుండు ప్రదేశములు, జన సంచారము లేని స్థానములు, దొంగలుండు స్థానములు, ఎత్తయిన పీఠభూముల సూచించును. గృహములందు కప్పు, గోడల పూత, పశుశాలలు, సేద్యభూములు మేషముచే సూచింప బడుచున్నవి. హ్రస్వరాశి, తూర్పు దిక్కును సూచించును. పృష్ఠోదయ రాశి గాన రాత్రివేళల బలముగలది. భూచరరాశి. అగ్ని తత్వము గలది. ఓజరాశి. చతుష్పదము. క్షత్రియరాశిగా పరిగణింపబడుచున్నది. క్రూర స్వభావము గలది. అర్థరాత్రివేళల అంధకము. రక్త వర్ణముగు ఎరుపు రంగుకలది. చరరాశి. వేసిరాశి. పురుష స్వభావము గల చైతన్య రాశి. సృష్టి ప్రారంభ రాశి. కుజస్థానము. 1 నుండి 12 భాగల వరకు కుజ మూలత్రికోణ స్థానము. 13 నుండి 30 భాగల వరకు కుజ స్వక్షేత్రము. ఇందు 1 నుండి 10 భాగల వరకు రవికి ఉచ్ఛ. 10వ భాగ పరమోచ్ఛ స్థానము. శనికి 20వ భాగ పరమనీచ. దశమ భావమై బలయుత మగు చున్నది. చంద్ర స్థితి 8 భాగలందు గలిగిన మృత్యువు. 21వ భాగ యందు శుభము. ఇందలి మృత్యు భాగలు రవికి— 20, కుజునకు— 19, బుధునకు— 15, గురునకు— 19, శుక్రునకు—28, శనికి—10, రాహునకు—14, కేతునకు— 8, మాందికి—23. ఈ రాశిచే సూచింపబడు వస్తువులు— బాంబులు, మందుగుండు సామాను, ఘన ద్రావకములు, రైలు పట్టాలు, ట్రాక్టర్లు, బస్సులు, మోటార్లు, మిషన్లు, ఇనుము, ఉక్కు, సాగు చేయబడిన నిప్పుల స్థానములు, ఇంటు పండు పంటలు, గొర్రెల స్థానరాశి గాన తొందరపాటు, ప్రతిఘ టించు స్వభావము, కామాతురత, కఠిన స్వభావము, రేపు లక్షణములు గలది. ఇందున్న శుక్రుడు బలహీనుడు.

మేషమందు జననమొందు వారల లక్షణములు:—

సామాన్యముగు ఒడ్డుపొడుగులు, కండర పూరిత మైన సన్నని దేహము, పెడమైన మెడ, ముఖము, ఎర్రని శరీరము, వెడల్పు గల నుదుటి భాగము, ఎక్కువ వెంట్రుకలతో గూడిన కనుబొమలు, తీక్ష్ణమగు దృష్టి, చురుకుతనము, అత్యాశ, ధైర్యము, సాహసము, వీరల సహజ లక్షణములు. దాపరికములేకుండా నిర్దుష్టముగా మాటలాడువారు, విచక్షణ లేని దానధర్మముల చేయువారు, మతాభిమానులు, విషయ సూక్ష్మాంశల నెరుగ గోరువారు, ఎల్లప్పుడూ ఏదో ఒక పని చేయవలె నని భావించువారు, కుశాగ్రబుద్ధి యవసరమగు పనుల యందు నేర్పరులు, రాజకీయాభిరుచిగలవారు, క్షణిక కోపము గలవారు, సుగుణవంతులు, లోభులు ఇందు జనన మొందు చున్నారు. రవి శుభుడై మేషమందున్న దేశాభిమానము, ధైర్య సాహసములు, నిజస్థితియందు, యాదార్థమందు ప్రేమగలవారు, అధిక మేధావులు జనన మొందుచున్నారు. రవి మేషమందు పాపియైన స్వలాభముల గోరువారు, అతిశయము లతో గూడినవారు, హీనగుణము గలవారు, మనోనిశ్చలత లేనివారు జనించుచున్నారు. మేషము లగ్నమై పాప సంయో గము గలిగిన తొందరపాటుతో పనుల ప్రారంభింతురు. శుభ సంబంధము గలిగిన మనోధైర్యము గలవారగుదురు. ఉన్నత స్థానముల నాక్రమింప ప్రయత్నింతురు. అన్ని రంగములందు నాయకత్వము వహింప కోర్కెగల వారగుదురు. ఇతరుల సలహాలను స్వీకరింపక తమ చిత్తానుసారము ప్రవర్తించుట, ఇతరుల ననుసరింపక అసంతృప్తి నొందుట, వీరల లక్షణములు. ఈ లగ్నమునకు శుభ సంబంధము గలిగిన జాతకులు నాయకు లగుదురు. ధైర్యముతో సాహసించి కర్తవ్యముల నెరవేర్ప గలరు. మనోధైర్యముతో త్వరగా పనుల ప్రారంభించుటయే గాక సాధించి కొనసాగింప సమర్థులు. రాజీ వ్యవహారములకు సుముఖులు. శీఘ్రకాలములో తమ మనోభావముల ఇతరుల సలహాలు లేకయే మార్చుకొన గలరు. కార్యానుకూలతకు సమయ ముల నైన నిరీక్షింపక కార్యసాధనోపాయముల సృష్టింప శక్తివంతులు. ఓటమి నొప్పుకొనక జయము లభించు వరకు

ఎట్టి కష్టములనైన సహింప గలరు. వీరికు ఉత్సాహశక్తి ఎక్కువ. కార్యదీక్ష మెండు. ఇతరుల సలహాల నిరాకరించుట, నిర్లక్ష్య పరచుట సహజ స్వభావము. దురభిమానముగు వీరా వేశము గలవారైననూ జయాభిలాష యందు మూఢ నమ్మకము గలవారు. ఈ లక్షణముల గలిగి యున్నందున తమకు నియమించిన కార్యముల గూడ చేయుటయే గాక అతిగా ప్రవర్తింతురు. మేషలగ్నమునకు పాపసంబంధము గలిగిన జాతకుల అభిమానములు మూఢభక్తిగా మార్పునొందును. మనో ధైర్యము మొండితనముగా గన్పించును. సాహసములు పిచ్చిగా నుండును. ఉదారత మితిమీరును. ఇతరుల అభిప్రాయముల నిరసించి స్వతంత్రులై ప్రవర్తింతురు. తొందరపాటు, గర్వము, మొండితనము, మూర్ఖత, తగాదాల పెంచు స్వభావము, నిర్దయ ప్రాధాన్యత వహించును. అహంకారమే ప్రధానముగా గలవారు. పట్టువిడక కార్యముల సాధింప ప్రయత్నింపగలరు. ఎట్టి కార్యముల నాచరించుటకైనను వెనుకాడక కార్యసిద్ధి నపేక్షింతురు. వీరలకు సోదర సౌఖ్యము సామాన్యము లేదా దత్తతా ప్రాప్తి గలుగును. పిత్రార్జితము ఎక్కువ కాగా వ్యవహార చిక్కులకు లోనగుదురు. కష్టములు, ప్రతిబంధకములు వీరలకు సహజముగా ప్రాప్తించును. కొంతకాలము తరువాత నభివృద్ధి నొందగలరు. బాల్యవివాహము, కళత్ర మూలక ధనప్రాప్తి గలుగును. విదేశములందు వీరలకు గౌరవ మర్యాదలు ప్రాప్తింప గలవు.

ఆరోగ్య భావము

సహజ ఆరోగ్య వంతులు. సామాన్య వ్యాధులు వీరలను బాధింప జాలవు. తలకు సంబంధించిన ప్రమాదములకు గురి యగుదురు. ఆటపాటలందు శ్రద్ధ వహించి ఆరోగ్యము కాపాడుకొన గలరు. తలనొప్పి, కాళ్ళల వలని బాధ, వాపులు, మెదడుకు సంబంధించిన వ్యాధులు, తాపము, మశూచికము, మలేరియా జ్వరము, త్రాంబోసిస్ ప్రాప్తించుట సహజము.

ఆర్థిక స్థితి

అధిక ద్రవ్యార్జన, సమానముగు ఖర్చులు ఉండును. నిల్వ యుండుట అరుదు. ధనవిషయమై ముందు దృష్టి తక్కువ. సంపాదించినంతవరకు ఖర్చుచేయు స్వభావము గలవారు. ధనాపేక్షాపరులు.

కుటుంబ సంబంధములు

ప్రేమాభిమానములు గలవారు. వీరల ఉదారత ఆకర్షణీయముగా నుండును. శాశ్వతముగు ఆదరాభిమానములకు కృషి చేయుదురు. తొందరపాటు గలవారు గాన ఇట్టి శాశ్వత స్థితి కష్టసాధ్యమగును. మేషలగ్నమందు జనన మొందు స్త్రీలు చమత్కారముగా మాటలాడ గలవారు. సామర్థ్యము, ఉదారము, ఆదరణ వీరల సహజ లక్షణములు. లగ్నమునకు పాప సంబంధము గలవారు గర్వముతో సంచరింతురు. ఆత్మస్తుతి ఎక్కువ. పరనింద యుండును. భర్తలను కూడ నిర్లక్ష్యముగా జూతురు. సింహలగ్న జాతకులు వీరలకు తగు భర్తలు. మేషలగ్న పురుషులను స్త్రీలు గౌరవింతురు. కుటుంబముపై ప్రేమాదరములు వీరల కెక్కువగా నుండును. స్నేహ సంబంధము తక్కువ. ఆదరాభిమానములు సహజ స్వభావములు.

వృత్తులు :

శుక్ర, బుధ, శనులు మేషమందున్ననూ, శని మేష నవాంశ నొందిననూ కుజుడు బలవంతుడై శుభస్థాన గతుడైననూ, సైనికోద్యోగులు, రక్షణ శాఖాధిపతులు, డాక్టర్లు, దంతవైద్యులు, కసాయివారు, పోలీసు శాఖ యందధికారులు, మంటల వర్తకులు, న్యాయాధికారులు, గార్డులు, పరిశోధకులు, వస్త్ర పరిశ్రమ లందలి ఉద్యోగులుగా నుందురు. కుజ, శుక్ర, బుధ, శనుల బలాబలములచే వీరల వృత్తి నిర్ణయింప వలెను. రెండవ రకపు వారు కమ్మరి పనులు, కుట్టు పనులు, రొట్టెల వ్యాపారము, గడియారముల రిపేరు, అట్టకపు పని, వంట పని, వడ్రంగము, నిప్పువేయువారు, ఇటుక ఆవముల కాల్పువారు కాగలరు.

రవి మేషమందున్న :

శక్తి గలవారు, కార్యదీక్ష గల వారు, ఆరోగ్యవంతులు, నుందురు, రేచి...గల వారు, శ్రద్ధ, ధైర్యములతో ...వు జరుపువారు, ప్రావెక్స్...చేయువారు, ఫలము నాశింపక కష్టించి పని చేయువారు కాగలరు.

చంద్రుడు మేషమందున్న :

ధైర్యము, స్వతంత్రత, కార్యమునందలి వేగిరితనము, ఉత్సాహశక్తి, స్వతంత్రతతో అభివృద్ధి నొందుశక్తి, ఆదరణ, ప్రజాసేవ, కుటుంబమునందలి వారల ప్రేమాదరములు, ప్రాప్తించును. చంద్రునకు పాపత్వము గాని, పాపసంబంధము గాని కలిగిన అతికోపము, తొందరపాటు, ఉద్రేకత గలుగును. చురుకుతనము, ఉన్నత పదవులందు, గౌరవమందు ఆశ, ప్రభువులతో కూడిన ఆలోచనలు, తెగించి అధిక ధనము పెట్టించి వ్యాపారము చేయగలరు.

కుజుడు మేషమందున్న :

ఎర్రని నేత్రములు, ఎరుపుఛాయ, బలిష్ఠమగు దేహము, మహోధైర్యము, పట్టుదల, సాహసము, ఉద్రేకము, ఆవేశము, ఇతరుల లక్ష్యము చేయకుండుట, ఉన్నదున్నట్లు మాట వాడుట, ఫలితముల ప్రభావముల గమనింపక త్వర పడి కార్యముల ప్రారంభించుట, సుఖసక్తి, ఆటలు, వేటయం దాసక్తి, కార్య సఫలత గల్గును. అగ్ని ప్రమాదములకు గురి యగుట, శస్త్ర చికిత్స నొందుట, తీవ్ర జ్వరబాధలు, ప్రమాద ములు, తల, ముఖము, కండ్ల యందలి బాధలు గలుగును.

బుధుడు మేషమందున్న :

తొందరపాటు, ఉద్రేకము, తర్కమందు నేర్పరి తనము, లేనివానిని ఉన్నట్లుగా చూపుట, విద్య, వ్రాత పను లందు కుశలత, వృత్తులను త్వరితముగా మార్చుకొనుట సహజముగా నుండును. శని దృష్టి బుధునకు గల్గిన, అస్థిర త్వము, మనస్థిమితము లేకుండుట ప్రాప్తింప గలవు. శుభ దృష్టి బుధునకు ప్రాప్తించిన తీక్ష్ణమగు గ్రాహ్యశక్తి, జాగ్రత, చురుకుతనము, తెలివితేటలు, స్వతంత్ర శక్తితో కార్యముల నెరవేర్చు మేధాతనము ప్రాప్తించును.

గురువు మేషమందున్న :

తీక్ష్ణ దృష్టిగల నేత్రద్వయము, ఎత్తయిన ముక్కు, ఇతరుల నాదరించి సహాయ్యము చేయు స్వభావము, పరులతో సతికి యుండుట, తగాదాల యందయిష్టత, అభివృద్ధి, ఆశ, న్యాయప్రవర్తన, కోర్కెలు సఫలములగుట, విశ్వాస పాత్రత, ఉన్నతాధికారము, వేదాంతమందభిరుచి, ధనార్జన, తనవారి క్షేమమును సహకరించుట వీరల లక్షణములు.

శుక్రుడు మేషమందున్న :

అందమగు, ఆకర్షణీయమగు శరీర సౌష్ఠవము, ప్రజాదరణ, స్నేహ సంబంధములు, లలిత కళలందలి ప్రేమ, కామాతృత, ఉదార స్వభావము, ఉన్నతాశయములు ప్రాప్తిం చును. శుక్రునకు పాపదృష్టి ప్రాప్తించిన దురదృష్టము ప్రాప్తించును. అస్థిరత్వము, స్వల్ప కాలములో ఆశయములు, వృత్తులు మార్చుట గలుగును. సహజ సంతోషవంతులు. ఆదరాభిమానము గలవారు. ఇతరులచే గౌరవింప బడువారు, నిత్య యౌవన వంతులు అగుదురు.

శని మేషమందున్న :

ప్రతిభగల వాక్చాతుర్యము, మనోధైర్యము, అత్యాశ, దంబాచారము, దీర్ఘకోపము, పగసాధించు స్వభావము, కష్టించి ఆర్జించుట, ధనమును జాగ్రత్త చేయుట యందలి నేర్పరి తనము, అభివృద్ధి, ఊహాశక్తి, మాటలందు నేర్పరితనము, తొందరపాటు, వాగ్వాదమందలి నియమములు, సంసార సౌఖ్యము లేకుండుట ప్రాప్తించును. ఈతనికి పాపసంబంధ ములు ప్రాప్తించుట అశుభము.

రాహువు మేషమందున్న :

రాహునకు శుభదృష్టి ప్రాప్తించుట అధిక శుభము నకు హేతువగును. కుజుని ఫలముల నితడు ఎక్కువగా నిచ్చును. ఫలప్రమాణ మధికమగును.

మేషరాశి షోడశాదివర్గులు

1. **రాశి** — 30 భాగలు, అధిపతి కుజుడు.

2. **హోర** — ప్రథమహోర 1 నుండి 15 భాగలు— రవి అధిపతి. ద్వితీయ హోర 16 నుండి 30 భాగలు. చంద్రు డధిపతి.

3. **ద్రేక్కాణము** — ప్రథమ ద్రేక్కాణము 1 నుండి 10 భాగలు. కుజుడధిపతి.

నీలవర్ణము గలిగి, తెల్లని వస్త్రమును ధరించిన పురుషుని రూపము. ఇతడు భయంకరుడు, ఎర్రని కన్నులు గలవాడు. ఎత్తబడిన గండ్రగొడ్డలి ధరించి ఎదురుగ నుండి రక్షింప సమర్థునివలె నుండువాడు. ఇది పురుష ద్రేక్కాణము.

ద్వితీయ ద్రేక్కాణము 11 నుండి 20 భాగలు— ద్వితీయ తృతీయ ద్రేక్కాణాధిపత్యములందు భిన్నాభిప్రాయము లున్నవి.

యవనాదుల మతము:—

కేచిత్తు హోరాం ప్రథమాం భవస్య
వాంఛతి లాభాధిపతే ర్ద్వితీయాం
ద్రేక్కాణ సంజ్ఞా మపి వర యంతి
స్వద్వాదశైకాదశ రాశిపానామ్॥

వరాహ మిహిరులు— "చృగాణా నిజ, తనయ, తపస్థాన పానాం భవంతి."

పాదుమని బోమాద్రి— "ద్రేక్కాణాః ప్రథమ, పంచ, నవపానాం."

కళ్యాణ వర్మ— "స్వర్ష్య సుత నవమ భేశో ద్రేక్కాణానాం."

మంత్రేశ్వరుడు— "ద్రేష్కాణేశా స్త్రిభాగై స్తను, సుత, శుభపా."

కాళిదాసు—

''అర్కేంద్వ ర్విష మేన్యథా సమగృహే హోరేథ ద్రేక్కాణ కే
లగ్నే స్వంకగృహేశ్వరో స్తురగృహే భాగ్యేశ్వరాత్యు స్థిరే
పుత్రేశాశ్రిత ఏవతు ద్వితనఃభే సప్తాంశకోస్త్వోజభే
లగ్నేశాత్వసమఃభేతు సప్తమ గృహాచ్చాధో నవాంశాః క్రమాత్‖''

స్థిర రాశియందు, చర రాశియందు, ద్విస్వభావ రాశి యందు ఈ ఆధిపత్యములకు భేదములున్నవి. చర రాశి యందు మొదటి ద్రేక్కాణమునకు లగ్నాధిపతి, రెండవ ద్రేక్కాణమునకు పంచమాధిపతి, మూడవ ద్రేక్కాణమునకు నవమాధిపతి ద్రేక్కాణాధిపతులు. స్థిర రాశియందు 9, 1, 5 స్థానాధిపతులు క్రమముగా 1, 2, 3 ద్రేక్కాణాధిపతులు. ద్విస్వభావ రాశియందు 5, 9, 1 స్థానాధిపతులు క్రమముగా 1, 2, 3 ద్రేక్కాణాధిపతులు.

పరాశర హోరయందు— 1, 5, 9 స్థానాధిపతులు క్రమముగా 1, 2, 3 ద్రేక్కాణాధిపతులని చెప్పబడియున్నది. గాన ఇది ప్రమాణముగా స్వీకరింపవచ్చును.

చరరాసియందు చరరాస్యాధిపతి ద్రేక్కాణాధిపతి యైన ఆ ద్రేక్కాణమునకు నారదుడధిదేవతయని, ద్రేక్కాణాధిపతి స్థిరరాశ్యాధిపతియైన అగస్త్యుడు అధిదేవతయని ద్విస్వభావాధిపతి ద్రేక్కాణాధిపతియైన దూర్వాసుడు అధి దేవతయని చెప్పబడియున్నది.

గాన ద్వితీయ ద్రేక్కాణమునకు రవి యధిపతి యని గ్రహింప వలెను.

ఈ ద్రేక్కాణము స్త్రీ రూపము.

రక్తాంబరా భూషణ భక్ష్య చిత్తా కుంభాకృతిర్వాజి ముఖీ తృషార్తా
ఏకేన పాదేన చ మేష మధ్యే ద్రేక్కాణ రూపం యవనోపదిష్టం‖

ఎర్రని చీరెను ధరించి, అలంకార ప్రియుమై, భక్ష్యము లందాసక్తి గలిగి ఘటమును ధరించి, గుర్రపు ముఖము గలిగి, దప్పిచేత పీడింపబడుచూ ఒకే పాదముతో యున్న స్త్రీ రూపము.

తృతీయ ద్రేక్కాణము 21 నుండి 30 భాగలు. గురు డధిపతి.

క్రూరః కలాజ్ఞః కపిలః క్రియార్థీ భగ్నవ్రతో
ఽభ్యుద్యత దండ హస్తః
రక్తాని వస్త్రాణి బిభర్తి చండో మేషే తృతీయః
కథిత స్త్రిభాగః‖

విషమ స్వభావుడు, 64 విద్యలందు నేర్పరి, పింగళ వర్ణుడు, క్రియాసక్తి గలవాడు, భగ్ననియమముల గలవాడు, ఎదురుగ నెత్తబడిన దండహస్తము గలవాడు, అధిక కోపముతో కూడిన ఎర్రని వస్త్రములు ధరించిన పురుష రూపము.

4. **చతుర్థాంశ**— తుర్యాంశ— ప్రథమ తుర్యాంశ నుండి $7\frac{1}{2}$ భాగలు— కుజుడధిపతి, రెండవ తుర్యాంశ $7\frac{1}{2}$ నుండి 15 భాగలు— చంద్రుడధిపతి, మూడవ తుర్యాంశ 15 నుండి $22\frac{1}{2}$ భాగలు— శుక్రుడధిపతి, నాల్గవ తుర్యాంశ $22\frac{1}{2}$ నుండి 30 భాగలు— శని అధిపతి. ఈ తుర్యాంశలకు సనక, సనందన, కుమార, సనాతన ఋషులు అధిదేవతలు.

5. **సప్తాంశ** — బేసిరాసులందు ప్రథమ సప్తాంశ ద్రావకమును, ద్వితీయ సప్తాంశ పాలను, తృతీయ సప్తాంశ పెరుగును, చతుర్థ సప్తాంశ నెయ్యిని, పంచమ సప్తాంశ చెరుకు పానకమును, షష్ట సప్తాంశ మద్యమును, సప్తమ సప్తాంశ శుద జలమును సూచించును. సరిరాసులందు ఈ క్రమము సప్తమముతో ప్రారంభమగును.

ప్రథమ సప్తాంశ 1 నుండి 4 2/7 భాగలు— కుజుడధి పతి.

ద్వితీయ సప్తాంశ 4 2/7 నుండి 8 4/7 భాగలు— శుక్రు డధిపతి.

తృతీయ సప్తాంశ 8 4/7 నుండి 12 6/7 భాగలు— బుధు డధిపతి.

చతుర్థ సప్తాంశ 12 6/7 నుండి 17 1/7 భాగలు— చంద్రుడు డధిపతి.

పంచమ సప్తాంశ 17 1/7 నుండి 21 3/7 భాగలు— రవి అధిపతి.

షష్ట సప్తాంశ 21 3/7 నుండి 25 5/7 భాగలు— కన్యా బుధు డధిపతి.

సప్తమ సప్తాంశ 25 5/7 నుండి 30 భాగలు— తులా శుక్ర డధిపతి.

6 **నవాంశ**— చర రాసులకు రాసినుండి, స్థిరరాసులకు 9 నుండి, ద్విస్వభావ రాసులంకు 5 నుండి నవాంశాధిపతులు ఏర్పడుదురు. చరరాసులందు ఇష్టదేవత అధిదేవత,

స్థిరరాసులందు నరుడు అధిదేవత, ద్విస్వభావ రాసులందు రాక్షసుడు అధిదేవత.

1వ నవాంశ— 1 నుండి 3.20 భాగలు— మేష కుజుడు అధిపతి.

2వ నవాంశ— 3.20 నుండి 6.40 భాగలు— వృషభ శుక్రుడధిపతి.

3వ నవాంశ— 6.40 నుండి 10.00 భాగలు— మిధున బుధుడధిపతి.

4వ నవాంశ— 10 నుండి 13.20 భాగలు— చంద్రుడధిపతి.

5వ నవాంశ— 13.20 నుండి 16.40 భాగలు — రవి అధిపతి.

6వ నవాంశ— 16.40 నుండి 20 భాగలు— కన్యా బుధుడధిపతి.

7వ నవాంశ— 20 నుండి 23.20 భాగలు— తులా శుక్రుడధిపతి.

8వ నవాంశ— 23.20 నుండి 26.40 భాగలు — వృశ్చిక కుజుడధిపతి.

9వ నవాంశ— 26.40 నుండి 30 భాగలు— ధనుర్గురుడధిపతి.

మేష కుజ నవాంశ వర్గోత్తమ నవాంశ యని గ్రహింప వలెను.

7. దశాంశ— బేసి రాసులకు లగ్నము నుండి దశాంశాధిపతు లేర్పడుదురు. సరి రాసులకు 9 నుండి దశాంశాధిపతు లేర్పడుదురు.

బేసిరాసులకు క్రమముగా ఇంద్రుడు, అగ్ని, యముడు, రాక్షసుడు, వరుణుడు, మరుత్తు, కుబేరుడు, ఈశానుడు, పద్మజుడు, అనంతుడు అధిదేవతలు.

సరి రాసులకు ఈ క్రమమును పదవ దశాంశ నుండి చూడవలెను.

1వ దశాంశ— 0 నుండి 3 భాగలు— మేష కుజుడధిపతి.

2వ దశాంశ— 3 నుండి 6 భాగలు— వృషభ శుక్రుడధిపతి.

3వ దశాంశ— 6 నుండి 9 భాగలు— మిధున బుధుడధిపతి.

4వ దశాంశ— 9 నుండి 12 భాగలు— చంద్రుడధిపతి.

5వ దశాంశ— 12 నుండి 15 భాగలు— రవి అధిపతి

6వ దశాంశ— 15 నుండి 18 భాగలు— కన్యా బుధుడధిపతి.

7వ దశాంశ— 18 నుండి 21 భాగలు— తులా శుక్రుడధిపతి.

8వ దశాంశ— 21 నుండి 24 భాగలు— వృశ్చిక కుజుడధిపతి.

9వ దశాంశ— 24 నుండి 27 భాగలు— ధనుర్గురుడధిపతి.

10వ దశాంశ— 27 నుండి 30 భాగలు— మకర శని అధిపతి.

8. ద్వాదశాంశ— రాశి నుండి ద్వాదశాధిపతులు క్రమముగా నేర్పడుదురు.

ఈ ద్వాదశాంశలకు క్రమముగా గణపతి, అశ్వినీకుమారులు, యముడు, సర్పము వరుసన అధిదేవత లగుదురు. అనగా 5వ ద్వాదశాంశకు గణపతి, అశ్వనీ కుమారులు, 7కు యముడు, 8కు సర్పము, 9కు గణపతి, 10కి అశ్వనీ కుమారులు, 11కు యముడు 12కు సర్పము యని ఎరుగవలెను.

1వ ద్వాదశాంశ 0 నుండి 2½ భాగలు— మేష కుజుడధిపతి.

2 వ ద్వాదశాంశ 2½ నుండి 5 భాగలు— వృషభ శుక్రుడధిపతి.

3 వ ద్వాదశాంశ 5 నుండి 7½ భాగలు— మిధున బుధుడధిపతి.

4 వ ద్వాదశాంశ 7½ నుండి 10 భాగలు—చంద్రుడధిపతి.

5 వ ద్వాదశాంశ 10 నుండి 12½ భాగలు— రవి అధిపతి.

6 వ ద్వాదశాంశ 12½ నుండి 15 భాగలు— కన్యా బుధుడధిపతి.

7 వ ద్వాదశాంశ 15 నుండి 17½ భాగలు— తులా శుక్రుడధిపతి.

8 వ ద్వాదశాంశ 17½ నుండి 20 భాగలు— వృశ్చిక కుజుడధిపతి.

9 వ ద్వాదశాంశ 20 నుండి 22½ భాగలు— ధనుర్గురుడధిపతి.

10 వ ద్వాదశాంశ 22½ నుండి 25 భాగలు— మకర శని అధిపతి.

11 వ ద్వాదశాంశ 25 నుండి 27½ భాగలు— కుంభ శని అధిపతి.

12 వ ద్వాదశాంశ 27½ నుండి 30 భాగలు— మీన గురు డధిపతి.

(9) షోడశాంశ లేక కళాంశ— చర రాసులకు మేషము నుండి, స్థిర రాసులకు సింహము నుండి, ద్విస్వభావ రాసులకు ధనస్సు నుండి కళాంశాధిపతులు ఏర్పడుదురు.

1 వ కళాంశ—0 నుండి 1 7/8 భాగలు—కుజ డధిపతి— బ్రహ్మ అధిదేవత

2 వ కళాంశ— 1 7/8 నుండి 3 6/8 భాగలు— వృషభ శుక్రు డధిపతి—విష్ణు అధిదేవత

3 వ కళాంశ—3 6/8 నుండి 5 5/8 భాగలు— మిధున బుధు డధిపతి— శివు డధిదేవత

4 వ కళాంశ— 5 5/8 నుండి 7 4/8 భాగలు— చంద్రు డధిపతి— సూర్యు డధిదేవత

5 వ కళాంశ 7 4/8 నుండి 9 3/8 భాగలు— రవి అధిపతి— బ్రహ్మ అధిదేవత

6 వ కళాంశ—9 3/8 నుండి 11 2/8 భాగలు— కన్యా బుధు డధిపతి— విష్ణు అధిదేవత

7 వ కళాంశ 11 2/8 నుండి 13 1/8 భాగలు— తులా శుక్రు డధిపతి— శివు డధిదేవత

8 వ కళాంశ 13 1/8 నుండి 15 భాగలు—వృశ్చిక కుజ డధిపతి—సూర్యు డధిదేవత

9 వ కళాంశ 15 నుండి 16 7/8 భాగలు—ధనుర్గురు డధిపతి— బ్రహ్మ అధిదేవత

10 వ కళాంశ 16 7/8 నుండి 18 6/8 భాగలు— మకర శని అధిపతి— విష్ణు అధిదేవత

11 వ కళాంశ 18 6/8 నుండి 20 5/8 భాగలు— కుంభ శని అధిపతి— శివు డధిదేవత

12 వ కళాంశ 20 5/8 నుండి 22 4/8 భాగలు— మీన గురు డధిపతి— సూర్యు డధిదేవత

13 వ కళాంశ 22 4/8 నుండి 24 3/8 భాగలు— మేష కుజ డధిపతి— బ్రహ్మ అధిదేవత

14 వ కళాంశ 24 3/8 నుండి 26 2/8 భాగలు— వృషభ శుక్రు డధిపతి— విష్ణు అధిదేవత

15 వ కళాంశ 26 2/8 నుండి 28 1/8 భాగలు— మిధున బుధు డధిపతి— శివుడధిదేవత

16 వ కళాంశ 28 1/8 నుండి 30 భాగలు— చంద్రు డధిపతి— సూర్యు డధిదేవత.

(10) వింశాంశ — 1.30 భాగలు పరిమాణము గలది. చరరాసులకు మేషాది, స్థిరరాసులకు ధనుస్సు మొదలుగను, ద్విస్వభావ రాసులకు సింహము ప్రారంభముగను అధిపతు లగుదురు.

1 వ వింశాంశ — 0 నుండి 1.30 భాగలు— మేష కుజ డధిపతి— కవి అధిదేవత

2 వ వింశాంశ — 1.30 నుండి 3 భాగలు— వృషభ శుక్రుడధిపతి— గౌరి అధిదేవత

3 వ వింశాంశ — 3 నుండి 4.30 భాగలు— మిధున బుధు డధిపతి— జయ అధిదేవత

4 వ వింశాంశ — 4.30 నుండి 6 భాగలు— చంద్రు డధిపతి— లక్ష్మి అధిదేవత

5 వ వింశాంశ— 6 నుండి 7.30 భాగలు— రవి అధిపతి— విజయుడు అధిదేవత

6 వ వింశాంశ— 7.30 నుండి 9 భాగలు— కన్యాబుధు డధిపతి— విమల అధిదేవత

7 వ వింశాంశ— 9 నుండి 10.30 భాగలు— తులా శుక్రు డధిపతి — సతి అధిదేవత

8 వ వింశాంశ— 10.30 నుండి 12 భాగలు— వృశ్చిక కుజ డధిపతి— తార అధిదేవత

9 వ వింశాంశ— 12 నుండి 13.30 భాగలు— ధను ర్గురు డధిపతి— జ్వాలాముఖి అధిదేవత

10 వ వింశాంశ—13.30 నుండి 15 భాగలు— మకర శని అధిపతి— శ్వేత అధిదేవత

11వ వింశాంశ — 15 నుండి 16.30 భాగలు— కుంభ శని అధిపతి— లలిత అధిదేవత

12వ వింశాంశ — 16.30 నుండి 18 భాగలు— మీన గురు డధిపతి— భగలచక్ర అధిదేవత

13 వ వింశాంశ— 18 నుండి 19.30 భాగలు— మేషకుజ డధిపతి— ప్రత్యంగిర అధిదేవత

14వ వింశాంశ — 19.30 నుండి 21 భాగలు— వృషభ శుక్రుడధిపతి— శచి అధిదేవత

15వ వింశాంశ — 21 నుండి 22.30 భాగలు— మిధున బుధు డధిపతి— రౌద్రి అధిదేవత

16వ వింశాంశ — 22.30 నుండి 24 భాగలు— చంద్రుడధిపతి— భవాని అధిదేవత

17వ వింశాంశ — 24 నుండి 25.30 భాగలు— రవి అధిపతి— వరదు డధిదేవత

18వ వింశాంశ — 25.30 నుండి 27 భాగలు— కన్యా బుధుడధిపతి— జయ అధిదేవత

19వ వింశాంశ — 27 నుండి 28.30 భాగలు— తులా శుక్రుడధిపతి— త్రిపుర అధిదేవత

20వ వింశాంశ — 28.30 నుండి 30 భాగలు— వృశ్చిక కుజు డధిపతి — సుముఖి అధిదేవత

(11) సిద్ధాంశ— 1.15 భాగలు దీని పరిమాణము. బేసి రాసులకు సింహము నుండి, సరి రాసులకు కర్కాటము నుండి అధిపతు లేర్పడుదురు.

1వ సిద్ధాంశ— 0 నుండి 1.15 భాగలు— రవి అధిపతి— స్కందుడధిదేవత

2వ సిద్ధాంశ— 1.15 నుండి 2.30 భాగలు — కన్యా బుధు డధిపతి— పశుధరుడధిదేవత

3 వ సిద్ధాంశ— 2.30 నుండి 3.45 భాగలు — తులా శుక్రు డధిపతి— అనల అధిదేవత

4వ సిద్ధాంశ— 3.45 నుండి 5 భాగలు— వృశ్చిక కుజు డధిపతి— విశ్వకర్మ అధిదేవత

5వ సిద్ధాంశ — 5 నుండి 6.15 భాగల— ధనుర్గురు డధిపతి— భాగ అధిదేవత

6వ సిద్ధాంశ — 6.15 నుండి 7.30 భాగలు — మకర శని అధిపతి— మిత్రుడధిదేవత

7వ సిద్ధాంశ — 7.30 నుండి 8.45 భాగలు — కుంభ శని అధిపతి — మాయు అధిదేవత

8వ సిద్ధాంశ — 8.45 నుండి 10 భాగలు— మీనగురు డధిపతి— అంధకుడు అధిదేవత

9వ సిద్ధాంశ — 10 నుండి 11.15 భాగలు— మేష కుజు డధిపతి— విషధ్వజ డధిదేవత

10వ సిద్ధాంశ — 11.15 నుండి 12.30 భాగలు— వృషభ శుక్రుడధిపతి— గోవిందు డధిదేవత

11వ సిద్ధాంశ — 12.30 నుండి 13.45 భాగలు— మిథున బుధుడధిపతి— మదనుడధిదేవత

12వ సిద్ధాంశ — 13.45 నుండి 15.00 భాగలు— చంద్రుడధిపతి— భీముడధిదేవత

13 నుండి 24 వరకు ఈ ప్రకారముగనే అధిపతులను అధిదేవతలను ఎరుగవలెను.

12. నక్షత్రాంశ లేక సప్తవింశాంశ :

రాశిని 27 భాగములు చేసిన ఏర్పడును. ఒక్కొక్క అంశ $1\frac{1}{9}$ భాగల పరిమాణము గలది. ఈ అంశలకు అధిపతులు ఆ ఈ రాశినాథులతో ప్రారంభ మగుదురు. వీని అధిదేవతలు క్రమముగా అశ్వినీ కుమారులు, యముడు, అగ్ని బ్రహ్మ, చంద్రుడు, ఈశుడు, అదితి, జీవ, సర్ప, పితృ, భాగ, అర్యమ, సూర్య, త్వష్ట్ర, వాయు, ఇంద్రాగ్ని, మిత్ర, వాసవ, నిరతి, జల, వైశ్యదేవ, విష్ణు, వసు, వరుణ, అజైకపాద, అహిర్బుధని, పూషులు.

దీనినే భాంశ యని కూడ వ్యవహరించుచున్నారు. ఒక్కొక్క భాంశ 1 భాగ, 6 నిమిషముల 40 సెకండులకు సమానముగా నుండును. మేషమందు 1వ భాగ 0 నుండి 1—6.40 వరకు మేష కుజ అధిపత్యము. 1—6.40 నుండి 2—13.20 వరకు వృషభ శుక్ర అధిపత్యము. 2—13.20 నుండి 3.20 వరకు మిథున బుధ అధిపత్యము. 3.20 నుండి 4 — 26.40 వరకు చంద్రాధిపత్యము. 4—26.40 నుండి 5—33.20 వరకు రవి అధిపత్యము 5—33.20 నుండి 6—40 వరకు కన్యా బుధ అధిపత్యము. 6.40 నుండి 7.46.40 వరకు తులా శుక్ర అధిపత్యము. 7—46.40 నుండి 8—53.20 వరకు వృశ్చిక కుజ అధిపత్యము. 8—53.20నుండి 10 వరకు ధనుర్గురు అధిపత్యము. క్రమముగా మకర శనితో ప్రారంభమై ఈ అధిపత్యములు మిథున బుధునితో అంత్యమగును.

13. త్రింశాంశ :

బేసి రాసులందు మొదటి 5 భాగలకు మేష కుజు డధిపతి, అగ్ని అధిదేవత, 5 నుండి 10 భాగల వరకు కుంభ శని అధిపతి: వాయువు అధిదేవత: 10 నుండి 18 భాగల వరకు ధనుర్గురు డధిపతి, ఇంద్రుడు అధిదేవత, 18 నుండి 25 భాగల వరకు మిథున బుధుడధిపతి, కుబేరుడధిదేవత, 25 నుండి 30 భాగల వరకు తులా శుక్రుడధిపతి, వరుణుడధిదేవత యని ఎరుగవలెను. మేషము బేసి రాసిగాన పై క్రమము సవ్యయుంచ వలెను.

14. స్వవేదాంశ :

రాశిని 40 సమభాగములు చేయుగా నేర్పడుచున్నది. ఒక్కొక్క అంశ 45 నిమిషముల ప్రమాణము గలిగి యుం

డును. బేసిరాసులకు మేషాదిగను సరిరాసులకు తులాదిగను అధిపతు లేర్పడుచున్నారు. మేషకుజునితో ప్రారంభమై చంద్రు నితో ఆధిపత్యములు పూర్తి యగుచున్నవి. ఇవి 3 ఆవృత్తులు పోగా శేషము 4 గాన చంద్రాధిపత్యముతో 40వ వేదాంశ అంత్య మగును.

వీని అధిదేవతలు క్రమముగా విష్ణు, చంద్ర, మరీచి, త్వష్ట, ధాత, శివ, రవి, యమి, యక్షేశ, గంధర్వ, కల, వరుణ, విష్ణు, చంద్ర, మరీచ్యాదులు క్రమముగ యుండి త్వష్టతో 40వ స్వవేదాంశ సంపూర్ణ మగుచున్నది.

15. అక్షవేదాంశ :

రాశిని 45 సమభాగములు చేయగా నేర్పడుచున్నది. ఒక్కొక్క అంశ 40 నిమిషముల ప్రమాణము గలది. చర రాసులకు మేషముతోను, స్థిరరాసులకు సింహముతోను, ద్విస్వభావ రాసులకు ధనుస్సుతోను ఈ అంశలకు అధిపతు లేర్పడుచున్నారు. మేషము చరరాశి గాన ప్రథమ అక్షవేదాం శకు మేష కుజునితో ప్రారంభమై 45 వ అక్షవేదాంశకు 3 ఆవృత్తులు తిరిగి 9 అంశలు శేషించినందున ధనుర్గురు డధిపతి యగుచున్నాడు. చరరాసులకు ప్రథమ అక్షవేదాంశను బ్రహ్మ, ద్వితీయమునకు శంకరుడు, తృతీయమునకు విష్ణువు అధిదేవతలు. ఈ క్రమమున మిగిలిన 42 అంశలకు వీరధి దేవతలగుచున్నారు.

16. షష్ట్యంశ :

రాశిని 60 సమభాగములు చేయగా నేర్పడుచున్నది. ఒక్కొక్క అంశ 0.30 నిమిషముల ప్రమాణము గలిగి యుండును. ఈ అంశనాథుల పేర్లు అన్ని ప్రధాన జ్యోతిష గ్రంథములందున్నందున మరల చెప్పుటలేదు. బేసిరాసులలో 1, 2 పాపాంశలు; 3 నుండి 6 వరకు శుభాంశలు; 7 నుండి 12 వరకు పాపాంశలు; 13, 14 శుభాంశలు; 15 పాపాంశ; 16 నుండి 26 వరకు శుభాంశలు; 27 పాపాంశ; 28, 29 శుభాంశలు; 30 నుండి 36 వరకు పాపాంశలు; 37 నుండి 39 వరకు శుభాంశలు; 40, 41 పాపాంశలు; 42 శుభాంశ; 43, 44 పాపాంశలు; 45 నుండి 48 వరకు శుభాంశలు; 49, 50 పాపాంశలు; 51 శుభాంశ; 52 పాపాంశ; 53 నుండి 58 వరకు శుభాంశలు; 59 పాపాంశ; 60 శుభాంశ. సరి రాసులు ఈ క్రమమును 60వ షష్ట్యంశనుండి వెరుగ వలెను.

పై జెప్పబడిన షోడశవర్గులు గాక ఆయుర్భావ విచారణకు, అదృష్ట విచారణకు అష్టమాంశ, ఏకాదశాం శలు ప్రమాణములు.

అష్టమాంశ :

రాశిని 8 భాగములు చేయగా నేర్పడును. ఒక్కొక్క అంశ 3 భాగల 45 నిమిషములు ప్రమాణము గలిగియుం డును. మేషమునకు 1వ అష్టమాంశకు— మేష కుజుడు; 2వ అష్టమాంశకు— వృషభ శుక్రుడు; 3వ అష్టమాంశకు— మిధున బుధుడు; 4వ అష్టమాంశకు— చంద్రుడు; 5వ అష్టమాంశకు— రవి; 6వ అష్టమాంశకు— కన్యాబుధుడు; 7వ అష్టమాంశకు— తులా శుక్రుడు; 8వ అష్టమాంశకు— వృశ్చిక కుజుడు అధిపతులు. ఈ క్రమము అన్ని చరరాసులకు వర్తించును. స్థిరరాసులకు ధనస్సు నుండి, ద్విస్వభావ రాసు లకు సింహము నుండి అధిపతు లేర్పడుదురు.

ఏకాదశాంశ :

రాశిని 11 సమ భాగములు చేయగా నేర్పడును. ఒక్కొక్క అంశ 2.43 భాగల పరిమాణము గలిగి యుం డును. అన్ని రాసులందునూ ప్రథమ ఏకాదశాంశకు మేష కుజు డధిపతి. 2 నుండి 11 వరకు క్రమముగా మీన గురుడు, కుంభశని, మకరశని, ధనుర్గురుడు, వృశ్చిక కుజుడు, తులా శుక్రుడు, కన్యాబుధుడు, రవి, చంద్రుడు, మిధున బుధుడు అధిపతులగుచున్నారు. ఇందు వృషభ శుక్రునకు ఆధిపత్యము లేదని గ్రహింప వలెను.

కుజరాసి యగు వృశ్చిక రాశి లక్షణాది వివరములను ఉదాహరణ జాతకములను రాబోవు వ్యాసమందు తెలుపగలను.

1904 సంవత్సరం అక్టోబరు 2వ తేదీన 11 గంటల 28 నిమిషలకు అతిసామాన్య కుటుంబమందు వృశ్చిక లగ్న మున జన్మించిన జాతకుడు ఎట్లు అత్యున్నత స్థాన మాక్ర మింప గలిగినది మొదలగునవిశేషములు శాస్త్రరీత్యా రాబోవు వ్యాసములో చర్చింప బడును.

ప్రజలు ప్రభుత్వము

శ్రీ జాన్ స్ట్రాచీ

ప్రభుత్వాన్ని తొలగించటం, ప్రతిష్ఠించటం, దానిని అదుపు ఆజ్ఞలలో ఉంచటం అనే మూడు హక్కులను ఇచ్చే రాజ్యాంగ యంత్రం కమ్యూనిస్టు రాజ్య ప్రజలకు ప్రాణావసర మన్నట్లు ఇంతవరకు చెప్పిన దానిలో తెల్పాను. పశ్చిమ రాజ్యాలలో మేము ఈ మూడు హక్కులను దివ్యంగా వినియోగించక పోయినా, మొత్తంమీద సరిగానే వినియోగిస్తున్నాము. పశ్చిమ రాజ్యాలలో ఏ ఒక్క దేశంలోను కూడా ప్రజలలో అధిక సంఖ్యాకుల అభిప్రాయానికి మరీ వ్యతిరేకంగా ఏ ప్రభుత్వమూ వ్యవహరించలేదు. అలా వ్యవహరిస్తే అది తొలగించబడుతుంది: ప్రజాభిప్రాయాన్ని మన్నించి వ్యవహరించే మరో ప్రభుత్వాన్ని దాని స్థానే ప్రతిష్ఠించడం జరుగుతుంది.

గత నలభై సంవత్సరాలలోను కమ్యూనిస్టు రాజ్యాలు అనేక విషాద సంఘటనలకు గురి అవడానికి కారణం ఈవిధమైన రాజకీయ యంత్రాంగం లేకపోవడమే. సిద్ధాంతరీత్యా ఈ యంత్రాంగం అవసరాన్ని కమ్యూనిస్టులు అంగీకరిస్తారు. కాని ఎన్నికల ద్వారా వారేర్పరచుకున్న రాజకీయ అధికార యంత్రం పనిచేయదు. కారణం కమ్యూనిస్టుపార్టీ అనుమతించిన అభ్యర్థులే, ఎన్నికకు నిలబడవలసి ఉంటుంది. కాబట్టి ప్రజలు ఎన్నుకోవలసి వచ్చేసరికి, ఒక్కడే ఒక్క అభ్యర్థి ఉండడం జరుగుతుంది; వృద్ధుడైన మా నాయకుడు క్లెమెంట్ అట్లీ ఈ స్థితిని ఇలా వర్ణించాడు : "కమ్యూనిస్టుల ఎన్నిక ఒకే గుర్రం పరుగెత్తే గుర్రపు పందెము."

పారిశ్రామికంగా బాగా అభివృద్ధిచెందిన దేశాలకు ప్రజాస్వామ్య ఎన్నికలు జరిపే రాజ్యాంగయంత్రం చాలా అవసరమని గత నలభై సంవత్సరాలలోను కమ్యూనిస్టు ప్రభుత్వాల గురించి మనకి ఏర్పడిన అనుభవం గట్టిగా నిరూపిస్తున్నది. కమ్యూనిస్టు దేశాలకు వచ్చిన కష్టాలు ఆ దేశాల పాలకులు వెర్రివారు, దుష్టులు అవటం మూలాన రాలేదు. వారిలో చాలామంది తమ శక్తివంచన లేకుండా పరిపాలన చేశారు. కొంతమంది నిర్దుష్టమైన నిజాయితీతో వ్యవహరించారు. కొంతమంది నీతి అనేది లేకుండా వ్యవహరించారు. పశ్చిమ రాజ్యాలను గురించి కూడా ఇలా చెప్పవచ్చు. నిజానికి కమ్యూనిస్టు రాజ్యాల పాలకులలో చాలామంది అసాధారణమైన శక్తి సామర్థ్యాలు కలవారై ఉన్నారు. ఒకప్పుడు అందరికన్న మిన్నగా అందల మెక్కించబడి, నేడు అంత అపఖ్యాతికి గురి అయిన శ్రీ జోసెఫ్ స్టాలిన్ పట్ల కూడా ఇది వర్తిస్తుంది. స్టాలిన్‌ను గురించి తెలిసినవారెవ్వరూ కూడా ఆయన శక్తి సామర్థ్యాలను సందేహించరు. నిజానికి నేను కూడా స్టాలిన్ ప్రతిభను గురించి శ్రీ కృశ్చేవ్ చెప్పినదానితో పూర్తిగా ఏకీభవించను. స్టాలిన్ హత్యలు జరిపించాడు. హింసించాడు. అబద్ధాలు చెప్పాడు. నాశనం చేయించాడు. అని శ్రీ కృశ్చేవ్ చెప్పగా దానిని ఎవ్వరూ కాదనలేరు: తన దేశాన్ని ఈ మూల నుంచి ఆ మూల వరకు ధ్వంసం చేశాడు. ఈ విషయంలో ఒక్క హిట్లర్ తప్ప ఎవ్వరూ సాటిరారు. శ్రీ కృశ్చేవ్ దూషణలనుబట్టి చూస్తే స్టాలిన్ చేసిన హత్యలు, చెప్పిన అబద్ధాలు, హింసలు అన్నీ తన ఆనందం కోసం, అధికారంకోసం చేసినట్లు బోధపడుతుంది. పూర్వం నిరంకుశ పాలకులు అలా చేశారు. వారు కేవలం అధికారంలో ఉండిపోవడానికి చేశారు. తమ అధిపత్యానికి ప్రమాదం తీసుకువస్తారనుకొన్నవారిని అణచివేశారు.

కాని స్టాలిన్ విషయంలో అలా అనడానికి వీలులేదు. తన దేశాన్ని పారిశ్రామికంగా పెద్దజేసి, సైనికంగా ప్రపంచంలో శక్తివంతమైన రాజ్యంగా తయారుచేయడానికి తాను చేసిన రాజకీయ వడపోతలు, తదితర భయంకర చర్యలు అవసరమని స్టాలిన్ నిజంగా నమ్మాడు. కొద్ది సంవత్సరాలలోనే తన దేశాన్ని ఆవిధంగా తయారుచేయకపోతే, ఇరుగు పొరుగు ధనస్వామిక దేశాలు దండెత్తి, తన దేశాన్ని నాశనం చేస్తాయని ఆయన నమ్మాడు. కాని, ఆయన అనుకున్నది అబద్ధమని తేలింది: ఆయన చర్యలకు మూలం ఈ అపోహలే కారణం, అని నా అభి

ప్రాయం. అయితే చివరి రోజుల్లో ఆయనకు ఇదొక జాడ్యంగా పరిణమించినట్లు కనపడింది.

స్టాలిన్ మాట అలా ఉంచండి. లెనిన్ కూడా భయంకరమైన చర్యలే చేశాడన్నమాట మరవకూడదు. ఆయన నిర్దుష్టమైన సంకల్పంతోనే చేశాడు. తన ఆశయం ఉత్కృష్టమైనది. కాబట్టి లెనిన్ ఇంకా నిస్సంకోచంగా తన భీషణ చర్యలు కొనసాగించాడు. అవసరమని, సరైనవని నమ్మకపోయినట్లయితే ఆ చర్యలలో కొన్నింటిని చేయగలిగి ఉండేవాడే కాదు. అయితే లెనిన్, స్టాలిన్ కంటె పోలిక లేనంతగా నాగరికుడైన వ్యక్తి.

బోల్షివిక్ పరిపాలనను అమిత ఆవేశంతో బలపరచిన వారిని హింసించడం లెనిన్ కాలంలోనే ఆరంభమైనదనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. 1921 సంవత్సరంలో క్రాన్‌స్టాడెట్‌లో నావికుల (వీరు అక్టోబరు విప్లవయోధులు) తిరుగుబాటు అణచివేసిన సంఘటన బోల్షివిక్ కార్య విధానంలో పెద్ద మార్పు అని చరిత్రకారులు చాలామంది అంగీకరించారు. ఆ సమయంలో అంతర్యుద్ధం సాగుచున్నమాట నిజం. శత్రురాజ్యాలు ఈ అంతర్యుద్ధంలో బాగా జోక్యం కలుగజేసుకున్నవి. కాని ప్రయోజనం లేకపోయింది. కనక అధికారం నిలబెట్టుకోడానికి తీసుకున్న చర్యలకు అతనిని విమర్శించడం హాస్యాస్పదం. ఏదేలా ఉన్నా, పశ్చిమ రాజ్యాలమీద గాని, పాత పాలకవర్గంమీద గాని, ఎర్ర సైన్యాన్ని నడపక, రష్యా కార్మిక దళం మీద, ఎర్ర నౌకాదళ నావికుల మీద, ఒకసారి ప్రయోగించడం జరిగిందో, అప్పుడే అంతకు కొద్ది సంవత్సరాల ముందు ఆయన ప్రతిపాదించిన కమ్యూనిస్టు ప్రజా ప్రభుత్వ ఉద్దండ సిద్ధాంతానికి చావుదెబ్బ తగిలింది.

దానిని నేను చావుదెబ్బ అని ఎందుకు అంటున్నానంటే నావికుల తిరుగుబాటు అణచిన రోజు నుండి, సోవియెట్ ప్రభుత్వం తన నిరంకుశ అధికారాన్ని ఏ విధంగాను పూర్వ పాలకుల వర్గానికి చెందినవారనే వారిపైనకాక, రష్యన్ ప్రజలలో ప్రముఖ వర్గాలమైననే ప్రయోగించడం జరుగుతూ వచ్చింది. ఈ వర్గాలు తప్పు త్రోవను పడ్డారనే సంజాయిషీ చెప్పడం కమ్యూనిస్టులకు పరిపాటి అయింది. ఈ సంజాయిషీ గమనార్హం : ఎందుకంటే కమ్యూనిస్టు ప్రపంచంలో జరిగిన విషాద సంఘటనలకు కారణాన్ని ఇది వెల్లడిచేస్తున్నది. తమకు ఎప్పుడూ, అన్నీ అందరికంటే బాగా తెలుసునని కమ్యూనిస్టుల ధృఢ నమ్మకం. ప్రజల శ్రేయస్సు ప్రజలకన్న తమకే తెలుసునని వారి విశ్వాసం. కాని అది నిజంకాదని చరిత్ర చెబుతున్నది.

తాము తప్పుచేయడమనేది అసంభవమనే కమ్యూనిస్టు మొండి నమ్మకమే గత నలభై సంవత్సరాలలోను వారు చేసిన అమానుష చర్యలకు కారణమైంది. మానవ శ్రేయాభివృద్ధి కృషిలో ముందు నడుస్తున్నామని చెప్పుకొనే వీరు [ఈ చెప్పుకోడం ఆదిలో కొంత సమర్దనీయమైనా] ''పార్టీ అనే దానిని నిర్మించి, దానిని ఒక దేవతగా ఊహించి, దాని పేరిట మానవ చరిత్రలో అతి భయానకమైన ఘాతుక చర్యలుచేయడం నిజంగా వింత. దైవాంశ గల వాటిలో రాజరికం ఒకటి. రాజు తప్పుచేయడు అనేదానికి నా విష్ణుః పృథివీపతిః అనేది ఆధారం. రాజైనా, పార్టీ అయినా మరే వ్యవస్థ అయినా చరిత్రబద్ధమైన ఒక బాధ్యతను నిర్వహించవలసి ఉన్నదని అన్నప్పుడే పరిశీలనకు ఏమాత్రం నిలబడనటువంటి గుడ్డి సిద్ధాంతాలు రావడం జరుగుతుంది. పరిపాలనా విధానం కేంద్రీకరింపజేయడానికి రాజరికం యొక్క అవసరం (అయిదు వందల సంవత్సరాల క్రితం) ఉన్నది. అదే విధంగా నేడు ఆర్థిక ఏకీకరణకు ఏక పార్టీ పరిపాలనగాని, లేక, పటుత్వమైన ప్రజా ప్రభుత్వ వ్యవస్థగాని తప్పనిసరి. ఈ విషయాన్ని గ్రహించి, మానవ దౌర్బల్యాన్ని గ్రహించి కమ్యూనిస్టులు పార్టీని ఒక ఆరాధ్య దైవంగా తయారుచేశారు. పార్టీకి దైవాంశమైన అధికారాలు ఇచ్చారు. పార్టీ తప్పుచేయలేదని అన్నారు. అయితే నిజానికి పార్టీ అనేది మన మోస్తరే పొరపాట్లుచేసే వ్యక్తులతో కూడినది. అది తప్పులు చేయడం తథ్యం. ఆ తప్పులు భయంకరమైనవి కూడా అవ్వచ్చు.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక, సాంఘిక జీవితాన్ని తృప్తికరమైన విధంగా నిర్మితం చేయడం మన తరంలో చాలా అవసరం. దాని నిర్వహణకు ఏకపార్టీ విధానమే గత్యంతరం కాదని చరిత్ర చూపగలదు. ఇందుకు ఉన్న అనేక పద్ధతులలో వీరిదొక పద్ధతి మాత్రమే. అంతేగాని, అదే అన్నింటికన్న ఉత్కృష్టమైనదని చెప్పడానికి వీలులేదు. కాబట్టి పార్టీకి దైవాంశమైన హక్కును ఇవ్వడం భయంకరం. అలా చేయడంవల్ల ఎడతెగని ప్రమాదాలకు నేరాలకు దారితీసింది. ఇంకా తీస్తున్నది. ఇలా అనడంవల్లనా కమ్యూనిస్టులు సాధించినదేమీ లేదని నేను అనడంలేదు. అదే మరొకసారి చెబుతున్నాను. వారు చాలా గొప్ప ఫలితాలను సాధించారు. వాటిని పూర్తిగా చర్చిస్తాను. పార్టీకి, తద్వారా వారి ప్రభుత్వానికి దైవాంశమైన అధికారాన్ని అంటగట్టటమే వారి కార్యక్రమంలో పెద్ద ప్రమాదాలు, నేరాలు జరిగినవని వ్యక్తం అవుతున్నది. ఇంతకంటేకూడా కమ్యూనిస్టుల మొండి నమ్మకం అంటే పార్టీ తప్పు చేయదనే నమ్మకం ఇంకా ఎక్కువ కష్టాలకు దారి

తీసి, ప్రపంచాన్ని నాశనం చేయవచ్చు. మార్క్సిజం కర్తలలో ఒకరు చెప్పిన దానిని కమ్యూనిస్టులు మర్చిపోయారు. "ప్రజలను బాధపెట్టి అసుఖపెట్టడం ఎప్పుడూ తప్పు" అని ఎంజెల్స్ తన వృద్ధాప్యంలో చెప్పాడు: ప్రజల ఇష్టా—అయిష్టాలతో సంబంధంలేకుండా, తాము మంచిది అనుకున్నది వారికి బలవంతంగా అంటగట్టడం పదేపదే చేశారు. ఇది తూర్పు ఐరోపాలో ప్రతిఒక్కరికి తెలుసు.

తమ పొరుగు దేశాలలో ఒకరిని తాము తలచిన రీతిగా ప్రభుత్వము నడపవలెనని సోవియెట్ ప్రభుత్వం బలవంత పెట్టడం నేను కళ్లారా చూచే అవకాశం కలిగింది. 1956వ సంవత్సరంలో రష్యా— పోలెండుల మధ్య "అక్టోబరు దినాలు" అనే క్లిష్ట సమయంలో నేను వార్సా నగరంలో మూడు వారాల పాటు ఉన్నాను. రష్యన్ ప్రభుత్వం చివరికి వెనకడుగువేసి, రాజీకి వచ్చింది. తన అదుపాజ్ఞలలో ఉన్న మరొకదేశ ప్రభుత్వం పైన ఉన్న పట్టును కొంత సడలించి ఆ ప్రభుత్వం కొంత విభిన్నంగా వ్యవహరించడానికి ఒప్పుకొన్నదనడానికి నాటి సంఘటనలు నిదర్శనం : అయితే పోలెండు ఉదంతం మామూలు దానికి విభిన్నమైనది. ఏమైనా ఆ మూడు వారాలలో అధికారానికి వచ్చిన పోలిష్ ప్రభుత్వం కమ్యూనిస్టు ప్రభుత్వమే ప్రధానంగా అది సనాతన కమ్యూనిస్టు ప్రభుత్వం. ఇతర కమ్యూనిస్టు ప్రభుత్వాలకు ఉన్న ద్వేష భావాలు, భ్రమలు వారికి కూడా ఉన్నవి.

తమ దేశంలో ఉన్న రష్యను సేనలను తొలగించవలెననిగాని, రష్యాతో ఉన్న సైనిక ఒప్పందం నుంచి తప్పుకోవాలనిగాని పోలెండు కొత్త ప్రభుత్వానికి ఉద్దేశం లేదు. ఆ ప్రభుత్వం కావాలన్నది రెండే విషయాలు. ఒకటి సామూదాయక వ్యవసాయాన్ని నిలుపు చేయడం. రెండు తను ప్రభుత్వానికి ఎక్కువ దేశీయత నాపాదించవలెనని. వారు కావాలన్నదల్లా రష్యా చెప్పిన ధోరణితో కాక చాలా సమర్థులైన పోలిషు ఆర్థిక శాస్త్రజ్ఞులు చెప్పిన రీతిగా పారిశ్రామిక కార్యక్రమాన్ని నడుపవలెనని తప్ప వేరుకాదు. సాంస్కృతిక జీవనంలో కొంత పోలిషు తనాన్ని అనుభవించాలనే వారు కోరేది.

పోలిషువారి ఈ చిన్న కోరికలను కూడా రష్యనులు అతి తీవ్రంగా ఎదిరించారు. నేనక్కడే ఉండగానే కృశ్చేవ్, మార్షల్ కోనివ్ తదితర ప్రభుత్వ ప్రముఖ్యులు ఒక పెద్ద విమానంలో దిగారు. పోలిష ప్రభుత్వం తాము చెప్పినట్లు నడవవలెనన్నారు. అంతేకాదు. ఆ దేశంలోఉన్న రష్యా సైనిక దళాలను వార్సా నగరం పైకి నడపటం మొదలు పెట్టారు. కాని పోలిషు ప్రభుత్వం మాత్రం ఏమాత్రం భయపడక ధైర్య స్థైర్యముతో వ్యవహరించింది. రష్యా చెప్పినట్లు నడవనన్నది. అంతే రష్యాతో తెగ తెంపులు చేసికోమన్నది. కాదు వీల్లేదంటే రష్యాతో పోట్లాడుతామన్నది. ఈ సందర్భంలో జరిగిన ప్రయత్నాలన్నీ నేను చూచాను. చివరికి రష్యనులు రాజీకి వచ్చారు. గోముల్కా వర్గాన్ని ప్రభుత్వాధికారాన్ని చేబట్టనిచ్చారు. వ్యతిరేకు లనుకున్నవారిని అణచివేయలేదు. అప్పటి నుంచి కాస్త సంస్కరింపబడిన కమ్యూనిస్టు ప్రభుత్వం పోలెండులో ఏర్పడింది. వెనుక జరిగినదంతా చూస్తే ఇది మామూలుకి భిన్నం రుజువవుతున్నది. కమ్యూనిస్టు పద్ధతిని కూడా మార్చవలెనంటే, పోలెండు దరిదాపు ఆత్మ వినాశనమొనర్చే యుద్ధానికి దిగవలసిన పరిస్థితి రావడం ఘోరాతిఘోరం కాదా? అసాధారణమైన అదృష్టము, రాజకీయ చాతుర్యమూ పోలెండు విజయానికి తోడ్పడినాయి. ఆ తరువాతి వారంలో హంగరీలో దానికి విరుద్ధంగా వచ్చిన ఫలితం ఈ విషయాన్ని ఇంకా రుజువు చేస్తున్నది. హంగరీ విషాదాన్ని గురించి అనేకులు కుప్పలు, కుప్పలుగా వ్రాశారు. కాని ఎవరు ఏమి వ్రాసినా నాకు స్ఫురించేది ఒకటే. తాము పొరబడి యుండవచ్చుననే అనుమానం రష్యనులకు లేకపోవటమే. హంగేరియనులకు తోచిన రీతిగా తమ ప్రభుత్వ విధానాన్ని నిర్మించుకోటానికి వారిష్టపడలేదు. సోవియటు ట్యాంకు దళాలక్రింద హంగరీ కార్మికులను అణచివేయుటంతప్ప వారికి వేరే గత్యంతరం కనపడలేదు. వారు దానిని నిజంగా నమ్మారు. నిజానికి అలా చేయుట వారికి ఇష్టంలేకపోయింది. తమ సైనిక దళాలను ప్రయోగించే ముందు చాలా తటపటాయించారు. కాని చివరికి తాము తప్పు చేయమనే పిచ్చి నమ్మకానికి లొంగిపోయారు. తాము ఏమి చేసినా, వారిని చంపినా కూడా హంగరీ కార్మికుల క్షేమానికేనని వారు అనుకున్నారు. తాము తప్పు చేయమనే కమ్యూనిస్టుల నమ్మకము. ఒక విధంగా Mystical ఈ రకమైన నమ్మకానికి తార్కాణంగా ఒకటి. హంగరీ విషాదానంతరం సోవియటు పత్రికలలో ఒకటి కనుపడింది. అది 1957 మార్చి 22 న కల్నల్ ఫెడరెర్ వ్రాసింది. ఆయన వ్రాసిన దిది. "కమ్యూనిస్టు పార్టీచే శిక్షణ పొంది రష్యా సైనిక దళాలు తమ అంతర్జాతీయ ధర్మ నిర్వహణ ప్రతిష్ఠను నిలబెట్టుకున్నాయి. హంగరీ కార్మికులకు వారిచ్చిన సహాయము ఆ విషయాన్ని తెలియజేసినది."

ఈ కల్నలు తన వ్రాతలోని అపహాస్యాన్ని తానే గుర్తించలేదనుకుంటాను. తమ పార్టీ తప్పు చేయదనే ఆయన విశ్వాసము. అందుకని బుడాపెస్టులోని కార్మికులను కాల్చి చంపటం వారికి సహాయం చేయటమని అనుకున్నాడు. సిద్ధాంతంపైని వ్యామోహం ఏమైనా చెప్పించగలదు.

తాము తప్పు చేయటం అసంభవం అనే కమ్యూనిస్టుల విశ్వాసానికి ఉదాహరణలు ఇంకా ఇచ్చేముందు, వారి తప్పులను సవరించటానికి ప్రజా ప్రభుత్వ సంస్థలు లేవని వ్యాఖ్యానించే ముందు ఒక విషయం వెంటనే చెప్పాలి. పశ్చిమ రాజ్యాలు ఆ విధమైన తప్పులు చెయ్యవని నేను చెప్పటంలేదు. వారేమీ అతీతులు కారు. నే చెప్పేదల్లా ఒకటే. ఎన్ని లోపాలున్నా పాలకులను అదుపులో పెట్టటానికి పశ్చిమ రాజ్యాలలో యంత్రాంగం ఉన్నది. నిర్ణీతమైన వ్యవధిలో పాలకులను పంపివేయవచ్చు. ప్రతిష్ఠించవచ్చు. ఆ విధంగా వారి తప్పులను కొంత పరిమితిలోనూ, అదుపులోనూ ఉంచవచ్చు.

పోలిషు, హంగరీ మొదలైన ఇతర దేశ ప్రజలను లొంగదీయటం అనేది కమ్యూనిస్టులు చేసిన తప్పులలో నిజానికి పెద్దది కాదు. తమ దేశంలో చేసినవే పెద్దవి. వ్యవసాయాన్ని సాముదాయకం చేయటం ఆ తప్పులన్నిటిలోను పెద్ద తప్పు. ఆర్థిక దృష్ట్యా చూస్తే కమ్యూనిస్టుల పారిశ్రామిక దృష్టి జయప్రదమైనవి. వ్యవసాయం మాత్రం పూర్తిగా భగ్నమైంది.

బలవంతం మీద సాముదాయక వ్యవసాయం ప్రవేశపెట్టటమే 1930 సం. లలో వచ్చిన క్షామానికి రాజకీయ పడపోతలకు కారణమైనది. ఇప్పటికి కూడా రష్యా ఆర్థిక అభివృద్ధికి ఆటంక మవుతున్నది. వ్యవసాయం భగ్నమయి మొత్తం రష్యా ఆర్థికాభివృద్ధికి గుదిబండగా తయారైనది. వత్తిడిచేసి ప్రవేశపెట్టిన సాముదాయక దుష్ఫలితాలు చైనాలో ఎక్కువగా కనుపడుతాయి. ఈ వ్యవసాయ పద్ధతికి చైనా పరిస్థితులు రష్యాలోకంటె తక్కువ అనుకూలంగా ఉన్నాయి. కాని చైనా ప్రభుత్వం ఇంకా తీవ్రమైన విధానాన్ని ప్రవేశపెట్టింది. ఫలితం గూర్చి వేరే చెప్ప నవసరం లేదు. ఆ దేశంలో వచ్చిన క్షామం ఎంతో మనకు తెలియదు. కాని క్షామం వచ్చినట్లు చైనా ప్రభుత్వమే చెప్పింది. ఆ యా దేశాలలో లక్షల టన్నుల గోధుమలను చైనా కొన్నది. తన ప్రజలు కనుక నిజంగా క్షామానికి గురికాక పోయినట్లయితే తమ విదేశ ద్రవ్యాన్ని భారీ ఎత్తు పరిశ్రమలకు ఉపయోగపడు యంత్రాలను కొనడానికి ఉపయోగించేవారు. 1958 సం॥ వరకు బాగా సాగుతూ వచ్చిన చైనా ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ విధానం భగ్నమయ్యేసరికి దెబ్బతిన్నది. కమ్యూనిస్టులు సాముదాయక విధానం ప్రవేశపెట్టటానికి రెండే కారణాలు. తమకే అందరికన్నా ఎక్కువ తెలుసున్నదని మొదటిది. కర్షకులకు అది మంచిదనే నమ్మకం /అధిక సంఖ్యాకుల అభిప్రాయాన్ని ప్రభుత్వం గమనించేటట్లుచేసే యంత్రాంగం లేకపోవటం రెండవది. ఆ దేశాల ప్రజలు, కర్షకులతోసహా ఈ పద్ధతికి బాగా వ్యతిరేకులనే విషయంలో ఏవిధమైన సందేహం లేదు.

మానవ చరిత్రలో ప్రభుత్వాలన్నీ తప్పులు చేశాయి. ఏ కొద్దిమందో తప్ప అందరూ ఘోరాలు చేశారు. అనేక ప్రభుత్వాలు కమ్యూనిస్టు ప్రభుత్వమంత గట్టిగానూ, నిరంకుశంగానూ వ్యవహరించారు. మానవాభివృద్ధికి తోడ్పడుతున్నామనే కమ్యూనిస్టులకున్న సమర్థన లేకుండానే వారు క్రూరంగా వ్యవహరించారు. స్టాలిన్ చేసిన అతిహీన కృత్యాలతో పోలిస్తే పూర్వులవి అంత తీవ్రంగా కనుపడకపోవచ్చు కాని వారికి ఒక ఆశయం అంటూ లేదు. కమ్యూనిస్టులపై అలాటి నిందను వెయ్యటానికి వీలులేదు. మన తరంలో ఫాసిస్టు హిట్లరు నాజీల పేరున చేసిన రాక్షస కృత్యాలను ఎవరిని మించలేవు. 20 వ శతాబ్దంలోని ఈ ఫాసిస్టులు సైనిక శక్తితో ప్రపంచాన్ని గెలవాలనే ఆశయంతో తప్ప మరో ఆశయం లేక, ప్రజలను హింసించి, చంపివేశారు. అందుకని కమ్యూనిస్టు ప్రభుత్వాలు పూర్వ క్రూర ప్రభుత్వాలకు భిన్నమైనవని నా అభిప్రాయం. కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉత్తమమైనవి. కాని కమ్యూనిస్టులు చెప్పినట్లు, ఉద్దేశాలు, ఆశయాలు చరిత్రలో లెక్కకు రావు. అసలు కమ్యూనిస్టులు అనుకున్నదానికి వారు చేసిన దానికి మధ్య ఏర్పడిన అగాధమే ఈ విషాదానికి రూపమైనది.

కాబట్టి ఇపుడు తేలిందేమంటే, నేడు ప్రపంచ సమస్య, పెట్టుబడి విధానానికి కమ్యూనిస్టులకు మధ్య ఉన్నది కాదు. ఆధునికంగా అభివృద్ధి చెందిన మానవ సంఘాలను, ప్రజా ప్రభుత్వ విధానం ద్వారా నడపటమనేదే మనలను ఎదుర్కొన్న పెద్ద సమస్య. ఆ సంఘాలలో ప్రజలకు ప్రభుత్వంపైని అధికారంఇచ్చే ప్రయత్నంయొక్క జయాపజయముల మీదనే ప్రపంచ క్షేమం ఆధారపడియుంటుంది. ఈ ఉపన్యాసాలను వింటున్న వారిలో కొంతమంది కూడా మంత్రులుగా తేవనుకుంటాను. నేను మంత్రిగా ఉన్నాను. ఎంత సదుద్దేశంగల ప్రభుత్వానికి కూడా పైన అదుపులో ఉంచే ప్రజాభిప్రాయం అవసరమని అనుభవంతో నేను చెబుతున్నాను. తాము చేసేది సరి అయినదనీ, తాము ప్రజాశ్రేయస్సునే కోరుతున్నామనీ, తాము ప్రజలకు అసాధారణ ప్రయోజనాలను ప్రాప్తింపచేయగలమని విశ్వసించే మంత్రులు కూడా(ముఖ్యంగా మంత్రులు) ప్రజల కిష్టం లేనిది తాము చేస్తే అధికారాన్ని కోలుపోతామని తప్పక గ్రహించాలి. మంత్రులకు ఇది తెలిసినపుడు నిజమైన ప్రజా ప్రభుత్వం ఉంటుంది. అది లేకపోతే లేదు. అది ఉంటేనే ప్రజా ప్రభుత్వం. అదే మానవ జాతికి ఆశా చంద్రిక.

రచయిత

అతని సమస్యలు - 3

శ్రీ యుజ్నే ఐనెస్కో

సులభమైనవైనా, క్లిష్టమైనవైనా, సూక్ష్మమైనవైనా, స్థూలమైనవైనా మన ప్రశ్నలన్నీ ఉపక్రమణకు, అంతః ప్రేరణకు చెందినవి. వీటిని శీఘ్రంగానే వెనక్కునెట్టి వదిలి వేస్తాము. మన అన్వేషణ, పరిశోధనా యాత్రలు ప్రారంభించడానికి అవి దోహదమిస్తాయి. కాని మనకు ఏమి కనపడుతుందో మనకు తెలియదు. ఉపదేశాలు చేయాలనే రచయితలు తమ పథకం ముందే వేసుకొని వుంటారు. అందుకని వారు కొత్తగా తెలుసుకొనేది కాని, కనుక్కునేది కాని వుండదు. వారి అన్వేషణ నిజంగా అనవసరం. ఎందుకంటే ఇతరుల అన్వేషణా ఫలితాలను ఏకరువు పెడతారు. అదివరకు ఒకరు తయారుచేసి పెట్టినదానిని, అందరూ ఎరిగిన దానినే వారు చెబుతారు. అలాంటి రచయితలు సాహిత్యానికి కొత్తగా ఇవ్వగలిగినదేమీ లేదు. వారు కాలం తీరిన వారు. వారు మనకు చెప్పడానికి వారి దగ్గర సరుకేమీ లేదు. సాధారణంగా ముందు ప్రశ్నలు వస్తాయి. సమాధానాలు తర్వాత వస్తాయి. ఉపదేశ పద్ధతి నవలంబించే రచయిత, రాజకీయాలను గురించి వ్రాసే రచయిత ప్రశ్నలు తెలపకుండానే సమాధానాలు ఇస్తారు. అయితే ఈ పద్ధతిలో సజీవమైన సమాధానాలు రావు. ప్రశ్నలు వేయటంతో సమాధానాలు రావచ్చు: రాకపోవచ్చు: కాని సాహిత్యంలో సమాధానం ఇవ్వటం, ఇవ్వలేకపోవటం అనేది ప్రధానం కాదు. ప్రశ్నలు వేసి, వాటికి సమాధానాలు ఇచ్చేవారు, ఇవ్వలేనివారు, ఉభయులు కూడా సమానమైన ప్రముఖ స్థాన మాత్రమిస్తారు. ఎందుకనంటే ఒక రచన సజీవమైన వ్యక్తి వంటిది. ప్రపంచం వంటిది. అలా సజీవంగా వుండటమే ముఖ్యం. ఈ విషయాన్ని గురించి తర్వాత చెబుతాను. ఏది ఎలా వున్నా రచనలో వుండే శాంతి-ఆందోళన; నిశ్చితా-అనిశ్చితాలు ఆ రచనను సజీవంగాను, ఉద్రూతలూగించేది గాను చేయటానికి సామాగ్రి అవుతాయి. అవి శరీరానికి అవయవాల లాంటివి. దానికి ఈ లక్షణాలే విలువ నిస్తాయి. ఆ రచనకు యథార్థ్యాన్ని ఇస్తాయి. రచన అనేది, ఉదాహరణకు ఒక నాటకం ప్రశ్నలు-సమాధానాలతో కూడిన సంపుటి కాదు. నిజంగా కళాత్మకమైన రచనలో అది వేసే ప్రశ్నలకు సమాధానాలు

దానిలో వుండనే వుంటాయి. ఒక చిత్రంలో ఒక రంగుకి పక్కనవున్న రంగు అర్థమూ, రూపమూ ఇచ్చినట్టు, సంగీతంలో ఒకస్వరం తర్వాత ఇంకొకస్వరం వచ్చినప్పుడు రాగమైనట్టు, రచన కూడా తనకు తానే సమాధానాలు ఇస్తుంది: నాటకంలో ప్రశ్నలు-సమాధానాలు ఆటలో ఆటాడే వారి వంటివి. నిజంగా నాటకమనేది ఒక దానితో ఆట ఆడుతూ వుంటుంది. ఆ నాటకంలో వుండే ప్రశ్నల స్వరూపాన్నిబట్టి, ఆ ప్రశ్నల లోని సత్యాన్నిబట్టి ఆ రచన ప్రాధాన్యత వుంటుంది.

కాబట్టి సాహిత్యరచనలు చేయడానికి కావలసిన స్వల్పవిషయం ఒకే ఒకటి—అది చిత్తశుద్ధి. చిత్తశుద్ధితో కూడిన వాణి బాగా వినపడుతుంది. అంటే చిత్తశుద్ధి కంఠస్వరం పెద్దది. మీ స్వరం వినపడవచ్చు. అంతమాత్రంచేత దానిని వింటారని లేదు. మొదట్లో దానికి ప్రతికూలత వుండవచ్చు. మీరు భావించింది, అనుభవించింది, అంటే మీరు యథార్థమైనది చెప్పినప్పుడు జనం మిమ్ములను నమ్మడానికి ఇష్టపడరు. ఒక్కొక్కప్పుడు సత్యం అతిసాధారణ విషయంగాను, వట్టిదిగాను కనపడవచ్చు: అసలు అర్థం మామూలుగా గోచరించదు. చూడనివ్వదు. జనం దానిని అప్పుడే చూడరు. తరువాత చూస్తారు. నిర్దుష్టమైన సత్యముతో కూడిన యథార్థవిషయము మామూలుకు భిన్నంగా వుంటుంది. అది అసాధారణము. అబద్ధము బజారులో కనబడుతుంది. మిమ్మల్ని అబద్ధాలకోరు అంటే మీరు చిత్తశుద్ధి కలవారని అనాలి. మీరు నిజాయితీపరులైతే, మిమ్ములను దొంగ అంటారు. మీ కేక సాముదాయక దృక్పదానికి ఒక గండి కొడుతుంది. నిన్న నిజమన్నది, కొత్తగా కనిపెట్టామన్నది, నేడు త్రోసివేయబడినా, సాంఘిక-మానసిక ధోరణులు కరుడు గట్టిపోయి, నిర్వీర్యము, నిరుపయోగము అయినవాటికి అంటిపెట్టుకొనడం పరిపాటి అయిపోయింది. ప్రతి దానిని ఎందుకొచ్చిన గొడవని ఆమోదించడం అలవాటు అయిపోయింది. ఇది ముఖ్యంగా విప్లవసందర్భాలలో వ్యక్తమౌతుంది.

తత్వజ్ఞుడు, శాస్త్రజ్ఞుడు తాను తెలుసుకున్న సత్యాలను, తన్ను గూర్చిన వాస్తవాలను తెలుసుకొని ప్రతిపాదించినట్టే, చిత్రకారుడు రచయిత కూడా తన పరిశోధనవల్ల, చిత్తశుద్ధివల్ల తనకు తెలిసినవి, గోచరించినవి ప్రతిపాదిస్తాడు. దీనికి ప్రాముఖ్యము వుండవచ్చు. లేకపోవచ్చు. అయితే ఎలాటిదైనా అది అనుకోకుండ వస్తుంది. ఇరుకున పెడుతుంది. అందుకని మొదట దానిని తిరస్కరించాలని అనుకుంటారు. దానిని తెలుసుకోవడం అనవసర శ్రమ అని, తెలిసిన దానితో తృప్తిపడాలని అనుకుంటారు. ఏదీ తప్పనిసరిగా అవసరమని అనుకోరు. అయినప్పటికి ఆ కొత్తగా వచ్చినది వెనక్కుపోకుండ తిష్ట వేస్తుంది. చివరికి అది చెప్పే దానికి జనం చెవి ఇస్తారు. మీరు చెప్పే దానిలో ఏమి వున్నదో అని చూస్తారు. మొట్టమొదట పెదిమ విరిచి, హేళన చేసి, తర్వాత మీపట్ల శ్రద్ధ చూపిస్తారు. మీరేమి చెబుతారో అని చూస్తారు. తర్వాత అబద్ధమన్నది నిజము అవుతుంది. యథార్థాన్ని మరోదృష్ట్యా రచయిత చిత్రిస్తున్నాడని గ్రహిస్తారు: చిత్రకారుడు కూడా తనేదో కనిపెడుతున్నానని అనుకుంటాడు. కాని

నిజానికి అతను కనుక్కొంటున్నాడు. కనిపెట్టడం—కనుక్కొనడం ఒకే మోస్తరువి: తనలోను, తనద్వారాను ఆవిర్భవించినవని రచయిత అనుకొన్నవి, తమకు కనిపించిన వాస్తవవిషయాలుగా జనానికి కనపడతాయి. అంతటితో వాటిని కాదన లేరు. అవి ముందే తెలుసునన్ని అనుకుంటారు. చాలా ప్రాథమిక మైన, సులభమైన సత్యాలుగా కనబడతాయి. వింతగా వున్నది సామాన్యంగా కనపడుతుంది. అస్పష్టమైనది విస్పష్టమౌతుంది. అసాధ్యమనేది లేదనిపిస్తుంది. రచయిత కనిపెట్టడం మూలాన కనుక్కోవడం జరిగిందనేది చెల్లదనడానికి వీల్లేదు:- అది జనం మనస్సుల్లో జీర్ణించి పోయింది. కొత్తగా కనపడేది మరుగుపడిపోయిన పాతదే, కొత్త వెలుగులో కనపడుతున్నదని అంటారు: కనపడకుండావున్న ప్రపంచం తిరిగి కనపడిన దంటారు.

ఆ తర్వాత అది బజారుసరుకల్లే కనపడేటంత మామూలై పోతుంది: రచయిత ప్రత్యేకంగా సాధించినదానిని గురించి, దానిని వివరిస్తూను కొల్లకొల్లలుగా వ్యాసాలు వ్యాఖ్యానాలు వస్తాయి. ఆయన వ్రాసిన దానిని పరిశీలించి తిరస్కరించడం జరుగుతుంది. ఆయన చెప్పవలసింది చివరదాకా చెప్ప లేదని ఒకరు అంటారు. అలా నడిపించవలసిందని, లేకపోతే, ఇలా నడిపించవలసిందని ఒక విమర్శకుడు అంటాడు. ఆయా విమర్శకులు దానికిచ్చే అర్థాన్ని బట్టి ఇలా అనడం జరుగుతుంది.

నేను వ్రాసిన దానికంటె, నా మీద వ్రాసినది ఎక్కువ. నా ధారణాశక్తి పటుత్వమైనదైతే నన్ను గురించి వ్రాసిన పుస్తకాలను ఆధారం చేసుకొని డాక్టరేట్‌కు కావలసినంత గ్రంథాన్ని తయారు చేయగలను. అంతకంటే విశేషం ఆ వ్యాఖ్యాతల సాంఘిక-మానసిక తత్వాంపైన కూడా ఒక గ్రంథాన్ని తయారు చేయగలను. అంటే ఒక విధంగా ఒకరి రచన స్వరూపాన్ని మార్చి వేయటం జరుగుతుంది. అసలు అసలు రచనే కాకుండా పోతుంది. [ఆ పుస్తకం ఆ పుస్తకంగానే వుంటే ఎలా వుంటుంది?] అది ఇతరులు అన్నట్టుగానే వుండి పోతుంది. దానిని విమర్శించే విమర్శకుని గురించి నాకు ఇదివరకే తెలిసి వుండినా, అతను ఏ పత్రికకు వ్రాస్తాడనేది తెలిసినా, అతనికి ఆ పుస్తకం అంటే వ్యక్తిగతంగా ఇష్టమైనా-అయిష్టమైనా, అతను వ్రాయబోయేది నాకు ముందే తెలుస్తుంది. అదే విధంగా, నా రచనను గురించి విమర్శకుని వ్యాఖ్యానంలో కొంత చదివినా, అతని రాజకీయదృక్పథం ఏమిటో తెలిసి పోతుంది. అతని నైతిక మానసిక స్వరూపాన్ని నేను తేలికగా చిత్రించగలను. నా రచన కొత్తదైనా, అది కొత్తదనే దృష్టితో దానిని పరిశీలించరు. పరిశీలించే పద్ధతి అదివరకే నిర్ణయమై పోయివుంటుంది. దానిని భేదించడానికి, భేదించగలిగినంత కొత్తగా బహుశా ఈ రచన లేకపోవచ్చు. అదివరకు అమలులో వున్న పద్ధతులను భేదించగలిగేటంత నవ్యత దానిలో లేకపోవచ్చు. లేకపోతే, కొంతకాలం అయిన తర్వాత ఆ రచన శక్తిని గుర్తించడం జరగవచ్చు.

తన రచనలు వెదజల్లిన ప్రభావాల్ని చూచి, రచయితే ఆశ్చర్యపోతాడు. కాబట్టి ఎంతో ఆనందంగా వుంటాడు. తనచిత్తశుద్ధి నిర్దుష్టమైనదేనా, తాను మోసం చేయలేదా

అని అనుకోవడం మూలాన ఆనందం పొందుతాడు: చిత్తశుద్ధికి, సత్యానికి నవ్యత అనేది చిహ్నమని నేను ఇదివరకే స్పష్టం చేశాను. నవ్యత నిజం. అనుచరణ కృత్రిమం: సాంప్రదాయం సంఘం చేసే కృత్రిమం: ఇతరులు నీకు నేర్పనిదే నిజమైనది. నిష్కలంకమైనది. చిలుకపలుకుకు చిత్తశుద్ధి లేదు. దాని పలుకు దానికి పట్టదు. అది దానికి అర్థం కాదు.

జ్ఞానాభివృద్ధికి నూతనభావం తప్పనిసరి. రచన సాగిస్తున్నప్పుడు తాను వ్రాసేది వ్రాయడానికి, తనకెంత అధికారమున్నదని, అదెంతవరకు సమంజసమని అనుకుంటూ వుంటాడు. ఇతరులు దానిని ధృవపరచడం కోసం వేచి వుంటాడు. అయితే జనులు రచయితపట్ల శ్రద్ధ చూపించినప్పుడు, వారు తన రచనను గురించి అనేది అనడానికి వారికి హక్కు వున్నదా అని కూడా అనుకుంటాడు. ఇతరులకు నీ ఆంతర్యం చెప్పుకోనడానికి వ్రాస్తావు: కాని అలా చెప్పుకున్నందుకు తరువాత నీమీద నీకే కోపంవస్తుంది. తను వ్రాసిన దానిని వారు అపార్థం చేసుకున్నారనడం కంటె, స్వలాభాపేక్షతో, తమ ఆశయ సిద్ధికి సాధన సామగ్రిగా ఉపయోగించుకొనడం కోసం, తమ నైతిక-రాజకీయ విశ్వాసాల సమర్థన కోసం చిత్రాలుగా ఉపయోగిస్తారని రచయిత అనుకోవచ్చు; నిష్కపటం అంటే నవ్యత అంటే పరిశుద్ధత—ఇవి ఒక రచనయొక్క విలువకు చిహ్నాలు. ఆవిధంగా ప్రగాఢమైన తన విషయపరిశీలనలో శిల్పి విషయంతో తాదాత్మ్యం పొందుతాడు. సనాతనుడు, నవీనుడు అవుతాడు. అంటే శాశ్వతస్థాయిని అందుకుంటాడు. ఎరిగినవాడు అవుతాడు. ఎరుగనివాడు అవుతాడు.

విమర్శ విలువ విషయంలో కూడా ఇదే నిజం. నేను అవలంబించే విమర్శా పద్ధతుల సామాన్యలక్షణాలను చూపనంతవరకు విమర్శ అనేది అంగీకారయోగ్యం. తన ప్రమాణాలను విస్మరించకుండా వాటిని నిరంతరం పరీక్షిస్తూ విమర్శకుడు, ఒక రచనను నిష్పాక్షికమైన, శుద్ధమైన దృష్టితో వ్యాఖ్యానించినట్లయితేనే, అది ఉత్తమమైనది అవుతుంది. రచయిత పూర్తిగా పాక్షికదృక్పథానికి ప్రతినిధి అయినప్పుడు, విమర్శకుడు పూర్తిగా నిష్పాక్షిక దృక్పథానికి ప్రతినిధిగా వుండ కూడదేమో నాకు తెలియదు. తిరస్కారభావంతో వుండే విమర్శకుడు చెడ్డవాడు. అతను తాను విమర్శించే రచయితకంటే అధికుడనని అనుకుంటాడు. తన గొప్పతనాన్ని ప్రదర్శించాలని అనుకుంటాడు. విద్యార్థిపట్ల ఉపాధ్యాయుడు ప్రదర్శించే వైఖరిని కాక, విద్యార్థి వైఖరిని విమర్శకుడు ప్రదర్శించాలి.

తిక్కన రచనా కాలము

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి

నేను ఆగష్టునెల 'భారతి' లో వ్రాసిన విషయములో తిక్కన రచనా కాలమును గుఱించి శ్రీ దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డిగారు సెప్టెంబరు భారతిలో కొన్ని సంశయములను లేవనెత్తి వానికి నివృత్తి కోరిరి. వెంటనే వ్రాయుటకు ప్రారంభింపగా ఏవేవో నూతనాంశములు స్ఫురింపసాగినవి. మరల నొకమారు ఆయా శాసనములను చూచుకొని ఇదే శ్రీ రెడ్డిగారికి సమాధానము వ్రాయుచున్నాను.

(1) విజయాదిత్యుడు విజయగండ గోపాలుడు.

'అల్లుందిక్క' లేక అల్లు తిరుకాళదేవ 'మహారాజునకు తమ్ముడు విజయాదిత్య మహారాజని నెల్లూరి శాసనములలో కనబడినందున, విజయాదిత్య గండగోపాలు డితడే యనియు, వీరిరువురునే 'తిక్కన బయ్యనలు' గా నుందురేమో యనియు నేను ప్రతిపాదించిన దానిని ఆక్షేపించి శ్రీ రెడ్డిగారు 'అట్లనుటకిని తలంప వీలులేదని కందుకూరు తాలూకా పెంట్రాల శిలాశాసనము (నెల్లూరు శాసనములు, కందుకూరు 62) శాసించుచున్నది' అని వ్రాసి ఆ శాసనము నుండి 'శ్రీ మన్మహా మండలేశ్వర ఇమ్మడి గండ గోపాళ విజయాదిత్య మహారాజులకు రాజ్యాభివృద్ధి ....' (సం 2 పు. 60) అని ఉదహరించినారు.

'వీడు వాడే' అని శాసనములలో వ్రాసిపెట్టి యుండునా? అట్లుండిన ఎట్టి కష్టమును లేదు గదా. మన పరిశోధన ఎందులకు ? మనము చారిత్రక పునర్నిర్మాణమును గుర్తింప వలసి యున్నది. అందులకు నా యుపపత్తులను నేను చూపితిని. ఈ శాసనమును ప్రమాణముగా గ్రహించి శ్రీ రెడ్డిగారు కాదనుచున్నారు. కాదనుటకు ఈ శాసనము బొత్తిగా చాలదు. పూర్తి శాసన మిదిగో—(సం 2 కందుకూరు శా. 62. పుట 60. అని అచ్చు తప్పు. పుట 599)—"శ్రీ శుభవ రుషంబులు ౧౧౭౧ అగునేంటి రవుద్ది సంవత్సర చైత్రశుద్ధ ౫ గురువారాన శ్రీ మన్మహా మండలేశ్వర ముక్కంటి కాడెట్టు వంశావతారులైన అందులూరి విజయదిత్త దేచిని మనుమండు మధుసూదనదేవ మహారాజు శ్రీ మన్మహా మండలేశ్వర ఇమ్మడి గండ గోపాళ విజయాదిత్తదేవ మహారాజులకు రాజ్యాభివృద్ధిగాను శ్రీమంతు వేదమార్గ ప్రతిష్ఠాచార్యులైన మార్గము పహిండిముక్కల వీర తిరువెంగళ కుమారుని పురుషకారాన మార్గ నారాయణ పెరుమాండ్ల పురోహితులకు వెలిగండ్లయిన మార్గ నారాయణపురము అగ్రహారము అచంద్రార్కముగా నిస్తిమి."

దీనినిబట్టి ఏమి తేలుచున్నది ? ఇమ్మడి విజయాదిత్య గండగోపాలుడను రాజు ఆ కాలమున పాలించుచుండెనని మాత్రమే గాని ఇక నేమియు కాదుగదా. అట్లనుటకిని తలంప వీలు లేదు' అని దీనినిబట్టి ఎట్లు వ్రాయగలరు ? మఱియొకని సోదరుడనియో, లేక అట్టి భావమునకు ఏదైన ఆధారమో దొరికిన గదా. లేదే ! దీనినిబట్టి నేను కావించిన నిర్ణయమునకు ఎట్టి బాధకమును లేదు. ఇది రౌద్రి (క్రీ. శ. 1260) సంవత్సరముది గదా, నేనుదాహరించిన శాసనము అంతకు చాల ముందుది, ప్లవంగ (1247—48) రావూరు (20). అన్న పాలించుచుండగా నీతడు యువరాజు, ఇప్పుడు పండ్రెండేండ్ల తర్వాత రాజు. ఇందులో అన్న పేరెట్లు కనబడును ? అల్లుందిరుకాళత్తి దేవుడు గండగోపాల బిరుదాంకుడుగదా, తమ్ముడు ఇప్పుడు రాజై, ఇమ్మడి గండగోపాలుడగుటలో నాశ్చర్యమేమి ?

మఱియొక విషయమును గుర్తింపవలెను. మొదటి తిక్కరాజు గండగోపాల బిరుదాంకుడు గదా, అల్లుం దిక్కరాజు కూడ గండగోపాల బిరుదాంకుడే గదా, అటు తర్వాతివాడైన ఈ విజయాదిత్యుడు ఇమ్మడి గండగోపాల బిరుదెట్లు తాల్చినాడు ? ఇతడు మూడవవాడుగా గదా కావలెను. లేకపోయిన ఇతనికి ముందొక విజయాదిత్య గండగోపాలు డుండెనా ? కావ రాదే ! కాబట్టి అల్లుం దిక్కరాజు నుండియే లెక్కపెట్టుకొని తన్ను ఇమ్మడి గండగోపాలుడని చెప్పించుకొన్నాడు.

శాసనములను పరికింతము— (K. V. 38) క్రీ. శ. 1227—28 మొదటి తిక్కరాజు 'గండగోపాల తిరుకాళదేవ చోడరాజు' అనబడెను. (K. V. 45) 1229—30 లో మరలనట్లే తర్వాత కొన్ని శాసనములలో 'మధురాన్తక పొత్తపి

చోడచేరియున్నది. ఇట్లే 1243 వఱకును పెక్కు శాసనములు కనబడుచున్నవి.

ఉదయగిరి 3 లో (క్రోధి) 1244—45 లో అల్లుం దిక్కరాజు పట్టి అల్లుడు మాత్రమే. తన రాజ్య సంవత్సరములను బిరుదును చెప్పుకొనలేదు. శాసనమందలి దీర్ఘ బిరుదావళి మామగారిది. అట్లే ఉదయగిరి 14లోను (1245-46) మామ బిరుదావళియే. ఆత్మకూరు 7, (1246—47) లోను అంతేగాక తన్ను గతించిన విషయమును తాను కాంచీపురమున రాజుగా నున్నట్లును. తన మామ కాంచీపురాధీశ్వరుడైనట్లు పైవానిలో పేర్కొని ఇందులో తాను కాంచీపురవరాధీశ్వరుడని వ్రాసికొనుట విశేషముగదా—"స్వస్తి సమస్త (ప్రభు) నామాంక మాది (వి) కా ప్రశస్తి సహితం శ్రీమను మహా మండలేశ్వర అల్లు తిరుకాళదేవ మహారాజు కాంచీ పట్టణంబున సుఖసత్కథా వినోదంబుల రాజ్యంబు సేయుచుండి తమ మామ తిరుకాళదేవ మహారాజులకు పుణ్యముగాను, తమకు ఆయురారోగ్యైశ్వర్యాభి వృద్ధ్యర్థముగాను శ్రీ అత్మ్యారిసోన ...." ఇందులో గండగోపాల బిరుదు కానరాదు. గూడూరు 77 శాసనమును తన మూడవ సంవత్సర మున్నాడు గాని శకసంవత్సర మీయలేదు. ఇందులో అల్లుం దిక్కరాజు గండగోపాలుడే. కాగా నేమి తేలుచున్నదనగా మొదటి తిక్కరాజు గతింపగానే అతని కుమారుని త్రోసిరాజని అల్లుడు తిక్కరాజు తాను రాజై తత్సూచకమైన గండగోపాల బిరుదమును ధరించెను. ఆ తరువాత 1247—48 (రాపూరు 20) లో తమ్ముడు విజయాదిత్యుడు మహారాజని పేర్కొనబడియున్నాడు. ఇచ్చట తమ్మునికి గండగోపాల బిరుదుండుటకు అవకాశము లేదు. ఏలయన అన్న రాజుగా నున్నాడు.

ఇక మిగిలియున్నది మనుమసిద్ధి చరిత్ర. అతడు మొదటి తిక్కరాజు కుమారుడు గదా, అతని గతి యేమైనది ? ఇతని మొదటి శాసనము రాపూరులోనే (53) కలదు. తారీఖు క్రీ. శ. 1243—44, తమిళము— "స్వస్తి శ్రీ. శుభం. . . శ్రీ మన్మహామండలేశ్వరన్ మధురాన్తక పొత్తప్పిచోళనాన తిలక నారాయణన్ మనుమ శిత్తరశన్ మహారాజ్యత్తిలే. . . ." దీనికి తర్వాతి కాలముదే అల్లుందిక్క ఉదయగిరి శాసనము. రాపూరు నెల్లూరికి దక్షిణము, ఉదయగిరి ఉత్తరము. దాదాపు ఏక కాలములో ఇరువురును రాజ్యములో రెండు ప్రాంతములలోను తమతమ యధికారములను ప్రకటించుకొన్నట్లున్నారు. తర్వాత అల్లుందిక్క దేశమును ఆక్రమించుకొని కాంచీపురమును రాజధానిగా చేసికొన్నట్లున్నాడు. ఇది ఆత్మకూరు 7, 1247 వలన స్పష్టము గదా. ఇతని రాజ్యము, ఈ శాసనము వలన కంచి నుండి ఆతుకూరు (నేటి ఆత్మకూరు) వఱకు వ్యాపించి యుండెనని తెలియుచున్నది. క్రీ. శ. 1243—44 లో మనుమసిద్ధి యుండిన రాపూరులో క్రీ. శ. 1247—48 లో విజయాదిత్యుడున్నాడు. రాజ్యము ఇప్పుడు అల్లుందిక్క రాజుది. (శ్రీమతు అలుతిరుకాళదేవ చోడ రాజ్యంబున శ్రీమతు ఆ రాజు తమ్ముండు విజయాదిత్య దేవచోడ మహారాజులకు. . . .) దీనిని బట్టి మనుమసిద్ధి తన రాజ్యమును పోగొట్టుకొనెనని స్పష్టము గదా.

మతి యీనాడెచ్చటికి పోయినాడనగా, కడపలో క్రీ. శ. 1249లో (V R I నె 812) ఒక శాసనము మనుమసిద్ధి తన తండ్రి రోగము నుండి విముక్తుడైనందులకు దానము చేసినట్లున్నది. ఇందలి తారీఖు కొంత సందేహాస్పదము. పరిశీలనార్హము. ఒకటి నిశ్చయము, మనుమసిద్ధి తండ్రి తిక్కరాజు చివరి దినములలో వ్యాధిగ్రస్తుడై యుండినట్లును, అతడు గతింపగా, కుమారుడు చెంత నుండెనో లేదో, తెలియదు గాని, అల్లుడు మాత్రము మామకు పుణ్యముగా దానము లొసరించి రాజ్యమును హరించెనని స్పష్టము.

ఈ తర్వాతను మనుమసిద్ధి శాసనములు నెల్లూరిలో కాన రావు. అల్లుందిక్కరాజు ఎంతకాలము పాలించెనో తెలియదు గాని ఇతని చివరితారీఖు క్రీ. శ. 1248—49గా కనబడుచున్నది. ఇందులకు తోడు ఇమ్మడి గండగోపాలుని (విజయాదిత్యుని) శాసనములు అతని రాజ్య వత్సరములలో నుండుట చేత, అతని ప్రారంభకాలమును సులువుగా నిర్ణయింపవచ్చును. ఇతని 29వ సంవత్సరము క్రీ. శ. 1278—9 (నందలూరు శాసనము A R నెం 423 of 1911). దీనిం బట్టి మొదటి సంవత్సరము క్రీ. శ. 1249—50 అగుచున్నది. అట్లే గూడూరు పల్లాం శాసనములు (69) 21వ సం. (74) 21వ సం (75) సం. (80) 27వ సం. (116) 19వ సం. ఇందులో నీతనికి 'త్రిభువన చక్రవర్తి' యనియు 'చిత్రమేళ' యనియు బిరుదులు. వీనిం బట్టి ఇతడు తన యన్న అల్లుందిక్కరాజు గతించినది మొదలు తన రాజ్య సంవత్సరములను లెక్కించుకొన్నాడనుట నిశ్చయము. తన యన్న గండగోపాలుడగుట చేత తాను ఇమ్మడి గండగోపాలుడని చెప్పుకొని మొదటి తిక్కరాజును లెక్కపెట్టలేదని తెలియుచున్నది గదా. ఈ యిరువురును మామగారి రాజ్యమును తాము అపహరించి మనుమసిద్ధిని . . . తాము అనుభవింప పోరని ఇంతకన్న వేఱు ప్రమాణము కావలయునా ? విజయాదిత్యుడు తన పేరులోని 'విజయ' కూడ చేర్చుకొని 'విజయగండగోపాలు'డైనాడు.

ఈ తిక్కరాజును విజయాదిత్యుడును తిక్కన బయ్యనలై యుండుటనియు, వీరిని తర్వాతి కావ్యకర్తలు పొరపాటున దాయాదులని వ్రాసియుండు రనుటలో తప్పే లేదు. అల్లుం దిక్క విజయాదిత్యులే తిక్కన బియ్యన లనుటకు ఎంత మాత్రము సందేహింప నక్కఱలేదు. ఇందులకు ఇంకను ఈ కాలమున, మనుమసిద్ధి తర్వాతి చరిత్ర తోడుపడుచున్నది.

మనుమసిద్ధి యొక్క ప్రవాసము

అల్లుందిక్కరాజు కాలముననే యాతడు నెల్లూరి రాజ్యమును వదల వలసి వచ్చెను. గద్యా. క్రీ. శ. 1243—44

తిక్కన రచనాకాలము

ప్రాంతమున నెల్లూరులోని రాపూరులో నుండిన యీతడు 1249లో కడపకు చేరుకొన్నాడు గదా. అంతకు ముందుండియే యీతడు దేశ సంచారము చేయుచుండె ననుటకు క్రీ. శ. 1239లో గుంటూరు జిల్లా పువ్వాడ (సత్తెనపల్లి తాలూకా) మహేశ్వరుని కీతడు దానమిచ్చినట్లు కలదు (247 of 1934 - 35). ఇందువలన నీతడు తండ్రి జీవిత కాలమందే అల్లుండ్రచేత తఱుమబడెనా యని సందేహము కలుగుచున్నది. ఆ రాజు చివరి దినములలో వ్యాధిగ్రస్తుడైనట్లు కూడ తెలియుట చేత ఏదో అంతఃపుర విద్రోహము జరిగి యుండవలెను. రాపూరు శాసనము వలన, గుంటూరిలో 1239లో నుండిన యీతడు 1243 - 44నకు మరల తన మండలమునకు వచ్చి, అట్లు తర్వాత కడప మండలమునకు పోయి యుండును. కడపలోనే గాక ఇతడు 1249లో వినుకొండలో కూడ నుండినట్లు శాసనములు దొరికి యున్నవి. (338 of 1934 - 35) ఇది ములకలపాడులో దేవదానము. కాబట్టి 1249కి చాలా ముందే, ఇది అల్లుండిక్క రాజు మూడవ సంవత్సరము కాబట్టి 1249 - 3 = 1246 నాటికే, అనగా తండ్రి గతించిన తర్వాతనే దేశాంతరగతుడాయె ననియు, నాటి నుండి నెల్లూరి రాజ్యము అల్లుం దిక్క రాజు పాలనలో పడిన దనియు విశదము.

క్రీ. శ. 1249వ సంవత్సరమున నెల్లూరి చరిత్రలో పెక్కు విశేషములు జరిగినట్లున్నది. ఒకవైపు విజయగండ గోపాలుడు రాజ్యమునకు వచ్చినట్లు దగా, కాకతీయ గణపతి దండయాత్ర కూడ ఆ సంవత్సరమే జరిగినట్లున్నది. కాకతీయ సేనాధిపతి సామంత భోజుడను నాతడు కంచిని 1449లో తాకెను. (IA, XXi పుటలు 197 నుండి) ఈ సామంత భోజుని శాసన మొకటి కాళహస్తిలో కూడ నున్నది. ఈ కాలమున గణపతి చక్రవర్తి దక్షిణదేశ దండయాత్ర ఎందులకు వచ్చెనో మనకు సిద్ధేశ్వరచరిత్ర వలన తెలియుచున్నది. తిక్కన బయ్యనలను లేటివి మనుమసిద్ధికి నెల్లూరి రాజ్యము నిప్పించుట కొఱకే గదా. మనుమసిద్ధి గణపతి సాయమపేక్షించెనని తర్వాతి కాలపు సిద్ధేశ్వర చరిత్రయే గాక సమకాలిక శాసనములును చెప్పుచున్నవి. (1) మనుమసిద్ధి నందవారు శాసనము, క్రి. శ. 1257—58 నాటిది (AR 580 of 1907) ఇట్లు చెప్పుచున్నది.

''యస్సాహాయ్యం విధిత్సుః గణపతి నృపతేః స్వేచ్ఛయా సంగరాగ్రే గోదావర్యాం సరితి నృపతిః చర్మయష్ట్యా విస్రృత్య కాళింగం స్వాన్కళింగా నభిముఖ మకరో దేవ వీరస్తు దానీమ్''

ఈ గోదావరీ సంగర మెప్పుడు జరిగినదో గాని మనుమసిద్ధి స్వకార్యసిద్ధికై గణపతిని ఎంతగా ఆశ్రయించెనో, ఎట్టి స్నేహము సంపాదించెనో తెలియుచున్నది. తిక్కన పోయి భారతమును పఠించి గణపతిని ప్రార్థింపగా, మనుమసిద్ధి గణపతి సైన్యమునకే సేనాధిపతిగా నుండి కాళింగులను జయింపగా; గణపతియే బయలుదేరివచ్చి తిక్కన బయ్యనలను జయించినట్లు, చెప్పుటకు గణపతి నాయుని వల్లి శాసనము, తారీఖు లేనిది, సాయపడుచున్నది. — ''మహా మండలేశ్వరులైన కాకతి గణపతిదేవ మహారాజులు దిగ్విజయము సేసి పర మండలములు సాధించి దక్షిణ దిగ్భాగమున నెల్లూరు గాల్చి తద్విరోధులైన పడిహారి బయ్యన తిక్కనల వెరపిసి శాత్రవ శిర బాలుం గందుక క్రీడా వినోదము సలిపి ద్రవిళ మండలమున కులోత్తుంగ రాజేంద్ర చోడనిచ్చికొని నెల్లూరిరాజు చేత ఏనుంగులం గానికగొనివచ్చి. . . ''దీనింగూర్చి వివరముగా చర్చించి, రాజేంద్ర కులోత్తుంగ చోడదేవుడెవడు, అతనిని ఏల గణపతి ద్రవిళ మండలమున పట్టవలసి వచ్చెను, ఈ తిక్కన బయ్యనలకును అతనికిని ఎట్టి సంబంధము కలదు అను విషయమును గూర్చి శ్రీ నేలటూరు వేంకట రమణయ్యగారు, తరణ, మాఘ భారతిలో 'కాకతి గణపతి దేవుడు— కులోత్తుంగ రాజేంద్ర చోళుడు' అను వ్యాసమును వ్రాసియున్నారు. సిద్ధేశ్వర చరిత్ర సోమదేవ రాజీయముల భేదములను గుర్తించుచు, తిక్కన బయ్యనలు 'సిద్ధిరాయని పాఱదోలి' అని పైదాని యందును 'పట్టి యునిచి' అని దానికి ప్రత్యక్ష విరుద్ధముగా తర్వాతి దాని యందును, 'దాయాదు' అనుమాట యుదాహృత సిద్ధేశ్వర చరిత్ర గ్రంథ భాగమున కానరాదు, అన్యత్ర కానవచ్చునేమో' అనియు హెచ్చరించి యున్నారు. అక్కన బయ్యనలే తిక్కన బయ్యనలను నిర్ణయమునకు వారు మఱియొక విధమున వచ్చిరి. పైగా వీరు మనుమసిద్ధికి దాయాదులు కారనియు, శాసనమును బట్టి 'పడిహారులు' (ప్రతీహారులు) అనియు తెలియుచున్నది గదా. పై శాసనమందు కులోత్తుంగ రాజేంద్ర చోడ డొక్కడే యుండగా సిద్ధేశ్వర చరిత్ర యందు వెలనాటిని గెల్చిన తర్వాత నెల్లూరికి వచ్చినట్లును, సోమదేవ రాజీయమందు 'వెలనాటి ధరణీపతుల' అనియు నుండుటను గుర్తించి, ''సిద్ధేశ్వర చరిత్ర వెలనాటి ధరణీశ్వరు డొక్కడనియే తెలుపుచుండగా సోమదేవ రాజీయము 'ధరణీపతులు' 'వారల' 'అంఱ'ని పెక్కుఱు వెలనాటిపై ప్రభుత్వము నల్పుచుండినట్లు చెప్పుటకు గారణము విశదముగాదు'' అని పరిశీలించి తుదకు ఈ నిర్ణయమును చేసినారు. ''పై మూడు అంశములందు తప్ప తక్కిన తావుల నీరెండు గ్రంథములకును భేదము గానరాదు. తక్కిన విషయమంతయు రెంటికిని సామాన్యమే. వీనియందుక్తమైన విషయము సత్యమనియు జరిత్రాత్మక మనియు గణపతిదేవుడు వేయించిన నాయనివల్లి శిలాశాసనము రుజువు సేయుచున్నది. శాసనములోని బయ్యన తిక్కనలే సిద్ధేశ్వర చరిత్ర సోమదేవ రాజీయములందు బేర్కొనబడిన యక్కన బయ్యనలు. తిక్కనకు బదు లక్కనయని పేరు ప్రమాద వశమున గ్రంథస్థమైనది. బయ్యన తిక్కన శాసన నామక్రమము గ్రంథములందు అ(తి)క్కన బయ్యనలని తారుమారైనది. ఇవి యంతగ పాటింప దగిన యంశములు గావు. మిగిలిన విషయములు గ్రంథముల యందుండునవియే శాసనములందును గానవచ్చుచున్నవి.'' (భారతి— తారణ మాఘమును పుట 164).

తర్వాత వెలనాటి చరిత్రను చర్చించి, కులోత్తుంగ రాజేంద్రచోడుని గుర్తించి, వెలనాటి పృథ్వీశ్వరుని తిక్కరాజు చోళచక్రవర్తి సాయమున చంపి 'చోళ చక్రవర్తి ప్రాసాదమున ఏలువ గుంటూరు మున్నగు రాష్ట్రములను స్వాధీనపరచుకొనెననియు వ్రాసిరి. పై జేర్కొన బడిన విషయముల నన్నిటిని పర్యాలోచనము జేసి చూడగా నెల్లూరు తెలుగు చోళరాజులు చోళచక్రవర్తియనుగ్రహమును బొంది తత్పూర్వము వెలనాటి రాజుల పాలనయందుండిన గుంటూరి ప్రాంత దేశమును దమ యధికారము క్రిందికి దెచ్చుకొనిరని తోచుచున్నది. (పుట 55) పార్థివ జ్యేష్ఠము). . . 'పృథ్వీశ్వరునికి తర్వాత. . . పోయిన రాజ్యమును మరల ప్రతిష్ఠ సేయ దలపెట్టిన వారిలో ప్రముఖుడు కులోత్తుంగ రాజేంద్రుడు చోళుడు. . . ఇతడు కంచి పర్యంతము గల దేశముపై క్రీ. శ. 1230 ప్రాంతమున నొకమారును, 1256 ప్రాంతమున నొకమారును రెండు పర్యాయములు దండు వెడలి పోయినట్లు తెలియవచ్చుచున్నది. (అషాఢము పు. 57). . . వెలనాటి రాజులకు గాకతీయులతో నొక ప్రక్కను, నెల్లూరు తెలుగు చోళులతో మఱియొక ప్రక్కను తరతరముల నుండియు వైరము గలదు. . వారి రాజ్యమున పశ్చిమ భాగము తెలుగు చోళుల యధీనమున నుండెను. వెంగి మండల మ్మంతయు కాకతీయులు కబళించిరి. (పుట 65). . ముమ్మడి కులోత్తుంగ రాజేంద్ర చోళుడు. . . పోయిన రాజ్యమును మరల సంపాదించుకొనుటకు దన కుల క్రమాగత శత్రువులైన కాకతీయులకును, నెల్లూరు చోడులకును శత్రువైన కళింగ భూపాలుడగు ముమ్మడి యని యంకభీమ నాశ్రయించి యతని వెంబడి ద్రావిడ దేశమునకు బోయెను. కాని హొయ్యల చోళ నెల్లూరు చోళ సైన్యము లేకీభవించి యుద్ధము సేయగా నెదుర్కొన జాలక పరాజయమునంది కళింగ సైన్యములతో గూడ వెనుదిరిగి స్వదేశమునకు బోయి చేరెను.'' (పుట 67)

నాయనిపల్లి గణపతి శాసనములో తారీఖు లేదుగాని ఈ విషయములు ఎప్పుడు జరిగినవో ఒక విధముగా ఊహించుటకు అవకాశములు గలవు. ఇంతఃఋకు చూడగా నిర్వచనోత్తర రామాయణ దశకుమార చరిత్రలలో గణపతి ప్రసక్తముగా తిక్కన బయ్యనల సంగతి గాని ఏదియు లేక విజయుని మాత్రము గెలిచినట్లుండుట వలన, క్రీ. శ. 1243కు తర్వాత, తండ్రి మరణానంతరము మనుమసిద్ధి రాజ్యమునకు రాగా ఆతనిని తిక్కరాజును విజయాదిత్యుడును దాక్షిణాత్యులు సాయమున నెదుర్కొనగా మనుమసిద్ధి వారిని ఎదుర్కొని 'ప్రాయేఱు' ఏటికు తటిని విజయము గాంచెను. తర్వాతనే బయ్యనలు క్రీ. శ. 1244-46ల నడుమ రేగి నెల్లూరిని ఆక్రమించిరి గదా. కాబట్టి క్రీ. శ. 1243లో మనుమసిద్ధి రాజ్యమునకు వచ్చి విజయాదిత్యుని ఓడించి మరలివచ్చి, రాజ్యము పూర్తిగా నష్టమై పోయి తాను విదేశాంతరగతుడగుటకు ముందు, అనగా క్రీ. శ. 1243-46 మధ్యకాలమున నిర్వచనోత్తర రామాయణమును అంకితము పందియుండును.

ఈ మధ్యలో దీనికి తర్వాత కేతన దశకుమార చరిత్రను తిక్కన అంకితమంది యుండును. క్రీ. శ. 1246కు ముందే ఈ గ్రంథములు ఒచన యని ఇప్పుడు దృఢముగా చెప్పవచ్చును. తిక్కన గంగని జయించుట 'మహారాష్ట్ర సామంత సాంగుం దోరి తురంగముంగొనుట'యు ఈ కాలమందే అని నిశ్చయింప వలయును. తర్వాత అల్లుందిక్కరాజు ఆతని సోదరుడును బలపడి క్రీ. శ. 1246నకు కొంత ముందు, ఆవుగా మనుమసిద్ధి కాకతీయుల నాశ్రయించి వారి సాయముతో క్రీ. శ. 1249 నాటికి మరల నెల్లూర పునరభిషేకమునుం జేసికొనెను. తిక్కన బయ్యనలకు వెలనాటి కులోత్తుంగ రాజేంద్రుని యొక్కయు కళింగరాజు అని యంకభీమని సాయమును కలిగినట్లు తెలియుచున్నది. వెలనాటిని జయించి కులోత్తుంగ రాజేంద్రుని గణపతి ద్రవిడ దేశమందు పట్టుకొనగా కళింగులను గోదావరీ తీరమందు మనుమసిద్ధి ఓడించెనని ఆతని నందలూరు శాసనమువలన తెలియుచున్నది గదా. క్రీ. శ. 1249 నాటికి గణపతి దక్షిణదేశమున నుండినట్లు ఆతని శాసనముల వలన తెలియుచుండగా సరిగా ఆ కాలమునకే అల్లుం దిక్కరాజు శాసనములు ముగియుట చేత తిక్కరాజు గతించి బయ్యన విజృంభించిన కాలమున, అదనుచూచి, కాకతీయులు ఎత్తివచ్చిరని తలంపవలెను. పైగా నాయనిపల్లి శాసనమునందలి వ్రాత ననుబట్టి తిక్కన బయ్యనను గణపతి చంపెనని తలంచుటకు లేదు. శాసనమున 'తద్విరోధులైన వదిహొరి బయ్యన తిక్కనల వెరసిన శాత్రవశిరంబులం గందుక క్రీడా వినోదమ్ము సలిపి' అని యున్నది. విజయాదిత్యుడు తర్వాత బ్రదికియే యున్నాడు. తిక్కరాజు లేడు. తిక్కరాజు ఈరణమందే గతించెనో లేక తత్పూర్వమే గతించెనోగాని శాసనము ప్రకారము వీరిని వెరసిన (=చేరిన) శాత్రవుల శిరంబుల నని గ్రహించుట యుక్తము.

తిక్కన బయ్యనలను గుఱించి వ్రాయుచు శ్రీ చాగంటి శేషయ్యగారు త్రోవగుంట శాసనము నుదాహరించి (నెల్లూరు జిల్లా, ఒంగోలు తాలూకా, నె.శా. సం. 1125 పుట) శ్రీ మన్మహామండలేశ్వర బయ్యన మహారాజ చినబయ్యన మహారాజులను చూపినారు. శాసనమందు తారీఖు లేనందున 'వీ రెవ్వరో ఏ కాలమువారో, మనుమసిద్ధికిని వీరికిని సంబంధమున్నదో లేదో చెప్పజాలము' అని వ్రాసినారు. (ఆం. క. త. 2 సం. పు. 218) తిక్కన బయ్యనలు గాక బయ్యన చినబయ్యన లనుట చేతను, నాటి రాజకీయములలో వీరి పాత్ర లేవో తెలియ నందునను తిక్కన బయ్యనలను వీరిని గ్రహించుట సాధ్యము కాదు.

(2) రణ మరణము మనుమసిద్ధిదే.

వీరగండ గోపాలబిరుదము ఏ కోశములోను లేని యీ విజయాదిత్యుడు రణమరణమును 1263 లో పొందినాడని శ్రీ రెడ్డిగారు ఎట్లు ప్రతిపాదింపగల్గిరో నా కాశ్చర్యముగా నున్నది. ఏలయన క్రీ. శ. 1262-63 లో గతించియుండిన

యొడల అతడెట్లు క్రీ. శ. 1278—9 లో తన 29 వ యేట నందలూరిలో శాసనము వేయించి యుండగలడు. ఈతడు మతియొకడనుటకు బొత్తిగా అవకాశము లేదు. తర్వాతి చరిత్రను అరయుదము.

మనుమసిద్ధి విజయాదిత్యులు శత్రువులనుట నిర్వివాదాంశము. తిక్కన సాక్ష్యము త్రోసివేయరానిది గాన దానిం గూర్చిన వివరము అనవసరము. రణమరణ మందినవాడు విజయాదిత్యుడా, మనుమసిద్ధియా యనునదే శ్రీ రెడ్డిగారు లేవనెత్తిన ప్రశ్న. ఈ క్రింది కారణములచేత విజయాదిత్యుడు కాడని నిశ్చయించుచున్నాను.

(1) విజయాదిత్యుడు విజయగండ గోపాలుడుగాని వీర గండ గోపాలుడు కాడు. అట్లనుటకు ఒక్క శాసనముగాని లేదు. 'విజయ' 'వీర' కానేరదు. 'వీర' శబ్ద మాతని బిరుద ములతో కలియలేదు.

(2) మనుమసిద్ధికి "గండగోపాల" బిరుదున్నట్లు శాసనములలో లేదు అని వీరు పెంట్రాల శిలాశాసనముల నుదాహరించి, అందుచేత 'వీరగండ గోపాల విహిత దాహదహన' యన్న సుందరపాండ్యుని చిదంబర శాసన గత బిరుదము మనుమసిద్ధిని సూచించుటలేదని, అందువలన పెంట్రాల శిలాశాసనములలో ఒకదానిలో విజయాదిత్యుని పేరుండుటచేత, చంపబడినవాడు విజయాదిత్యుడని ప్రతిపాదించినారు. చాల పొరపాటు. పెంట్రాల (కందుకూరు తాలూకా) లో నాలుగు శాసనములు మనకు ముఖ్యములు. (1) నెం 60. కాళయుక్తిది. శ్రీ మన్మహా మండలేశ్వర భుజబలవీర మన్మసిద్ధయదేవ మహారాజులు చేసిన దానము (1258—59 ?), (2) నెం. 61, సిద్ధార్థి, ఈ మన్మసిద్ధి 'రాజ్యాభివృద్ధికి' గాను చేయబడినదే (1259—60 ?); (3) నెం. 62 రౌద్రి, శ్రీ మన్మహా మండలేశ్వర ఇమ్మడిగండ గోపాల విజయాదిత్య దేవమహారాజులకు రాజ్యాభివృద్ధి (కి) గాను చేయబడినది. (1260—61); (4) నెం 63. దుర్మతి—'భుజబల వీర మన్మయసిద్ధియ దేవ చోడ మహారాజులకు రాజ్యాభివృద్ధికిగాను' చేయబడినది. ఈ నాలుగింటిలో మూడు మనుమసిద్ధివి. ఒకటే విజయాదిత్యునిది. అట్లని శాసన సంపాదకులే ఇట్లు హెచ్చరించి యున్నారు. పుట. 605. నెల్లూరి శాసనములు. (NoI) "In this series of Pentrala inscriptions ......The appearance of Gandagopala in the course of Vira Manma Siddhaya's reign is not understood."' అని. వారికే సందేహము నాటికే కలిగినది. రౌద్రి శాసనకర్త వేఱని వారికి తోచినది.

ఇది సరియే. ఎందువలన ననగా ఈ నెల్లూరి శాసనములలో ఎచ్చటను మనుమసిద్ధి పేరుతో కలసి గండగోపాల బిరుదము కానరాదు. అంతమాత్రము చేత గండగోపాల బిరుదముగాని మనుమసిద్ధికి లేదని సిద్ధాంతము చేయుట పొర పాటు. పెంట్రాల శాసనోక్త పురుషులు ఇరువురు. ఒకడు మనుమసిద్ధి, రెండవవాడు విజయాదిత్యుడు. మొదటి రెండును మనుమసిద్ధివి, మూడవది విజయునిది. ఇట్లే నాలుగును ఒక్క యూరిలోనే దొరకుట కూడ గొప్ప చరిత్రాంశ మునకే దారితీయునేమో. పైగా 1257—58 లో మనుమ సిద్ధి (గణపతి సాహాయ్యమును కోరుచు) నందలూరిలో నున్నాడు. నందలూరిని కలిపి నెల్లూరిని ఏలుచుండెనో లేక అప్పటి నుండి నెల్లూరిని మరల జయించి వచ్చెనో నిర్ణయింప వలసి యున్నది. క్రీ. శ. 1249 కి తర్వాత మరల నితనికి రాజ్యము పోయినట్లున్నది. 1249—1257 మధ్యకాలమున నీతని శాసనములు పాకనాటిలో కానరావు. ఈతడు 1257 లోనే గాక 1249 లో కూడ నందలూరిలో నున్నట్లు మతి యొక శాసనము (598 of 1907) వలన తెలియుచున్నది. ఇందు మనుమసిద్ధికి 'మధురాన్తక పొత్తప్పిచ్చోళ గండగోపాళ మనుమ శిత్తరశర్' అని స్పష్టముగా నున్నది. నెల్లూరిజిల్లా శాసనములలో లేకపోవుట యొక కొఱత కాదు. పైగా నెల్లూరి శాసనములలో ఈ బిరుదుల నన్నిటిని వదలక పూర్తిగా వ్రాయుట కానరాదు. కొంత అశ్రద్ధ కనబడుచున్నది. మొదటి తిక్కరాజు శాసనములలో కూడ కొన్ని గండగోపాల బిరుదులేనివి కలవు. అతనికి పూర్వ మీ బిరుద మున్నట్లు కానరాదు. అతని తోనే ప్రారంభమైనట్లున్నది. అతని తర్వాతి అల్లుండ్రు తాల్చినారు. కాని ఇంత బాధ ఎందులకు. తిక్కనయే నిర్వచ నోత్తర రామాయణమున సందేహమునకు అవకాశములేని యట్లు వ్రాసినాడు. తండ్రి కొమ్మాళ్ళకు ఇరువురకును గండ గోపాల బిరుదమున్నది. తిక్కరాజును గూర్చి 'రాయగండ గోపాలు ..... దిక్కధరణి విభు ....' (ప్రథ. ఆ. 33) అనియు మనుమసిద్ధిని గూర్చి సప్తమాశ్వాసాంతమున (160 పద్యము) 'ఫలితామర తరు శాఖా తులిత భుజుం ...., రాయగండ గోపాలు డితన్' అనియు తిక్కన వ్రాసినది చాలును. గండగోపాల బిరుదము కుదిరినది. 'వీర' ను చూతము. మనుమసిద్ధికి 'భుజబల వీర' బిరుదమున్నది. విజయాదిత్యునికి 'వీర' ఎచ్చటను లేదు. వీరగండ గోపాలు డొకడు, విజయాదిత్యుడు కానివాడు ఈ కాలమున స్పష్టముగా నుండెనని గూడూరు (మలాం) శాసనము నెం. 67 (N D I) అతని తొమ్మిదవ సంవత్సరమునిది చెప్పుచున్నది. ఇచ్చటనే విజయగండ గోపాలునివి కూడ నుండుటచే ఇరువురు భిన్నులనుట నిక్కము. మొదట 'గండగోపాలుడు' గా నుండి విజయాదిత్యునిమీది పగయు పంత మును అధికరించుకొలది వీరపదము నితడు తాల్చినాడని ఈ శాసనముచే నిర్ణయింపవచ్చును.

ఇందులకు అనుగుణముగానే జటావర్మ సుందర పాండ్యుని శాసనములను చూచినచో కొన్నిటిలో 'గండ గోపాల' యనియు, కొన్నిట 'వీరగండ గోపాల' యనియు కనబడుచునే యున్నది. "హత్వా చేరము పాణ్డ్య హాయ్యళ పతిం విద్రావ్య చోళేశ్వరం జిత్వా కాటక గణ్డగోప గణపత్యాదీన

రాతి నపి వీరసున్దర పాణ్డ్య దేవ నృపతిః కృత్వా తులారోహణం చక్రేతాణ్డ విన శ్మశాంక కలికా చూడస్య హైమీం సభామ్'' [South Indian Inscripsions iv —625, 626, 630). కొన్నిట 'వీర' చేర్చియు, కొన్నిట వదలియు, కొన్నిట 'కాంచీపతి' యనియు నీతని శాసనములలో కలదు. 'వీరగండ గోపాల విపినదావదహన కాఞ్చీపుర వరాధీశ్వర, గణపతి హరిణ శార్దూల, నెల్లూరు పుర విరచిత వీరాభిషేక, ప్రణతరాజ ప్రతిష్ఠాపన' (S. I. I. iv 631) గణ్డగోపాలుని చంపుటచేతనే తాను కాంచీపుర వరాధీశ్వరుడైనట్లు ఇందు స్పష్టము. నెల్లూరినుండి కంచి వఱకు వీరి రాజ్యము కదా. ఈ కాలమున నెల్లూరివారి శాసనములు కంచిలో చాల గలవు. తమిళ శాసనములలో 'వీర' ను వదలి 'కళ్ళర్ గండగోపాలన్' అని కలదు. ఇచ్చట కళ్ళర్ అనగా గండపెండేరమని యర్థము. భాషాంతరీకరణ మొనర్చి వ్రాయుట గమనింపదగినది. ఇందు వలన మనుమసిద్ధి ఎంతటి వీరుడో తెలియగలడు. దీనిని గుఱించి వ్రాయుచు శ్రీ నీలకంఠశాస్త్రిగారు—

'......and it is quite possible that Vira in the Sanskrit expression is not an integral part of the name' అని తమ The Pandyan Kingdom లో (పుట 169) వ్రాసియున్నారు.

పైగా జటావర్మ చంపినది కాకతి గణపతితో చేసిన (వీర)గండ గోపాలుని గదా. విజయగండగోపాలుడు కాకతీయులతో వైత్రి నెఱపిన ట్లెచ్చటను లేదు.

(3) విజయగండ గోపాలుడు క్రీ. శ. 1263 లో చావలేదని ముందే వివరింపబడినది. ఇతని చివరిశాసనము క్రీ. శ. 1232 ది. (A R137 of 1916) ఇతని శాసనములు నెల్లూరు కడప కంచి త్రిపురాంతకములలో గలవు.

(4) సుందరపాండ్యుడు (జటావర్మ) గండగోపాలుని చంపిన తర్వాత నెల్లూరి రాజ్యమును ఆతని తమ్ములకు(సహోదరులకు ?) ఇచ్చెనని యొక తమిళ శాసనము కలదు. (ఇదికూడ చిదంబరము నటరాజాలయములోనిదే. ఎందుచేతనో డిపార్టుమెంటువారు ప్రకటింపలేదు. 'సెందమిళ్' అను తమిళ పత్రికలో ప్రకటింపబడినది.) ఆ వాక్యములు. 'వాక్కియల్ సెందమిழ் సుందర పాండియన్ వాళమరిల్। వీక్కియవన్ కళ్ళర్ గండగోపాలన్నై విణ్ణులకిన్। పోక్కియు పిన్నవన్ తంబియర్ పోఱ్ఱ పురన్దరశ్। వాక్కియ వార్త్తై పదినాలులకము వానదుఃలే॥ ఈ 'తంబియవర్' ఎవరోగాని మనుమసిద్ధికి సహోదరు లుండినట్లు కానరాదు. దాయాదులుగా నుండియుందురు.

(5) క్రీ. శ. 1263 కు తర్వాత ఈ 'తంబియర్' ఎంతకాలము పాలించిరో తెలియదు గాని, కడపటి చోళ చక్రవర్తి మూడవ వీరరాజేంద్రచోళుడు 1268 వఱకు పాలించుచుండెను. ఈతడు మొదటి తిక్కరాజునకును మనుమసిద్ధికిని కూడ సమకాలికుడు. (చూ. నెల్లూరు శా. g 39, 85, 90 u 48) ఆ సంవత్సరము కాకతి రుద్రమదేవి సామంతుడు నాగదేవమహారాజు నెల్లూరిని జయించి పాలింప నారంభించెను. ఐదారేండ్లు పాలించినట్లు తెలియుచున్నది. (నె. శా. A 51, K. V. 48, N 21) క్రీ. శ. 1279—80 ప్రాంతమునుండియు ఈ నాగరాజు కమ్మనాటిలో కనబడుచున్నాడు. ఒంగోలు తాలూకాలో 1280 వఱకు వీతని శాసనములున్నవి. క్రీ. శ. 1278 నాటికి మనుమసిద్ధి కుమారుడు రెండవ తిరుకాళదేవుడు (రెండవ తిక్కరాజు) తలయెత్తినాడు గదా (గూడూరు తాలూకా మడమనూరు శాసనము.) ఇత డెట్లు రాజ్యమునకు వచ్చెనో గాని ఒకటి కనబడుచున్నది. నెల్లూరిని ఇమ్మడి తిరుకాళదేవుడు పట్టుకొన్న కాలమునకు సరిగా విజయగండ గోపాలదేవుడు నందలూరు ప్రాంతమున కాయస్థ రాజ్యముపై దాడి సలిపినట్లు అతని 29 వ సంవత్సరపు శాసనము దొరకియున్నది. (A R 423 of 1911) నెల్లూరుజిల్లాలోని గూడూరు తాలూకాయును, చిత్తూరు, కాళహస్తి, తిరుపతి ప్రాంతములు (అనగా తర్వాతి విజయనగర రాజుల కాలపు చంద్రగిరి రాజ్యము) విజయగండ గోపాలుని స్వాధీనమున నుండినట్లు శాసనము లున్నవి. నెల్లూరులో ఉత్తర భాగము నాగదేవరాజు స్వాధీనమున నుండెను. గదా. దీనినిబట్టి రెండవ తిక్కరాజు గూడూరు, నెల్లూరు ప్రాంత దేశమును పట్టుకొనగానే విజయుడు ప్రతిక్రియగానో లేక తిక్కరాజుయొక్క సహాయులను బాధించుటకో అటు దండెత్తి యుండునని చరిత్రకారుల యభిప్రాయము. క్రీ. శ. 1263 లో మనుమసిద్ధి చావలేదని శ్రీ రెడ్డిగారూహించిరి గదా అట్లుండిన యెడల ఈ కాలమున రాజ్యమును మరల జయించుటకు తాను రాక కుమారుని పంపునా ?

(6) చిరమన శాసనము క్రీ. శ. 1284—85 నాటిది గదా. ఇందలి విజయగండ గోపాలుని నిర్దేశించి శ్రీ రెడ్డిగారు ఇమ్మడి మనుమసిద్ధి క్రీ. శ. 1284—85 వఱకు జీవించియుండెననియు, 'విజయగండ గోపాల మహారాజు రాజ్యమున మఱియొక రాజ్యము స్థాపించినట్లు కలదు.' అనియు, 'విజయగండ గోపాలుని రాజ్యమున (మన్మసిద్ధి మొదలగు) రాజులు యుద్ధము చేసి జయించినట్లు కనబడుచున్నది' అనియు వ్రాసినారు.

ఇదంతయు చారిత్రక విషయములను నెమ్మదిగా సమన్వయపఱచుకొనకపోవుటచే కలిగిన గందరగోళము. ఇచ్చట శ్రీ రెడ్డిగారు బొత్తిగా విస్మరించిన విషయము ఒకటి కలదు. క్రీ. శ. 1278—9 నాటికే రెండవ తిక్కరాజు మనుమసిద్ధి రాజ్యమునకు వచ్చియుండగా, అంతకు ఎంతో ముందే గతించిన మనుమసిద్ధి వచ్చి యుద్ధమెట్లు చెయును ? తండ్రి యుండగానే కుమారుడు రాజ్యమునకు వచ్చి ఆతడు అంతలో అస్తమించి మరల తండ్రి రాజ్య ప్రయత్నము చేసెననుటకు ఆధారము ఎక్కడ నున్నది ? కాబట్టి ఇదంతయు అసంభవము. ఇది వీరికి ఏ ప్రమాణము

చేత తోచినదోగాని ఆ శాసనములో ఎవరో రాజ్యము స్థాపించి నట్లు గాని, యుద్ధము చేసినట్లుగాని, అన్నిటిని మించి మనుమసిద్ధికి దీనితో సంబంధమున్నదని తలంచుటకుగాని ఆధార మేమియు లేదు. ఆ శాసనమిదిగో (నె. శా. పుట 233—34).

"శక వరుషంబులు ౧౨౦౭ గునేంటి భాద్రపద శుద్ధ త్రయోదశి గురువారమునాండు స్వస్తి పర్ణవంశోద్భవ భారద్వాజ గోత్ర పవిత్ర ఖట్వాంగ ధ్వజ వృషభ లాంచన కాంచీపుర వరాధీశ్వర కామకోట్యంబికా లబ్ధ వరప్రసాద జగద గోపాళ నామాది ప్రశస్తి సహితం శ్రీ మన్మహా మండలేశ్వరం విజయగండ గోపాళ మహారాజు రాజ్యమున స్వస్తిగుణమణి కిరణాలంకృత కేయూర హార ఒరయూరి పురవరాధీశ్వర గండరగండ ప్రజమెచ్చు గండ పండిత పుండరీక షండ మార్తాండ బిరాగండ నితల గోటుగండ బద్య మహారాజ స్థాపనాచార్య నామాది ప్రశస్తి సహితం శ్రీమతు గొన్నపూండి కేశిమనాయని కొడ్కులు శ్రీ కామయ నాయకుండును, దేవి నాయకుండును ధర్మవృత్తియైన చెఱువున ఎర్లికార్జున దేవరగుడి రంగభోగార్థముగాను భోగమువారికిచ్చిన వరచేను ...."

తర్వాత దానము యొక్క వివరములు, ఇచ్చుట రాజులు గాని, మనుమసిద్ధిగాని, యుద్ధము చేయుటగాని బొత్తిగా కనబడదే! అట్లుండగా శ్రీ రెడ్డిగారు ఎట్లు ఈ అభిప్రాయమునకు వచ్చిరో నా ఊహకు అందుట లేదు. ఏదో ఒక దానికి మఱియొకటి అనుకొనియుందురు. 'బద్యమహారాజ స్థాపనాచార్య' అన్నది కూడ గొన్నపూండి నాయకులకు వర్తించు చున్నది. ఈ బద్యమహారాజెవరో తర్వాత చూతము. మనుమసిద్ధి మాత్రము కానరాడు గదా!

(7) ఈ విజయగండ గోపాలుడు నాటివాడే యగునో కాడో, మఱి ఆత్మకూరు తాలూకాలో చిరమన కెట్లు రాగలిగెనో పరిశోధింపవలసియున్నది గాని, మనుమసిద్ధియొక్క శత్రువె ఐ యెడల తన రాజ్యసంవత్సరమును ఇందు చెప్పక పోవుట యెందుచేతనో! విచార్యము. కాని, క్రీ. శ. 1278—9 లో నందలూరి వఱకు వచ్చిన విజయాదిత్యుడు 1281 వఱకు జీవించియుండినట్లు కంచి శాసనముచే తెలియవచ్చుట చేత, నందలూరు ప్రాంతమునుండి ఆత్మకూరు చిరమనలో శాసనము వేయించి యుండదగును. దీర్ఘకాలము జీవించి యుండినట్లున్నాడు.

ఈ కాలమున నొక మనుమగండ గోపాలుడు కనబడు చున్నాడు గాని అతడు మన రెండవ మనుమసిద్ధి మాత్రము కాడు. క్రీ. శ. 1279 లో నెల్లూరిని మరల గ్రహించిన రెండవ తిక్కరాజు ఎంతకాలము పాలించెనో తెలియదు గాని మనుమగండ గోపాలుని శాసనములు మాత్రము శ 1204 (క్రీ. శ. 1282—3) నుండి కనబడుటచే నితని రాజ్యకాలము మూడు నాలుగేండ్లవఱకు మించలేదని విశదము. మనుమగండ గోపాలు డెంతకాలము పాలించెనోగాని ఇతని తర్వాత రాజగండ గోపాల బిరుదాంకుడు మధురాన్తక పొత్తపి చోళ రంగనాథుడు నెల్లూరులో క్రీ. శ. 1290 లో పాలించుచుండెను. మనుమగండ గోపాలుని అంత్యకాలమెప్పుడో గాని ఇతనిది కూడ రణ మరణమే. కాకతి రుద్రమదేవి కాలమున ప్రతాప రుద్రుని సకల సేనాధిపతియైన అడిదము మల్లు అను నతడు 'మనుమగండ గోపాల శిరఃఖండన' యను బిరుదును ధరించి యున్నాడు. (SI I X 479).

(౩) తిక్కన భారత రచనా కాలము.

'సత్య మెట్టిదో తెలుప వేడికోలు' అని జిజ్ఞాసువులై శ్రీ రెడ్డిగారు కోరినందున ఇంతదూరము వివరించి వ్రాయ వలసి వచ్చినది. సత్యమే చరిత్ర కెక్కును. సత్యేతర మెక్కదు గదా. అది నవలలకు పనికివచ్చును. "శ్రీ శాస్త్రిగారి పరిశోధన ప్రకారము ఇమ్మడి మనుమసిద్ధి క్రీ. శ. 1284—85 ప్రాంతము వఱకు సజీవుడై యుండి తిక్కన కావ్యమును కృతి నందియుండవలెనని అనిపించుచున్నది" అని రెడ్డిగారు వ్రాయుటకు బొత్తిగా ఆధారములేదు అనుటకు గాని అనిపించుటకుగాని నా రచనలో ఎచ్చటను అవకాశము లేదు. తిక్కనచే మనుమసిద్ధి నిర్వచనోత్తర రామాయణమును కృతి నందినది క్రీ. శ. 1243—46 ల నడిమి కాలమని స్పష్టీకరించితిని గదా. మనుమసిద్ధి మరణము క్రీ. శ. 1263 కు లేక కొంత ముందని గంట వాయించినట్లు తెలిపితిని గదా. ఇంక నెట్లు వ్రాయవలయునో తెలియుట లేదు.

మనుమసిద్ధి మరణానంతరమే మహాభారత రచన యని ఇదివరలో వ్రాసితిని. తిక్కన బయ్యనకు అల్లుఁ డిక్కరాజును ఆతని సోదరుడు నని తెల్పితిని గదా. భారతము నాంధ్రీకరించి, కాకతి గణపతికి దానిని వినిపించి ఆతని సాయమును తిక్కన సంపాదించెనని సిద్ధేశ్వర చరిత్రాదులలో నుండుటచే, క్రీ. శ. 1249 కి ముందే మరల నెల్లూరికి గణపతి వచ్చియుండుట చేత క్రీ. శ. 1246—49 నడిమి కాలమున మనుమసిద్ధి రాజ్యభ్రష్టుడగుటకు ముందు, నిర్వచనోత్తర రామాయణ దశకుమార చరిత్రలకు తర్వాత, తిక్కన భారతాంధ్రీకరణమును ప్రారంభించి, గణపతి చక్రవర్తిని సందర్శించిన సందర్భమున ఆతనికి వినిపించియుండుట సుసంభవమే. జరిగి యుండునని తలంచుటకు అవకాశము కలదు. భారతాంధ్రీకర

ణము పూర్తియగు లోపల మనుమసిద్ధి గతించి తర్వాత తిక్కన హరిహరనాథుని కంకితమిచ్చియుండునని పండితాభిప్రాయ ముగా నుండెను.

కాని ఇంతదూరము తర్కించిన తర్వాత నా కొకటి తోచుచున్నది. తిక్కన భారతములో మనుమసిద్ధి ప్రస్తావము లేకపోయినను, స్వప్నములో తిక్కనకు కనబడిన 'తండ్రి' నాటి విషాద విషమ రాజకీయ పరిస్థితులను వేటినిగాని సూచింపక భగవంతుని యనుగ్రహప్రకారమును తెలిపి తన వెంట వచ్చిన ఆ దేవునే చూపుటయు, దేవుడు దర్శన మిచ్చుటయు, అంకితము కోరుటయు, తిక్కన 'ఇమ్మహాభారతంబు సమస్త దురితాపహంబును సభిమత శుభావహంబును గావున నొక్క మహాఫలంబు గోరి జనమేజయుడు .... వినిన కథ' అని వ్రాసి మరల తాను ఆ భారతమునే వ్రాసి వినిపించుటయు చూడగా తానును ఏదో 'మహాఫలము' ను కోరియే వ్రాసి వినిపించినట్లు ధ్వనించుచున్నది. ఏదో అనిష్టము తొలగిపోవుటకు చేసిన పనిగా కనబడుచున్నది. 'తిక్కన బయ్యనలను జయించుటయే ధ్యేయ యుండినయెడల అది సిద్ధించుటకే భారతాంధ్రీకరణమై యుండును. దానినే గణపతిచక్రవర్తికి వినిపించియుండును. దశకుమారచరిత్ర యందు గణపత్యాదుల ప్రస్తావము లేనట్లే అనంతర రాజకీయ కల్లోలాదికములకు గాని, రణ మరణ మందిన మనుమసిద్ధికి గాని ఎట్టి సూచనయు భారత మందు లేదు. సిద్దేశ్వర చరిత్రలోని వృత్తాంతము— గణ పతి 'తిక్కన బయనలను' నిర్జించుట చరిత్రాంశముగా తేలినది గదా. కాబట్టి—తిక్కనయు భారతములో సోమయాజి యని మాత్రము వ్రాసికొని, మనుమసిద్ధి రాజ్యమందు తాను కుదురుపరచినట్లు చెప్పకపోవుటచేత భారతము కూడ మనుమ సిద్ధి యుండగానే, అతని రాజ్యలబ్ధి కొఱకే భగవదారాధనగా వ్రాసి యుండునేమో ! ఇది యొక ప్రమొక్కువంటిది గావునను, స్వప్నవృత్తాంతమునుబట్టి అంకితము దేవునికే దైవనిర్ణీత మైనందునలనను రాజు అంకితము కోరలేదని తోచుచున్నది. 'తిక్కన బయ్యనల' చరిత్ర సత్యమై యుండగా, మనుమ సిద్ధి గణపతి సాయమును కోరినది శాసనస్థమై యుండగా, తిక్కన భారతము నంత దీక్షతో వ్రాసియుండగా, గణపతికి భారతమును వినిపించినది మాత్ర మెట్లు అసత్యమగును ? గణపతిని దర్శించు నాటికే తిక్కన సోమయాజి యైనాడని సిద్దేశ్వర చరిత్ర వ్యక్తము చేయుచున్నది. 'అట్టి మహా త్ముని నా సోమయాజి' అని.

ఇదంతయు క్రీ. శ. 1263 కు ముందేయని తేలు చున్నది గదా. ఇంకను సూక్ష్మముగా పోయిన 'తిక్కన బయ్య న'లు ఇరువురును—అల్లుండిక్క విజయాదిత్యులు—సజీవులై యుండిన కాలమునకు క్రీ. శ. 1249 కి ముందే జరిగి యుండవలెను. 'మనుమసిద్ధి పాండ్యుల తోడి రణమున మర ణమందిన కాలమునకు తిక్కనయున్నాడో గతించెనో. ఏల యన భారతము రచించు నాటికి తిక్కనకు తండ్రి లేడు. నిర్వచనోత్తర రామాయణము నాటికే తిక్కనను మనుమసిద్ధి మామ యని పిలిచెడు వాడు. క్రీ. శ. 1243 నాటికే మహా వీరుడై విజయములు గాంచిన మనుమసిద్ధి బాలుడుగా నుండ డు. 1243 నుండి 1263 వఱకు దాదాపిరువది ఏండ్లు రాజ్యమునకై పోరాడియున్నాడు. ఇరువది ఏండ్లకే రాజ్యము నకు వచ్చెనని తలంచినను గతించునాటికి మనుమసిద్ధికి నలు వదియైన నుండవలదా. కాని అల్లుని తమ్ముడు 1281 వఱకో లేక 1284 వఱకో జీవించియుండినట్లు కనుబడు చుండుట చేత అల్లునికన్న చిన్నవాడైనను, అల్లుని తమ్మునితో సమ వయస్కుడై యుండవచ్చును గదా. విజయాదిత్యుడు దాదాపు నలువది యేండ్లు (1243—1283) పోరాడి యున్నాడు గదా. 1243 నాటికి ఇరువదేండ్ల వాడన్నను అఱువ దేండ్లు జీవించి యుండవలయును. కాని నాటి రాజకీయ వాతావరణమును చూచిన యెడల అంతకన్న పెద్దవాడైయే యుండవలెనని తోచుచున్నది. మనుమసిద్ధియు రణ మరణ మందు నాటికి దాదాపేబది యేండ్లవాడుగా నుండియుం డును నాటికి తిక్కన సోమయాజి గతించియుండును. లేనిచో ఆంధ్ర మహా భారతానంతరము ఆయన ఏమియు వ్రాసి నట్లులేదు. ఏవేవో గ్రంథములు ఆయనకు ఆరోపితము లైనవి. తర్వాతి వారికి మార్గదర్శకుడై పూజ్యుడైన కవి బ్రహ్మయొక్క గ్రంథములు నశించిపోవునా? కావునను, ఇతర కారణములచేతను వానిని పండితులు తిక్కనవి కావని తలంచి వారు.

ఉపయోగకరమైన సరిక్రొత్త గ్రంథములు

వ్యవసాయము — ఫిషరి — కోళ్ల పెంపకం — అడవులు — తోట పని — యింజనీరింగ్ — వైద్యము — వివిధ సాంకేతిక విషయములపై గ్రంథములు గలవు. కేటలాగు ఉచితము.

ఇంగ్లీషులో వ్రాయండి :

N. K. PAUL & SONS,
P. B. No. 12202, Calcutta—5.

తిక్కన రచనాకాలము

పైగా తిక్కన ఒక కాళయుక్తి సంవత్సరము గతించి నట్లొక పద్యము మెకంజీగారి సంచయమున దొరకి యున్నది.


"అంబర రవి శశి శాకా
బ్దంబులు చనఁ గాళయుక్తి భాద్రపదపు మా
సంబున నంబరమణి చిం
బంబన దగు తిక్క యజ్వ బ్రహ్మము చేరెన్."

దీనింబట్టి శా. శ. 1120, క్రీ. శ. 1198 అగుచున్నది. కాళయుక్తి సరియేగాని క్రీ. శ. 1198 నిధన కాలమగుట అసంభవముగదా. తర్వాతి కాళయుక్తి యగునేని క్రీ. శ. 1258 అగుచున్నది. క్రీ. శ. 1249 కి ముందే భారత రచనయేని నాటికి గణపతి నెల్లూరి వఱకునువచ్చి కంచిని కూడ జయించినను విజయాదిత్యుడు పట్టు వదలేదు. మనుమసిద్ధియు నెల్లూర పాలింపలేదు. పెంట్రాల శాసనము నాటికి మరల వచ్చియున్నాడు. మరల నొక సంవత్సరమున రౌద్రిలో, మధ్య, 1260 కి విజయాదిత్యుడు ఉచ్చటనే శాసనము వేసియున్నాడు. మరల దుర్ముఖిలో మనుమసిద్ధి వచ్చియున్నాడు. ఇరువురు రాజులును పోటీలు వేసికొని ఆయూరిలోనే శాసనములు వేయించుట, పైగా 'తమ రాజ్యాభివృద్ధికి' అని వ్రాయించుకొనుట చూడగా యుద్ధములలో పరస్పరము జయించుచు ఓడిపోవుచునుండిరని తోచుచున్నది. తుదకు ఇదంతయు 1263 నాటి ముత్తుకూరు రణరంగమునకు దారితీసియుండును. గణపత్యాదులు మనుమసిద్ధికి సాయము వచ్చినను దైవము ప్రతికూలమైనది. తిక్కన సోమయాజిని పోషించిన ప్రభువునకు ఆయుపు తీరినది. కాగా రాజకీయ విప్లవవాదులచే నెమ్మదిలేక తిక్కనకవి భారతానంతరము ఏమియు వ్రాసి యుండడు. క్రీ. శ. 1258 (కాళయుక్తియే) నాటికి మనుమసిద్ధి కందుకూరు సీమలో నుండుట, అడ్డులేక మూడేండ్లుండిన యనంతరము విజయాదిత్యుడు వచ్చుట చూడగా, క్రీ. శ. 1249 లో నొకసారి విజయము గాంచినను క్రీ. శ. 1258 (కాళయుక్తి) నాటికి మనుమసిద్ధి నెల్లూరిలో స్థిరపడినట్లున్నాడు. ఆ సంవత్సరమే, కార్య సాఫల్యానంతరమే తిక్కన సోమయాజియు 'బ్రహ్మము' చేరి యుండును. ఇది ఈ చారిత్రక పునర్నిర్మాణమునకు సరిపడుచున్నది.

కావున తిక్కన 1280 ప్రాంతమున గ్రంథ రచనలు చేయుచు మనుమసిద్ధికి అంకితమిచ్చుచు కాలక్షేపము చేయుచుండెననుట ఎంతమాత్రము కుదురదని శ్రీ రెడ్డిగారికి నా విన్నపము.

సారాంశము—(1) విజయాదిత్య గండ గోపాలుడు బయ్యనయే. (2) సుందరపాండ్యునిచే చంపబడినవాడు విజయాదిత్యుడు కాడు (3) వీరగండ గోపాలుడు మనుమసిద్ధియే. (4) నిర్వచనోత్తర రామాయణ దశకుమార చరిత్రల రచనా కాలము క్రీ. శ. 1243—46 లకు నడుమ. (5) ఆంధ్ర మహా భారత రచనా కాలము క్రీ. శ. 1246—49 లకు నడుమ. (6) తిక్కన నిధన కాలము క్రీ. శ. 1258. (7) మనుమసిద్ధి నిధనకాలము 1263. (8) రెండవ తిక్కరాజు రాజ్యమునకు వచ్చినది 1279— జక్కన తాత కాలము.

శ్రీ రెడ్డిగారు ప్రతిపాదించినవి కుదురవు.



BI-TFN, 10 Tel



తాజా టీ
పరిమళమైన టీ
ఉత్తమ టీ

టాటా-ఫిన్లే టీ


సాటిలేని టీ!

* తాజాగా వుంచుటకు టాటా-ఫిన్లే టీని ప్రత్యేకమైన ప్యాకింగ్‌లో సురక్షితముగా భద్రపరచుతారు.


* అతి సున్నితమైన పరిమళమిచ్చుటకు కావలసిన కోమలమైన ఆకులను మొగ్గలనే టాటా-ఫిన్లే టీలో ఉపయోగిస్తారు.

* టాటా-ఫిన్లే టీ మిశ్రణ (బ్లెండింగ్) అతి నిపుణతతో చేస్తారు, కనుకనే ఈ టీ చిక్కగా రుచికరంగా వుంటుంది.

టాటా-ఫిన్లే *టీ త్రాగండి; ఆనందము అందుకోండి!*



ఈ క్రింది రకాలలోను, ప్యాకింగ్స్‌లోను టాటా-ఫిన్లే టీ దొరుకుతుంది:-
ప్రెస్టిజ్ డార్జిలింగ్, లలిత్ లీఫ్ టీ, మిలాప్ లీఫ్ టీ, బహదూర్ డస్ట్ టీ, షాన్ డస్ట్ టీ



నాటకం :

అతిథి

శ్రీ ఆదివిష్ణు

[ఈ నాటకాన్ని మంగపతి కోసం వ్రాశాను. కథ నడవడానికి ఉప పాత్రలూ అవసరం గనక ఆ అవసరాన్ని పాటించేను. ఆ హోటల్లో జరిగిన ఈ సన్నివేశం ద్వారా మంగపతి మీద జాలి కలిగింది. మంగపతి 'అతి సామాన్యమైన మనిషి'. సుబ్బరాజు 'ప్రముఖమైన వ్యక్తి'. కథా ప్రారంభం నాటికి అయిదేళ్ల క్రితం వాళ్లిద్దరూ ప్రాణమిత్రులు. అయిదేళ్ల తర్వాత కలుసుకున్న వాళ్ల మనసులకి సంబంధించిన కథ ఇది.

అది హోటలు గది. దాన్లో ఉంటున్నది సుప్రసిద్ధ సినిమా దర్శకుడు సుబ్బరాజు గనక, అతని స్థాయికి తగ్గ విధంగా ఆ గది అలంకరించబడి ఉంది. సుబ్బరాజు ఆలోచిస్తూ కూర్చున్నాడు. సమయం రాత్రి. దగ్గర్లో ఉన్న తాణాలోంచి ఎనిమిది గంటలు వినిపించేయి. సుబ్బరాజు వాచి చూచుకున్నాడు. తల పంకించేడు. లేచి ఒళ్లు విరుచుకున్నాడు. చేతులూపుకుంటూ కాసేపు గదిలో పచార్లు చేశాడు. తర్వాత ఆగిపోయేడు.

సుబ్బరాజుకో జబ్బుంది. రేపెప్పుడో, ఎక్కడో, ఎవర్తోనో మాటాడ వలసిన ముఖ్య విషయాల్ని ఈ రోజు తనలో తనే చర్చించుకుని ఓ నిర్ణయాని కొచ్చేస్తాడు. ఇప్పుడు జరుగుతూన్న తంతు అదే.]

సుబ్బ : మా చిత్రసీమలో ఈ వూరికి ఓ ప్రత్యేకమైన స్థానముంది. మేమందరం దీన్ని అమితంగా అభిమానిస్తాం. (అతనన్నది అతనికే నచ్చలేదు) నేనిప్పుడు మాటాడిందేమీ బాగోలేదు. (మళ్లా ఆలోచించేడు. తట్టింది) ప్రముఖమైన కళాకారులకి పుట్టినిల్లైన ఈ వూళ్లో, నాటక పోటీలు నిర్వహించడమనేది ముదావహం. ఈ నాడు ఇక్కడ హాజరైన ప్రేక్షకుల్లో మహాదాంతులు రసజ్ఞులూ, సహృదయులూ (ఆగిపోయేడు) నాన్‌సెన్స్— మహాదాంతులంటే ఏడ్చినట్టుంటుంది. ఇలా కాదు. (తలెత్తి చూసేడు. తల దించి అన్నాడు). ఈ వేదిక మీద, మీ ముందు నించుని, ఇలా మాటాడాలనే కోరిక చాలా కాలం నుంచీ ఉంది. ఆ కోరిక నేటికి నెరవేరినందుకు అమితానందంగానూ ఉంది. అవకాశాన్నిచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు. (హాజరవ్వబోయే జనాభా నుంచి 'చప్పట్లు' వచ్చినట్టు ఊహించేడు. మెల్లిగా నవ్వేడు. చప్పట్లు కసువుగా తలూపేడు. చేత్తో ఇక చాలన్నట్టు సంజ్ఞ చేశాడు) ప్రదర్శించిన నాటకాలన్నీ చూచేందుకు అవకాశం లేకపోయింది. మా పరిశ్రమ అలాటిది. క్షణం తీరుబడి చిక్కదు. ఈ వేళ మీ ముందిలా మాటాడుతున్నానన్న మాటే గాని మనసులో మదరాసు మెదుల్తూనే ఉంది. (నవ్వేశాడు కులాసాగా.) క్షమించాలి. విషయాన్ని మరోదారి పట్టించేట్టున్నాను. (హడావిడిగా ఫోన్ మోగడంతో 'మూడ్స్' చెడిపోయేయి. విసుగ్గా ఫోన్ దగ్గరికెళ్లేడు. రిసీవరు అందుకున్నాడు) హల్లో. . . యస్. సుబ్బరాజు హియర్.. ఓ.. మీరా లిల్లీ.. గూడ్.... నేనింకా ఎవరో అనుకున్నాను. ఏమిటి విశేషం ?.... నా ప్రోగ్రామా?. రేపుదయం మా సొంత వూరు వెళ్లడం మళ్లా సాయంత్రం నాలుగ్గంటలకి ఈ ఊరొచ్చి అయిదు నుంచీ ఏడింటి వరకూ ఆడిటోరియంలో గడిపి ఏడున్నరకి ఫ్లయిట్లో మదరాస్. యస్.. ఐ సీ.. మీ రిక్కడికి వస్తారా.. రండి.... అలాగే. (ఫోన్ పెట్టేశాడు) లిల్లీ ! రియల్లీ ఎ స్వీట్ వేన్చ్ ! (వొచ్చి కూర్చుని, సిగరెట్టు ముట్టించేడు. తెగిపోయిన ఉపన్యాసాన్ని తిరిగి ప్రారంభించాలనే ఉద్దేశం కలగడంతో ముక్కు రుద్దుకుంటూ లేచేడు. ఉపన్యాసం ప్రారంభించేడు) కళాకారులందరికీ నా అభినందనలు. విజేతలైన కళాకారులకి నా చేతి ద్వారా జరగబోయే బహుమతి ప్రధానంతో పాటు నా శుభాకాంక్షలూ అందజేస్తున్నాను. (ఆగిపోయి

విహరించేడు) ఈ వాక్యంలో వ్యాకరణం దెబ్బతిన్నట్టుంది. పైగా— బహుమతి ప్రధానమంటారో బహుమతి ప్రదానమో తెలీదు. మరోటి నెమ్మదిగా ఆలోచించాలి. రాయబారాన్ని రాయభారమని అసిస్టెంట్ చాత చెప్పించుకున్నాను. ఆ అనుభవం చాలు. (సిగరెట్టు దమ్ము గట్టిగా పీల్చాడు) మొన్న మొన్నటి వరకూ నేనూ మీ అందరిలా ప్రేక్షకుడినే. ఈ నాడు సినీదర్శకుడిగా పలుకుబడిని సంపాయించుకున్నానంటె కారణం మీరూ మీ అభిమానమూను. (జుట్టు సవరించుకున్నాడు.) నేను తీసిన మూడు చిత్రాలూ ప్రజాదరణ పొంది శతదినోత్సవాలు చేసుకున్నాయన్న ఆలోచన గుర్తుకొచ్చినప్పుడల్లా ఉత్సాహం పొర్లి పొంగిపోతూంది నాకు. నిజం. మా పరిశ్రమలో నాకన్న పెద్దవారైన వారి అభినందనల్తో గాలిలో తేలిపోతూ ఉన్నట్టుంటుంది. అయిదేళ్ల క్రితం మామూలు సుబ్బరాజుని. ఈనాడు ప్రఖ్యాత సినీదర్శక సుబ్బరాజుని. రాజుని. (ఆగిపోయేడు) ఇంకా నయం. ఇక్కడున్నది నేనొక్కడ్నీ కాబట్టి సరిపోయింది. ఈ వరస రేపక్కడ ఉపయోగిస్తే చేతులారా ఉరేసుకు చచ్చినంత పనైపోను. (విసుగొచ్చింది) ఛ .... ఛ.... ఇదంతా నా పీకలమీదికొచ్చి పడిందేమిటి ? అయినా ఎవరో, నాటక పోటీలు బాబోయ్, మీరొచ్చి మమ్మల్నానందపరచండి నాయనోయ్ అని ఆహ్వానం పంపితే నేను రావడమేమిటి ? వాళ్ల మనసుకి హత్తుకునే ఒక్క చక్కటి ముక్కా దొరక్క యిబ్బంది పడటమేమిటి ? రేపు ఆ సభ నెలా తృప్తిపరచాలి ? ఆహ్వానం తిరస్కరిస్తే గీరంటారు. అందుకునివస్తే యిదిగో యీ పాట్లు. సిగరెట్టు విసిరికొట్టి— వచ్చి సోఫాలో విసుగ్గా కూర్చున్నాడు. మొహాన్ని చేతుల్తో రుద్దుకుంటూండగా ఆంజనేయులొచ్చేడు.)

ఆంజ : (ఆగిపోయిన తన వాచీని సరిచేయడానికి సిద్ధపడుతూ అడిగేడు—) మీ టైమెంత చూస్తారు ?

సుబ్బ : (అతని మొహంలోకి చూసేడు. ఆంజనేయులు అందమైన చిరునవ్వుని చిందించేడు. చప్పున తల తిప్పుకుని వాచీ చూచుకున్నాడు) ఎనిమిదిం బావు.

ఆంజ : (టైం సరిచేసుకున్నాడు) థేంక్సండి. నాపేరు ఆంజనేయులు. ప్రస్తుతం పదమూడో నెంబరు గదిలో ఉంటున్నాను.

సుబ్బ : ఐ సీ .....

ఆంజ : బి. ఎ. పాసై రెండు సంవత్సరాలైంది. ప్రస్తుతం ఖాళీ.

సుబ్బ : అలాగా.

ఆంజ : అవునండి మా వూరు ఇక్కడికి దగ్గర్లో ఉన్న పల్లెటూరు. ప్రస్తుతం ఓ చిన్నపని మూలంగా ఈవూరొచ్చేను.

సుబ్బ : బాగుంది.

ఆంజ : అవునండి. (చేతికి వాచీ పెట్టుకుంటూ అన్నాడు) ఈ వాచీని హెచ్‌ఎమ్‌టీ వారు తయారు చేశారు. ప్రస్తుతం మనదేశంలో తాండవిస్తున్న కొన్ని విపత్కర పరిస్థితుల దృష్ట్యా స్వదేశీ మార్కు వస్తువుల్నే వాడాలని నా అభిప్రాయం.

సుబ్బ : భేష్ .... మంచి అభిప్రాయం.

ఆంజ : అవునండి. నా అభిప్రాయాలు ఎప్పుడూ మంచిగానే ఉంటాయండి. ప్రస్తుతం వివిధ రంగాల్లో జరుగుతున్న అయొక్క మార్పులపైన నా గాఢమైన అభిప్రాయాలు .....

సుబ్బ : కొంచెం ఘాటుగానే ఉండొచ్చు.

ఆంజ : (నవ్వేడు) అవునండి. నిజం చెప్పాలంటే. ఫన్‌స్టైన్స్ చిత్రరంగాన్ని తీసుకుందామాండి ! ప్రస్తుతం జనం మనస్తత్వం కామెడీ మీద పడిపోయింది. తెలుగాడు సుఖాంతాల్నే భరించగలడని బెంగాలీ వాడన్నాడండి. బెంగాలీ వాడేమో దారుణమైన లైఫ్ మీద అయొక్క ప్రయోగాలు చేసి పారేసి ఇంటర్నేషనల్ లెవల్లో పేరు తెచ్చేసుకుంటున్నాడండి. తెలుగాడి సినిమాలు రోజు రోజుకీ దిగజారిపోతున్నాయండి. (గాలి పీల్చుకున్నాడు) టూకీగా ప్రస్తుతం తెలుగు సినిమాల మీద నా అభిప్రాయం యిదేనండి.

సుబ్బ : (కొంచెం కోపం వచ్చింది గానీ దాచుకున్నాడు) మీ అభిప్రాయాలలా ఉంచి మీ ఉద్దేశ మేమిటో సరిగ్గా చెప్పండి. వింటాను.

ఆంజ : అవునండి. కూర్చోమంటారాండి.

సుబ్బ : నిరభ్యంతరంగా.

ఆంజ : థాంక్స్ సార్ (కూర్చున్నాడు. కుర్చీపైన చేతుల్తో తాళం వేసి కాళ్లూపేడు. మళ్లా అంతలోనే లేచి నిలబడ్డాడు) ప్రస్తుతం తెలుగు చిత్రరంగంలో జీనియస్సులు లేరని నా ఉద్దేశం కాదు. వాళ్ల అయొక్క బెంగాలీ బాబుల్ని తలకొట్టేంత మొనగాళ్లు కారనీ నా ఉద్దేశం గాదండి. (కూర్చున్నాడు. పక్కనున్న సుబ్బరాజు మొహంవేపు చూచి మళ్లా చూపు తిన్నగా నిలిపి అన్నాడు) జీనియస్సులైన బహుకొద్దిమందీ అవకాశంరాక, ఆదరణ

లేక కొందరి చేతుల్లో కీలుబొమ్మలై ఆయొక్క వాళ్ల సరదాలూ, వాళ్ల వ్యాపారమూ అనే వలలో చిక్కడి పోయేరు. ఇదీ నా విచారం. ఈ విషయమ్మై నేనో వ్యాసం వ్రాయాలని ఉంది. (మళ్ళా కాళ్ళూపడం ప్రారంభించేడు) ఈ ఉద్దేశంపై అభినందనలూ వొచ్చేయి. తిరస్కారాలూ వచ్చేయి. ఐతే నేను వాటిని పట్టించుకోనే లేదు లెండి.

సుబ్బ : మీ రెప్పుడైనా మదరా సొచ్చేరా ?

ఆంజ : (కాళ్ళూపడం మానుకున్నాడు) లేదండి. రావాలని మాత్రం ఉంది.

సుబ్బ : మీరు చెప్పిన కొందరి జీనియస్సుల్ని చూసేరా ?

ఆంజ : లేదండి. చూడాలని మాత్రం ఉంది.

సుబ్బ : అయితే ఆ వ్యాసం ఏం తెలుసుకు వ్రాయాలనుకున్నారు.

ఆంజ : లేదండి. వ్రాయాలని మాత్రమే ఉంది.

సుబ్బ : మీ పేరేమిటన్నారు ?

ఆంజ: (మళ్ళా కులాసాగా కాళ్ళూపడం ప్రారంభించేడు) ఆంజనేయులన్నానండి.

సుబ్బ : మంచిపేరు.

ఆంజ : కానీ మార్చుకోవాలని ఉందండి.

సుబ్బ : ఎంచేత ?

ఆంజ : అందరూ నన్ను హనుమంతరావని పిలుస్తున్నారు.

సుబ్బ : అదీ బాగానే ఉంది.

ఆంజ : అదీ నా కిష్టం లేదండి. చక్కగా ముఖర్జీ అనో, సత్యజిత్‌రాయ్ అనో, పోతె ఫక్తు తెలుగు నేమ్ సుబ్బరాజనో మార్చుకోవాలని ఉంది.

సుబ్బ : మధ్య వాడెవడు ?

ఆంజ : (కుర్చీకి అంటుకు పోయేడు) బహుముఖ ప్రజ్ఞగల ఒకానొక తెలివైన తెలుగు దర్శకుడు. ప్రస్తుతం మూడు సినిమాలు తీసి జనం చాత భేష్ అనిపించుకున్న ధీశాలి. ఆయనకి నేభై ఉత్తరాలు రాసేను.

సుబ్బ : పాపం. జవాబు వ్రాశాడా ?

ఆంజ : లేదండి. ఆయన వ్రాయరు. ప్రస్తుతం సినీ జగత్తులో ఆ యొక్క పలుకుబడి గల వ్యక్తికి ఉత్తరం రాసేందుకు తీరుబడెక్కడ చిక్కుతుంది లెండి !

సుబ్బ : (కొంచెం సంతోషించేడు) సిగరెట్టు కాలుస్తావా ?

ఆంజ : వొద్దు లెండి.

సుబ్బ : మీ అభిప్రాయాలు బాగున్నాయి. ఉద్దేశాలు యింకాస్త స్థాయిలో పెరగాలి.

ఆంజ : అవునండి. ప్రస్తుతం అందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నానండి. కానీ నా అభిరుచి వేరు. నా ఆశయం మరోటి!

సుబ్బ : (కుతూహలం కలిగింది) ఏమిటది ?

ఆంజ : (లేచి నించుని మెడ చుట్టూ చేతులు పెడుతున్నాడు) నటుసిగా సినీ జగత్తులో స్థిరపడి నా చాతనైన కృషిలో ఆయొక్క కళామతల్లికి నీరాజనం అందించాలని ఉంది. మహామహులైన దర్శకుల చేతుల్లో తర్ఫీదుపొంది కళయొక్క లోతుపాతుల్ని తెలుసుకోవాలనీ ఉంది. ప్రస్తుతం ఆ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను.

సుబ్బ : మంచిది.

ఆంజ : క్షమించాలి. మీ రెవరో నాకు తెలీదు. అయినా ఇంత సేపు మీతో మాటాడి మీ అమూల్యమైన కాలాన్ని వృధా చేసినందుకు చింతిస్తున్నాను. నా గది నెంబరు పదమూడు. బి. ఏ. వరకూ చదువుకున్నానండి. నా పేరింకా నిర్ణయించుకో లేదు. నటుడిగా రాణించాలని కోరికండి. వొస్తాను. (అందంగా నడుచుకుంటూ వెళ్ళి పోయేడు. సుబ్బరాజు నిట్టూర్చేడు. మరో సిగరెట్టు వెలిగించేడు. కాలింగ్‌బెల్ నొక్కేడు. వెయిటర్ రావడం తోనే అడిగేడు)

సుబ్బ : ఇప్పుడు నా గదిలోంచి బైటకు వెళ్ళినతను....

వెయిటర్ : పదమూడో నెంబరు గదిలో ఉంటున్నారు సార్. చాలా గొప్పమనిషిలాగున్నారు సార్. ఆయన్ను కలుసుకోడానికి వొచ్చే పోయే జనం సార్. ఆయనొచ్చి రెండు రోజులైంది సార్.

సుబ్బ : సరిసరి. నాకు డ్రాక్స జ్యాప్ పట్టుకురా. క్విక్ ! (సర్వరు వెళ్ళిపోయేడు. సుబ్బరాజు ఆలోచనలో పడ్డాడు) పదమూడో నెంబరు గది. చాలా గొప్ప మనిషి. ఆయన్ని కలుసుకోడాని కొచ్చే జనం. (అప్రయత్నంగా నవ్వేడు. అంతలో మళ్ళా ఫోన్ మోగింది. తీసుకున్నాడు) యస్ మిస్ లిల్లీ ! మీరింకా బైలుదేరలేదన్నమాట .... నో ఫియర్స్ మీ రొచ్చేంతవరకూ యిక్కడే ఉంటాను. ఏమంటారు .... టేప్ రికార్డరు గూడా తీసుకొస్తారా... వెల్. పట్రండి. కొంచెం కాలక్షేపం జరుగుతుంది.... సరిగ్గా అరగంటలో వొచ్చేయాలి.... భోజనమా ... (నవ్వేడు) నే నుత్త ఆకలి మనిషిని మిస్ లిల్లీ, భోంచేసి అరగంటైంది .... దట్సాల్ రైట్ .... వచ్చేస్తారుగా. (ఫోన్ పెట్టేశాడు. తన ప్రక్కనే నించున్న వెయిటర్‌ని చూశాడు. అత నిచ్చిన డ్రాక్స

గ్లాస్ తీసుకున్నాడు. అతను వెళ్ళబోతూండగా ఆగమన్నట్టు సైగ చేశాడు. తాపీగా కూర్చుని (డ్రాక్ట గ్లాస్‌ని కొంచెం కొంచెంగా సిప్ చేస్తూ అడిగేడు)

సుబ్బ : ఆంజనీలనే కుర్రాడు పదమూడో నెంబరు గదిలో ఉంటున్నాడు. అవునా ?

వెంయి : యస్సార్.

సుబ్బ : నా పేరు సుబ్బరాజని నీకు తెలుసు. అవునా ?

వెంయి : యస్సార్.

సుబ్బ : నిజం చెప్పు. ఆంజనీలు నీ చేతిలో ఎంత పెట్టాడు !

వెంయి : (వొణికిపోయేడు).

సుబ్బ : (కోపం వొచ్చింది) చెప్పు. అతను నీ కెంత యిచ్చేడు ?

వెంయి : (నీళ్ళు నములుతున్నాడు) ఈవేళ సాయంత్రమే వొచ్చారు సార్. మీ గురించి అడిగేరు సార్. ఓ అయిదు రూపాయ లిచ్చేరు సార్.

సుబ్బ : ఊ, సరే. నువ్వెళ్ళు. ఈ తడవ అతనీ గది కొచ్చేముందు నువ్వేం అడ్డు చెప్పకు. తెలిసిందా ?

వెంయి : యస్సార్. (వెళ్ళిపోయేడు)

సుబ్బ : (డ్రాక్ట గ్లాస్ తాగేశాడు. చేతిగుడ్డతో మూతిని తుడుచుకొన్నాడు. చిరునవ్వుతో లేచి నిలబడి రేపటి ప్రేక్షకుల్ని ఉద్దేశించి అన్నాడు) మాకు చాలా తరహాల మనుషులతో పరిచయం ఉంటుంది. సినిమాల్లో చేరాలనే 'పిచ్చి' ముదిరిపోతే ఆరోగ్యానికే మంత మంచిది కాదని చెప్తాను. ఈనాడు ఈ పిచ్చి ముదిరిన కుర్రాళ్ళు ఎక్కువగా కనిపించడం ఆశ్చర్యపడవలసిన విషయం కానేకాదు. ఇక్కడ మీకో తమాషా చెప్పాలని ఉంది. (వాచీ చూసుకున్నాడు) నిన్న రాత్రి దాదాపు ఎనిమిదింబావు ప్రాంతాల్లో ఓ యువకుడు నా గది కొచ్చేడు. అతనికి నా పేరూ, నా వృత్తీ అన్నీ తెలుసు. సినిమాల్లో చేరాలనే ఉత్సాహాన్ని నేను కించపరచను. కానీ, నిజజీవితంలో గూడా ఎబ్బెట్టుగా నటించి ఫెయిలయిపోతే నాకు జాలి, కొళ్ళమంట గూడాను. అతను తెలుగు సినీమా రంగాన్ని తిట్టేడు. నన్ను తెలినట్టు నటించి సుబ్బరాజు లాంటి జీనియస్సుల్ని పొగిడేడు. అతని ప్లాను బాగానే ఉంది. కానీ అది కాదు పద్ధతి. ఇలాంటి అడ్డుదోవలు వెతికే మనిషి సినిమారంగానికే కాదు దేనికీ పనికి రాడని ఖచ్చితంగా చెప్తాను. (అప్పుడే వొచ్చిన వెంయిటర్ని చూడటంతో ఉపన్యాసం ఆపేడు. వెంయిటర్ నానన్నుతూ అన్నాడు.)

వెంయి : సార్.

సుబ్బ : యస్ ....

వెంయి : మీ కోసం ఎవరో వచ్చారు సార్.

సుబ్బ : ఎవరు ?

వెంయి : నాకు తెలియదు సార్. పేరడిగితే మంగపతి అన్నారు సార్.

సుబ్బ : (ఉలిక్కిపడ్డాడు) మంగపతి ! ....

వెంయి : యస్సార్ ! కొంచెం కుంటుతూ—

సుబ్బ : బోయ్ !

వెంయి : యస్సార్.

సుబ్బ : రమ్మను తొరగా రమ్మను క్విక్ .... అలాగే మరో డ్రాక్ట గ్లాస్ పట్రా. వెళ్ళు.

(వెంయిటర్‌కి సుబ్బరాజు ఆందోళన అర్థం కాలేదు. దాదాపు పరుగెత్తినట్టు వెళ్ళిపోయేడు).

సుబ్బ : మంగపతీ !

(మంగపతి వొచ్చేశాడు. అతను కుంటివాడు. వొచ్చి అన్నాడు.—)

మంగ : నేనేరా రాజూ .... చాలు .... ఈ రెండు క్షణాల్లో నీ మొహంలో వెలిగిన వెల్తురు చాలు.

సుబ్బ : (తన చేతుల్తో అతని చేతుల్ని గట్టిగా పట్టుకున్నాడు) ఎన్నాళ్ళకి చూసేనురా నిన్ను: (మంగపతి కళ్ళల్లో నీళ్ళు తిరగడం గమనించేడు) ఛా .... ఎందుకురా కన్నీరు ? తప్పు కదూ !

మంగ : ఆనందం రాజూ .... కన్నీరు కాదు .... అశ్రునా.

సుబ్బ : (మంగపతి కళ్ళు తుడిచేడు) కులాసానా మంగా !

మంగ : నా మిత్రుడు, అయిదేళ్ళ క్రితం నా నీడగా అతను, అతని నీడగా నేనూ తిరిగిన ప్రాణస్నేహితుడు రాజా అనే కుర్రాడు ఇప్పుడు ముక్కోటి ఆంధ్రులచాత భేషనిపించుకుంటున్న దర్శకుడు. రాజూ ! నువ్వు గుర్తుకొచ్చినప్పుడు నేనెంత సంతోషిస్తూ ననుకున్నావ్. ఎంత గర్విస్తూ నానుకున్నావ్.

సుబ్బ : రా .... ఇలా కూర్చో .... (వెంయిటర్ తెచ్చిన గ్లాస్ మంగపతి కిచ్చేడు) ఇందరా— ముందిది తాగు.

మంగ : (గ్లాసు తీసుకున్నాడు. వెంయిటర్ వీళ్ళిద్దర్నీ చిత్రంగా చూచి వెళ్ళిపోయేడు) నువ్వొస్తున్నావని పేపర్లో చదివేను. రెక్కలు కట్టుకుని రెడీగా ఉన్నాను. నువ్వొచ్చినట్టు తెలిసింది. నేను వాలేను. వారే రాజూ .... నువ్వు చాలా మారిపోయావురా.

సుబ్బ : (నవ్వేడు) నా కథ నీకు తెలుసు. మరి నీ విషయాలేమిటి?

మంగ : (నవ్వేడు బిక్కు బిక్కుమంటూ ద్రాక్షరసం తాగేడు.)

సుబ్బ : చెప్పరా. నీ విషయాలేమిటి?

మంగ : (లేచాడు) పొద్దుతే రాజా! నాకు చెప్పాలనిపించడంలేదు. చెప్పి నీ మనసు నొప్పించాలనీ లేదు.

సుబ్బ : మంగా ! నన్ను దూరం చేస్తున్నావు కదూ.

మంగ : నా కథ నీలాటి బంగారు జీవితం కాదురా. నువ్వు వినదగ్గ చరిత్ర కాదు.

సుబ్బ : మా మంగ మంచివాడు. వాడికి నేనంటే ఎంతో ప్రాణం. నాదగ్గర ఏమీ దాచడు.

మంగ : నీ మంగ దాచతగ్గదేమీ ఉండ కూడదు. అయినా ఉన్నది దాస్తేనే మా రాజు మనసు కులాసాగా ఉంటుంది.

సుబ్బ : నా కోపం వొస్తే నే నెలాటి మనిషినో మన మంగిని పూడి తిరణాల సంగతి గుర్తు చేస్తుంది. నువ్వానాడు నన్ను ఏదో విషయమై రెచ్చగొట్టావ్. ఎంత చెప్పినా వినిపించుకోలేదు. అప్పుడు నేనేం చేశానో గుర్తుందా? నీ తలని రెండు చేతులతో పట్టుకు సముద్రంలో ముంచేను. తర్వాత వొడ్డుకి చేర్చి నీ పొట్టలో నీళ్ళు కక్కించేను.

మంగ : (అప్రయత్నంగా ఏడుపొచ్చింది. తన మొహాన్ని చేతుల్లో దాచుకున్నాడు).

సుబ్బ : ఎందుకురా ? ఎందుకు ఏడుస్తావ్ ?

మంగ : అల్పుడ్ని ! సర్వ సామాన్యంగా బ్రతికిన కుర్రాడ్ని. ఆనాటి మన బంగారు కలలు గుర్తుకొచ్చినప్పుడు మన సంతా వెరితితో నిండిపోయి, గుండెల్లో ఓ రకమైన ... నేను చెప్పలేను రాజా ! కవిత్వం రాదు. మాటలు చాత కావు. నటుడినీ కాను—అంచేత నన్ను నిండిన భావాల్ని నీతో సరిగ్గా చెప్పలేకపోతున్నాను. ఏదో చెప్పాలని మాత్రం ఉంది. అది మాటల్లో పెగిలి బైటకు రావడం లేదు. అది అసూయ కాదు.! ఈర్ష్య కాదు !

సుబ్బ : మంగా ! నన్ను అనుమానిస్తున్నావట్రా! నువ్వు అసూయతో, ఈర్ష్యతో మండిపోతున్నావని అనుకునే మనిషినా నేను.

మంగ : నీ సంగతి కాదురా చెప్తూంట, నిన్న .... నాకు తెలిసి నతన్తో నీ సంగతి చెప్పాను. నీకూ, నాకూ ఉన్న స్నేహితం గురించి చెప్పాను. అప్పుడతను వెకిలిగా నవ్వేడు. నేనేదో గొప్పలు చెప్తున్నానని నా మొహం ముందే ఎద్దేవా చేశాడు! 'ఫలానా గొప్పవాడు నా మిత్రుడురా సన్నాసీ' అని చెప్పుకునేందుకైనా తగని వాడినా నేను ? కానీ అతను నన్నర్థం చేసుకో లేదు. నోటికొచ్చినట్టు పేలేడు. మిగిలున్నది యూ ఒక్క కాలేరా రాజా ! ఆ అధికాలుమంట నెత్తి కెక్కింది. వాడి పీక నొక్కేసి ఉందును. కాని చాతకాక వూరుకున్నాను.

సుబ్బ : (నవ్వేడు) ఎవడ్రా వాడు ?

మంగ : ఎవడోనా ? మీ డిస్ట్రిబ్యూటరు బావమరిది. డబ్బులో, మదంలో కులుకుతూన్న పక్షి ! ఏంరా ! నా కేమిటిరా తక్కువ ? ఉద్యోగం లేదంటే అది వేరే మాట. తప్పుడ పనులు చేయలేదే నేను. నీతికి దూరం కాలేదే. భ్రష్టుడైన వెధవ కుళ్ళుకు చావాలి గానీ, నాకేంరా ?

సుబ్బ : అసలు నీ కతన్తో పరిచయం ఎలా కలిగింది ?

మంగ : ఈ మందభాగ్యుడికి జీవితంలో చాలా ఎదురు దెబ్బలు తగిలేయి రాజా ! అయిదేళ్ళనుంచీ లేని కోరిక నాలుగు రోజుల క్రితం గుండెల్లో కెలికింది. మానవమాత్రుడ్ని, అందువా అవసరాల్లో ఉన్నాను గనుక వూగిపోయేను. నా బలహీనత నన్ను మింగింది. ఎదురుపడ్డ పెద్ద మనిషిని ఉద్యోగం అడిగేశాను. క్వాలిఫికేష నేమిటన్నాడు. నువ్వు నవ్వద్దు రాజా ! నిజం చెప్తేస్తున్నాను —అయిదేళ్లలో నాకున్న డిగ్రీ నన్ను ప్రయోజకుడ్ని చేయలేదు. కనక దానిమీద నాకు నమ్మకం బొత్తిగా పోయింది. అంచేత నీ పేరు చెప్పాను. నా క్వాలిఫికేషన్కి ఆ కారాకిళ్లీ వెధవ పకపకా నవ్వేశాడు.... నవ్వి నన్ను ఎద్దేవా చేశాడు.. జీవితంలో ఏదో ఒకరోజున పెద్ద వాడ్నయి, ఆ వెధవచేత నా బూటుకి పాలిష్ చేయించు కోవాలన్నంత కోపం వొచ్చింది.

సుబ్బ : (మంగపతి కోపానికి కలవరపడ్డాడు) పోనీలే మంగా ! ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు ? అన్నట్టు నీ కింత వరకూ ఉద్యోగమే దొరకలేదా ?

మంగ : దొరుకుతున్నాయి, పోతున్నాయి. నేను దేనికీ పనికి రాలేక పోతున్నాను. చివరికి ఏదో నాలుగు ట్యూషన్లు చెప్పుకు బ్రతుకుతున్నాను. నా ఒక్కడి పొట్టా గడపక పోదురా రాజా ! కానీ, నా వెనకనున్న 'ప్రపంచం' చాలా పెద్దది. ముసలి తల్లి, విధవ చెల్లెలూ మరియూ చవట తమ్ముడూ —

సుబ్బ : (కరిగిపోయేడు) మంగా ! నీకుదా యిన్ని యిబ్బందులు

మంగ: అందుకే యివన్నీ చెప్పడం నా కిష్టంలేదు. నన్ను అవ్వితంగా ప్రేమించే మిత్రులు ఇద్దరనుకున్నాను. ఒకడు

శోభనాద్రి. రెండు నువ్వు. శోభనాద్రి కారుల్లో తిరుగుతున్నాడు. లక్షల్లో మునిగి తేలుతున్నాడు. వాడి పెళ్లాం భాగ్యవంతుల పిల్ల. ఒక్కగా నొక్క కూతురు. గారాబుపట్టి. శోభనాద్రి అందమైనవాడు. పైపెచ్చు లౌక్యుడు. లవ్‌చేసి పెళ్లి చేసుకున్నాడు. వాడి కిప్పుడు నేను కనిపించను. ఏరే రాజా—నీకు తెలీదుగానీ, యీ కుంటి బ్రతుకు నన్ను ఖూనీ చేసిందిరా. నా బ్రతుకుని తినేస్తుంది. ఇది .... ఇది పెద్ద డిస్ క్వాలిఫికేషను. నా రెండో కాలూ నిక్షేపంలా ఉంటే, మనసులో తలిచినవన్నీ టకటకా నెరవేరుతూ పోతుంటే ఐ కెన్ పుట్ ఫరాల్ దీజ్ రోగ్స్. అందుకే మనమంటే దేవుడికి భయమేసి కుంటి బ్రతుకుని చేశాడు. పూర్ ఫెలో— తెలివిగల బుర్ర వాడిది !

సుబ్బ : పెళ్లయిందిరా ?

మంగ : ఎవరికి నాకేనా ? అయ్యింది. ఆరున్నై ఒకటి జూన్‌లో. వైజాగులో పనిచేస్తూండగా అక్కడి పిల్లనే చేసుకున్నాను. కమల సత్తికాలపు పిల్లని భ్రమించేను. అతిగా ప్రేమించేను. వైజాగ్‌లో ఉద్యోగం ఊడిన తర్వాత మళ్లా ఈ వూరొచ్చేను. ఇక్కడి వాతావరణం కమలకి సరిపడ లేదు. రెండు మూడు మాట్లు చెప్పి చూచింది. నన్నేం చేయమంటావని ప్రతిసారి విసుక్కునే వాడిని. తనకి తోచిన పని చేసి వెళ్లిపోయింది. వైజాగ్‌లోనే కుట్టు మిషను పెట్టుకుని బ్రతుకుతోంది. నేను అక్కడికి వొస్తే ఆదరిస్తుందిట. నాకింత కాచిపోస్తుందిట. ఆడదాని భరోసాతో బ్రతకనా ? అధవా నే నందుకు సిద్ధపడితే నా 'ప్రపంచం' సంగతేంగాను రాజా ! ఏమవుతుంది ? అడకత్తెర—పోకచెక్క.

సుబ్బ: (సిగరెట్టు ముట్టించేడు. అతనికీ యిచ్చేడు. కానీ మంగపతి కాల్చలేదు. సిగరెట్టు నలా పట్టుకునే ఉన్నాడు) కష్టాలు కలకాలం ఉండవురా మంగా !

మంగ : తెలుగు సినిమా కాదురా జీవితం ! ఏనుగెక్కావ్, నువ్వు మాత్ర మేం చెస్తావులే. బండెడు సానుభూతి నెత్తిని పెట్టుకు పోమంటావ్. కానీ నే వొచ్చింది నీ సానుభూతి కోసం కాదు రాజా ! కళ్లారా నిన్ను చూద్దామని. చదువుకునే రోజుల్లో క్లాసు లెగ్గొట్టి మాట్నీల కెళ్లేవాడివి. అప్పుడు నీ అటెండెన్సు నే పలికేవాడిని. ఎకనామిక్స్‌లో బ్రిలియంటని నాకు పేరు. ఆ సబ్జెక్టు నీకు దెయ్యం. అవునా— పరీక్షలముందు నేరే యింపార్టెంట్ క్వశ్చెన్స్ రాసి యిచ్చేను. కంఠతా పట్టావ్. మంగళగిరి విహార యాత్రలో బస్సు వెనక సీట్లో కూర్చుని ఒక్క సిగరెట్టునీ ఇద్దరం ఆరగా ఆరగా కాల్చుకున్నాం. ఇవన్నీ మరొప్పుడైతే గుర్తుపెట్టుకోవలసిన అవసరం నాకుండేది కాదేమో ! పెద్దవాడితో నా పరిచయం మళ్లా గానే ఎన్నో సంవత్సరాల క్రితం నీ నా అనుబంధం మైన్యూట్ డిటేయిల్స్‌తో సహా గుర్తుకొస్తుంది. ఇట్ఈజ ఠ్రిల్ టుమీ.'

సుబ్బ : మంగా నేను నీ సుబ్బరాజుని.

మంగ : (కాసేపు మవునంగా ఉండి పోయి అన్నాడు) మా ఇంటికి రమ్మని పిలవడానికి రాలేదు. మా ఇల్లు నరకం. నువ్వీ వూళ్లో ఉన్నంతవరకూ నీ పక్కనే ఉండాలని ఉంది.

సుబ్బ : అలాగే.

మంగ : మరో ముఖ్యమైన కోరిక. రేపు సాయంత్రం నీకు జరగబోయే సన్మాన సభకి మీ డిస్ట్రిబ్యూటరు బావ మరిది వొస్తాడు. వాడికి నేనుగా నిన్ను పరిచయం చేస్తాను. నీ దగ్గరున్న సిగరెట్లలో ఒకటి నేను కాల్చుకుని, మరోటి వాడి మొహాన్ని కొడతాను. అప్పటి గ్గాని నా క్వాలిఫికేషనేమిటో వాడికి తెలిచ్చావదు. నన్ను ఏద్దేవా చేస్తాడు? ఈ దెబ్బతో వాడు హడిలి చచ్చి నాకుద్యోగం ఇస్తానని మనిషితో ఖబురంపగా మానడు, నేను దాన్ని త్రోసివేయికా తప్పదు. అంత చిన్న మనసుగల మనిషి దగ్గర నేను చస్తే ఉద్యోగం చేయ నసలు.

సుబ్బ : (నవ్వేడు)

మంగ : ఎందుకురా నవ్వుతావ్?

సుబ్బ : నీ ఖబుర్లు అప్పుడూ ఇప్పుడూ ఒకలాగానే ఉన్నాయి. ఏం మార్పు లేదు.

మంగ : నేను పెరిగి పెద్దవాడ్నవుతున్నకొద్దీ లోకంమీద కసి గూడా పెరిగిపోతోంది. దీని రిజల్టేమిటో గాని కసికి లొంగిపోయేను. ఈమధ్య మా ఇంట్లోనూ నా ధూంధాం లెక్కువైపోతున్నాయి. పేదవాడి కోపం పెదవికి చేటన్న తెలిసి గూడా అదుపులో పెట్టుకోలేక పోతున్నాను. (వెయిటర్ వచ్చేడు. అతన్ని చూచి మంగపతి మాట లాపేశాడు)

వెయి : సార్. ఎవరో ప్రెసిడెంట్‌గారట. మీతో మాటాడాలిట. రమ్మంటారా?

సుబ్బ : రమ్మను. (మంగపతి నుద్దేశించి) మనం తర్వాత తీరుబడిగా మాట్లాడుకుందాం గాని ఆ లోపలి గదిలో రెస్టు తీసుకోరా.

(మంగపతి కుంటుకుంటూ లోపలి గదిలోకి వెళ్ళేడు. ప్రెసిడెంట్ వచ్చేడు. స్టైలూ హంగామాతో వెలిగిపోతున్నాడు. వచ్చీ రాంగానే అన్నాడు—)

ప్రెసి : నమస్కారం సార్!

సుబ్బ : కూర్చోండి.

ప్రెసి : (కూర్చున్నాడు) మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానేమో. నా కర్తవ్యం నెత్తిమీద కెక్కి కూర్చుంది. నేను స్థానిక కళాశాల విద్యార్థి సంఘానికి ప్రెసిడెంటుని.

సుబ్బ : ఐ సీ.

ప్రెసి : మీ రీ వూరు వచ్చారని తెలిసిన మరుక్షణం నుంచే, మిమ్మల్ని మా కళాశాలకి ఆహ్వానించడానికిగాను మా వాళ్ళు తొందర చేయడం ప్రారంభించేరు. అందుచేత విధిగా నే నిక్కడికి రావలసి వచ్చింది.

సుబ్బ : థేంక్స్. కానీ రే పొక్కరోజే నే నీ వూళ్ళో ఉంటున్నాను.

ప్రెసి : రేపే ఒక్కగంట టైమ్ మాకు వినియోగించవలసిందిగా కోరుతున్నాను.

సుబ్బ : సారీ మిస్టర్. రేపు నేను చాలా బిజీగా ఉంటాను. ఇక్కడికి దగ్గర్లోనే మా వూరుంది. ఉదయం అక్కడికివెళ్ళి సాయంత్రం వచ్చి ఒక గంటా, గంటన్నర పాటు నాటకోత్సవాల్లో గడిపి మళ్ళా వెంటనే మద్రాసు వెళ్ళిపోవాలి.

ప్రెసి : రేపున్న పన్నెండు గంటల్లో ఒక్కగంట మాకోసం స్పేర్ చేయలేరా?

సుబ్బ : దటీజ్ ఇంపాజిబుల్!

ప్రెసి : నిరుత్సాహపరచకండి. ఒకప్పుడు మీరూ ఈ కాలేజీ విద్యార్థే నన్నమాట మరిచిపోకండి.

సుబ్బ : కానీ నా ప్రోగ్రాం మార్చుకోడం కష్టం.

ప్రెసి : ప్లీజ్.

సుబ్బ : చూడండి మిస్టర్! మాకు రావడానికే విధమైన అభ్యంతరమూ లేదు. కానీ మీ రీ ప్రోగ్రాం నాలుగు రోజుల ముందే నాకు తెలిజేస్తే నే నేదో ఇబ్బందిపడి అడ్జెస్ట్ చేసుకునే వాడిని. తీరా ఇప్పుడొచ్చి ఇలా ప్రాణంమీద కూర్చుంటే నేనేం చెప్పేది.

ప్రెసి : (కోపం వచ్చేసింది) మనుష్యులు గమ్మత్తుగా మారిపోతారు.

సుబ్బ : మీరు సూటిగా మాట్లాడితే బాగుంటుంది.

ప్రెసి : మనిషైన ప్రతివాడు పుట్టిన మరుక్షణంలోనే గొప్పవాడై వెలిగిపోడు సుమండీ!

సుబ్బ : కొత్త విషయమేమీ కాదు విని ఆశ్చర్యపోడానికి.

ప్రెసి : (లేచేడు) ఒక్కసారి మీ గతాన్ని నెమరేసుకోండి సుబ్బరాజుగారూ! మీరింత ప్రయోజకులవ్వడానికి ఏ కొంచమైనా సాయపడింది మీ చదువు. అది మీరు కాదనలేరు. మీరీ కాలేజీలో నాలుగేళ్ళపాటు చదివేరు. చాలా మందిలా సర్వసాధారణంగా చదువుకున్నారు. మీ కృషి గానీండి లేదా మీగీత అనండి— ఈ నాడు ప్రముఖులై అంతమాత్రం చేత మిమ్మల్ని నాలుగేళ్ళపాటు ఆదరించిన పోయేరు. ఈ కాలేజి ఆవరణనీ, అక్కడున్న ఉపాధ్యాయుల్నీ, మీకు సోదరసమానులైన విద్యార్థుల్నీ మరచిపోవడం నేరం. ఒక్కటి మాత్రం మరచిపోకండి— ఎవ్వరో నిర్వహించిన నాటక పోటీలకు హాజరై, అక్కడ మీ విజ్ఞానాన్ని వెదజల్లి హాజరైన వారందరిచేతా భేషనిపించుకుని సన్మానం చేయించుకొనే సందడి కంటే–తల్లిలాంటి మీ విద్యాసంస్థకొచ్చి ఒక్కనాటు మీ సోదరులందరితో మనసు విప్పుకు మాట్లాడి, వాళ్ళ అభిమానం పంచుకోడమనే పండగ ఏ మాత్రమూ తీసిపోదు. సరే...మీరు రాలేనని చెప్పేరు. రమ్మని మావాళ్ళందరి తరఫునా ప్రాధేయపడి ఆహ్వానించేను. రేపుదయానికి మనమధ్య జరిగిన ఈ సంభాషణ వూరంతా తెలుస్తుంది. ఊళ్ళో ఉన్న పెద్దమనుషుల విషయమేమోగాని విద్యార్థుల సహనశక్తి మీకు తెలియందేమీ కాదు గనక నేను ప్రత్యక్షంగా చెప్పక్కర్లేదు. సెలవు—

(అతను వెళ్ళబోయేడు.)

సుబ్బ : (నవ్వేడు) ఆగండి.

ప్రెసి : (ఆగిపోయాడు)

సుబ్బ : ఇలా నా దగ్గరిగా రండి.

ప్రెసి : (వొచ్చేడు)

సుబ్బ : చేయి కలపండి.

ప్రెసి : (సందేహిస్తూ చేయి కలిపేడు)

సుబ్బ : ఈ సుబ్బరాజు మీ సవాలుకి భయపడేంత భీరువు కాదు. నన్ను ఆహ్వానించడాని కొచ్చిన ప్రెసిడెంట్ నేను చదివినప్పుడున్న ప్రెసిడెంట్ కే మాత్రం

సరిపోతాడో చూద్దామనే ఉద్దేశంతో నే నింత వరకూ నాటకం ఆడేను. కళాశాలలో ఆనాడు తాండవించిన ఉత్సాహం ఈనాడు కించిత్తైనా తగ్గలేదని మీరు నిరూపించేరు. గర్వంగా ఉంది నాకు. నాకు చదువు చెప్పిన సంస్థ మీరు అభిమానిస్తున్న నాలాటి వాళ్లని ఇంకా చాలామందిని తయారు చేయగలదనే ధీమా మీ ధోరణి విన్నాక కలిగింది.

ప్రెసి : (ఆశ్చర్యపోయేడు)

సుబ్బ : సినిమా మనుషులం. గాలివాటు మాటలు నేర్చిన ఘనులమని నే చెప్పేది కొట్టి పారేయకండి. సద్వినియోగం చేసుకుంటే అదే పదివేలు. చెప్పండి. మన కాలేజికి నన్నెప్పుడు రమ్మంటారో చెబితే నే నా వేళకి ఒక్క నిమిషం అటూ ఇటూ గాకుండా వచ్చి చేరతాను.

ప్రెసి : థాంక్యూ సార్......థాంక్యూ. నా మాట మన్నించి నందుకు ఆనందంగా ఉంది.

సుబ్బ : బై ది బై—రేపు మన సమావేశంలో మీతో పోటీ చేసి ఓడిపోయిన మీ ప్రత్యర్థిని చూడాలని ఉంది. అది నా కోరిక.

ప్రెసి : అలాగే సార్ (వెళ్లబోయేడు)

సుబ్బ : ఆగండి! టైం చెప్పి మరీ వెళ్లండి.

ప్రెసి : సాయంత్రం నాలుగ్గంటలకి ఏర్పాటు చేశాను సార్.

సుబ్బ : అప్పుడే అన్ని ఏర్పాట్లూ ముగిసాయన్నమాట.

ప్రెసి : ఆ బాధ్యత స్వయంగా నేనే తీసుకున్నాను.

సుబ్బ : వెల్.

ప్రెసి : వస్తానండి. రేపు మూడున్నర ప్రాంతాల్లో మళ్లా నేనే వస్తాను.

సుబ్బ : కాదు. మీ ప్రత్యర్థిని పంపండి. అత నెంత ఘనుడో చూడాలని ఉంది.

ప్రెసి : (నవ్వేశాడు అమాయకంగా) అలాగేనండి. శెలవు. (వెళ్ళిపోయాడు)

సుబ్బ : (కాసేపు చేత్తో గడ్డం రుద్దుకున్నాడు. రేపు సాయంత్రం ఆడిటోరియంలో హాజరవ్వబోయే ప్రేక్షకుల్ని ఉద్దేశించి అన్నాడు) ఈ సభకి నే నింత ఆలిస్యంగా రావడానికి కారణం మా కాలేజీ విద్యార్థులూ, వాళ్ల అభిమానమూను. అక్కడ వాళ్ల ముందు నించుని మాటాడుతుంటే అయిదేళ్లక్రితం మధుర స్మృతులెన్నో గుర్తు కొచ్చేయి. ఆ తన్మయత్వంలో నేనెంతసేపు మాటాడానో గమనించే కలగ లేదు. ఇక్కడ మీరందరూ నాకోసం ఎదురుచూస్తుంటారనే విషయాన్ని పూర్తిగా మరిచిపోయేను. (గుమ్మం దగ్గిర నించుని ఈ నాటకం గమనిస్తున్న మంగపతికి విడ్డూరంగా ఉంది) అక్కడి మా వాళ్లందరూ నన్ను చూచి గర్విస్తున్నామని చెప్పేరు. నాకు వాళ్ల ఉజ్జ్వల భవిష్యత్తు మీద నమ్మకం కలుగుతున్నాయి—(మంగపతి వచ్చి సుబ్బరాజు భుజంమీద చేయి వేశాడు. సుబ్బరాజు ఉలిక్కిపడ్డాడు)

మంగ : ఏమిటిది రాజూ!

సుబ్బ : (కొంచెం సిగ్గుపడ్డాడు) నాకీ మధ్య బాగా అలవాటై పోయింది మంగా! మా యూనిట్ వాళ్లకిది మొదట్లో కొత్తనిపించినా ఇప్పుడిప్పుడు పట్టించుకోడం లేదు.

మంగ : అవుతే నీలాటి వాడికీ రిహార్సిలు అవసరమే నన్న మాట.

సుబ్బ : అది మంచి చేస్తుందేగాని, కీడు చేయదుగా.

(వెయిటర్ వచ్చేడు)

వెయి : సార్! ఆంజనేయులుగారు మీ గదికేసి వస్తున్నారు సార్

సుబ్బ : సరే.....నీకేం తెలిసినట్టు నువ్వెళ్లిపో. నే నా తమాషా చూస్తాను.

(వెయిటర్ వెళ్ళిపోయేడు)

మంగ : ఆంజనేయు లెవరు?

సుబ్బ : ఒక హనుమంతరావు. సినిమా ఛాన్స్ కోసం కోతి వేషం వేస్తున్నాడు. కాసేపట్లో నీ కంతా అర్థమవుతుందిగా. ఓపికపట్టు. సరే. నువ్వా సోఫాలో గమ్మున కూర్చో. జరిగేది చూస్తుండు.

(మంగపతి కూర్చున్నాడు. ఇందాక సుబ్బరాజిచ్చిన సిగరెట్టుని ఇప్పుడు ముట్టించుకున్నాడు. ఆంజనేయులు వచ్చేడు. చేతిలో రెండు పుస్తకాలున్నాయి.)

ఆంజ : విన్నారా......రేపు సాయంత్రం శ్రీ సుబ్బరాజుగారు ఈ వూరొస్తున్నార్ట. ప్రస్తుతం నే నెంత ఇబ్బందిలో పడిపోయానంటె—ఆయనే స్వయంగా బహుమతు లిస్తారన్న విషయం ముందే తెలుస్తే మా వాళ్లందర్నీ కలుపుకుని ఈ నాటక పోటీల్లో నేనూ ఓ ఎంట్రీ పారేసి ఉందును. ఖచ్చితంగా ఆ యేడాది ఉత్తమ నటుడిగా నేనే ఎన్నికయ్యేవాడిని. కానీ ఖర్మంకాలి అలా జరగలేదు. ప్రస్తుతం నే నెంత విచారించినా లాభమేమిటి?

ఆయొక్క సుబ్బరాజుగారు నా యొక్క నటనా చాతు ర్యాన్నెలా గుర్తించగలరు?

సుబ్బ : ఈ సుబ్బరాజెవడోగానీ మహా ఘనుడిలా కనుపిస్తు న్నాడు సుమాండి.

ఆంజ : ఆయన జీవితం వర్ధించిన విస్తరి. అదృష్ట జాత కులు. అందుచేతనే ఆయన చేత్తో తాకిన ప్రతి సినీమా శత దినోత్సవం చేయించుకుంటుంది. ప్రస్తు తం జనం ఆయనకి బ్రహ్మరథం పట్టేస్తున్నారు.

సుబ్బ : ఆయన గురించి మీకు చాలా తెలుసులా ఉంది. కానీ నా విషయం వేరు. నేనీ సినీమాలూ, గినీమాలు నాటకాలూ, గీటకాలూ అంటే చాలా దూరంగా ఉంటాను. నా వ్యాపార మేమిటో నేనేమిటో అంతే. ఇందాక ఓ తమాషా జరిగింది. మీ కది తెలీదు. చెప్పేదా?

ఆంజ : (ఆశ్చర్యపోయేడు) చెప్పండి.

సుబ్బ : మీ రంటూన్న సుబ్బరాజు ఈ హోటల్లో దిగేడన్న పదంతి విని ఎవరో ఒక కుర్రాడు ఇక్కడికి వచ్చేడు. తిన్నగా నా గది కొచ్చి పలుకరించి ఏమిటేమిటో మాటా డేడు. అది ఓ పట్టాన నా కర్థం కాలేదు. చివరికి తేలిందేమిటయ్యాంటే; అతను నన్నే సుబ్బరాజుగా పోల్చుకుని వచ్చాట్ట. పైగా ఆ వేయిటరో హాడు— అతని నమ్మకానికి మద్దతు యిచ్చాట్ట. వింటూన్న నాక్కు జాలి కలిగింది. 'క్షమించండి! మనిషిని పోలిన మను షులు చాలామంది ఉండొచ్చు. నేను సుబ్బరాజుని కాదు. సుబ్బరా జెవరో గూడా తెలీని అజ్ఞానిని అవ టాని' ప్రాధేయపడ్డాను. చివరికి అతనికి నా మాట మీద నమ్మకం కుదిరి క్షమించవలసిందిగా కోరి మరీ వెళ్ళిపోయేడు. అతనలా వెళ్లాడు, మీరిలా వచ్చారు. అతన్ని మీరు చూచే ఉంటారు.

ఆంజ : (నెత్తిమీద పిడుగు పడినట్లయింది) అవునండి. అంటే, మీరు……

సుబ్బ : కాను. నేను సుబ్బరాజుని కాను.

ఆంజ : నిజమాండి? ప్రస్తుతం……

సుబ్బ : అంటే మీరూ నన్నే సుబ్బరాజనే అనుకున్నారా?

ఆంజ : అవునండి. అబ్బే కాదండి. అలా అని అనుమానించేను

సుబ్బ : (నవ్వేడు) అనుకున్నారో, అనుమానించారో, అది వేరే విషయం. ఇంతకు మునుపు సుబ్బరాజుని ఆకాశాని కెత్తేరుగదా మరి అదంతా—

ఆంజ : (చిన్నబుచ్చుకున్నాడు) అదాండి! నా మనసులో వున్న మాటండి.

సుబ్బ : నిజంగా నేనే ఆ సుబ్బరాజునైతే మీ కీ పాటికి ఘన మైన సత్కారం చేసి ఉందును. మీ దురదృష్టవశాత్తూ—

ఆంజ : (నీరసంగా అన్నాడు) పోనీండి. ఎవరి కర్మ కెవరు బాధ్యులు? ప్రస్తుతం నే నిక్కడా ఫెయిలయ్యాను. దుర్విధి నామీద పగబట్టి తమాషా చేస్తోంది. అవమా నిస్తోంది. వస్తానండి. సెలవు.

(ఆంజనేయులి ఉత్సాహం చల్లారిపోయింది. బరువుగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయేడు. కొంతసేపు మౌ నంగా గడిచింది. సుబ్బరాజు సిగరెట్టు ముట్టించు కుని అడిగేడు.)

సుబ్బ : అర వైయిందిటరా మంగా!

మంగ : నిక్షేపంగా.

సుబ్బ : ఇన్నేళ్ల అనుభవంలో నేను చాలా తమాషాలు చూశాను.

మంగ : జీనియస్సువిరా రాజా! చదువుకునే రోజుల్లో చాక లాటి ఈ తెలివి ఎక్కడ దాచావోగానీ ఇప్పుడు వెలిగి పోతున్నావు.

సుబ్బ : (కులాసాగా భుజం కదిపేడు) నేనోటి చెప్పేదా మంగా! కాలేజీ నాలుగ్గోడల్లో నీతోపాటు కలిసి చదువుకున్న ప్రతివాడు ప్రయోజకుడై సంఘాన్ని ఉద్ధరించేస్తా డనుకోడం, లేదూ—నువ్వూహించిన మనిషి ఎందుకూ పనికిరాని చవటగా తయారవుతాడనుకోడం పొరపాటు. మనిషిని వున్న పళంగా పెంచి పెద్ద చేయడంగానీ, వెధవగా ముద్ర వేయడంగానీ అక్కడ జరగవు. జీవితమనే వైకుంఠ పాళీలో కాలేజీ ఒక చిన్న చదరం. చలనం కలుగితే పాము నోట్లోనైనా పడొచ్చు, నిచ్చె నైనా ఎక్కొచ్చు.

మంగ : నువ్వు మునుపటి రాజువి మాత్రం కాదు.

సుబ్బ : కావచ్చు. కానీ అనుక్షణం నన్ను ఒక వి. ఐ. పి. క్రింద జమకట్టి మాటాడకు మంగా! అది నా క్కొంచెం కష్టంగా ఉంటుంది.

మంగ : నీతో మాటాడుతూంటే నా ఒళ్ళెందుకో పులక రిస్తోంది. మనసు తూగుటుయ్యాల లూగుతోంది. ఏదో గ్రేట్‌నెస్ అనుభవిస్తున్నాను. నువ్వు నా సుబ్బ రాజువే. కానీ……కానీ సరిగ్గా చెప్పలేక పోతున్నాను రాజూ.

సుబ్బ : పోనీలే……ఇంకా ఏమైనా ఖబుర్లు చెప్పు.

మంగ : ముందే అన్నాను. నా నోటినుంచి నువ్వినదగ్గ విశేష మేమీలేదని. గనక తమాషా ఖబుర్లు నువ్వే చెప్పు వింటాను.

సుబ్బ : సినిమా ప్రపంచంలో తమాషా ఖబుర్లకు తక్కువేమీ గావులే మంగా! నీకూ అనుభవంమీద తెలుస్తాయిలే.

మంగ : (అదిరిపడ్డాడు) నాకు అనుభవం మీదనా?

సుబ్బ: ఎక్జాక్ట్లీ!

మంగ : రాజా! ఏమిట్రా నువ్వనేది?

సుబ్బ : పుట్టిన మరుక్షణమే నేను డైరక్టర్ని కాలేదు. కృషి— కొంచెం జాతకం. మంగపతే కాదు సురో నారాయణ రావైనా పైకొచ్చేందుకు అవకాశం ఉందక్కడ. నిజంరా మంగా.

మంగ : పెద్దవాడవ్. అపహాస్యం చేయకు.

సుబ్బ : ప్రెసిడెంటూ, ఆంజనేయులూ నాకు పరాయివాళ్ళు. వాళ్ళతో ఎప్పటి కయ్యేదన్నట్టు తాళం వేశాను. మంగపతి నా హార్ట్. ఆత్మహత్య చేసుకోడం చాత కాదు.

మంగ : నీ మాటలు వింటూంటె నా కళ్ళు తిరిగి పోతున్నట్టుంది.

(సుబ్బరాజు మళ్ళా నవ్వేడు. ఇంతలో నమస్కారమంటూ ఓ వ్యక్తి వచ్చేడు. అతని మెళ్ళో కెమేరా ఉంది. చేతిలో ఫైలుంది. వచ్చీ రావడంతోనే విజిటింగ్ కార్డు సుబ్బరాజు కిచ్చేడు. సుబ్బరాజు చదివి అన్నాడు.)

సుబ్బ : పత్రికా విలేఖర్లన్నమాట. అలా కూర్చోండి.

విలే : (కూర్చున్నాడు) నేను రావడం కొంచెం ఆలస్యమైంది.

సుబ్బ : కాఫీ తాగుతారా? కూల్ డ్రింక్సు తీసుకుంటారా?

విలే : నో థేంక్స్. ఏమీ వద్దు.

సుబ్బ : పోనీ మంచి నీళ్ళైనా.

విలే : వద్దండి.

సుబ్బ : మీ పత్రికని నేను చదువుతూనే ఉన్నాను. సినిమా గురించి చాలా పత్రిక లొస్తున్నాయి గానీ మీ పత్రికంత ముచ్చటగా మరోటి రావడంలేదని నేనే కాదు మావాళ్ళు చాలామంది అన్నారు.

విలే : థేంక్స్. మీలాటివారి అభిమానం మా కెంతైనా అవసరం. మీ రొస్తున్నట్టు తెలిసింది. రేపొచ్చే స్పెషల్ యిష్యూలో మీ గురించి ప్రత్యేకమైన పరిచయం తయారు చేసుకుంటున్నాం. సాంప్రదాయమూ తెలిసిందే గనక కార్యక్రమం ప్రారంభిద్దాం.

సుబ్బ : (ఉత్సాహంగా ముందుకి జరిగేడు. సిగరెట్టు ముట్టించేడు) కానివ్వండి.

విలే : మీ వయస్సెంత?

సుబ్బ : ముప్పై తొమ్మిదిలో పుట్టాను.

విలే : అంటే పాతిక సంవత్సరాలు నిండాయన్నమాట.

సుబ్బ : (తలూపేడు)

విలే : ప్రముఖ దర్శకుల్లో వయస్సు పరంగా మీరు కుర్రవాళ్ళు. ఈ మధ్య అన్ని రంగాల్లోనూ యువకులుచేరి ఆ యా రంగాల స్థాయిని పెంచడానికి చేస్తున్న కృషి ఫలిస్తుందనడానికి మీరూ ఒక నిదర్శనమని అంటాను. మీరేమంటారు.

సుబ్బ : ఈ విషయంలో స్వాభిప్రాయంకంటే ముఖ్యమైంది మీ లాటివారి అమూల్యాభిప్రాయమే!

విలే : థేంక్స్. మీరింతవరకూ ఎన్ని చిత్రాల్లో పని చేశారు?

సుబ్బ : మూడు.


విలే : మూడూ శత దినోత్సవాలు చేసుకున్నవేగా.

సుబ్బ : అవును.

విలే : చిత్రరంగంలో ప్రవేశించడానికి మునుపు మీరేం చేసేవారు?

సుబ్బ : ప్రవేశం సంపాయించుకోడానికి ప్రయత్నాలు చేసేవాడిని.

(సశేషం)



పోతన*

శ్రీ నోరి నరసింహశాస్త్రి

ఇవి భారతీయ సాహితీవేత్తలు, అను శీర్షికతో నేషనలుబుక్ ట్రస్టు వారు భారతీయ భాషలలో ముఖ్యములైన తొమ్మిదింటిలోనికిని ఆంగ్లములోనికిని అనువదింపజేసి భారతీయకవి ప్రకాండులను భారతదేశము లోని అన్ని ప్రాంతముల వారికే కాక ప్రపంచ సాహితీవేత్తలందరికీ పరిచయముచేయు ఉదాత్తాశయముతో ప్రచురింపబడిన గ్రంథములలో ఒకటి. ఆంధ్ర భాషా కవులలో మహనీయులెందరో ఉన్నను, ముందు పోతనను గ్రహించుట సమంజసముగా నున్నది. పోతన వలె పండిత పామరులకు సమానముగా అభిమాన గౌరవ పాత్రుడైన ఆంధ్ర కవి ఇంకొకడు లేడు గదా! భారతీయ భాషా కవులలో పోతనకు తులసీదాసుతో సమానమగు స్థానము కలదు.

ఇట్టి గ్రంథమును వ్రాయుటకు శ్రీ వేంకటరావు గారిని ఎన్నుకొనుట సర్వ విధముల యుక్తముగా నున్నది. ఆంధ్ర కవితా విమర్శనలోను పరిశోధనలోను వారికి విశేషానుభవమున్నది. వారికి గ్రంథ రచనలో అభ్యాసము కూడా అపారముగా నున్నది.

ప్రచురణకర్తలు తమపై పెట్టిన భారమును నిర్వహించుటకు శ్రీ వేంకటరావుగారు ఎంతో శ్రద్ధగా సర్వతోముఖముగా ఆలోచించి విశేష శ్రమపడి ఈ గ్రంథము రచించినారు. దీనిని సర్వవిధముల సంపూర్ణముగా చేయుటకు వారు చేసిన కృషి ఈ గ్రంథములో సర్వత్ర గోచరించుచున్నది. బహు గ్రంథకర్తలైన వీరు తమ రచనలలో నెల్ల 'పోతన' రచనకు అపరిమిత శ్రద్ధ వహించిరనుటకు ఎట్టి సందేహమును లేదు.

విషయ సూచిక చూచిన మాత్రముననే వారిది ఎంత ఆలోచనా పూర్వకముగా రచించిరో విస్పష్టము కాగలదు. అవతారికలో పోతనను ఆంధ్ర శుక యోగిగా వర్ణించి, రెండవ ప్రకరణములో భారతీయ భాషలలోని భాగవతానువాదము లన్నిటిలో పోతన భాగవత విశిష్టతను నిరూపించుచు పోతనను తులసీదాసుతో పోల్చి వారిద్దరు రామకృష్ణ భక్తి సాహిత్యములకు తీర్థభూతులని నిర్వచించిరి. ఆ తర్వాత పోతన అవతరించు నాటి దేశకాల మత పరిస్థితులను ఒక ప్రకరణములో తెలిపి, మరియొక ప్రకరణములో పోతన ఇతర కృతులను తెలిపిరి. 5 వ ప్రకరణములో పోతన ఏయే స్కంధములు వ్రాసినది విమర్శించిరి. 6 వ ప్రకరణములో పోతన ఆంధ్రీకరణ విధానమును ఉదాహరించిరి. ఆ తర్వాతి దానిలో పోతన కవితా లక్షణములను తొమ్మిదింటిని పేర్కొనిరి. 8 వ దానిలో పోతనలో మూడు భక్తి రీతులు కలవని వివేచించిరి. పిమ్మటి ప్రకరణములో శ్రీనాథ పోతనల గూర్చిన మహత్వ కథలు వర్ణించిరి. 10 వ దానిలో పోతన అనుసరించిన పూర్వ కవులను, పోతన ననుసరించిన ఇతర కవులను విష్పులీకరించిరి. 29 పుటలున్న ఈ ప్రకరణములో ఒకటి రెండు పేజీలు తప్ప తక్కినదంతయు ఉదాహరణ రూపమైనదే. 11 వ దానిలో పోతన వ్రాయని ఇతర స్కంధములు వ్రాసిన కవులను గంగన నుండి నేటి కాలపు శ్రీ మిన్నికంటి గురునాథశర్మగారి వరకు తెలిపిరి. ఆ తర్వాత భాగవతములోని ఉపాఖ్యానములను భాగవతా దర్శమును తెలుపుటకు ఒక ప్రకరణము ప్రత్యేకించిరి కాని అది రెండు పేజీలపైన కొద్ది పంక్తులు మాత్రమే కలదు. పరీక్ష పేపరు వ్రాయు విద్యార్థులు ఉత్తరము వ్రాయుటకిచ్చిన సమయమో స్థలమో అయిపోవుటచేత చివరి భాగము సంకోచించి వ్రాసినట్లే సరిగా ఈ చివరి ప్రకరణ ముండుట శోచనీయము.

ఆ తర్వాత అనుబంధమున్నది. అందులో ముందు పోతన భాగవత మహాత్మ్యమును గూర్చి 'సాక్షి!' నుండి ఆరున్నర పేజీలతో తెలిపిరి. పిమ్మట మరి ఆరున్నర పేజీలతో పోతనను స్తుతించిన కవుల స్తుతులను శ్రీ వేంకటరావు గారి వరకు ఉదాహరించిరి. ఇందులోనే పోతన వంశమును గూర్చి ప్రస్తావించిరి గాని ఆ విషయ మెందువల్లనో గాని తగినంతగా విస్తరింపలేదు. 3 వ అనుబంధములో సంకలన గ్రంథములలో నుదాహరించిన భాగవత పద్యములు తెలిపిరి. చివరి అనుబంధములో భాగవతమును అనువదించిన వారియు అనుసరించిన వారియు వివరములను విమర్శలను టీకాదులను వ్యాఖ్యాదులను తెలిపిరి. ఈ విధముగా ఈ గ్రంథ రచనకు గ్రంథకర్త చేసిన విస్తార పరిశ్రమను ముఖ్యముగా అభినందించుచున్నాను.

---

* గ్రంథకర్త : శ్రీ నిడుదవోలు వేంకటరావు. ప్రకాశకులు : నేషనల్ బుక్ ట్రస్టువారు—భారత ప్రభుత్వ సమాచార, రేడియో మంత్రిత్వశాఖ, ప్రచురణ విభాగము డెమ్మీ 1/8 పేజీలు. 238 పే : రు. 2-75.

కాని ఇంత శ్రమ చేసి వీరు వ్రాసిన పుస్తకము ఉద్దిష్టమైన ప్రధాన ప్రయోజనమును సాధింపగలదా అను సందేహము మాత్రము, గ్రంథమును అశ్రద్ధగా తిరగవేసిన వారికి కూడ కలుగకపోదు. గ్రంథములో సగముకంటె ఎక్కువ పాలు ఉదాహృత పద్యములతోనే నిండి పోయినది. ఇతర భాషల లోనికి అనువదించినపుడు వాని ప్రాణము పోవును. అనుసరణములోను, అనుకరణములలోను ప్రధానముగా శబ్ద సామ్యముండుటచే, అవి భాషాంతరీకరణములలో ఎంతమాత్రము బోధపడవు. పోతన కవిత్వమునకు ఉదాహరణములైనచో నవి తప్పవు. కాని ఇట్లుదాహరించిన వానిలో పోతన పద్యములెన్నో, అంతకంటె ఇతరులవే ఎక్కువేమో అనిపించునంతగా ఉన్నవి. ఈ గ్రంథానువాదములు ఆంధ్రేతరులు చదివి పోతన అతిశయము తెలిసికొనుటకు ఉద్దేశింపబడినదను భావముతో చూచినచో, గ్రంథకర్త దూరమాలోచించినట్లు తోచదు. వారి ఉత్సాహాతిశయము ఉచితజ్ఞతను మరపింప జేసినది.

మరల నట్టిదే మరియొక పొరపాటు రెండవ ప్రకరణములో చేసినట్లు తోచును. అందులో దేశ భాషలలో వచ్చిన భాగవతానువాదములలోనెల్ల పోతన భాగవతము ఉత్తమమైనదని ప్రతిపాదించిరి. తమ తమ భాషలలో ప్రసిద్ధులైన కవులమీద ఈగ వ్రాలినను సహింపని దురభిమానము ప్రతి భాషాభిమానులకు విపరీతముగా నేటి కాలములో వృద్ధి పొందుచున్న సంగతి జగద్విదితము. అందువల్ల ఆ యా భాషలలోని భాగవతములను గూర్చి వ్రాయు మాటలు ఆ యా భాషాభిమానులకు నొప్పి కలిగింపకుండ వ్రాయుట అత్యవసరము. శ్రీ వేంకటరావుగారు సూరసాగరము గూర్చి వ్రాసినది హిందీ ప్రాంతమువారు గాని, జగన్నాథదాసు భాగవతమును గూర్చినది ఓఢ్రులుగాని, ఏకనాథుని గూర్చినది మహారాష్ట్రులుగాని, ఎజుత్తచ్చన్ను గూర్చి వ్రాసినది మళయాళులుగాని చదివి హర్షింపరు. జగన్నాథదాసు భాగవతమునకు ఉత్కళదేశమున దేవాలయములు గూడ కట్టబడుచుండునంత భక్తిభావము కలదు. 'అస్సామీ' భాషలో శంకరదేవుని భాగవతమును గూర్చి వ్రాసిన దానినిబట్టి, శ్రీ వేంకటరావుగారికి దాని మంచి చెడుగులు తెలియవని స్పష్టమగుచున్నది. ఇతర భాషల భాగవతముల గూర్చియు వారికి తగినంతగా తెలిసినట్లు లేదు. కొన్నిటికి ఆ భాషా కవి పూర్తిగా వ్రాయలేదని లోపము చూపిరి. అది పోతనకును అన్వయించును గదా! కొందరు కొన్ని భాగములనే ప్రధానముగా పెట్టుకుని పెంచినారని లోపముగా చూపిరి. పే. 83 లో పోతన దశమ స్కంధమును గూర్చి వ్రాయుచు "ఈ స్కంధము మూలముకన్న మూడు నాలుగు రెట్లు తెలుగు సేతలో పెరిగినది" అని వ్రాసిరి. అందుచే ఆ లోపము పోతనకు కూడ అన్వయింపవచ్చును. ఒరియా భాషలోని భాగవతములో వంగ వైష్ణవ సంప్రదాయములు కనబడుట లోపముగా ఎన్నిరి: అద్వైత మార్గ మవలంబించుట పోతన లోపముగా వారు గణింపగూడదా? కీ. శే. ఉన్నవ లక్ష్మీనారాయణగారు వైష్ణవపరమైన భాగవత మూలమును అద్వైత పరము చేసి పోతన తారుమారు చేసెనని ఉపన్యాసములలో ఉద్ఘాటించెడి వారు.

అందువలన ద్వితీయ ప్రకరణాంత భాగములో "దీనిని బట్టి యా యా భాషలలో భాగవతానువాదమునకు పోతన వంటి సమర్థుడగు మహాకవి జన్మించలేదని చెప్పవలసియున్నది" అని వ్రాసిన మాటలు ఇతర భాషలవారికి రుచింపవనియు, వారికి పోతనలో లోపములు వెదుకవలెనను పట్టుదల పెరుగుననియు గ్రంథకర్త ఆలోచించి యుండవలసినది. అదికాక సర్వ భాషల భాగవతములను పరిశోధించిన వారే కాని అట్టి యభిప్రాయ మిచ్చుటకు అధికారులు కారు. అట్టి యధికారము గ్రంథకర్తకు లేదని స్పష్టము. ఈ సందర్భములో గ్రంథకర్త ఉత్సాహాభిమానములు జాగరూకతను పోగొట్టినవి. "పోతన యనుసరించిన మార్గములో అది ఉత్కృష్టమైనది" అని వ్రాసినచో ఎవరికిని బాధ కలిగియుండదు, పోతన ప్రత్యేకతయు అతిశయమును తగ్గియుండవు.

మరియు ఈ గ్రంథములో పెక్కు తావులలో నిష్కృష్టమైన హేతువాదము లోపించినది : ఉదా:

(1) 123–124 'నవ విధ భక్తి' అను శీర్షిక క్రింద ప్రహ్లాద చరిత్రలోని 'ఈ తొమ్మిది భక్తిమార్గముల'అని యున్న ప్రసిద్ధ పద్యమును ఉదాహరించి, దాని మూల శ్లోకములో 'నవ లక్షణా' అని ఉన్న మాటను చూపిరి. ఆపైన శరీరమునకు నవ ద్వారము లున్నట్లే నవ విధ భక్తి మార్గము లున్నవనియు, ఈ నవ శబ్దమునకు నూతనము అను నర్థము కూడకలదు కావున ఇది నూతన మార్గమనియు ఏమేమో వ్రాసిరి. ఈ సందర్భములో పోతన నవ శబ్దమే వాడలేదనుమాట మరచిరి. మరి యెందు కింత వ్యాఖ్యానము!

(2) పేజీ 94 : 'శ్రీధరాచార్యుని వ్యాఖ్యానము ననుసరించుటచేత పోతన రచించిన భాగములెల్ల అద్వైత పరములుగా నున్నవి' అని పైని తెలిపి, క్రింద "శివాద్వైతి కావున పోతన, యద్వైత వ్యాఖ్యానమునే యనుసరించెను" అని వ్రాసిరి. శ్రీధర వ్యాఖ్యానము శివాద్వైత వ్యాఖ్యానము కాదు కదా! శ్రీధరుని దృష్టిలో శివాద్వైతమునకును (వైష్ణవ) విశిష్టాద్వైతమునకును ఎక్కువ భేదముండదు.

(3) పేజీ 100 : "ఇచట విశిష్టాద్వైత సిద్ధాంతము లున్నవి గాన, ఈ భాగము దశమ స్కంధోత్తర భాగము పోతనది కాదనియు కొందరు విమర్శకులు చెప్పుచున్నారు కాని యిది సహేతుకము గాదు! ఏలయనగా, సమదర్శనుడగు పోతన యిచట ప్రధానముగా కేవలము విష్ణుపరమైన తత్త్వమును గూర్చిన ఘట్టమున, తన కాలమున ప్రచుర ప్రచారములో నున్న విశిష్టాద్వైత సిద్ధాంతమును గూడ సూచించుట సమంజసమే"—ఇట్టి వ్రాతలు హేతువాదమునకు నిలువ

జాలవు. మహా భాగవతములో విష్ణుపరము కానిదేమున్నది? ఇక్కడనే విశిష్టాద్వైత పరముగా నుండుటకు కారణమేమి? ఆ భాగమునకు పూర్వమే 'ఇక్కడి నుండి నరయు రచనము' అని ఉన్నదానిని త్రోసివేయుచు గ్రంథకర్త నిర్ధారణ యుండుటచేత, తన సిద్ధాంతమునకు విరుద్ధముగా ఉన్న విషయమును ఎదుర్కొనలేక చెప్పిన సాకు. బుద్ధిమంతులిట్టి వితండవాదమునకు హర్షింపరు. ఇట్టి వింకను ఎన్నో గ్రంథ మందంతట గలవు.

మహా భాగవతములో పోతన ఏయే భాగములు వ్రాసెను, అనునది క్లిష్టమైన సమస్య, విప్పలేని చిక్కుముడి. మొత్తము మీద స్కంధాంత గద్యలను బట్టి గ్రంథకర్త సిద్ధాంతము చేసెను. ఉపలభ్యమైన వ్రాతప్రతులన్నీ సూక్ష్మముగా పరిశీలన చేసి వాని కాలము నిర్ధారణ చేయవలె. సమగ్రముగా మూలమూ మూల పాఠభేదాలు వ్యాఖ్యానాలు పరిశోధించవలె. అప్పుడు కాని కొంత ధైర్యముగా సిద్ధాంతము చేయుటకు వీలులేని దీ విషయము! అసలు ఒకరు కాదు, నూరు మంది చేయవలసినది. అట్టిది లేకుండా నేడు చేయు నిర్ధారణలు ఊహలు మాత్రమే. ఊహలు సిద్ధాంతములుగా ప్రకటించుట శాస్త్రీయమైన పరిశోధకుల పద్ధతి కాదు. అలెగ్జాండరు గార్డియను ముడిని భేదించి విజయము సాధించినాడట. అట్లే ఈ గ్రంథకర్త ఈ చిక్కుముడిని కోసివేసిరి. విజ్ఞానము విస్తరించిన ఈ కాలములో సాహిత్యవేత్తలందరికే శ్రీ వెంకటరావుగారిని అగ్గింపరు. ఈ సందర్భములో గ్రంథకర్త చేసిన వాదములో హేతువు లెన్ని యున్నవో హేత్వాభాసములును అన్ని యున్నవి. రెండవ స్కంధములోను దశమ స్కంధము ఉత్తర భాగములోను కొంతదూరము పోయిన తర్వాత 'వెలిగందల నారయ కవిత్వము' అని కొన్ని వ్రాత ప్రతులలో కనిపించుచున్నది. ఆ భాగములలో కొన్ని భాగములు అద్వైత పరములుగాను, కొన్ని విశిష్టాద్వైత పరములుగాను కనిపించుచున్నవి. కవిత్వ స్థాయి కూడ కొన్ని చోట్ల పోతన స్థాయిలోను, ఎన్నో చోట్ల మిక్కిలి దిగజారియు కనపడుచున్నది. ఇవి యన్నియు సమగ్రముగా నాలోచించుటచేతనే ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు ప్రచురించిన శ్రీ మహా భాగవత పీఠిక ముగించుచు "ఈ విషయము లోతుగా పర్యాలోచించినప్పుడు మూల గ్రంథము పూర్తిగా నష్టమైనట్లు తోచదు. ఆ యా భాగాలలో, నత్తగుల్లలలో ముత్తెపు చిప్పలవలె పెంటాకులలో పారిజాతముల లాగున, మహాకవి అమృతవాణి చెవి తాకి చిత్తమును చిగిరింపజేయుచున్నది" అని వ్రాసిరి.

పోతన రచించిన ఇతర గ్రంథము లేవి యనునది కూడ నట్టి చిక్కు సమస్యయే. వీరభద్ర విజయము పూర్తిగా చదివిన వారికి ఇది పోతన కృతియా యను సందేహము కలుగక మానదు. బాల్యకృతి యని యవతారికలో నున్నను, భాగవత రచన పిమ్మటిదని స్పష్టముచేయు పద్యము కూడ ఒకటి యున్నది. ఆ పద్యము కొన్ని వ్రాత ప్రతులలో లేదట. అందువల్ల నది ప్రక్షిప్తమని నిర్ధారణ చేసినారు. మన వాదమునకు అడ్డువచ్చిన వానిని ప్రక్షిప్తములని త్రోసివేయుట తేలిక. ఆ పద్యము ప్రక్షిప్తము చేయుటకు కారణమేమో, ఏ వ్రాత ప్రతులలో ఉన్నదో, దేనిలో లేదో సమగ్రముగా విచారణ చేయనిది నిశ్చయింప వీలులేదు. అందులో పోతన వీరమాహేశ్వరాచారవిభుడైన ఇవ్వటూరి సోమశేఖరారాధ్యుల శిష్యుడనియు, వీరభద్ర ప్రసాద లబ్ధ కవితాతిశయము కలవాడనియు గూడ కలదు. ఆ గురువుల సంగతి కాని కవిత్వమునకు వీరభద్ర ప్రసాదము కారణమను సంగతి కాని పోతన భాగవతములో కానరాదు. పైపెచ్చు విష్ణువు పారమ్యము ప్రతిపాదించు ఘట్టములును, శివుని తక్కువచేయు ఘట్టములును మూలము కంటె విస్తరించి కూడ భాగవతములో వ్రాసెను. వీరమాహేశ్వరాచారుడైనవాడు అట్లు చేయునా అను సందేహము కలుగక మానదు. తర్వాత పోతన మతము మార్చుకొనెనందుమా, ఈ గ్రంథకర్త పోతనను మొదటి నుండి చివరి వరకు 'వీరశైవు'నిగానే వర్ణించిరి. వీరభద్ర విజయములో కొన్ని పద్యములు పోతనవే యనుపించును. కొన్ని ఎంత చిన్నతనములోనైనను పోతన యిట్లు వ్రాసియుండునా యనిపించును. అవతారిక యంతయు ఎవరో 'వీరశైవు'లు చేర్చిరా యనియు సందేహింపవచ్చును. సాధక బాధకము లన్నియు నిష్పక్షపాతముగా ప్రదర్శించి ఆపైన తమకున్న అభిప్రాయము తెలుపుట న్యాయము. అట్టి దీ గ్రంథకర్త చేయలేదు.

పేజీలు 22—28: "దేశ కాల మత పరిస్థితులు: తెలుగు సాహిత్యము. మత సామరస్యము", అను శీర్షికల క్రింద వ్రాసిన దేమా వారికి తెలిసినట్లు లేదు. పైగా ఆ ప్రస్తావమును "నేటి సాహితీ లోకమున వీరశైవ మతమును గూర్చియు, నా వాఙ్మయమునకు సంబంధించిన శివ కవులు అనువారి గ్రంథములను గూర్చియు వ్రాసిన విమర్శనములు.... వీర శైవ మత సంప్రదాయమునకు మూల భూతములగు గ్రంథములను చక్కగా చదివి యవగాహనము చేసికొని.. వ్రాసినవి కావని నిరూపింపవచ్చును" అని ప్రారంభము చేసి, "పై చర్చనుబట్టి వీర శైవమున విష్ణు ప్రసక్తి యున్నదనియు, వైష్ణవమున శివ ప్రసక్తి లేదనియు నట్లు లేక పోయినను తెలుగు సాహిత్యమున కవులు సామరస్య భావమున కృతులు రచించిరనియు విశదమగుచున్నది" అని పూర్తి చేసిరి. ఈ భాగములోను అందలి విషయములను విస్తరించిన తక్కిన గ్రంథ భాగములలోను నేటి సాహితీ లోకమున విమర్శనములు చేయువారిని గూర్చియు, వారికి మత మూల గ్రంథములు బాగుగా తెలియవనియు చెప్పిన మాటలు తక్కరములు: ఈ గ్రంథకర్తకు అన్వయించు ననుమాట నిశ్చయముగా కానవచ్చుచున్నది.

‘‘వీర శైవులు విష్ణు పారమ్యము నంగీకరింపరే గాని విష్ణువు నెంతమాత్రము ద్వేషింపరు’’ అని గ్రంథకర్త వ్రాసినది కొంత నిజమే. కాని యట్లే శ్రీ రామానుజ వైష్ణవులును గూడ శివ పారమ్యము నంగీకరింపరే కాని శివు నెంత మాత్రము ద్వేషింపరనియు, శివుని విష్ణు భక్తాగ్రేసరునిగా నెన్నుదురనియు శ్రీ వెంకటరావు గారికి తెలియదా? విష్ణు క్షేత్రములకు క్షేత్రపాలక శివాలయ ముండుట సర్వ సామాన్యము కాదా? విష్ణు సహస్ర నామములలో ‘శివాయనమః’ అను నామము రెండుమార్లు ‘స్థాణవే నమః’ అని మూఁడుమార్లు, వచ్చుటే కాక, శంభవే నమః, రుద్రాయ నమః, ఉగ్రాయ నమః, స్కందాయ నమః, శర్వాయనమః స్కందాయనమః, గుహాయనమః శరభాయనమః అనునిత్యాది నామము లున్నవి గదా! ప్రసిద్ధమైన లక్ష్మీ అష్టోత్తర శత నామములలో ‘శివాయై నమః, బ్రహ్మ విష్ణు శివాత్మికాయై నమః ఇత్యాది నామము లున్నవి కదా! ఈమధ్య ఎక్కువ ప్రసిద్ధికి వచ్చిన శ్రీ వెంకటేశ్వర సహస్ర నామములలో, ‘శివ వాక్పుష్ట మానసాయ నమః, మహేశ్వర సంస్తుత్యాయనమః’ అను నిత్యాది నామము లున్నవి గదా! వైఖానస వైష్ణవములో గూడ కుంభ దీప విధానములో ‘అర్చనా నవనీతము’లో ‘‘......దీపే క్షిత్రం సమర్పయేత్. ధూపే భవం సమారాధ్య......’’ ఇత్యాదిగా నున్నది. కాబట్టి పే. 28 వ ‘వైష్ణవమున శివ ప్రసక్తి లేదు’ అన్న మాటలు నిరాధారములు.

వీర శైవులకు విష్ణు ద్వేషము లేదనుటకు గ్రంథకర్త చెప్పిన కారణములలో, ‘పాల్కురికి సోమనాథుని తండ్రి పేరు విష్ణురామదేవుడు, తల్లి పేరు శ్రియా దేవి యనియు, శివభక్తులలో సిద్ధరామయ్య, ఏకాంతరామయ్య అను విష్ణు నామాంకితులు కలరు’ అనియు నొక హేతువుగా పేర్కొనిరి. ఈ హేతువు కేమైన బలమున్నదా? ఆ భక్తులవి వారు పుట్టిన కొద్ది కాలమునకే వారి తల్లిదండ్రులు పెట్టిన వ్యవహార నామములు కాని, వారు శి దీక్ష తీసికున్నప్పుడు గురువులు పెట్టిన నామములు కావు గదా! ఇక సోమనాథుడు ఎంత శివభక్తుడైనను తన తల్లి దండ్రుల పేర్లు మార్పగలఁడా? ఐనను అత డెక్కువ సాహసుడు కీవుర వీరశైవము ముదిరిన పిమ్మట వ్రాసిన పండితారాధ్య చరిత్రములో అవి కూడ మార్చివేసి తాను ‘శ్రీ మద్గురు లింగ ఘన కరుణా హస్త గర్భ సంభవుడ’ననియు, ‘బసవన్నయులు పుట్టు బానిస కొడుక’ ననియు చెప్పి విధిలేక, వైష్ణవ నామములతో నున్న యా నామములు కూడ వ్రాయుట కిష్టములేక ‘మును బసవ పురాణమున నెన్నఁబడిన పెనుపాల జనులకు పెంపుడు కొడుక’ నని చెప్పికొనెను గదా! ఇదా, వీరి శైవులలో కొందరికైనను విష్ణు ద్వేషము లేదనుటకు ఉదాహరింపవలసినది!

నేటి విమర్శకులే కాక పూర్వ కవులు గ్రంథకర్తలు కూడ మత నామములను పేర్కొనుటలో స్పష్టమైన వ్యవస్థ చేసికున్నట్లు లేదు. కాని ‘వీర’ శబ్దము ఏ మతమునకు విశేషణముగా వాడినను దాని ప్రధాన లక్షణము ఒక్కటే,—అది చాతుర్వర్ణ్య బద్ధమైన వ్యవస్థను ధిక్కరించుట. ఆ లక్షణము ననుసరించి వారు శ్రౌత స్మార్త కర్మలయందు శ్రద్ధ చూపకుండుటయు, వేద భాగములను కొన్నిటిని ఉపయోగించుకొనుచున్నను వేదమును పరమ ప్రమాణముగా నంగీకరింపకుండుటయు, తమకు ఇష్టమైన ఆగమములతో, తంత్రములతో, శాస్త్రములతో పరమ ప్రమాణములుగా గ్రహించుటయు జరిగినది. వారికి రెండే కులములు. తమ కభిమానమైన దేవత పారమ్యము నంగీకరించి కొలుచువారు, అట్లు చేయనివారు. ఈ లక్షణ మున్నవారినే ‘వీర’ విశేషణముతో వ్యవహరించుట యుక్తము — వీర శైవులు, వీర వైష్ణవులు, వీర శాక్తులు బసవన ఉపనయనాది స్మార్త కర్మ లుజ్జగించి అన్ని కులముల శివ భక్తులతో కుడుచుచున్నందున వీర శైవుడన జెల్లెను. పల్నాటి వీర చరిత్రములో చాపకూడు కుడిచిన వైష్ణవులును వీర వైష్ణవులు. అంతేకాని వర్ణ వ్యవస్థను తీవ్రముగా పాటించు ఆంధ్ర దేశములోని ఆరాధ్య బ్రాహ్మణులను గాని శ్రీ వైష్ణవులను గాని ‘వీర’ విశేషణముతో వ్యవహరించుట యుక్తము కాదు. అట్లు వ్యవహరించిన స్థలములలో ‘వీర’ శబ్దమును మత పరముగా కాక, శ్రద్ధా విశేషము వర్ణించు విశేషణముగా గ్రహించుట భావ్యము. ‘వీర శైవ’ శబ్దము ఇష్టలింగ ధారణము ఆచారముగా నున్న వారందరికి శ్రీ వెంకటరావుగారు అన్వయించినట్లు తోచుచున్నది.

అదియు గాక బసవ మతము, రామానుజ మతము వ్యాప్తిలోనికి రాకముందున్న శివభక్తులయు విష్ణు భక్తులయు రచనలును కథలును, ఆ తర్వాత రూపాంతరము పొందినవి. ఆ మెట్లు వేరు చేయక నేటి స్థితిని బట్టి కలగూరగంపగా మత విషయములు సిద్ధాంతములు చేయబూనుకొనుట సాహసము. ఈ సందర్భములో పూజ్యులగు శ్రీ కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గారు ప్రారంభించిన శాస్త్రీయ పరిశోధన పద్ధతి ఈ కాలములో ముందుకు పోక వెనుక వెనుకకు పోవుచుండుట శోచనీయము. వారు పండితారాధ్యుల ‘శివ తత్త్వ సారము’నకు వ్రాసిన ఉపోద్ఘాతములో ‘‘ఇప్పటి స్మార్తులకు శివ కేశవులు సమానులయినను ఒకప్పుడు కొందరకు నప్పయ దీక్షితులవలె శివుని యందును, కొందరకుఁ బోతనవలె విష్ణువునందును భక్తి యధికము (పే. 31) అనియు, ‘‘ఈ గ్రంథమునందు శివాధిక్యతను గురించి ఎక్కువగ జెప్పబడినను, లింగధారణను గురించి ఎంత మాత్రముఁ జెప్పఁబడి యుండక పోవుట యాశ్చర్యము! (పే. 35)’’ అనియు వ్రాసిరనుట గమనింపదగినది.

ఇక ఈ గ్రంథములో నెట్లు వ్రాసిరో పరిశీలింతము! పే. 31 లో ‘‘బసవన అవైదికమగు జంగమ సంప్రదాయమునకును పండితారాధ్యులు వైదికమగు నారాధ్య సంప్రదాయమునకును ప్రవర్తకులు’’ అనియు, పే. 23 లో ‘‘బసవేశ్వరుడు ప్రవర్తిల్లఁజేసిన వీర శైవ జంగమ సంప్రదాయ

మును, పండితారాధ్యుడు ప్రవర్తిల్లజేసిన సద్వైదికారాధ్య వీర శైవ సంప్రదాయమును'' అని వ్రాసినారు. ఇట్లే గ్రంథ మందు పలు తావులందు వీర శైవములో అవైదికము సద్వైదికము అను రెండు భేదము లున్నట్లు గ్రంథకర్త తెలిపినారు. శైవముగావి వీర శైవముగాని 'వైదికము' అని వాడక 'సద్వైదికము' అని వాడుటలో గ్రంథకర్త ఉద్దేశము మాకు బోధపడ లేదు. 'సద్వైదికము' అను పద ప్రయోగమువలన నా మతము వేదోక్తము కాని వేద విరుద్ధ మతమనియు, అందులో కొన్ని వైదిక లక్షణములు కలసినవనియు నర్థము వచ్చును. ఆ యుద్దేశముతో గ్రంథకర్త పద ప్రయోగము చేసినట్లు తోచదు. ఆ యుద్దేశమే వారి కున్నచో వారభిమానించు ఆరాధ్య బ్రాహ్మణులు వేద విరుద్ధ మతస్థులని ఏర్పడును. ఆ భావము ఆరాధ్య బ్రాహ్మణు లెంత మాత్రము హర్షించునది కాదు. ఇంతకూ వైదికము అవైదికము అను స్పష్టమైన రెండు శబ్దము లుండగా వానిలో 'వైదిక' శబ్దము వదలివేసి, అపార్థమిచ్చు 'సద్వైదిక' గ్రంథ మందంతటను ప్రయోగించుటకు కారణము శ్రీ నిడుదవోలు వారికే తెలియవలెను! పే. 18 లో, ''తన గద్యయందు 'సహజ పాండిత్య పోతనామాత్య' అని వ్రాసుకొని యుండుట చేత నాతడు తెలుగు దేశమున మంత్రులు మహా కవులు మహావీరులు జన్మించిన నియోగి శాఖకు జెందినవాడు'' అని వ్రాసి ఒక శాఖా మానము కూడ ప్రదర్శించిరి.

ఏర్పారి సింగనను గూర్చి చెప్పుచు పే. 168 లో ''తాను మంత్రి శేఖరుడనని చెప్పుకొనుటచే నీత డార్వేల నియోగి'' అని వ్రాసి, శాఖలో ఆంతర శాఖాభిమానము కూడ గ్రంథకర్త ప్రదర్శించిరి. అతడు, పాపము, పాకనాటి నియోగి యైనా కాకూడదా? కాదు. ఎందువల్ల? గ్రంథకర్తకు ఆ యాంతర శాఖమీదనున్న అభిమానమువల్లననియే మన మూహింపవలెను. ఈ విధమైన యుసంగర్భపు వ్రాతలు కొందరు తరుచుగా వ్రాయుచుండుట పరిపాటియైనది.

పోతనాదు లెవ్వరును తాము నియోగులమనిగాని ఆరు వేల నియోగులమని గాని చెప్పుకొనలేదు. అమాత్య శబ్దము కాని అమాత్య పదవికాని ఏ కాలములోనైనా ఒక శాఖవారి సొమ్ము కాదు. నియోగిశాఖ ఎప్పుడు పరిణమించినదో నిర్ధారింప నలవి కాదు. కంకంటి పాపరాజు కాలమునాటికున్నది కాని పోతన కాలమున కున్నట్లు నిశ్చయాధారము లేదు. ఆ కాలములో ఒకే కుటుంబములో ఒకరు అమాత్య పదవి నిర్వహించుచుండగా అతని సోదరుడే విద్వాంసుడై అగ్రహార దాన పరిగ్రహము చేసినట్లు నిదర్శనములు కలవు. అమాత్య శబ్దము ఒక శాఖకే వర్తించునని కొంతకాలమునుండి అంధపరంపరా న్యాయముగా ప్రచారమగుచున్నదే కాని అందులో సత్యము లేదని పరిశోధకులగు శ్రీ నిడుదవోలువారికి తెలియకుండుట ఆశ్చర్యకరము. శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తమ రెడ్డి రాజ్య చరిత్రలో 'ఆంధ్ర బ్రాహ్మణులలో ఈ శాఖా భేదము చివరి రెడ్డిరాజుల పాలనలోగాని ప్రారంభము కాలేదు' అని వ్రాసినది శాఖాభిమానులు ముఖ్యముగా గమనింపదగిన విషయము! పోతన యీ శాఖా భేదము పరిణమించుచున్న కాలమువాడు. అతడు ఏ శాఖవాడో నిర్ణయింప సాధ్యము కాదు.

పోతనను వీరశైవుడని గ్రంథ మంతట నుద్ఘాటించుచు సందర్భ వశమున కవి ధూర్జటి మొదలగు వారిని గూడ వీర శైవులని గ్రంథకర్త చెప్పుచు వచ్చినారు. వీర శైవమునకు ఇష్టలింగ ధారణము శివ పారమ్యము మాత్రమే అంగీకరించుట ప్రధాన లక్షణములైనట్లు గ్రంథకర్త అభిప్రాయమని తోచుచున్నది. ఈ రెండు ప్రధాన లక్షణములు మాత్రము కవి ధూర్జటి కన్వయింపవు. అతడు శివభక్తాగ్రేసరుడే కాని శ్రీ కాళహస్తి మహాత్మ్యము ద్వితీయాశ్వాసములో చంద్రవర్ణనము చేయుచు 131 వ పద్యములో, ''సకలాపూర్ణుడు నీలవర్ణుడనుటల్.. అభవుడుద్వేవుండు భేదంబు గామికిఁ దెల్లంబుగ నల్పుతల్పుగ ధరన్ విలంచెన్ శశాంకాకృతిక'' అని వర్ణించుటలో శివ కేశవుల కభేదము స్పష్టపరచినాడు. శ్రీ కాళ హస్తీశ్వర శతకము 102 వ పద్యము 'భసితోద్ధూళన ధూసరాంగులు' ఇత్యాదిలో తనకు పూజ్యులైన వారి చిహ్నములలో భస్మరుద్రాక్ష ధారణము పంచవర్ణ జపమే చెప్పెను గాని ఇష్ట లింగ ధారణము చెప్పలేదు. భస్మ ధారణము రుద్రాక్ష ధారణము పాశుపత దీక్షాంగములుగా సూత సంహిత చెప్పుచున్నది. అది స్మార్తులకు అభిమాన పాత్రమైన సంహిత. అందులో ఇష్టలింగ ధారణములేదు. అప్పయ దీక్షితులు, ఎర్రయ, శ్రీనాథుడు, ధూర్జటి, గణపతిదేవుని దీక్షా గురువగు విశ్వేశ్వర శంభు దేశికులు స్పష్టముగా అద్వైతులు. శివ తత్త్వ సారకర్తయగు పండితారాధ్యులలో కొంత విశేష మున్నను, వారి కాలమున గూడ ఇష్టలింగధారణ మున్నట్లు నిశ్చయింపలేము. నిజ మిట్లుండగా గ్రంథకర్త ప్రతివారిని 'వీర శైవు'లనుగా వర్ణించుట సంభావ్యము కాదు.

ఇక పోతన మత విషయము ఎన్నో సంశయములతో కూడుకొన్నది. ఆతడు ముందు శ్రీ కైవల్య పద కాంక్షతో మహా నందాంగనా డింభకుని చింతించినాడు. తర్వాత శూలికి ధాతకు వందనము చేసి 'అని నిఖిల ప్రధాన దేవతా వందనంబు సేసి' కొంతదూరము పోయి 'మహనీయమగు వాగ్వైభవము' యగు దుర్గను మహత్త్వ కవిత్వ పటుత్వ సంపద లీవుత' మన్నాడు. ఈ దుర్గయే మొదటి పద్యము ననిన మహా లక్ష్మి దాంగనయా యను సందేహము కలుగును. లేనిచో సందర్భానికి మహద్విశేషణమ్ములు సార్థక పూరణ మనవచ్చును. తర్వాత 'మదీయ పూర్వ జన్మ సహస్ర సంచిత తపః ఫలంబున శ్రీ మన్నారాయణ కథా ప్రపంచ విరచనా కుతూహలుండనై' అని గంగా స్నానమునకు వెళ్లెను. అక్కడ స్నానానంతరమున 'మహేశ్వర ధ్యానంబు' చేయుచు కొంచెము కన్నులు తెరువగా 'రాజ ముఖ్యు' డొకడు ప్రత్యక్షమై ఆ 'రాజ శేఖరుడు' తాను రామభద్రుడనని తెలిపి తన కంకితముగా భాగవతము వ్రాయు

మని ఆదేశించి తిరోహితు డయ్యెను. ఆ తర్వాత కూడ షష్ఠ్యంత పద్యములు నాల్గింటిలోను శ్రీ కృష్ణుడే కాని శ్రీరాముని పేరే లేదు. ఆశ్వాసాద్యంతములలో మరల శ్రీరాముడే ఉన్నాడు. జన్మ సార్థక మగుటకు ఆయనకు అవసరమని చెప్పిన కర్తవ్యములు 'చేతులారంగ శివుని పూజించుట నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువుట.'

ఇక నాతని వంశము చూచినచో తండ్రి కేసన్న (కేశవ శబ్ద భవము) శైవ శాస్త్ర మతము గన్నవాడు. "శైవ శాస్త్ర మత మనగా వీర శైవములో ప్రసిద్ధికెక్కిన నారాధ్య సంప్రదాయము" (పేర 19) అని గ్రంథకర్త చేసిన వ్యాఖ్యానము సిద్ధాంతముగా గ్రహింపదగినది కాదు. దాని కాధారము గ్రంథకర్త అభిమానమే. తల్లి లక్కసాని (లక్ష్మీదేవి)' సదాశివ పాదయుగార్చన'చేయునది. అన్న తిప్పయ 'ఈశ్వర సేవాకాముడు' వీరభద్ర విజయమును, దాని యవతారికయు పోతయే వ్రాసియున్నచో ఆతనికి 'భవి జూడక భవి డాయున' ఉండు వారే పూజ్యులే కాదు, 'వారి ప్రసాద కరుణా విశేషప్రవర్ధమాన కవితా మహత్వ సంపన్నుండ' నని కూడ చెప్పుకన్నాడు. ఇక నారాయణ శతకము కూడ నాతడే రచించినాడని నిశ్చయించినచో (అదియు వీరభద్ర విజయము నాటి కవితా పరిణతినే సూచించును) అందులో నారాయణుడు "మన మారన్న చతే ద్రుహిణాధిపతికి న్నమస్త్రాగ్ర మాణిక్యమై" అని ప.7 లోను, ప. 19 వ దానిలో త్రిపుర విజయమునకు కూడ నారాయణుడే కారకునిగాను ప. 39 లో నారాయణ భక్తాగ్రేసరులలో ముందు 'హరునిన్' అనియు ప. 73 లో 'వేదంబు మను నిశ్చయుం డగు మహా వేల్పెవ్వడో' యని మునీశ్వరులు వెదుకగా శ్రీరంగ నారాయణుడే కాని వేరుండు లేడని నిశ్చయించిరనియు ప. 92 వ

"నీలగ్రీవుడు చేతి పున్క విడిచెన్ నీ యుంతి భిక్షంబునన్
నీలగ్రీవుడు ఈశ్వరాజ్యదనరెన్ నీ నామజప్యంబునన్
నీలగ్రీవుడు మించి త్రుంచె నీ బురముల్ నీ ప్రాపు
సేవించినన్

నీలగ్రీవ ముఖాబ్జ భాస్కర కృపా నిత్యాత్మ నారాయణా!"

అని వ్రాసినాడనియు గమనింపవలెను. నారాయణ శతకము పోతనయే వ్రాసెనని గ్రంథకర్త నిశ్చయము! విష్ణు పార మ్యమే కాక శివుని అల్పత్వమును గూడ నంగీకరించు వీర శైవుడన్నమాట పోతన !

ఇట్టి పోతనను గ్రంథకర్త వీర శైవుడనియు వీరమాహేశ్వరు డనియు మరల మరల వర్ణించుటయెంత సంగతమో బుద్ధిమంతులే ఊహింతురుగాక ! ఈ శాఖా భేదముల సంగతియు మత ముల సంగతియు ప్రస్తావించుట మాకు ఇష్టము కాకున్నను, అవ సిద్ధాంతములు అంధ పరంపరగా ప్రచార మగుచు లోక వ్యాప్తిని నిరాఘాటముగా నందుచుండుట చేతను, ఈ గ్రంథము నందంతట నదియే విస్తారముగా కానవచ్చుచుండుట చేతను, తప్పనిసరియై ఈ ప్రస్తావము కావింపవలసి వచ్చినది.

పోతన మీది అభిమానము చేతనే ఐనను హేతువాదము నకు నిలవని ఊహలు గ్రంథకర్త ఎన్నో చేసినాడు. అట్టివి నవలా రచయితలకు ఒక్కొక్కప్పుడు గ్రాహ్యములు కావచ్చును గాని చరిత్రకారులకు కావు. అవి పరస్పర వచన వ్యాఘాతములతో నున్నప్పుడు ఎవరికిని గ్రాహ్యములు కావు. అట్టి వానిని కొన్నిటిని క్రింద తెలుపుచున్నాము.

(1) పే. 37 "పోతన వీరభద్ర గ్రంథ రచన మూలము ననే, వీరభద్రారాధనము, కోస్తాంధ్ర దేశమందు వ్యాప్తము లైనవి."— ఆ వెంటనే పే. 38 "పోతన కాలమునకు కొంచెము ముందుగానే, తెలుగు దేశమున, గుంటూరు మండల మున తాడువాయి గ్రామములోను, తూర్పు గోదావరి మండల మున పట్టిసక్షేత్రమునను వీరభద్రాలయములు వెలసినవి." వీరభద్రారాధనము అప్పటికే వ్యాప్తిలో లేనిది ఆలయములు వెలసి యుండునా ? తెలిసినంతవరకైనను మొదటి వీరభద్రా లయము ఎప్పుడు పుట్టినదో శ్రీ నిడుదవోలు వారు పరి శోధించిరా ? ఆ పైన ఇంకొకటి : పే. 38 "ఓరుంగల్లునకు పడమట నున్న 'కొలని' యందు వీరభద్రాలయ ముండుట కూడ, పోతన వీరభద్ర విజయ కర్తృత్వ నిర్ధారణకు దోహదము చున్నది." ఆ రెండింటికి కార్యకారణ భావ మెట్టిదో బోధ పడుట లేదు. 'కొలని'లో వీరభద్రాలయ ప్రతిష్ఠ ఎప్పుడు జరిగినదో గ్రంథకర్త చెప్పలేదు. పోతన నాటికే ఉన్నదన్నచో, పై వాదము మరింత బలహీన మగును. అదికాక వీరభద్ర విజయములో కొలనిలో వెలసిన వీరభద్రుని ప్రశంస ఉన్నదా యను ప్రశ్న పుట్టును. పోతన తర్వాతిదన్నచో, పై వాదము నకు ఆధారాభాసము కూడ అంతరించును. ఇంకను పైన ఇట్లు వ్రాసిరి. పే. 38 "ఈ క్షేత్రమునకు ప్రత్యేక క్షేత్ర మహాత్మ్యములు లేకపోయినను, పోతన వీరభద్ర విజయము వలన, దాని ప్రాభవ మినుమడించినదని చెప్పుటలో యతిశయోక్తి లేదు" ప్రాభవ మినుమడించిన దనుటకు ఆధార మేమి ? దానికి కారణము పోతన గ్రంథ మనుటకు ఆధార మేమి ? వెంటనే ఉన్న వాక్యము చూడుడు : "వీరభద్ర విజయ గాథ, వాఙ్మయమున ప్రచారము గాంచుట పోతన కృతి వలననే గావున, బాల్యకృతి యయ్యును నది వాఙ్మయ చరిత్ర మున చిరప్రతిష్ఠ వడసి ప్రబంధ, యక్షగాన, శతక, గేయ రూపముల వెలసిల్లుట కధారమైనది." వీరభద్ర విజయ గాథ బహుపురాణ ప్రసిద్ధము ! దక్షాధ్వర ధ్వంసము, త్రిపుర దాహము, హాలాహల భక్షణము శివపురాణ కథలలో ముఖ్యమైనవి. అవి ఏదో యొక రూపమున భాగవతము కూడ వదలలేక గ్రహింపవలసి వచ్చినది. వీరభద్ర విజయగాథ

ప్రచారము కాంచుటకు పోతన బాల్యకృతియే యనుట ఆస్తికు లకు శివాపరాధముగా స్ఫురించును. ఆ మాటలు విన్నచో పోతన చెవులు మూసికొని యుండును. వీరభద్ర విజయము పోతన కృతమే యున్న యెడల నాతడు తన కవిత్వమునకు వీరభద్ర ప్రసాదమే కారణమని అవతారికలో నున్న మాటలు గమనింప దగినవి.

(2) భాగవత రచనకు పూర్వము చంద్రగ్రహణ సమయమున స్నానమాడ బోయిన గంగ గోదావరియే యని పలువురు విమర్శకుల వలెనే గ్రంథకర్తయు నిర్ధారణ చేసెను. భాగీరథ గంగ కాదనలేము కాని గోదావరీ గంగయే శత విధాల ఐ ఉండు ననుట సంభావ్యమే. కాని ఆ స్నానము చేసిన చోటు నేటి భద్రాద్రి రామాలయ మున్నచోటే అని గ్రంథకర్త ఊహించినారు. పే. 15 "గోపన్న యాలయము గట్టుటకా ప్రత్యేక స్థలమే యేల నిర్దిష్టము కావలెను ? అది పోతనకు రామ భద్రుడు ప్రత్యక్షమైన చోటు ! అది రామభద్రుని సంకల్పము. ఆంధ్రుల పూర్వపుణ్య పరిపాకము." ఈ ఊహ నవలాకారుడో కేవల భక్తుడో చేసిన చో ఆపాత మధురముగా నుండును. కాని ఇటువంటి గ్రంథములో సమంజసము కాదు. జాగ్రఫీ చిక్కు కూడా ఒకటున్నది. ఓరుగల్లు ప్రాంతము నుండి గోదావరీ స్నానమునకు వెళ్లువారు ఏ రేవుకు వెళ్లినను ఇవతలి దరిని స్నానము చేయుదురు కాని ప్రత్యేక కారణము లేనిది ఆవలి దరికి దాటి స్నానము చేసిరారు. భద్రాచల క్షేత్రము ఆవలి దరి నున్న దనుమాట ఉత్సాహాతిశయములో స్ఫురణకు రాలేదేమో ! అప్పటికే భద్రాద్రి రామాలయ మున్నదన్నచో గంగ దాటుటకు పోతనకు కారణముండును. అది యవతారికలో చెప్పకూడ నుండును. మరి పోతన "గంగ కద్దరి వేలిద్దరి కీడునుం గలదు" అని విశ్వసించినవాడా ?

(3) పే. 17: "శ్రీరామ భక్తుడగు పోతన భాస్కర రామాయణము నెరిగి యున్నట్లుగా నందలి యనుసరణము లే గాక 'భాస్కరుఁడు బదరెలు గాని రామాయణమును బండ్లె క్కింపనా' అను పోతన ప్రతిజ్ఞయుం దెలుపుచున్నది" అని వ్రాసిరి. పోతన ఈ ప్రతిజ్ఞ ఎక్కడ చేసినాడు ? తమ యల్పత్వమును అహంభావమును పోతన కంటగట్టిన మిథ్యా కథకుల మాటలు శిలాశాసన వాక్యము లైనట్లు ప్రతిజ్ఞగా పేర్కొనుట పోతన వ్యక్తిత్వమును గౌరవించుట కాదు. పోతన నాటికున్నది ఒక్క భాస్కర రామాయణమే కాదు. ఎఱ్ఱయ రామాయణము తిక్కన ఉత్తర రామాయణము కూడా దున్నది. "ఒరరన్ నన్నయ తిక్కనాది కవు లీయుర్విం బురాణావళుల్ తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో తెనుగుం జేయరు మున్ను భాగవతమున్" అని వినయమై వ్రాసిన పోతనకు పై మాట లంటగట్టుట ఎంత యనుచితమో గ్రంథకర్త దూరము మాలోచించినట్లు లేదు. కవిత్రయము లోని ఎఱ్ఱయ రామాయణము కూడా పోగా, నేటికిని ప్రధానముగా ఆంధ్రుల కభిమానపాత్ర మైనది భాస్కర రామాయణమే అనుమాట మరవరాదు. పోతనను ప్రత్యేకముగా 'శ్రీ రామభక్తు'డని నిర్దేశించుటయు సరికాదని భాగవతావతారికాదుల వలన స్పష్టపడును.

(4) పే. 123 "శ్రీ కృష్ణ గోపికా శృంగారలీలా ప్రదర్శనమున పోతన ప్రదర్శించిన లోకోత్తర ప్రతిభ, భక్తి తత్త్వము, వంగ దేశమున చైతన్యస్వామి ప్రతిపాదించిన మధుర భక్తి భావమునకు నాధారమైనది." చైతన్యస్వామి పోతన కించుక తర్వాతి వాడు. ఆయన ఆంధ్రదేశములో గూడ సంచారము చేసెను. అప్పుడు పోతన భాగవతమును శ్రవణ మొనర్చి ప్రభావితు డైనట్లును, అంతకుముందాభావము లాయనకు లేనట్లును ఏదో కొంత యాధారమైన జాడనిది పై నుదాహరించిన వాక్యమునకు విలువ యుండదు. అట్టి ప్రయత్నమైనను గ్రంథకర్త చేయలేదు !

ఇక గ్రంథ రచనలో ఎన్నో భాగములలో ఊరకే అనవసరముగా గ్రంథము పెరిగినది. ముఖ్యముగా పద్యము లుదాహరించుటతో గ్రంథము విపరీతముగా పెరిగినది. ప్రత్యేకముగా అనవసరముగా పెంపుడలయైన భాగములు కొన్ని యుదాహరింతుము.

(1) భోగినీ దండకము సంగతి 3½ పేజీలలో వ్రాసినారు. పే. 48—51. ఆ భాగములో ఇంకను అన్ని పేజీ లున్నను అనవసర మనలేము. కాని ఆ పిమ్మట పే. 52 "భోగినీ దండకము నాందిగా వాఙ్మయమున వెలసిన కొన్ని శృంగార దండకములను పేర్కొనుట యప్రస్తుతము కాదు." అని ప్రారంభించి వానిని పేర్కొని యూరకొనక రెండు పేజీలు ఉదాహరణలతో నింపుట అప్రస్తుతమే.

(2) పే. 163—188 ఇతర కవికృత స్కంధములు అని 11వ ప్రకరణమున్నది. అతి కఠినముగా విచారించినచో ఈ ప్రకరణమే అనవసర మనవచ్చును. కాని కొంత సంబంధ మున్నది కనుక ప్రకరణము చేర్చుట సమంజసమే. కాని అంతయు క్లుప్తముగా చెప్పవలసినది. వాని భాషాంతరీకరణ విధానములు తెలుపుటకు మూలము, వ్యాఖ్యానము, తెలుగు ఉదాహరించుకుని పోవుట యనవసరము. ఇక నా సందర్భములో 'కవుల షష్ఠము లేక శృంగార షష్ఠము' అను శీర్షిక క్రింద రాచమల్లువారి షష్ఠము అను నామాంతరము గలదానిని ప్రస్తావించి "ఆ గ్రంథము మనకు పూర్తిగ లభించలేదు గాని లాక్షణికు లుదాహరించిన పద్యములను బట్టి చూడగా నిందలి కవితా రచన యత్యంత రసోల్లసితమైన దని చెప్పవచ్చును. వారుదాహరించిన పద్యము లన్నింటిని నిందులో పటిచుచున్నాము" అని వ్రాసి వరుసగా 3 పేజీలు పైచిలుకు పూర్ణాపూర్ణ పద్యములతో నింపుట యనవసరము. గ్రంథకర్త శ్రమపడి పరిశోధించిన దంతయు ఇక్కడ ప్రస్తుతము కాదు. ఆ పిమ్మట

నేటి కాలమున శ్రీ మిన్నికంటి గురునాథ శర్మగారి వరకు భాగవత భాగములు వ్రాసిన వారి వివరములు తెలుపుకొని పోవుట కూడ వృథా విడంబనమే !

(3) పోతన యనుసరించిన పూర్వకవులు అను 10 వ ప్రకరణములో 20 పేజీలు ఉదాహరణ పద్యములు కలవు. అందులో కొంతవరకైనను అనుసరమే కాని పే. 153 నుండి 162 వరకు పోతన ననుసరించిన కవుల నుదాహరించుట యనవసరము. పోతన తర్వాత పోతనచే ప్రభావితుడు కాని ఆంధ్రకవి ఉన్నాడా ?

(4) శ్రీనాథ పోతనలు— భక్తి మాహాత్మ్య కథలను అను 9వ ప్రకరణములో ఆ కథలు సత్యములని నమ్మించుటకే గ్రంథకర్త వ్రాసినట్లు తోచును. ఇతర కవుల స్వప్నాదులను బహుతర తీక్ష్ణహేతువుతో విచారణ చేసెడి శ్రీ నిడుదవోలు వారు ఈ కథలను ప్రసిద్ధిని బట్టి తెలుపుచున్నానని వ్రాసి ఊరుకొనక నిజములని నమ్మినట్లే ఏల వ్రాసిరో తెలియదు. తక్కిన వాని సంగతి యెట్లున్నను ''బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకన్'' అను ప్రసిద్ధ పద్యము అంతకు ముందెన్నడో మంచెన రచించిన కేయూర బాహు చరిత్రము లోని దని యైన చెప్పకపోవుటే కాక,దానిని బట్టి పోతన హాలికుడే యైనట్లు అంగీకరించి ప్రకరణము వ్రాయుట అనవసరపు పేరిపుదలయే !

(5) అనుబంధము 192—198లో పోతన భాగవత మాహాత్మ్యమును తెలుపున దను 'సాక్షి' వ్యాసము కేవల మనవసరము. ఈ మధ్య 'భక్త పోతన' వెండితెర కథ కూడా ఈ పద్ధతిన వ్రాసి యుండవచ్చును.

(6) 2 వ అనుబంధము పోతనను స్తుతించిన కవులు అని 198—214 వరకు సింగన షష్ఠస్కంధము నుండి నిడుదవోలు వేంకటరావు వరకు 77 మంది (ఎక్కువ మంది అనామక కవులు) కవుల పద్యములుదాహరించుట యనుపసరము పోతనను స్తుతింపని కవీశ్వరుడు కనుక ప్రతి యూరిలోను పదులు వందలు పద్యములు దొరకును.

ఈ విధముగా నిర్ణీతమైన పుటలు నింపుటకు గ్రంథము పెంచినారేమో యను సందేహము కలుగవచ్చును కాని యది సత్యము కాదు. ముఖ్యముగా పెరుగదగిన భాగములు కొన్ని అతిగా సంకోచము చేయబడినవి. ఈ క్రిందివి అందుకు కొన్ని యుదాహరణములు :

(1) 'భాగవతాదర్శము— ఉపాఖ్యానములు' అను చివరి ప్రకరణము రెండు పేజీలపైన ఐదు పంక్తులే ఉన్నది. ఉపాఖ్యాన విషయములు 8 శీర్షికల క్రింద కుర్చిగాపు భాషలో సంకోచింప బడినవి.

(2) 'పోతన యువతరణ' అను 3 వ ప్రకరణములో 'దేశకాల మత పరిస్థితులు' అను శీర్షిక క్రింద వీరశైవులకు విష్ణు ద్వేషము లేదను వాదమునకే ప్రాధాన్య మిచ్చిరి కాని ఆ కాలపు రాజకీయ పరిస్థితులు కాని సాంఘిక పరిస్థితులు కాని తుదకు మత పరిస్థితులు కాని విపులముగా వర్ణింప లేదు.

(3) పోతన తర్వాత ఆయన వంశములో పలువురు కవులున్నారు. అనుబంధములో పోతనకు స్తుతించిన కవులలో కేసన మల్లనలు అని శీర్షిక క్రింద రెండు పేజీలు పోతన వంశీయులను గూర్చి తెలిపిరి. నేడు బమ్మెరలో పోతన వంశస్థుల మని చెప్పుకొనువారు గొప్ప భూస్థితి గలవారై 'దొరలు' అను వ్యవహారమున నున్నారనియు, వారి ఇప్పటి ఇంటి పేరు నెల్లుట్ల వారనియు, వారి పూర్వులు వైష్ణవము పుచ్చుకొని రనియు 'బమ్మెర పోతన' అను వందపేజీల గ్రంథములో అనుముల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తెలిపినారు. ఆ విషయము లెందు వల్లనో గ్రంథకర్త ప్రస్తావింపలేదు. 'బమ్మెరలో పోతన భాగవతము రచించినప్పటి చిహ్నములు గూడ వారు చూపెదరు. బమ్మెరలో నుండు చెఱువొకటి పోతన తల్లియగు లక్కాంబ పేర లక్కమ్మ చెఱువని పేర్కొనం బడుచున్నదట'' అనియు శ్రీ శాస్త్రిగారు వ్రాసిరి. పై విషయములు బమ్మెర వెళ్లినచో తెలిసి యుండును గదా ! పై వాక్యములు నిజమైనచో పోతన దారిద్ర్యముతో బాధపడె నను కథలు బండారము కూడ తేలిపోయెడిది. పోతన తల్లి లక్కాంబ 'వితరణ కరణలు విడువదు' అనియు నివారిత దీనమానవ గ్లాని' అనియు 'దాన ధర్మమతి' అనియు, తండ్రి 'కేసన దాన మాన నీతిఘనుడు' అనియు పోతన చేసిన వర్ణనను బట్టి పోతన కుటుంబము అన్న వస్త్రముల కెంత మాత్రము లోపము లేని సంపన్న కుటుంబ మనిపించును.

మరి రెండు విషయములు ప్రస్తావించి ముగింతుము !

వైరి సమాసములు, వలపల గిలక ప్రాసలు, క్వార్థకే కార సంధులు ఇత్యాదులు ఒక్క శివకవుల సొమ్మే ఐనట్లు' అది శివకవి సంప్రదాయ మని, దానిని పోతన యనుసరించె నని గ్రంథకర్త పలుచోట్ల సూచించినారు. ఆ స్వాతంత్ర్యము నన్నయ నుండి నేటివరకు వారి వారి పాండిత్యములకు అభిరుచులకు తగినట్లుగా కొద్దిగానో గొప్పగానో కవులందరు నవలంబించుచునే యున్నారు. అదేమియు శివకవుల ప్రత్యేక లక్షణము కాదు.

గ్రంథ రచన కుపక్రమించినప్పుడు గ్రంథకర్త ప్రణాళిక ఏర్పరచుకున్నప్పటి శ్రద్ధ రచనలో చూపలేదనుటకు 'పోతన కవితా లక్షణములు' అను 7వ ప్రకరణము బలవన్నిదర్శనము. అందులో ముందు ఒక పట్టికగా 1. సులలిత సురళ ధారాశుద్ధి 2. ప్రసన్న గంభీరత 3. సుకుమార మాధుర్య పద సంపద 4. రసోద్దీపకత 5. అన్వయ సౌలభ్యము 6. శయ్యా సౌభాగ్యము 7. శబ్దాలంకార వైచిత్రి 8. నిసర్గ మనోహరత 9. భక్తి భావనా బంధురత అని 'నవ విధ భక్తి మార్గములక నవరీతులు గల కవితా రచన ననుసంధించి యున్నాడు' అని

ఉపక్రమించిరి. ఈ విధముగా చెప్పుకొని పెయుసచో తొమ్మి దింటితో వాగునా అను ప్రశ్న మేమియు వేయుట లేదు. ఆ ప్రకరణ ములో వరుసగానో మొత్తము విహాదనో ఈ తొమ్మిది లక్షణ ముల వివరణము నుండుట క్రమ పద్ధతి. ప్రకరణములో అదే లేకపోగా ఇతరము లేవో ఉండుట బుద్ధిమంతులైన పాఠకులను చకితుల నొనర్చును. ఇక ఆ వ్రాసిన దానిలో కవిత్రయము వారి శైలికిని పోతన శైలికిని భేదములు కనిపించుచున్నవని జాబితాగా ఏడింటి నిచ్చిరి. వానిలో మూడిం టిని మాత్ర ముదాహరింతుము :

''కవిత్రయము	పోతన
3. ఆంధ్ర పద బాహుళ్యము	సంస్కృత పద బాహుళ్యము
6. పదవాక్య సౌష్ఠవము	రసోచిత రచనా వైఖరి
7. అర్థ సారస్యము	రస సౌభాగ్యము.''

పై భేదముల ఔచిత్యము వేరుగా వివరింప నక్కర లేదు. గ్రంథకర్త 'పోతన'ను గూర్చి వ్రాయుచున్నారు కనుక, కవిత్రయము వారి కవిత పద వాక్యముల కూర్పు అర్థ సౌష్ఠవ ముతో నాగిపోగా, పోతన మాత్రమే రసస్థాయి నందుకొన్నా డని తేలుచున్నది. ఏ వ్రతమును గూర్చి చెప్పినను చిల్లర పురాణములు అదియే 'వ్రతానా ముత్తమా వ్రతేత్' అని చెప్పు చుండు స్థాయిలోనికి దిగజారినది. పోతనయందు మనకెంత భక్తియున్నను, కవిత్రయముతో పోల్చుచున్నామను జాగ రూకత యక్కర లేదా ? ఇది చదివిన ఇతర రాష్ట్రముల పాఠకులకు కవిత్రయముపై నెట్టి యభిప్రాయము కలు గునో అనియైన ఆలోచింప నక్కర లేదా ?

ఏ విధముగా చూచినను ఈ గ్రంథము ఉద్దిష్ట ప్రయోజనమును సాధించు స్థాయిలో లేదని చెప్పవలసి నందుకు విచార పడుచున్నాము.

ఇక ప్రచురణ కర్తలకు సంబంధించిన దొక్కటి తెలిపి ముగింతుము. అది అచ్చు తప్పులను గూర్చినది. మధ్య కాలములో వచ్చిన మజిలీ పుస్తకముల అచ్చు తప్పులతో సమాన స్థాయిని ఇందులోని తప్పులు కొంచెము హెచ్చు తగ్గుగా అందుకొన్నవి. స్పేసింగు అనవసరమైన చోట్ల ఉండి అవసరమైన చోట్ల నుండదు. వత్తులు తరుచుగా వదలి వేయబడినవి. అందులో ముఖ్యముగా తవత్తు టవత్తు గానే తరుచుగా ఉన్నది. సంస్కృత శ్లోకములలో తప్పులు లెక్కలేనన్ని యున్నవి. ఈ మాట అతిశయోక్తులుగా పాఠకు లకు తోచునేమో యని రెండు ఉదాహరణములు మాత్రము క్రింద నిచ్చుచున్నాము :

పే. 175: తల్లి దండ్రియు దైవంబుఁ దలఁప గురుఁడ
కాదె యతఁ డేమి చేసినఁ గనల నగునె ?

పై రెండు పంక్తులలో ఆరు స్పేసింగు తప్పులు.

పే. 178 :

	తప్పు	ఒప్పు
పం. 5	పరీక్షత్తు	క్షి
'' 8	బహు సమర్థతో	సమర్థతతో
'' 9	నీలకంఠస్తన ప్రశంస	స్తవ
'' 12	వైవస్వమను	వైవస్వతమను
'' 19	స్వపిత్రూణాం	స్వపితౄణాం

పై 178 పేజీ వానిలో అచ్చుపొరిగా అంటక సందే హాస్పదములుగా నున్న తప్పులును, స్పేసింగు తప్పులును వదలి వేసి పైన చూపినాము.



తెలుగు ఛందస్సు ఎలాగ ఏర్పడి ఉంటుంది?

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

నన్నయగారికి ముందే చిరకాలమునుంచీ తెనుగులో పద్యాలు వ్రాసే సాంప్రదాయ ముండినది. రగడలూ, తరువోజలూ సీసపద్యాలూ, ఆయనకు పూర్వముండిన శాసనాలలో గోచరిస్తున్నాయి. ఆయన కన్నడకావ్యాల్ని ఎరిగినవాడు కనక వాటిలోని పద్యరీతుల్ని తెలుగులోకి తెచ్చి, సంస్కృతవృత్తాల్ని స్వీకరించి, తెలుగు జాతీయ ఛందస్సులను ఇంచుకంత సంస్కరించి, మొత్తంగా చాలా వైవిధ్యముండేటట్లు "ఆదికావ్య" రచన చేశారు. తెలుగు కవులు— కొందరెవరో ద్విపదలలో రచించినా—మొత్తమ్మీద అందరూ ఆ పద్యాలలోనే తమ రచనలు చేశారూ, కావ్యాలు పద్యాలలోనే ఉండాలి అన్న— ఎవరూ వ్రాసిపెట్టని —నియమము అమలులోకి వచ్చేసింది. సంస్కృత వృత్తాలలో లేని యతిప్రాస నియమాలు తెలుగులో ప్రవేశించాయీ, ఆ వృత్తాలలో ఉన్న విరామనియము తెలుగులో మాయమైంది. అన్ని నియమాలకూ లోబడి కవులు కావ్య రచన చేశారూ, ఈ నియమ వ్యతిక్రమము జరిగిన చోట్ల విమర్శకులు కవులను దుయ్యబట్టారు. ఛందో నియమాలు దేవదత్తములే అనేటంత పట్టుదల ఉంది ఈనాటి విద్యావంతులలో. ఆధునికులు వచన పద్యాలు వ్రాస్తుంటే ఉపేక్షించడమే కాకుండా అవి అరాజకపు వ్రాతలనీ సభాముఖాన్ని వినిపించరానివనీ వెక్కిరిస్తున్నారు కూడాను పద్య రచయితలు. పూర్వము కూడా పద్యాలలో కాక ద్విపదలలో కావ్యాలు వ్రాసిన వారిని 'ముది విటులు, విధవ లంజలు' తో జతచేసి ఆక్షేపించారు పెద్ద పెద్ద కవులు. అంత ఉన్నత స్థాయిలో ఉంచి మనవారు గౌరవిస్తూన్న ఛందస్సు ఏ రీతిగా ఏర్పడి ఉంటుంది? అనే జిజ్ఞాసతో ఎక్కువగా వాడుకలో ఉన్న పద్యరీతులను పరిశీలించినాను 'అంతర సాక్ష్యము దొరుకుతుంది గదా' అని. 'పద్యాలు కూడా పాటలు ఉపయోగించే అవృతాలనే ఉపయోగించుకున్నాయి' అన్న అనుమానాని (inference) కి వచ్చాను. జూన్ నెల భారతిలోని నా "కవిత్వములో ఛందస్సు ఉండి తీరాలా" అన్న వ్యాసములో ఈ సత్యమును సూచించే ఉండినాను.

బాహ్య సాక్ష్యము కోసము డాక్టరు గిడుగు సీతాపతి గారి 'తెలుగులో ఛందో రీతులు' అన్న గ్రంథమును చూచినాను. దాన లభించిన వస్తు విది : (తెలుగు) వృత్తములలో అక్షర సంఖ్యా నియమము ప్రధానమయినది. జాతులలో (గణ నియమమే కాని) అక్షర సంఖ్యా నియమము లేదు. అక్షరములు ఒకటి మొదలు 26 వరకును (నాలుగు పాదములలోనూ) గలిగిన (వృత్తముల) వి 26 ఛందములు గలవు. మొదటి ఛందములో ఒక గురువు కానీ ఒక లఘువు కానీ ఉంటుంది ఒక్కొక్క పాదములో. కనుక మొదటి ఛందములో రెండు వేర్వేరు వృత్తాలుండ గలవు. రెండో ఛందములో ప్రతి పాదమునకూ ఉండవలసిన రెండు అక్షరముల కూర్పులో మొత్తము నాలుగు భేదాలు (గగ, గల, లగ, లలములు) ఏర్పడ గలవు. కనుక రెండో ఛందములో నాలుగు సమవృత్త (భేద) ము లుండగలవు. ఈరీతిగా 3, 4, 5 .... 26 అక్షరములు గల వృత్తభేదములన్నీ లెక్కవేస్తే అవి మొత్తము 134217726 గా తేల్తాయి. వృత్తములకు చివరి అక్షరము గురువు గానే ఉండవలెనన్న నియమమువల్ల ఇవి పై సంఖ్యలో సగము అనగా

67108863 అవుతాయి. మనకు పరిచితములైన 'మదన విలసితము, విద్యున్మాలా, ఉపేంద్రవజ్రము=తోటకము,స్రగ్విణి భుజంగప్రయాతము,మాలిని, పంచ చామరము, శిఖరిణీ=మందాక్రాంత, మత్తకోకిల, శార్దూల విక్రీడితము, మత్తేభ విక్రీడితము=ఉత్పలమాల, చంపకమాల=స్రగ్ధర, మహాస్రగ్ధర, కవిరాజ విరాజితము, మంగళ మహాశ్రీ, వృత్తాలు వరుసగా 7, 8, 11, 12, 15, 16, 17, 18,19, 20, 21, 22, 23, 26 ఛందస్సులలోని వృత్తభేదములు.''

ఏతావాతా, 67108863 సాధ్య వృత్తములలో మనకు పరిచితములైన కొద్ది వృత్తాలే ఈనాటికి నిలిచినవి. చిత్రకవి పెద్దన 263 గురించి చెప్పగా అప్పకవి 227 చెప్పినాడట (వడ్లమూడివారి 'పరిచయము'.) ఈ వృత్తముల సమగ్ర లక్ష్య లక్షణ నామకరణ విచారమును డాక్టరు సీతాపతిగారి* వంటి పండితులకే వదలి మనము ప్రస్తుతము ఛందోసామిత్ర్యమును గురించి ఆలోచిద్దాము. నేను మొదటలో చెప్పిన అంతర సాక్ష్యాన్నీ బాహ్య సాక్ష్యాన్నీ జతచేసి తర్కిస్తే ''లెక్కకు సాధ్యమైన ఆరుకోట్ల డెబ్బయి లక్షల వృత్తాలలోనూ కవులకు సుమారు యాభయి వరకలే స్వీకారము లైనవి'' అన్న తీర్మానం మేర్పడుతుంది. ఈ యాభయ్యీ, ఏ సుగుణము వల్ల ఎంచుకోబడ్డవీ అంటే, ''వాటిలో లయ స్ఫుటముగా ఉండుట వల్ల'' అని జవాబు వస్తున్న దంటున్నాను; సీతాపతిగారు చెప్పనే చెప్పినారు : ''త్ర్యస్ర గతిలో నున్నవి, పంచచామరము, సుగంధి, ఉత్సాహ, తరళ, లలి; చతురస్ర లోనివి, పాదప, తోటక, రమణక, మానిని, కవిరాజ విరాజిత, మలయజ, సాధ్వీ, లాక్షణి, స్వాగత, వంశస్థ, విద్యున్మాల, క్రౌంచ పదమూ; ఖండ గతిలో నున్నవి, స్రగ్విణి, భుజంగ ప్రయాత, వనమయూరము, వసంత తిలక, మంగళ మహాశ్రీ; మిశ్రగతి లోనివి మత్తకోకిల, ధ్రువకోకిల'', అని. ఇక మిగిలిన వాటిలో కందము చతురస్రగతిదీ, ఉత్పలమాల, చంపకమాల, ప్రభు, వృత్తాలు చతురస్రగతి లోనివి. ద్విపద, తరువోజ, సీసము, లయవిభాతి, లయగ్రాహి ఖండగతివి. గీతము రెండు త్ర్యస్ర—, రెండు ఖండ—, మళ్లీ రెండు త్ర్యస్ర—,మాత్రాగణాల మిశ్రమము కాగా, ఆటవెలది మూడు త్ర్యస్ర—,రెండు ఖండ— ఆ వృతాల మిశ్రమమైంది. ఈ పద్యాలకు వాడుటకు వీలున్న గణములు అన్నీ ఈ లయపు వింగడింపునకు లొంగివచ్చేటంత అనుకూలములు కావు కాని నలములకు బదులు అయిదు మాత్రల గణాలు వాడితేనే ఆటవెలదీ, తేటగీతీ, సీసమూ సరిగా నడచునని అందరూ ఎరిగిన విషయమే. కనుక ఆ పద్యాలలో నలములు పట్టవు, కక్కుర్తికి వేస్తే లయ కుంటునడుతుంది. పద్యాల్ని పాడినప్పుడు మాత్రానియమము ఎగిరిపోతుంది కనక ఆ గొడవే అక్కర లేదు పద్య గాయకులకు. ప్రతి పద్యాన్నీ దాని నడక స్ఫురించే రీతిగా చదివినప్పుడే ఈ గతులు నిలిచో, తెగిపోయో స్ఫురిస్తాయి.

ఏతా వాతా, పరిచిత గతులు గర్భీకృతము చేసుకున్న ఛందోరీతులే తరచు వాడుతున్నారు కవులు. ఈ గతులు, పాటలలో స్ఫురించే సమయనే ప్రాణముగా గలట్టివి. మరి పద్య ఛందస్సు అవతరించి సాధించిన ఘనకార్య మేమిటి ? అని. ఆ లయను క్లిష్టమూ, కష్టమూ చేసింది. ఎలాగా ? అంటారా, మనవి చేస్తున్నా.

శార్దూల విక్రీడితము చూడండి సంస్కృతానిది :

బర్హోత్తంస విలాసి కున్తల భరం
మాధుర్య మగ్నాననం

అన్నది ఒక పాదం. యతి దగ్గర విరామం ఉంటుంది సంస్కృతంలో. దీని లయ—నడక—పూర్వార్ధంలో క్లిష్టము. రెండో భాగములో రెండు అయిదు మాత్రల గణాలూ, ఒక గురువూ తెలుస్తున్నాయి. పాదాంతమందు మూడు మాత్రల కాలం ఆగవచ్చును మూడో అయిదు మాత్రల గణానికి. మొదటి భాగంలో చతురస్రగతిలో నాలుగు ఆవృతాలు దాటి ఒక్క గురువున్నది. ఇంకొక రెండు మాత్రల కాల విరామంతో అయిదు ఆవృతాలౌతాయి. చివర పూర్ణానుస్వార మున్నది కనుక రెండు మాత్రల కాలమూ ఆగడము అనుకూలమే. దీన్ని తెలుగులోకి తెచ్చుకుని, విరామం ఎగగొట్టి, పాదాంతమందైనా విరతి లేకుండా చదివితే దీని గతి దుర్గతి కాక వేరేమి కాగలదు? సీతాపతిగారు తెలుగు శార్దూలాన్ని విశ్లేషించి యతిని చతురస్ర గణము లోపల బూర్చినారు. దాని పూర్తిగా చతురస్రగతియే సిద్ధించినది. ''లయ (ఏదంటారేమ?) గుప్తముగా.. ఉన్నదని'' వారూ తెల్పినారు. లయ లేని పద్యాలను ఎవరూ వ్రాయకపోడములతో అవిలోపించి పోయినవి. 'మహాస్రగ్ధర' పేరుగొప్ప కోసమే కాక పోతే దాని వ్రాసినవారు కొద్దిమంది మాసివేసి ఉందురు.

కనుక తెలుగు పద్య ఛందస్సు కవిత్వమును—వాల్మీకి శోకాన్ని లాగ—విశ్లేషిస్తే వచ్చినట్టిది కాదు. అంటే సహజము కాదు; కృతకమే కనుక ఇది అనివార్యము కాదు. అట్లైతే, కృతకముకాని ఛందస్సు ఎక్కడేనా ఉన్నదా అని అడుగుతారు పాఠకులు. ఛందస్సు ఒకటి నడవున్నదన్న స్ఫురణ చదు

---

* పద్య భేదములను గురించి వారు ''1919 నుండి'' శ్రమిస్తున్నారు. పూర్తిచేసిన గౌరవము వారికి దక్కితే న్యాయము.

వరికి కలగకుండా ఏ ఛందస్సులో రాసినా అది సహజమే. ఇక్కడ ఒక్క మాట. త్యాగరాజు ''ఎంత నేర్చినా ఎంత జూచినా, కొంత దాసులే'' అన్న పల్లవిని విని చకితులైనవా రందరూ, ఆ తరువాతి ''సంతతంబు శ్రీ కాంత స్వాంత సిద్ధాంతమైన మార్గ చింతలేని వారెంత నేర్చినా '' అని వినగానే'' ''అయితే ఫరవాలేద''ను కున్నట్టుగా, పద్యాలు రచించే వారందరూ చక్కగానే వ్రాస్తు న్నామనుకొంటారు. ఎవరి పద్యాల్లోనైనా కేవల ఛందోస్ఫురణ అక్కడక్కడ కలుగుతుంది. కనుకనే అన్నాను పద్యమే కృతక మని. వేమన్నకు ఆటవెలది, ధూర్జటికి వృత్తమూ శ్రీనాథు డికి సీసమూ చాలా మట్టుకు సహజాలు. వాటిల్లో వారి రచన మొత్తం మీద ఛందస్సు కట్లకు లోనైనట్లు కానరాదు. అయితే వారికీ అన్ని పద్యాలూ సహజంగా కుదరవు. ఉమాకాన్తం గారన్న ఛందో వ్యతిక్రమాలూ భాషా వ్యతిక్రమాలు కట్టుబాట్ల వల్లనే కలుగుతాయి. కనుక 'ఈ ఛందస్సు' లో వ్రాయాలనీ ఈ వృత్తాల్లోనే పూర్తిచెయ్యాలనీ ఉద్యమించకండి మీ భావాలు చదువరికి చక్కగా అందేటట్టు వ్రాయండి అంటున్నాను.

నాలుగు 'ర' గణాలు చేర్చితే స్రగ్విణి, అవే 'య' గణా లైతే భుజంగప్రయాతమూ, 'భ' గణాలైతే పాదపమూ (దీనిలో చివరి లఘువులు రెండూ గురువైనాయి), 'స'గణా లైతే తోటకమూ, 'న' గణాలైతే తరళమూ, నలములైతే రమణకమూ, ఏర్పడుతున్నాయి. అదొకటి ఇదొకటి అదొకటి ఇదొకటీ చొప్పున చేర్చితే తరలి, మలయుజ, సాధ్వి, లయ విభాతి ఏర్పడుతున్నాయి. ఇలాగ సామాన్య గణాల్ని పేర్చి కృత కంగా నిర్మించినట్టిదే గాని ఛందస్సూ, కవితా రచనలు చాలా చాలా రచించిన తర్వాత, ''ఇంచక్కగా కుదిరేయే ఇవేమిటి ?'' అని విశ్లేషించుకున్నట్టిది కాదు. అలాగ జరిగి ఉంటే ప్రకృతి సిద్ధమైన వరసలు కొన్నయినా సిద్ధించి ఉండును. ఇప్పుడు జరిగిన దేమిటి—? పాటల వరసలో వాడుతున్న వాటినే రెండు ఆ వృతాలలోని సమీపాక్షరాలను అతికి గురువు చేసి (ఉత్పలమాలలో రెండో నాలుగు మాత్రల గణాన్నీ మూడో నాలుగు మాత్రల గణాన్నీ గురువుతో అతికినట్లు) ఆ వృతాల్ని అతికి పద్య వరస చేశారు. సరిగ్గా ఇలాగే ఉన్న మరో వరసని చంపకమాల అన్నారు. ఇలాగ ఆవృతాల సరాలకు వేర్వేరు పేర్లు పెట్టి, యతిప్రాసల్ని తగిలార్చారు. ఈ ఛందస్సు అని వార్యము ఎందుకౌతుంది ? కానే కాదు.

ఛందస్సుకి శాస్త్రసిద్ధమైన నిర్మాణ మున్నది గదా, దానిని కృత కమనుటేలా ? అని అనుమానిస్తారు పాఠకులు. ఆ నిర్మాణపు లెక్కని ఈ వ్యాసములోని మొదటి నాలుగు అక్ష రాలూ ఒక వృత్తము. తర్వాతి రెండు రెండు అక్షరాలూ (నాలుగు రెండ్లు) ఒక వృత్తము. మూడు మూడు ఇంకొక వృత్తము. నాలుగు నాలుగులూ, నాలుగు అయిదులూ, నాలుగు ఆరులూ, ఇలాగ నాలుగు ఇరవైయార్ల వరకూ 26 ఛంద స్సులకూ ఉదాహరణలైన ఇరవైయారు వృత్తాలు ! చివరి అక్షరాలు దీర్ఘాలు చెయ్యడమూ, యతులు కుదర్చడమూ కష్టమేమీ కాదు లెండి. పనికిరానంత విశాలముగా ఉంది ఛందశ్శాస్త్రము. సీతాపతిగారు పట్టిన సీసభేదములూ, కంద భేదములూ ఇతర పద్యాల అవతారములూ అన్నీ చేర్చి ఛందస్సు చెప్పే 134217726 లో ఎన్నవ వంతో! ఇంకా చాలా మిగిలి ఉంది పరిశోధన !

'కవిత్వానికి ఏదో వరస ఉండి తీరాలి' అంటున్నారు కొందరు. ఆ వరస యేదో కవికి వదిలేయండి. వరస అక్కర లేదనుకుని కవి వచన పద్యాలు రచిస్తే ఏదో నేరము జరిగినట్టు 'హాలికేక'లు పెట్టడమేలా ? కవే ఎంచుకుంటాడు కావలసిన వరసని. మీస్కేలు బద్దలూ ప్రొట్రాక్టరులూ పట్టుకుని తీర్పు బోతారెందుకూ ఆతని సృష్టినీ ? అది బాగుండకపోతే బాగులేని రచనలకూపంలో పడిపోతుంది, బాగుంటేనే నిలుస్తుంది.

అకాడమీ బహుమతులు: శ్రీ విలాయత్ ఖాన్ విమర్శ

ప్రముఖ సితార్ విద్వాంసుడు ఉస్తాద్ విలాయత్ ఖాన్ కేంద్ర సంగీత నాటక అకాడమీవారు తనకివ్వజూపిన బహుమతిని తిరస్కరించారు. ఇందుకు కారణాలను ఆయన వివరిస్తూ ఈ బహుమతులు ఇవ్వడానికి నిర్ణయాలు జరుగుతున్న తీరు సవ్యంగా లేదనే విషయం ప్రజలదృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుక రాగోరి, కావాలనే బహుమతి స్వీకరణకు తాను నిరాకరించినట్టు తెలియ జేశారు.

ఈ బహుమతుల నిర్ణయ పద్ధతి పూర్తిగా మారిపోవా లని, అలా జరిగినప్పుడే అకాడమీ నిర్ణయాలు ప్రజలయొక్క కళాకారులయొక్క మన్ననలు పొందగలవనికూడా శ్రీ విలాయత్ ఖాన్ స్పష్టం చేశారు. అకాడమీ నిర్ణయాలు కళాకారుని ప్రతిభనుబట్టి, సూత్రబద్ధంగా కాకుండా నిరంకుశంగా జరుగు తున్నాయని అంటూ తనకు బహుమతి ఇవ్వాలని ఏ పరీక్ష లేదా సూత్రాల ప్రకారం నిర్ణయించారో తెలియ జేయమని అకాడ మీ వారికి లేఖ వ్రాసినా, దానికి స్పష్టమైన సమాధానం రాలే దన్నారు. అందువల్లనే బహుమతిని తిరస్కరిస్తున్నట్టు మరొక లేఖ వ్రాశామని కూడా తెల్పారు.

లేఖలు

కూర్చుండు: ఒక జిజ్ఞాస

ఆర్యా !

తెనుగులో ఆసీనులై ఉండుటకు తగిన స్వతంత్ర క్రియ ఏదీ ఉన్నట్లు కనిపించదు. కూర్చు+ఉండు— కూర్చుండు, కూరుచుండు ఉన్నది. ఇదే వాడుకలో కూర్చొను అయింది. భారతములోను, కుమార సంభవములోను కూర్చుండు వాడిన సందర్భము లున్నవి. కూర్చొను కూర్చుకొను రూపంలో నుండి వచ్చి యుండవచ్చును. కూర్చుకొను, కూర్చుకో కూరుచో, కూర్చోగా మారినది. తక్కువ తరగతి గ్రామ్య భాషలో కూకో, కూకుండు, కూసుకో వంటి రూపాలు కూడా ఉన్నవి. ఇది 'కూర్చుకో'' పొందిన అపభ్రంశ రూపాలు కావచ్చును. ఈ క్రియలన్నీ చూస్తే ధాతువుగా ఉన్న కర్త్రర్థక స్వతంత్ర క్రియ ఏదీ దేశి తెనుగులో ఉన్నట్లు తోచదు. రా, పో, తే, లే అన్నట్లు కూర్చో యని అనలేము. అంటే అది లక్షణ విరుద్ధము కావచ్చు. తెలుగు తోబుట్టువులైన దక్షిణాది ద్రావిడ భాషలలో కూర్చుండటానికి క్రియా పదము— తమిళంలో ఉట్కారు ఉక్కారుంగో (కూర్చుండండి) అని వస్తుంది. అది కూర్చుండు లాంటిదే— స్వతంత్ర క్రియ కాదు. కన్నడంలో కూర్చుకో— కూన్‌కో— అని ఉంటుంది. 40 జనరు కూఱ్ఱదు— అని రైలు పెట్టెలలో వ్రాసి ఉండటం చూస్తాం. మలయాళంలో 'కఇరు' అనేది కూర్చుండు అనే క్రియకు బదులు వాడతారు. అందుచేత ద్రావిడ భాషలకు మూలమైన దక్షిణాది వాసుల వాడుక భాష ఏదైనా ఉంటే దానిలో 'క ఇరు' 'కూర్చుండు' అనే మాటకు పర్యాయ పదంగా వాడే వారేమో ! ఇంక— భారతీయ భాషలన్నింటికి మూలమున దగిన సంస్కృత భాషలో తిష్ఠ, తిష్ఠతి అనేది వాడుకలో ఉన్నది. ఇది 'ష్ఠ'లో నుండి వచ్చియుండవచ్చును. ప్రాకృత భాషల్లో కూడ ఈ రూపం మార్పు చెంది ఉన్నది. తిష్ఠ, విష్ఠ అయి— చిఠ్ఠ, బిస్స, బైఠో, బస్సొ, బసో అయింది. ఈ క్రమ పరివర్తనమే— అస్సామీ, ఒరియా, బెంగాలీ భాషలలో బొస్సో గాను, బొసొ బోసో గాను ప్రయోగంలో ఉన్నది. ఈ వాడుక, వసు లోంచి వచ్చిందంటారు. 'వసతి', అంటే ఉండటం. తిరిగి 'కూర్చుండు' లోని ఉపక్రియ 'ఉండు'లోనికి వస్తే తిరిగి వస్తాము. హిందీ, ఉరుదూ, పంజాబీ భాషలలో 'బైఠో' గానే వాడుతున్నారు. గుజరాతీ, మరాఠీ, భాషలలోనూ అంతే— యూరపియన్ భాషలలోనికి— ఆర్యన్ భాషా తద్భవంగానే వచ్చినట్లు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు నిరూపించినది. 'సిట్టాన్' చిటాన్ రూపానికి వికృతి. ప్రాత ఇంగ్లీషులో 'సిట్టాన్' అని వాడేవారట. డచ్చి భాషలో 'జిట్టెన్' అనీ జర్మన్‌భాషలో సిట్‌జెన్ అనీ లాటిన్ భాషలో సిదీర్ అనీ, గ్రీక్ భాషలో హెజమాయ్ అనీ, సంస్కృతంలో ''షద్లృ'' అని ఉంటుందని ఉదాహరణలు ఈ నిఘంటువు చూపించినది. ఇవన్నీ పరిశీలిస్తే— భారతీయ భాషలలో కాని, యూరపియన్ భాషలలో కాని తెలుగులోని 'కూర్చుండు' అనే క్రియా పదానికి ఉత్పత్తి రూపం కాన రాదు. పూర్వం తెనుగువారు 'కూర్చుండు'టకు అలవాటు పడలేదా ? లేనియెడల, తెలుగులో ఈ క్రియాపదమెందుకు లేదు ? ఈ సంశయమును భాషాకోవిదులు తెలుప గలరని అభిలషిస్తున్నాను.

(విజయవాడ) —శ్రీ వాత్సవ.

విమర్శల పోకడ

ఇటీవల అక్టోబరు నెల భారతిలో ప్రచురితమైన శ్రీ అక్షయ గారి లేఖను చదివేను. భారతి ప్రతినెలా చదివే సామాన్య పాఠకుల్లో నేనొకణ్ణి. ఎన్నో సంవత్సరాలుగా, భారతిలో ప్రచురితమైన వ్యాసాల్ని సాహిత్యవిమర్శల్ని చదువుతున్నాను కాని, శ్రీ అక్షయగారి లేఖ వంటిది ఎన్నడూ చూడలేదు. వినలేదు. వారు ప్రస్తావించిన విషయమూ, అందులో వివరించిన అంశాలు, నిర్మాణాత్మక దృష్టితో లిఖింప బడినవేఅయినా ఒక్క సందర్భంలో ఆయన పొరపాటు చేశారనిచెప్పక తప్పదు.

భారతిలో విమర్శల పోకడలు సమీక్షించటం వంటి ముఖ్య బాధ్యతను నిర్వహిస్తూ, వారు తటస్థంగా ఉండాల్సిందే కానీ ఏ ఒక్కరి విమర్శకు సమాధానం వ్రాయకూడదు. శ్రీ అక్షయగారు చేసిన పొరపాటు యిదే.

దీపాల వారి విమర్శను ''క్రూరం'' అని వర్ణించటం బాగు లేదు. కనీసం సదస్సు మర్యాద పరిమితుల్ని అదాటుని మరో పద ప్రయోగం చేయవలసింది. ఉదా : ''కఠినం'' ''తీక్ష్ణం'' మొదలైనవి. పైగా ''వ్యర్థగీతం''లోని 'అశావాదాన్ని' సమర్థిస్తూ అందులోని భావాల్ని నచ్చని శ్రీపాదవారికి సమానంగా నాలుగు వాక్యాలు రాయటంలో వీరిఆంతర్యమేమి?

భారతిలో విమర్శల పోకడలను నిరూపింప దలచిన వారు, ఆ స్థాయిని ఉగ్గడించి చాలించవలసింది. ఒకరి విమర్శను క్రూరం అనటం మరొకర్ని సమర్థిస్తూ ప్రతి కక్షికి సమాధానం రాయటం— ఈ ధోరణి, వారు వర్ణించిన ఉత్తమ మధ్యమాధమ పద్ధతుల్లో ఏ తెగకు చెందినా, వివాదాన్ని రెచ్చగొట్టే విధంగా ఉండటం చేత అవాంఛనీయం అనాలి.

శ్రీ అక్షయగారు మొదట్లోనే చెప్పారు విమర్శలో మూడు పద్ధతులున్నవని. నిజమే; కానీ విమర్శకుల్లో అనేక పద్ధతుల వారున్నారని తెలుసుకోవటం అవసరం. కొందరు తీవ్రంగా విమర్శిస్తారు. కొందరు వ్యంగ్యంగా ఎత్తిపొడుపుగా రాస్తారు. మరికొందరు అన్యాపదేశ కవిత్వం అల్లుతారు, ఇంకా కొంత మంది శిఖండిని ముందర పెట్టుకుని యుద్ధం చేసిన అర్జునుడి లాగా ఎవర్నో అండగా తీసుకుని విమర్శ సాగిస్తారు. బహుశా కడుపు తెగవారు కాబోలు అటూ తేల్చక ఇటూ తేల్చక— సుతి మెత్తని రాగాలాపన చెస్తూ సుత్తి పెట్లు పెడుతుంటారు. ఎవరి ధోరణి వారిది. విమర్శించే ఆవేశంలో ప్రమాదాలు దొర్లవచ్చు— అంత మాత్రం చేత యువక రచయితలు తల్లక్రిందులు కావడం వారి మానసిక దౌర్బల్యాన్ని వ్యక్తం చేస్తుంది. విమర్శ అనగానే భయపడ నక్కఱ లేదు. అది ఒక 'తప్పొప్పుల పట్టికగా' తీసుకోవాలి. ఒకరు విమర్శిస్తున్నారంటే మనల్ని సానబట్టడానికి ప్రయత్నిస్తున్నారని అనుకోవాలి. అదేసంస్కారం. ఇంతవరకూ నేను రాసిన నాలుగు మాటలు అక్షయగారి లేఖను విమర్శించటానికి కాదు. నా అభిప్రాయాల్ని నేనువ్యక్తం చేసేను.

(జంషెడ్పూర్)—బలివాడ రఘునాథరావు.

గ్రంథ విమర్శలు

శ్రీరామకృష్ణ లీలామృతము
శ్రీ వివేకానంద జీవిత చరిత్ర

రచయితలు :— శ్రీ. శ్రీ. వెదురుమూడి కృష్ణారావు పంతులుగారు. శ్రీ. శ్రీ. కందుకూరు మల్లికార్జునంగారు. వెల :— రూ5—00.

శ్రీ వివేకానంద జీవిత చరిత్ర. రచయిత :— శ్రీ చిరంతనానందస్వామి. వెల:— 4.25. ప్రాప్తిస్థానము :— శ్రీరామకృష్ణమఠము. మైలాపూరు. మద్రాసు—14.

మతము వేరు. దర్శనము వేరు. దర్శనమునకే తత్త్వశాస్త్రమనునది మరియొక పేరు. విశ్వాసము మతమునకు తల్లి వేరు. విచారము దర్శనమునకు జీవగఱ్ఱ. బాహ్యాభ్యంతర శౌచము లను బోధించి, శమదమాది గుణములనువేర్పి, భగవదారాధన క్రమమును, నిత్యనైమిత్తిక కర్మలను నిర్దేశించునది మతము. మతమునకు పరమాత్మ కేంద్రము. జీవాత్మ అనుబంధము. ఆచారములు విశ్వాసములు, వివిధ నిషేధములు మతమునకు మహాంగములు. ఇక దర్శనమందురా ? దాని పోకడయేవేరు. సకల చరాచరములకు నిలయమయిన ఈ నామరూప జగత్తునకు ఆద్యంతములేల ? దీనికి ఉపాదన కారణమేమి ? ఈఘటపటాది ప్రపంచము సాపేక్షమా ? నిరపేక్షమా ? ఈసృష్టిలో జీవుని విలువయేమి ? మానవునకు ప్రకృతికిగల చుట్టరికమెట్టిది ? విశ్వచోదకమయిన శక్తి స్వరూప మేది ? ఈప్రశ్నలకు సమాధానములను వెదుకునది దర్శనము. దర్శనములో మతము పాలిటసొమ్ము కొంతయుండును. దర్శనమునకు సమన్వయము ప్రాణము. మతములో హఠము మెండు. భారతదేశములో మతమునకు దర్శనమునకు భేదమును చూపిన వారెందరో లేరు. అందుచేతనే మతవిభాగమును గౌణముగా చేసి జగత్తత్త్వమును శోధించిన వారిని పాషండులనియు, నాస్తికులనియు అనుట పరిపాటయినది. మతమును అంగీగా చేసినవారిని మహాత్ములనుట పొసగినది. మత దర్శనముల తారతమ్యమును పరిగణింపనిచో భారతదేశములో మతప్రచారకులు దార్శనికులుగా సాక్షాత్కరింతురు. సాక్షాత్కరించిరి గూడా. ఇట్లగుట దర్శన మూలతత్త్వమునకే విరుద్ధము. భారతదేశమునందలి దర్శనములను రెండు తెగలుగా స్థూలముగా వింగడింప వచ్చును. ఒక తెగ దర్శనములు ముఖ్యముగా వేదప్రామాణ్యమును అంగీకరించి విశ్వాసముతో విశ్వపరిశీలనము చేయును. ఈ తెగ ప్రకారము వేదములు అపౌరుషేయములు. త్రికాలాబాధితములు. రెండవ తెగ వేదప్రామాణ్యమును త్రోసిరాజని, స్వతంత్రముగా విశ్వతత్త్వమును వెల్లడించును. దీనికి వేదములు పౌరుషేయములే. శంకరాదులు మొదటి తెగవారు. సాంఖ్య బౌద్ధ దర్శనములు రెండవ తెగ. వేద ప్రామాణ్యము నంగీకరించుచు విశ్వమును వ్యాఖ్యానించుట యందును వేదములు లేకపోలేదు. అందుచేతనే నూతనదర్శనము చేయ నిశ్చయించిన ప్రతిదార్శనికుడు ప్రస్థానత్రయమునకు తనకనుకూలముగా భాష్యము వ్రాయుట పరిపాటి యయినది. దీనిని బట్టిచూచిన వేదములు, ప్రస్థానత్రయము సర్వదర్శనముల బీజములు కలిగియున్నవేమో యనిపించును. ప్రాచీన కాలమున భారత దేశములో ఈ జగద్రహస్య శోధనము అధికము. రాను రాను ఈ పరిశోధనము సన్నగిల్లినది. ప్రజ్ఞామూర్తులవతరింపరైరి. నూతన దర్శనములు వెలువడవాయె. ఉన్న దర్శనములను పూర్ణముగనో, ఖండముగనో వివరీకరించుటయో సంగ్రహించుటయో సంభవించినది. దీనికి తోడు ఈ యాదిమ దర్శనములు మతవిభాగమునకు లోబడి అనాచారములకు నిలయములైనవి. చారిత్రక కారణముల వలన తత్త్వజిజ్ఞాస, మతనైర్మల్యము చచ్చినవి. మహమ్మదీయుల త్రుళ్లు, పాశ్చాత్యుల రాక, అన్నిటిని మించిన దురహంకార మౌఢ్యములు ఏకము కాగా భారతదేశములో పదునెన్మిదవ శతాబ్దమునాటికే మతదర్శనములు జీర్ణములయినవి. అన్నమైన నేమి ? సున్నమైన నేమి ? తినుటకు అన్నము మాత్రమే పెట్టుము; అను గేదె కాడ వేదాంతము ఎక్కువ యయినది. కొనబఱ్ఱ యయినది. ఇంతలో పందొమ్మిదవ శతాబ్దము రానే వచ్చినది.

నవభారతోదయమునకు పందొమ్మిదవ శతాబ్దము పూరేఖ. పాశ్చాత్య సభ్యత పాశ్చాత్య భాషా సంబంధము భారత దేశమునకు సాంస్కృతిక క్షేత్రములో ఒక క్రొత్త వెలుగు నిచ్చినవి. భారతదేశములో సాంస్కృతిక పునరుజ్జీవనము మొదలిడినది. ఆంగ్ల పరిపాలనము వలన భారతదేశము రాజకీయముగా అస్థిరంజరమైన మాట నిజము. అంతమాత్రమున సాంస్కృతికముగా సాంఘికముగా పాశ్చాత్య సభ్యత వలన కలిగే మేళ్లను మఱచిపోవుట బుద్ధిమాంద్యమునకు తార్కాణమే యగును. సంస్కృత భాషా పునరుద్ధరణము, ఉదార సాంఘిక సంస్కరణము, నూతన సాహితీ ప్రక్రియా సంప్రదాయములు, మత మౌఢ్య ప్రక్షాళనము పాశ్చాత్య సభ్యతఫలిత కలిగిన మేళ్లు. ధర్మదేవత పాదముల కడ సర్వ వర్ణములు సమానము లని గుర్తించినవా రాంగ్లేయులు. అధ్యయ నాధ్యాపనములకు సర్వ వర్ణములు సమానములే యని గుర్తించినది ఆంగ్ల ప్రభుత్వము. సౌభ్రాత్రము, సమానత్వము, స్వాతంత్ర్యము అను శరణత్రయమును నేర్పినది పాశ్చాత్య సభ్యత. ఇంతయేల?

గ్రంథ విమర్శ

ముసుగుదన్ని రేపవలు నిదురమత్తుతో మైమఱచిన భారతీయులను మేల్కొల్పి ఆత్మావలోకనము గఱపి, భారతీయ సంస్కృతి వైభవమును చాటినవారు ఉదారులగు పాశ్చాత్య విద్వాంసులు. మేళ్లతో పాటు కీళ్లు కలిగిన వందురా ? దాతలతోపాటు గ్రహీతలు కారణమే. సమచిత్తముతో దేనికి ఎవరెంత బాధ్యులో నిగ్గు తేల్పవలె. అంతే.

ఒక్కసారి పందొమ్మిదవ శతాబ్దమునాటి భారతదేశమును చూచినచో ఎందఱు మహాత్ములు ఏయే పొలములలో ఎంతగా విడమఱలేకుండా కృషి చేసిరో తెలియగలదు. ఆనాడు పాశ్చాత్య సభ్యత ఆ మహాత్ములపయి ప్రత్యక్షముగనో పరోక్షముగనో ప్రభావము చూపినది. పూర్తిగా పాశ్చాత్యపథమైపు ప్రమొగ్గి భారతదేశమును చెడగొట్టినవారానాడున్నారు. సర్వ విజ్ఞానము భారతదేశీయులకు కరతలామలకమే యని బిఱ్ఱబిగిసి ప్రేఱ్ఱేగినవారానాడున్నారు. వీరెవ్వరు చరిత్ర కెక్కలేదు. మఱి చరిత్ర కెక్కిన దెవ్వరు ? మార్గోపదేశకులైన దెవ్వరు ? పరిణామమును గుర్తించినవారు, ప్రాచ్య పాశ్చాత్య సభ్యతల మేలిమి చూచిన వారు, అన్య సభ్యతా విశేషములను భారతీయములుగా చేసి సమన్వయించిన వారు మాత్రమే దేశమును ముందునకు తీసికొని పోయిరి. అట్టివారిలో రాజారామమోహనరాయలు, కేశవచంద్ర సేనుడు, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, దయానంద సరస్వతి, అనీబిసెంట్, ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, రానడే, గోఖలే, కార్వే వీరేశలింగము పంతులు మున్నగు వారు ముఖ్యులు. రాజారామమోహనరాయలు మున్నగువారు మత సాంఘిక సంస్కర్తలు. ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు మున్నగువారు సాంఘిక సంస్కర్తలు. ప్రధాన లక్షణమును బట్టి యీ విభజనము సిద్ధించినది. రాజారామమోహనరాయలు మొదటి తెగకు తలమానికము. ఆయన యుద్యమము మొక పెద్ద యుప్పెన వలె పరవళ్ళు ద్రొక్కినది, కేశవచంద్రసేనుడు మతమును నిష్కళంకముగా చేసి హేతువాద పీఠముపయి ప్రతిష్ఠించెను. ఫలము బ్రహ్మసమాజము. రామకృష్ణ వివేకానందులు సనాతన ధర్మమునకు నడుమ నంటుకొన్న మురికిని కడిగి తుడిచి ప్రాక్తన శుచి స్వరూపమును చూపి దానిని పైకెత్తిరి. దయానందుడు హైందవమునకు వీరతాగుణమును అలవఱచి వేదోన్ముఖ ప్రవృత్తిని (Back to vedas) చాటెను. అనీబిసెంట్ హైందవ మతముపట్ల అతివేలమయిన అనురాగమును చూపుచు, సత్యమత సామరస్యమును అనుగ్రహించెను. ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు, వీరేశలింగము పంతులు మున్నగువారు సంఘమునకు పట్టిన బూజును దులిపిరి. హైందవ సంఘము గతి చూపజాలని వారికి గతి కల్పించిరి. ఈ రెండు తెగల లక్షణములును మూర్తీభవించిన యుగపురుషుడే మహాత్ముడు. ఈసంస్కర్తలందఱు భారతదేశ ప్రాచీన సంస్కృతిని విస్మరించినవారు **గారు. వారికి భారతీయ సంప్రదాయములు కొట్టిన పిండి. వారు తమ చుట్టును నాలుగు గోడలు కట్టుకొన్నవారు గారు. పాశ్చాత్య సభ్యతయందలి జీవశక్తిని,** పరిణామ శీలమును భారతీయములుగా చేసి స్వజాతికి, స్వమతమునకు, స్వసంఘమునకు జోడించిరి. మానవతా వాదము, కరుణ, అభేద దృష్టి ఆ సంస్కర్తలను నడిపించిన శక్తులు. వారి సిద్ధాంతములు వర్ణావధిని దాటినవి. వారెల్లరు సర్వ భారతీయ సంఘమునకు చెందినవారు. హైందవమత సంఘములకు సంక్రమించిన కాలదోషములను ఉచ్చాటనము చేసిరి. తిరిగి వాని ప్రాచీన పరిశుద్ధ రూపములను వెలుగునకు తెచ్చుచునే, అంతకుముందు లేని మేలిమిని వానికి కలిగించిరి. మొదట మత సంస్కరణములుగాని సాంఘిక సంస్కరణములు గాని పొత్తు పొందికలు లేక వేని త్రోవ వవే పోయినవి. ఇరువదవ శతాబ్దము వేగుచుక్క పొడిచిన తరువాత గాని, మత సాంఘిక సంస్కరణములు ఒకదానితో నొకటి పెనవైచికొని ఒక మహాలక్ష్యమునకు అంగములైనవి. ఆ మహాలక్ష్యము పరతంత్ర భారత విముక్తి. ఆ జాతీయోద్యమ రథసారథి మహాత్ముడు. మొదట మత స్వాతంత్ర్యము, సాంఘిక స్వాతంత్ర్యము భిన్నములుగా ప్రచలితము లయినను, తుదకు అవి రాజకీయ స్వాతంత్ర్యముతో ముడిపడినవి. ఈ మూడు స్వాతంత్ర్యములును మహాత్ముని చేతి యందలి పగ్గములు.

పందొమ్మిదవ శతాబ్దమందలి భారతదేశము ఎంత హీనస్థితిలో నున్నదో చెప్పజాలము. క్రూర నిరంకుశమయిన ప్రభుత్వము, నిర్వీర్యత, స్తబ్దత, అజ్ఞానము, దారిద్ర్యము ఎముకలను కొఱికివేయుచున్న ప్రజలు, వామాచారములతో నిండి పవిత్రతకు దూరమయిన మతము, మూఢవిశ్వాసములను, అనాచారములను వీడలేని సంఘము—పందొమ్మిదవ శతాబ్దము నాటి భారతదేశము భౌతికస్వరూప మిది. దీనిని మించి అపరిపక్వబుద్ధులగు క్రైస్తవమత ప్రచారకుల్ను, ఆంగ్ల ప్రభుత్వోద్యోగుల రారాపిళ్లకు, దుర్విమర్శలకు, పీడలకు, భారతీయ జాతి, భారతీయ మతము తట్టుకొనలేక పోయినది. పాశ్చాత్య దేశముల నుండి క్రొత్తగా వచ్చిన హేతువాద శస్త్రమును చేబట్టి ఆనాటి ఆంగ్ల విద్యాభిమానులు భారతీయ సంస్కృతిని చీల్చి చెండాడిరి. పాశ్చాత్యులు వాడిన "నేటివ్స్" అను పదమే వారికి భారతీయులపట్ల గల రోతకు తార్కాణము. ఈ రోతముజూచి ఆనాటి భారతీయ విద్యావంతులు మురిసిపోయిరని మనము మఱవరాదు. స్వమత విశ్వాసము లేగపోవుట అట్లుండ నిండు పరప్రత్యయనేయ బుద్ధులై, భారతీయసంస్కృతిమూల తత్త్వమును గ్రహింపజాలక, దానిని ఖండించుట ఆనాటి విద్యావంతులకు ఆచారమయినది. నరేంద్రుడే ఈ వరదలో పడి కొట్టుకొని పోయి పోయి, రామకృష్ణపరమహంస మనఃచక్షువును తెఱచినదాక భారతీయ సంస్కృతిని విమర్శింప మానలేదు. నరేంద్రుడు "మీరు దేవేంద్రున జూచితిరా?" యని మహర్షి దేవేంద్రనాథ ఠాగూరునే ప్రశ్నించెను. ఇది యీనాటి పడుచువాండ్ర బుద్ధులే పోకడలు పోవుచున్నవో తెలియ జేయును. ఇట్టిచో పరిశుద్ధమయిన సనాతన ధర్మమును, చాటి, ప్రత్యక్ష ప్రమాణము నంగీకరించు హేతువాదులక్

జగచ్ఛక్తి లీలావిలాసములను చూపు మహాత్ముడు కావలసి. రావలసి యుండెను. ఆనాటికి ఆయన పుట్టనే పుట్టెను. ఆ మహాత్ముడే శ్రీ రామకృష్ణ పరమహంస.

రామకృష్ణపరమహంస నూతన దర్శనమును నెలకొల్పినవాడు గాడు. మిక్కిలి యుదారమయిన, శుద్ధమయిన సనాతన ధర్మమును కాలానుకూలముగా ప్రవచించి, జగచ్ఛక్తి లీలలను తా ననుభవించి, తన్నాశ్రయించినవారు కూడ అనుభవించునట్లు చేసిన కర్మయోగి. ఈశ్వర లీలావిలాసములను వెల్లడించినవాడు గనుకనే, రామకృష్ణుని జీవితములో ముప్పాతిక మువ్వీసము, సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మమును భిన్న భిన్నోపాధులలో దర్శించుట యందే గడచిపోయినది. పరదేవతా దివ్యదర్శనమువలన ఆయనకు బాహ్యస్మృతి పరిపూర్ణముగా నశించుచుండెడిది. "అన్ని ఆకృతులందును, అన్ని మతములందును ఒకే దైవమును చూడ" గలిగిన విశాల హృదయము రామకృష్ణుని సొమ్ము. విశ్వేశ్వరీ దర్శనము గావించి రామకృష్ణుడు దివ్యోన్మాదమునకు లోనయ్యెను. సీతాదేవిని చూచెను. ఆయన చైతన్యుని అపరావతారమని భైరవీ బ్రాహ్మణి తలంపు. మహాభావములన్నియు రామకృష్ణునిలో నున్నవని యామె తీర్పు. రామకృష్ణుడు తాంత్రికసాధన చేసెను. వైష్ణవారాధన పద్ధతుల ననుసరించెను. మధుర భావోన్మాది యాయెను. ఈ మధురభావ సాధనలో గోపిక వోలె వస్త్రధారణము చేసెను. నిర్వికల్ప సమాధి పొందెను. "ఇతర మతముల వలెనే మహమ్మదీయ మతము గూడ భగవత్సాక్షాత్కారము పడయుటకు ఒక సాధనమని ఆయన విశ్వసింపసాగెను." ఆయన అల్లాను దర్శించెను. క్రైస్తవమత భావ పరవశుడై, క్రీస్తును జూచెను. ఏ సాధన మార్గము ననుసరించినను రామకృష్ణుడు తత్సంబంధ బాంధవములందే లీనమగును. ఆయన హనుమంతుని వ్యక్తిత్వ భావనలో మునిగిపోయి తత్సంబంధ చేష్టలే చేసెను. రామకృష్ణుడు సర్వవిధ దివ్యభావములను అతీంద్రియ దశయందే అనుభవించెను. అనుభవించుటయే గాక భావోద్రేక పరవశుడై హృదయ ప్రేరణల ననుసరించి చిత్ర విచిత్రములుగా ప్రవర్తించెను. ఆయన యద్వైతియే గాదు విశిష్టాద్వైతియును. ద్వైతియును. కామినీ కాంచనములను ఆయనమాదిరిగా జయించినవా రరిది. జననాత్పూర్వము దివ్య చిహ్నములు గోచరించుట, ఏకాంతసాధనము, శిష్యగణము నెన్నికొనుట, ప్రాతినిధ్య సిద్ధాంతము, హస్తస్పర్శ కలిగియుండుట రామకృష్ణ పరమహంస క్రీస్తు జీవితములలో కన్పించు సమాన లక్షణములు.

లలితకోమలోదాహరణములతో గాఢ వేదాంతరహస్యములను వెల్లడించుట రామకృష్ణునకు వెన్నతో పెట్టిన విద్య. ఆయనది పుస్తకజ్ఞానము కాదు. అనుభవమువలన సిద్ధమయిన జ్ఞానమది. అందుచే రామకృష్ణపరమహంస యేది చెప్పినను అనుభవ పరమార్థముతో నిండి విను వారి గుండెలో సూటిగా హత్తుకొని పోవును. నోరును మాత్రమే మూయించి, హృదయ విశ్వాసము గల్గింపలేని శుష్కతర్కమే ప్రాయికముగా వేదాంత బోధలో గోచరించును. అట్టితర్కము రామకృష్ణుని వాక్కులలో కానరాదు. రామకృష్ణపరమహంస జీవనము బోధించు చరమార్థమేది? ఆయన "సకలమత శిక్షణ విధాన మార్గానలమున్న భగవత్సాక్షాత్కారము గాంచిన పిమ్మట సర్వ మతములును సత్యమే యని—అనగా ప్రతి మత సిద్ధాంత పద్ధతియు భగవత్పాద సన్నిధికి ఒక మార్గమే యని దృఢముగా విశ్వసించెను" రామకృష్ణుడొక ప్రసంగమున ఇట్లు వాక్రుచ్చెను. "ఒక చెఱువునకు చాల ఘట్టము లున్నవి. ఒక ఘట్టములో హిందువులును, మఱియొకదానిలో మహమ్మదీయులును ఇంకొకదానిలో ఆంగ్లేయులును నీరు ముంచుకొందురు. వారా నీటినే క్రమముగా నీరని, పానీ అని, వాటర్ అని అందురు. కాని మూడును ఒకటే, భేదము పేరులోనే. అట్లే కొందఱు అతనిని అల్లా యనియు, కొందఱు గాడ్ యనియు, మఱికొందఱు బ్రహ్మమనియు, కాళి యనియు, దుర్గ యనియు, రాముడనియు, హరి యనియు, ఏసుక్రీస్తనియు, అందురు". ఇంతమాత్రమున రామకృష్ణ పరమహంస హైందవ మతమునకు స్వస్తి చెప్పెనని భావింప రాదు. ఆయన హైందవుడుగనే జీవించి హైందవుడుగనే సమాధి పొందెను. భారతీయుడు హైందవ ధర్మమును నియమనిష్ఠలతో అనుసరించుచు, పరాగమములన తృణీకరింపరాదనియే ఆయన ప్రవచించెను. భారతీయునకు సనాతనధర్మము. సోపానము సాధనము. విశ్వమత సామరస్య గమ్యము. సాధ్యము. ఇదియే రామకృష్ణుని జీవన చరమార్థము. ఏకం సద్విప్రా బహుధా వదంతి. భిన్నత్వమునందు ఏకత్వమును దర్శించుట భారత సంస్కృతి పరమలక్షణమని విజ్ఞుల అభిప్రాయము. ఆ పరమలక్షణము మూర్తీభవించిన అవతార పురుషుడే రామకృష్ణ పరమహంస. ఆ యవతారపురుషుడు క్షుద్రములయిన వర్ణభేదములకు తన గుండెలో, తన మాటలో, తన నడవడిలో చోటు చూపలేదు.

రామకృష్ణుడు మంత్రశక్తి. ఉత్సాహ ప్రభు శక్తుల మేళనము వివేకానందుడు. రామకృష్ణుడు అర్థము. వివేకానందుడు వాక్కు. రామకృష్ణుడు పరతత్త్వాగ్ని. వివేకానందుడు ఊష్మలత. వా రిరువురు నరనారాయణులు. రామకృష్ణుడు వివేకానందుని కొఱకు పొందిన తహతహపాటు గోపికా గోపాల తత్త్వమును స్మరణకు తెచ్చును. హేతువాద కరవాలముచే సమస్తాగమములను చీల్చి చెండాడు నరేంద్రుడే రామకృష్ణ సాంగత్యము వలన ఆధ్యాత్మికవాదియై వివేకానందు డాయెను. వివేకానందుని జీవితములో విశ్వమత మహాసభ యొక్క ప్రప్రధాన ఘట్టము. దానివలన కలిగిన మేళ్లు రెండు. వివేకానందునకు పాశ్చాత్య ప్రపంచమున సనాతన ధర్మమును ప్రచారముచేయ వీలుగల్గుట మొదటి మేలు. నిర్వీర్యమై క్రైస్తవమత ప్రచారకుల యజ్ఞానమయ విమర్శ

లకు కృంగిపోయిన హైందవ మతము నిలబడి విశ్వవీధులలో తలయెత్తుట రెండవ మేలు. విశ్వమత మహాసభలో నుపన్యసించిన వివేకానందుని గూర్చి అనాటి న్యూయార్క్ హెరాల్డ్ ఈ క్రింది విధముగా వ్రాసినది. "He is undoubtedly the gratest figure in the Parliament of Religions. After hearing him we feel how foolish it is to send missionaries to this learned nation." మొదట పాశ్చాత్య సభ్యత యందలి క్రియాశీల శక్తి, పరిణామ శీల శక్తి వివేకానందుని యెంతగానో ఆకర్షించినవి. విశ్వమత మహాసభకు వెడలిన వివేకానందునకు ఆ శక్తుల వెనుక దాగిన అమానుష ప్రవృత్తి అవగతమయినది. పడమటివారి యెట్టయెదుటనే వారి సభ్యత యందలి క్రుళ్ళును కుండ బ్రద్దలు గొట్టినట్లుగా వెల్లడించి, కడిగి కడిగి కంచెలో పోసెను. ఈ పోయుటలో క్రైస్తవమత ప్రచారకుల అగడము అగినది. అంతమాత్రమున భారతీయ సభ్యత యందలి దోషములను చూడలేని గ్రుడ్డితనము వివేకానందునిలో నున్నదని మనము భావింపరాదు. భారతీయుల మూఢాచారములను దురహంకారమును, నిర్వీర్యతను, క్రియాభిరాహిత్యమును చూచి వివేకానందు డెంతగా ఏవగించుకొనెనో, ఎంతగా చెడదిట్టెనో, ఎంతగా ఆక్రోశించెనో ఆయన రచనలు చదివినవారి కెల్లరకు తెలియును. భారతదేశములో భారతీయుల దురహంకార దురాచార మౌఢ్యములను దూషించుట, విదేశములలో భారతీయ సంస్కృతి వైభవమును చాటుట మనకు వివేకానందునిలో కానంబడును. విదేశీయుల విమర్శల నెదుర్కొని, భారతీయులకు ఆత్మావలోకనము అలవరచి, సనాతన ధర్మమును కాలానుగుణముగా విశ్వవ్యాప్తము చేయుటయే వివేకానందుని రచనల తాత్పర్యమై భాసించుచున్నది. ఆ రచనలలో దివ్యావేశము, కవితాకళ సౌందర్యము తొణికిసలాడును. ఆ రచనలు హృదయాగ్ని నుండి వెలువడిన విస్ఫులింగములు. వివేకానందుడు నూతన దర్శన స్థాపకుడు గాడు. మరి పరిశుద్ధ సనాతన ధర్మమును సరళసుందరముగా, ఆబాలగోపాలమునకు అర్థమగునట్లుగా వ్యాఖ్యానముచేసిన ప్రజామూర్తి.

రామకృష్ణ పరమహంసకంటె వివేకానందునిలో సాంఘిక దృష్టి ఎక్కువ. భారతీయుల అజ్ఞానము, దారిద్ర్యము ఆయన గుండెలను బ్రద్దలు చేసినవి. ఆ దారిద్ర్య విద్రావణమునకై ధనము సేకరించుటయు ఆయన యమెరికా యాత్రకొక ప్రబల కారణము. వివేకానందుడు సమగ్రముగు సాంఘిక న్యాయము గోరిన వాడగుటచే కాబోలు వర్ణాంతర వివాహములను సైతము వాంఛించిన వాడాయెను. రామకృష్ణ పరమహంస వలె వివేకానందుడు కూడ ఏ తుచ్ఛ భేదమును పాటింపలేదు. వ్యక్తియందలి దివ్యాంశను ఆయన తెస్పగా గుర్తించెను. ఈ సాంఘిక దృష్టియే ఆయనను శంకరాచార్యుల వారి కంటె గొప్పవానినిగా జేసినది. బుద్ధ రామానుజుల తర్వాత మానవతావాదిగా వివేకానందు డొకడే మనకు గోచరించును. ఆయన తన యాచార్యునివలె పరమత ద్వేషమును ఖండించెను. భారతదేశ మనినను, భారతీయ సంస్కృతి యనినను వివేకానందునకు ప్రాణ కల్పములు. భారతీయుడు భారతీయుడుగనే జీవింపవలయునని ఆయన స్థిర సంకల్పము. ఒక్క సనాతన ధర్మమునకే విశ్వమతమగు అధికారము, యోగ్యత కలవని ఆయన దృఢ విశ్వాసము. ఇతర సంస్కృతుల మేలిమిని గుర్తింపని స్వజాతి మత దురహంకారములు ఆయనలో మచ్చునకైన లేవు. ఆయన మాటలివి. "There is another great lesson we have to remember: Imitation is no civilization. Learn every thing that is good from others, but bring it in and in your own way absorb it; do not become like others. Do not be dragged away out of this Indian life; do not for a moment think that it would be better for India if all the Indians dressed, ate and behaved like another race." మానవతావాదము మూల ద్రవ్యముగా నున్న ఆధ్యాత్మిక జాతీయవాది వివేకానందుడు. భారతీయుడయిన వివేకానందుడు పరిపూర్ణ విశ్వమానవుడైనాడు. ఒక శిష్యున కాయన యిట్లు వ్రాసెను. "నేను భారత దేశమున కెంత చెందుదునో ప్రపంచమునకు నంత చెందుదను. ఏ దేశమునకు గాని నామీద ప్రత్యేకపు హక్కు లేదు. ఒక దేశమునకు నేను దాసుడనుగాను" సర్వ భారతీయులు భారతీయులుగా జీవించుచు ఇట్లే పరిణమింపవలయునని వివేకానందుని ప్రబోధము. "Make a European Society with India's religion." "Become an occidental of occidentals in your spirit of equality, freedom, work and energy, and at the same time a Hindu to the very backbone in religious culture, and instincts." "I am throughly convinced that no individual or nation can live by holding itself apart from the community of others, and wherever such an attempt has been made under false ideas of greatness, policy of holiness—the result has always been disastrous to the secluding one." "The fact of our isolation from all the other nations of the world is the cause of our degradation and its only remedy is getting back into the current of the rest of the world. "Motion is the sign of life." ఇవి వివేకానందుని సూక్తి రత్నాకరమునందలి యొక కొన్ని రత్నములు. స్వతంత్ర భారత దేశమునకు ఈ వాక్కులను అనుసరించుటకంటె ఈనాడు

మఱొకదారి లేదు. మరియొకదారి యున్నదందురా? అది పతనమునకే కొనిపోవుట తథ్యము. వివేకానందుని వాక్కే దానికి సాక్షి.

అట్టి రామకృష్ణుని వివేకానందుని జీవిత చరిత్రలను బహువిధములయిన సూక్ష్మాంశములతో మరల ఈనాడు రామకృష్ణ మఠమువారు ప్రచురించిరి. శ్రీ రామకృష్ణ లీలామృతము కథా కావ్యమువలె ఒప్పుచున్నది. వస్తు విభజనము ముచ్చటగా నున్నది. రచయిత లిరువురు ఏ యధ్యాయమున కా యధ్యాయము స్పష్టముగా నుండునట్లు చేసిరి. శైలి చిక్కనిది. చక్కనిది. రామకృష్ణుని శిష్యులను నలు తెగలుగా వింగడించుట అందముగా నున్నది. ఈ గ్రంథ రచయితలు యథార్థ కథనము నందెంతో సంయమనము చూపిరి. రచనలో ఎక్కడను రచయితలకు రామకృష్ణునిపట్ల గల మమత తలచూపదు. అందుచే రచనము సొగసులు పోయినది. చదువరి క్రమ క్రమముగా పెంపొందు అనుభూతితో చదువు కొని పోవునట్లుగా రామకృష్ణుని జీవితమునందలి యా యా ఘట్టములు చిత్రితములయినవి. మఱి ఈ రచయిత లిరువురిలోనున్న సంయమనము వివేకానంద జీవిత చరిత్రకారునిలో కానంబడదు. గ్రంథకర్తకు వివేకానందునియందుగల గాఢాభిమానము అను పదమున గోచరించును. అందుచే రచనకు ఎడనెడ ఒక విధమయిన కృత్రిమత్వము సంక్రమించినది. ఒక్క తార్కాణము. వివేకానందుడు మొదట ఆంగ్ల భాషను నేర్వ నిరాకరించినను, తుదకు అంగీకరించెను. అపుడు గ్రంథకర్త యిట్లు వ్రాసెను. "ఆంగ్లమున తన సందేశముచే పాశ్చాత్య ప్రపంచము నుద్ధూత లాగింపవలసి యుండిన యాతని జిహ్వ ప్రేరితుడై యందుల కంగీకరించెనని భావింపవలెను". పలుచోట్ల గ్రంథకర్త ఇట్లే భావించెను. ఇట్టి వ్రాతచే రచన యందలి సహజ గుణము దెబ్బతినును. ఇట్టి భావనలు మినహాయించిచో వివేకానందుని జీవిత చరిత్రయు మనోహరముగా నున్నదని నిశ్చయముగా చెప్పవచ్చును. సువిశాలమయిన వివేకానందుని జీవితమును దాని యందలి ఘట్టము లను మధురమయిన చరిత్ర వలె గ్రంథకర్త వర్ణించెను. వివేకానందుని లేఖల యందలి, యుపన్యాసమందలి గంభీర వాక్యములు ప్రకరణమునకు తగినట్లుగా యథాతథముగా అనువదింపబడినవి. నానాడు పెరుగుచున్న రామకృష్ణుని తేజస్సునకు వివేకానందుని వ్యక్తిత్వమునకు సాక్షిభూతులుగా నున్న అనుచరుల అభిప్రాయములు సైతము గ్రంథములలో రెంటిలో తార్కాణింపబడినవి. ముఖ్య సంఘటనముల కాల క్రమము, అకారానుక్రమ విషయ సూచిక రామకృష్ణ లీలామృతము చివర గలవు. అట్లే వివేకానంద జీవిత చరిత్రకు చివర అనుక్రమణిక కలదు. రామకృష్ణ వివేకానందుల జీవితములను ఆసక్తి కలిగించు కథలుగా, విషయ నిబిడత్వముతో వర్ణించుట యందు రచయితలెంతో నేర్పరితనము చూపిరి. ఎల్లర యింట నుండదగిన గ్రంథము లివి.

—శాక్యసింహ.

భర్తృదానమ్

గ్రంథకర్త : శ్రీ వధానం సూర్యనారాయణ శాస్త్రి.
ప్రాప్తిస్థానము : గ్రంథకర్త, 44 జీరా, సికందరాబాదు,
ఆం. ప్ర. వెల : రు. 1.00. పేజీలు 14.35. క్రౌను 1/8.

ఇది పారిజాత కథతో శ్రీ కృష్ణతులాభారము జోడించి రచించిన సంస్కృత కావ్యము. గ్రంథకర్త : సంస్కృతాంధ్రములలో విద్వాంసులు, కవులు. వారికి అభిమాన శాస్త్రములు వ్యాకరణము అలంకార శాస్త్రము. సంస్కృత భాష గ్రంథకర్తకు వాచోవిధేయము, పద్య రచన మంచినీళ్ల ప్రాయము. భాష సులభ గ్రాహ్యముగా నున్నది.

దీనికి శ్రీ పి. శ్రీరామచంద్రుడు గారు ఆంగ్లములో మంచి ఉపోద్ఘాతము వ్రాసినారు. అందులో వారు పారిజాత కథ వరకు శృంగార రస ప్రధానమైనను, తులాభారకథ శాంత రస ప్రధానమగుటచే, శృంగార రసమును అంగరసముగా నుండునట్లు చేసిరనియు, ఇంద్రునితో పారిజాతాపహరణమునకై యుద్ధము పెట్టక రెండు పద్యములలో సంక్షేపించి అంగ కథకు అతి విస్తృతి అను దోషము రాకుండజేసిరనియు లగ్గించిరి. అంతవరకు సత్యమే కాని ఇందులో 23 పేజీలు పారిజాత కథ, 12 పజీలు మాత్రమే భర్తృదాన కథ ఉన్నవి. ఈ విధముగా కఠిన పరీక్ష చేసినచో ఆ దోషము మరొక విధముగా రానే వచ్చినదేమో! కాని సంస్కృతములో దృశ్య కావ్యములలో కథ కూర్పులో నుండు బిగువు శ్రవ్య కావ్యములలో నుండదనుట ప్రసిద్ధము కదా! ఈ దృష్టితో చూచినచో సంస్కృత శ్రవ్య కావ్య మర్యాదనే పాటించుటచే ఆ దోష ప్రశంసయే అనవసరమనిపించుచున్నది.

శ్రీ శాస్త్రిగారికి వ్యాకరణ శాస్త్రమందు అభినివేశము కూడ కలదు. ప్రామాణిక వ్యాకరణములులేని ఆంధ్ర భాషాదులందు ప్రయోగములు ప్రమాణములేకాని, మహా భాగవతాది గ్రంథములలో ప్రయోగము లెన్ని చూపినను వ్యాకరణ శాస్త్రముచేత, సాధింపలేని ప్రయోగములు సంస్కృత భాషలో బుద్ధిపూర్వకముగా చేయుటచే శ్రీ శాస్త్రిగారి వంటి వైయాకరణులకు ఉచితముకాదని, పునీత శబ్దము పూతార్థమున ప్రయోగించిన సందర్భములో ఉపోద్ఘాత కర్తలు సూచించిన ఆశయముతో మేమును ఏకీభవించుచున్నాము. ఆంధ్రదేశములో సంస్కృత పండితులు ఇతర దేశ భాషల వారికంటె శాస్త్ర మర్యాదను ఎక్కువ పాటించువారని ప్రదర్శించుట ఎక్కువ వాంఛనీయము గదా!

పురాణమూలమే యైనను ఆంధ్రదేశములో ఎక్కువ వ్యాప్తిలోనున్న ఈ కథను సులభ సంస్కృతములో రచించి అఖండ భారత వ్యాప్తికి చేసిన శ్రీ శాస్త్రిగారి ప్రయత్నమును అభినందించుచున్నాము.

గ్రంథవిమర్శలు

నందచరితమ్

గ్రంథకర్త : శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి. ప్రాప్తిస్థానము : గ్రంథకర్త, 44 జీరా, సికిందరాబాదు, ఆం. ప్ర. మూల్యము : రు. 1—00. పేజీలు : 31+8 క్రౌను 1/8.

భర్తృదానము రచించిన గ్రంథకర్తయే ఈ గ్రంథము కూడ రచించిరి. రచన దానివలెనే సులభ గ్రాహ్యమైన సంస్కృతములో నడచినది. ఇందలి ఇతివృత్తము భక్తనంద నార చరిత్రము. దానికి ఆంగ్ల భాషలో శ్రీ కె. వి. యస్. అప్పారావుగారు. చక్క ఉపోద్ఘాతము వ్రాసినారు. 'నక్క ఎక్కడ నాగలోకమెక్కడ' వంటి తెలుగు నుడుల సొంపును సంస్కృతములోనికి తెచ్చినందుకు శ్రీ అప్పారావుగారు గ్రంథ కర్తను ప్రశంసించిన దానితో మేమును మనస్ఫూర్తిగా ఏకీభ వించుచున్నాము. అఖండ భారత భాషయైన సంస్కృతము నిత్యజీవితము కేదై నిత్య ప్రవృద్ధమానమగుచున్నదనుటకు ఇట్టి ప్రయత్నములు దోహదకారులు కాగలవు. ఈ విధముగా సంస్కృతభాషా సేవకు పూనుకున్న గ్రంథకర్తను హృదయ పూర్వకముగా శ్లాఘించుచున్నాము.

—నోరి నరసింహశాస్త్రి.

శ్రీనివాస

రచయిత : శ్రీనివాస కాశ్యప; ప్రతులకు : కాశ్యప ప్రచు రణలు, 35, తాండవరాయముదలి వీధి, మద్రాసు—21; సుమారు యాభై పేజీలు వెల 75 పైసలు

వెంకటేశ్వరుని ముఖచిత్రముగల ఈ పుస్తకమునందు అందరకును అర్థమగు చక్కని శైలిలో నూట ముప్పది పద్య ములు కలవు.

శ్రీ శివస్తవ సుధాధార

రచన : శ్రీ వప్పంగి రామారావు (జయశ్రీ;) ప్రతు లకు : శ్రీ ప్రకాష్ న్యూస్ ఏజెన్సీ, డెయిలీ మార్కెట్, జయ పురం; ముప్పది పేజీలు వెల : 10 పైసలు

ఈ చిన్న పుస్తకమునందు శివుని స్తోత్రము కలదు

శ్రీ వేంకటేశపద్య రత్నావళి

కర్త : విద్వాన్ బయిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఆంధ్రోపా ధ్యాయుడు, మెత్రహా పురపాలకోన్నతపాఠశాల, తిరుపతి.

ఇరువది పేజీలుగల ఈ చిన్న పుస్తకమునందు శ్రీ వెంక టేశ్వరుని స్తుతించుచు ఇరువది చక్కని సీస పద్యములు గలవు

ఆంధ్రకేసరి

రచన : సత్యాగ్రహాచార్య; వలయువారు భగవాన్ పబ్లి కేషన్స్, మద్రాసు—24 నూట నలుబదినాలుగు పేజీలు వెల : 125 పైసలు

చక్కని ముఖ చిత్రముతో స్వర్గీయ టంగుటూరి ప్రకాశంపంతులు గారి జీవిత చరిత్ర పుట్టుక మొదలు అంతిమ యాత్రవరకు వ్రాయబడెను. అందరునూ చదువవలసిన నవల

ముకుందమాల

రచయిత : ప్రతివాది భయంకర వేదాంతాచార్యులు ప్రకాశకులు : శ్రీరామా బుక్ డిపో, శికింద్రాబాదు; అరువది పేజీలు వెల : 60 పైసలు.

సంస్కృత భాషలో శ్రీ కులశేఖ రాళ్వారు రచించిన 'ముకుందమాల' శ్లోకములకు ఆంధ్రానువాదము. ఒక్కొక్క పుటలో నొక్కొక్క శ్లోకము దానికి పద్యము దాని తాత్ప ర్యము ముద్రింపబడినవి. ఈ పుస్తకము చివరి భాగమునందు కులశేఖరుని జీవిత చరిత్ర కూడా పద్య కావ్యములో నున్నది.

శ్రీ దేవి పత్రిక

మాసపత్రిక; ఎడిటర్ : వప్పంగి రామారావు, వెల : 30 పైసలు. వివరములకు : ఎడిటర్, శ్రీ దేవీ పత్రిక, జయ పురం, కోరాపుట్ జిల్లా (ఒరిస్సా.)

15, అక్టోబరు 64 (సంపుటి 1 సంచిక 3) పత్రి కలో భగవాన్ శ్రీ అరవింద సీరియల్ న్యాసం; విధి బలీయం, బురద విసరాలనుకుంటే......కథలు నర్తనశాల తంబుర (సీరి యల్) కథ; ఇంకా చెణుకులు, మిణుకులు, అర్థికరంగం, దవా నలం మొదలైనవి కలవు.

మారుతీ స్తవము

రచయిత కవిశ్రీ వేదగిరి వేంకట నరసింహరాయశర్మ; ప్రతులకు: వెంకట రమణ కవితా నికేతన్, జానకమ్మపేట, ఫినల తలపిపోస్ట్, (వయా) పెద్ద పవని, నెల్లూరుజిల్లా. ఎనిమిది పేజీలు వెల . 25 పైసలు.

ఇరువది నాలుగు పద్యములతో హనుమంతునికి మనసార గావించిన స్తుతి ఇది. శ్రీ జటప్రోలు సంస్థానకవిగారు 'తొలి పలుకు'లో ఈ పుస్తకమును ముక్కుంబుడక, పచ్చికలు పత్రంపు ముక్కలు, గగుర్పాటు రతితో పోల్చినారు.

కాళ్లబేరం

రచన : దామెర్ల వేంకటరమణ. ప్రతులకు : శ్రీ పద్మా వతి పబ్లికేషన్స్, 339 గిడ్డంగివీధి, నెల్లూరు. యాభై ఆరు పేజీలు వెల . 1—25 పైసలు.

ఇది స్త్రీ పాత్రలేని నాటిక. దీనిని 1961 లో శ్రీ వేంకటేశ్వర నాట్య కళా పరిషత్తు, తిరుపతివారు జరిపిన పోటీ లలో ప్రదర్శించిరి. 62 లో కొన్ని మార్పులతో కావలిలో "శ్రీ సాధన కరోత్సవముల" పోటీలలో ప్రదర్శించగా ఉత్తమ ప్రదర్శనకు ప్రథమ బహుమతి, గోపీ పాత్రకు ప్రత్యేక బహు మతి లభించినవి. పై ప్రదర్శనలలో పాల్గొన్నది "శ్రీ విజయ ఆర్ట్స్ థియేటర్, నెల్లూరు" వారు. ఈ పుస్తకము చదువు టకు చాలా చక్కగా నున్నది.

27301

వ న బా ల

రచయిత : విద్వాన్ టి. రామకోటేశ్వరరావు. వివరాలకు : విజయసాహితి, నెల్లూరు. సుమారు యాభై పేజీలు వెల : ఒక రూపాయి.

ఇందులో దీక్ష, కర్షక హృదయము, జీవయాత్ర, కష్టజీవి, ఋతు సమోదము, చిన్నారిపాప, శివరాత్రి, వనబాల కావ్య ఖండికలు కలవు. సులభశైలిలో వ్రాయబడినవి.

శ్రీ కృష్ణానదీ మహాత్మ్యము

రచన : డాక్టరు గొర్రెపాటి వెంకట సుబ్బయ్య. వలయువారు : శ్రీ కదళీపుర గ్రంథమాల, రాణీ భవానీదుర్గం, పెదకళ్లేపల్లి (కృష్ణాజిల్లా). నలుబది నాలుగు పేజీలు వెల : 75 పైసలు.

ఈ పుస్తకమునందు కృష్ణానదీ మహాత్మ్యమును శ్రీ కోదండరామ ప్రభువులకు శ్రీ శంకరస్వామి చెప్పుచున్నట్లు వచన రూపమున అందరకునూ అర్థమగునట్లు రచింపబడెను.

ప్ర వ క్త లు

రచయితలు : జాస్తి వేంకట నరసయ్య, షేక్ దావూదు సాహెబ్, ప్రకాశకులు : భారతిసమితి, పామర్రు. కృష్ణాజిల్లా. ఎనబది పేజీలు వెల : 1—25 పైసలు.

ఈ పుస్తకములో శంకరాచార్యులు, శ్రీ రామానుజాచార్యులు, రామకృష్ణ పరమహంస, గౌతమబుద్ధుడు, దయానంద సరస్వతి, గురునానక్, వర్ధమానుడు, కబీరుదాసు జీవిత విశేషములు క్లుప్తముగా వ్రాయబడినవి.

ర స త రం గి ణి

సంకలన కర్తలు : పెద్దోజు రాజేశ్వర రావు, ఆకుల. వి. పానకేశ్వరరావు ప్రతులకు : పెద్దోజు రాజేశ్వరరావు. అరండలుపేట, 10 వ లైను, 2 వ అడ్డరోడ్డు—గుంటూరు—2. అరువది నాలుగు పేజీలు వెల : 1—00 పైసలు.

ఈ పుస్తకమునందు భక్తి తరంగిణి (ప్రబోధము, ముత్యాలహారం, స్మరణ, సంస్కృతి, కృతజ్ఞత, ఇది నా దేశం, బుద్ధదేవుని బోధ); భావ తరంగిణి (ఉద్బోధ వేడికోలు, విడివడని ప్రే(మ)ముడి, అర్ధ జీవితం, మొగ్గలు, అనుభూతి, షాజహాను, కవి, కవితా సంక్రాంతి, ఎచటికి వలపు పిలుపు, చెప్పవూ తృష్ణ క్రీడ, పరువతము, కన్నీటి చిరు చినుకులు, వేదనా వేదం, వలపు విలాసం, బావతో బస్తీకి) ఉద్వేగ తరంగిణి (వక్రగతులు, ఒక్కడవే, అర్ధరాత్రి ఆలోచన, విజా విజాలు, చీకటి, బాపూటా, ప్రస్థానం, కవీ—కర్తవ్యము, అనంతయాత్ర) మొదలగు చిన్న చిన్న పద్యములు కలవు.

శ్రీ మజ్జిగౌరీశ్వరి సందర్శనము

రచయిత : జయశ్రీ, జయపురం, కోరాపుట్ జిల్లా. యాభై పేజీలు. వెల : 37 పైసలు.

శాంభవిమాత "శ్రీమజ్జి గౌరీశ్వరి" పై అనేకపద్యములు సులభ శైలిలో "శ్రీ మజ్జి గౌరీ!" అను చివరి పదముతో రచింపబడెను.

శ్రీ ప్ర ణ యి ని

రచయిత : వైద్య విద్వత్పండిత సత్కవి నారు నగనార్య; వలయువారు : పండిత నారు నాగనార్య "ఆత్మారామ నిలయము" నాగవరము పోస్టు, (వయా) రైల్వే కోడూరు, కడప జిల్లా. ఎనభై నాలుగు పేజీలు. వెల : ఒక రూపాయి.

ప్రవరుడిని పొగుడుతూ ప్రణయిని పలికినట్లు వ్రాసిన ఈ పద్య కావ్యము రచన చాలా చక్కగా నున్నది. కాని సామాన్యులకు అర్థమగు శైలిలో లేదు.

పంచాయతీ రాజ్యం

ఎడిటర్ : చిర్రావూరు నాగభూషణాచార్యులు.

ఈ వార్షిక సంచిక (12 వ సంపుటి. సంచిక 1) లో శ్రీ కో. లక్ష్మణరావు, శ్రీ డి. సంజీవయ్య, శ్రీ ఎం. ఆర్. అప్పారావు, శ్రీ జి. యస్. రాజు, శ్రీ బి. యస్. మూర్తి, శ్రీ ఎం. భక్తవత్సలంగార్ల సందేశములు గలవు. ఈ పక్ష పత్రిక వలయువారు : మేనేజరు : 'పంచాయతీరాజ్యం' తత్వానంద శిల్పాశ్రమం, నిడమర్రు, పోస్టు (వయా) మంగళగిరి, గుంటూరు జిల్లా.

పదరా! పదరా! భారతవీరా!

రచన. అద్దేపల్లి నాగ గోపాలరావు : పద్మా ప్రచురణలు, ఏలూరు. ఇరువదినాలుగు పేజీలు. వెల : 30 పైసలు.

పుస్తకము ముందు, వెనుక నెహ్రూ, గాంధీజీల చిత్రములతో మెచ్చదగిన కృతి, నతి, వీరగీతి, ప్రచార ఫణితి, శతకాంజలి పద్యములతో చక్కగా నున్నది.

యు వ భా ర తి

సాంస్కృతిక సాహితి సంస్థ జన్మదిన ప్రత్యేక సంచిక. వివరాలకు : కార్యదర్శి, యువభారతి, 102—శేరా, సికింద్రాబాదు.

సంపాదకవర్గము : శ్రీ గుంటూరు శ్రీ హరి, శ్రీ తేజోమూర్తుల సూర్యనారాయణ, పూడిపెద్ది లక్ష్మణమూర్తి. స్థాపితం : శోభకృతు—విజయదశమి, 27—10—63.

ఈ సంచిక అనేక మంది రచనలతో సుమారు నూట పది పేజీలతో వెలసినది. —కె. ఆర్.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1

Editor : S. Sambhu Prasad.

Bharati December 7th 1964 Regd. No M. 1856

27301

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/-	రు. 150/-
2 లేక 3 వ కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	150/-	125/-
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	125/-	100/-
అర్ధ పేజి	...	65/-	55/-
పావు పేజి	...	40/-	35/-

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

నం॥నకు వరుసగా 12 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12-0-0
6 మాసముల చందా	...	రు. 6-0-0
విడి ప్రతి	...	రు. 1-0-0

మేనేజరు, భారతి.

మద్రాసు-1.